భారతి

సాహిత్య మాసపత్రిక

నవంబరు 1980

ఈ వసంతం శాశ్వతమైతే!!

సంపత్కుమారాచార్య

పట్టాభి

తారానాథ్

ఎడారిలో...
పొద్దుపొడిచిన ఇన్నాళ్లకు...

ఖమ్రుద్దీన్

జ్యోతిష్యం శాస్త్రమా?

ఐసెన్క్

తొలి అనుభవం
కన్నీళ్లు

సుధాకరరావు

చతుర్ముఖ శివలింగము

కార్తికేయశర్మ

ఇంకా యస్. యస్. రెడ్డి, కిశోరుబాబు అశోకుబాబు, మాధవీసనారా, సిధారెడ్డి, ఈశ్వరచరణ్, రంగాచార్యులు, రాఘవన్, రమేష్‌బాబు, రఘునాథరెడ్డి, వీరభద్రయ్య, రమణ, శివరామశాస్త్రిగారు, వీరయ్య, అమరేంద్ర, మోహన ప్రసాద్ ఇతరుల రచనలు

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

★

నవంబరు 1980

సంపుటము : 57 సంచిక : 11

విడిపత్రిక వెల రెండు రూపాయలు

విషయానుక్రమణిక

నవంబరు 1980

ఈ వసంతం శాశ్వతమైతే!!

శ్రీ ఏ. సంపత్కుమారాచార్య

శిశిరమనగా నాదు మానస
  మందయిష్టత పాదుకొన్నది !
కుసుమములకే శత్రువతడని
కిసలయమ్ముల కహితుడతడని !

చలినీ మంచునూ రంగరించి
బడుగులను వడకించుతాడని...
మేడలందున మిద్దెలందున
వెలుగువారికె మిత్రుడతడని. .
శిశిరుడనగా నాదు మానస
మందసహనము కలుగుతున్నది !

కాల పురుషునే కలతపెట్టును !
కఠినముగ చలిపాలు చేయును !
కాలమూరకుండునా ? ?
అతని దేహశుద్ధి చేయుగ
పూల ఋతువుకు [illegible] చేసెను ! !

నూత్నఋతు దర్శనము కొఱకై
సాగుచున్న యియాసువులకు
సంతసము కలిగింప...వా
సంత సుషమలు వెల్లివిరిసెను ! ! ...

చలికి ఆయువు తీరిపోవగ
పుష్పసమయ మేతెంచెలే ! ...
పూలజేరి మధూళిగ్రోలగ
పుష్పలిహములె జేరెలే ! !

పల్లవములే పోటమరించెను !...
పచ్చదనముతో ప్రకృతినిండెను !
కాకపిక భేదము తెలియగ
కోకిలలు గళమెత్తి పాడెను ! !

'స్వాగతం వాసంతలక్ష్మి
స్వాగతం సుస్వాగతమ్మ'ని
పంచమస్వర మాధుర్యముతో
పిక సమూహము పాడగా
అడుగిడెను వాసంతలక్ష్మి
కనుల కామెత పెట్టగా ! ! ..

సౌరభాలు పరిగిపులవీడగా
మధుపమ్ము ఝంకారమె శ్రుతిగా
కారాకుల పతనమ్మె తాళముగ
పికము వసంతరాగము పాడెను !
కీరము స్వాగత పత్రము చదివెను ! !...

తరువుల అలరులు.. వలిరులు...పండ్లు
పక్వము నొంది మాధురినిండెను
పూవులె మధుపాత్రలుకాగా
తేటులు తీయని కవిత చెప్పెను !
జగతియె వెన్నెల తోటగ మారెను ! .
వనలక్ష్మికి సన్మానము జరిగెను ! !...

నిత్యహరిత వసంత పత్రతోరణాలే అమర్చినట్టి
విశ్వ కళ్యాణ వేదికలుగా ఎడదలన్నీ మారిపోతే !
ఈ వసంత శోభలన్నీ శాశ్వతంగా నిలచిపోతే ! !

విలయానికి స్వస్తిచెప్పి హృదయమందు శాంతినింపి
అంతరాలే అంతమొంది అన్ని ఋతువులు
వసంతాలై
ప్రకృతియంతా పికమువలె సౌహార్ద్యగీతంపాడితే ! !
ఈ వసంత మధూత్సవం జగతియంతట
నిండిపోతే ! !...
ఈ వసంత హరిత పత్రిక కనుల ఎదుటనె నిలచిపోతే!!

[ఆ కా శ వా ణి వి జ య వా డ సౌ జ న్యం తో ....]

జాతికి గ్రహణం పట్టిన రోజు

శ్రీ ముదిగొండ ఈశ్వర చరణ్

అందమైన ఆరోజు
ఇంకా జ్ఞాపకం ఉన్నది.

నీలి జలతారు నీడల్లో
నింగి దోబూచు లాడిన రోజు
చుక్కల కాటుక కన్నుల్లో
ముత్యాలు
తళతళ లాడిన రోజు
కమ్మ తెమ్మెరలు
విందుగా పసందుగా
కిత కితలు పెట్టిన రోజు
కన్నె మబ్బులు
మెల్లగా చల్లగా
తేలిపోయిన రోజు
పూల బాలలు
కాళరాత్రి కరిగిందని
మురిసి మురిసి విరిసిన రోజు
ఆకసానికి సింధూరం పూసి
చీకటి గుయ్యారం చీల్చుకొని
సూర్యుడి బింబం
చొచ్చుకవచ్చిన రోజు
కాషాయపు రోచిస్సులు
కాంతి రేఖలు
— క్రాంతి రేఖలు
నింపిన రోజు
ఆరోజు
అందమైన రోజు
ఇంకా జ్ఞాపకం ఉన్నది.

2

ఆరోజు
అందం కుసుమించిన రోజు
ఆనందం పల్లవించిన రోజు
స్వచ్ఛంగా స్వచ్ఛందంగా
మెరుస్తున్న సూర్యుడ్నిచూచి
కళ్ళుమండి రాహువు
దుమ్మెత్తి పోసిన రోజు
చీకటిలో చేయికలిపి
మసి బూసిన రోజు
కోటి కోటి రావాలు
కుమిలి కుమిలి రోదించిన రోజు
ఆరోజు
ఇంకా జ్ఞాపకం ఉన్నది.

3

ఆరోజు
అందాన్ని హత్యచేసిన రోజు
ఆనందాన్ని అణగార్చిన రోజు
సూర్యుడికి గ్రహణం పట్టిన రోజు
రాహువు నెత్తిన
చీకటి మొత్తిన రోజు
దిగంతాల కావల
వెలుతురు దాక్కొన్న రోజు
మింగలేక — కక్కలేక
గొంతు మూగవోయిన రోజు
జాతి సిగ్గుతో తలవంచిన రోజు
జనం బుద్ధిగా చేతులెత్తినరోజు
చీకటి నిండిన ఆరోజు
ఇంకా జ్ఞాపకం ఉన్నది.

శ్రీ కోకుమాను తారానాథ్

"కాంగ్రెసు చరిత్రకారుడు డాక్టరు పట్టాభి"

(మనం ఆంధ్రులం, ఆవేశం మనసొత్తు, త్యాగం మన ముఖ్య లక్షణం, ఔదార్యరాహిత్యం మన ప్రవృత్తి, రాజకీయాలు మన ఊపిరి—కాబట్టే 1972నాటి ఆంధ్రకేసరి శతజయంతి, వేర్పాటు ఆంధ్రోద్యమంలో కొట్టుకుపోయింది. ఆంధ్రుల స్వాతంత్ర్యసమర చరిత్రఅంతా ముగ్గురు మూర్తులచుట్టూ పరిభ్రమించింది—ప్రకాశం, పట్టాభి, ఆచార్య రంగాలు. వీరిది అపూర్వమైన 'లవ్‌హేట్' బాంధవ్యం. ఈ బాంధవ్యం 1947కు ముందు మనకు విచిత్రమనిపిస్తే, 1947 తరువాత మనకు దురదృష్టకరంగా పరిణమించింది.

1947 తరువాత దాదాపు రెండు దశాబ్దాలవరకూ ఆంధ్ర నాయకత్వమంతా వీరో, వీరి శిష్యులో, ప్రశిష్యులో మాత్రమే.

వీరిలో ప్రకాశం నిజంగా 'కేసరి', అపూర్వ త్యాగధనుడు, సైమన్ కమీషను రాకసందర్భంలో తుపాకులకు ఎంత గంభీరంగా ఛాతి ఎదురిచ్చాడో, అంతకంటె గంభీరంగా మహాత్మాజీనే ఎదిరించాడు ప్రజానాయకుడు. వీరిపట్ల అభిమానం ఆంధ్రులలో ఏ వర్గానికో, ఏ ప్రాంతానికో పరిమితం కాలేదు. ప్రకాశంలేని ఆంధ్రలేదు సుమీ అని అనిపించిన నాయకుడు.

ఆచార్య రంగా విస్తృతమైన, దృఢమైన భూమికను నిర్మించుకో గలిగిన నాయకుడు. రాజకీయ విద్యాలయాలు నడపటం, శిష్యులను తయారుచేయటం ఆయనకు వెన్నతోపెట్టిన విద్య. నిరంతర రాజకీయ శ్రమజీవి. అధికారరూపేణా ఫలితాన్ని పొందకపోయినా, రాజకీయ కర్మయోగాన్ని ఆచరణలో పెట్టిన సిద్ధపురుషుడు. ఆయన జీవితంలో మలుపు 1970 ప్రాంతాలలోనే కనిపిస్తుంది.

డాక్టరు పట్టాభి రాజకీయ డాక్టరు. దృఢమైన భూమిక లేకపోయినా, సునిశిత మేధాసంపత్తితో తనకొక ప్రత్యేకస్థానాన్ని ఏర్పరుచుకొనిన ధన్యజీవి. యావద్భారతంలో మిగతా ఇరువురికంటె పేరు పొంది, కాంగ్రెసు అధ్యక్షుడయ్యాడు. అనేక రంగాలను తన రచనల ద్వారా ప్రభావితంచేశాడు. అగ్రనాయకులకు నమ్మిక కలిగించిన నాయకుడయ్యాడు. ఆ మహానుభావుని శతజయంతి సందర్భంగా ఈ మాసంలో ఆయనను గురించి వ్రాయటం భావ్యమనిపించి ఈ ప్రయత్నంచేయటం జరుగుతున్నది.

నేటి అధికారవ్యామోహ సాగర మథనంలో ఈ జయంతి నేటి నాయకులలో ఎంతమందికి గుర్తు ఉంటుంది అనేది అడగవలదని ప్రశ్న. చివరకు ప్రభుత్వం, ఆంధ్రప్రజానీకం కూడా ఆ శతజయంతిని జరపటమనేది పత్రికారంగానికే పరిమితమై ఉంటుంది అనే బాధతో చేసే చిన్న ప్రయత్నమే ఇది. ఆంధ్రవిశ్వవిద్యాలయానికి చెందిన డాక్టరు ప్రసన్నకుమార్ వ్రాసిన 'డా. బి. పట్టాభి సీతారామయ్య... ఏ పొలిటికల్ స్టడీ' అనే గ్రంథం లేకపోతే ఈ వ్యాసం లేదుసుమా!

వారి శతజయంతి మాసంలో, ఆంధ్రరాష్ట్ర రజతోత్సవ సంవత్సర ప్రారంభ మాసంలో ఈ వ్యాసం సముచితమనుకుంటాను.)

I

సంపన్న నియోగి బ్రాహ్మణ కుటుంబంలో 25 ఎకరాల ఆసామీ, కరణంఅయిన వారికడుపున పశ్చిమగోదావరి జిల్లాలోని గుండుగొలను గ్రామంలో నవంబరు 24, 1880న జన్మించిన పట్టాభి తన రెండవ ఏటనే తండ్రిని కోల్పోయాడు. 2500ల అప్పుకుగాను 25 ఎకరాల మాగాణిపోయి, దయతో కరణంగారి కుటుంబానికి నెలకు 7–50 రూపాయల భృతి ఏర్పాటు చేయబడింది. గోచితో పాఠశాలకు పోవటం, 4వ ఫారందాకా ఒంటిమీద చొక్కా అనేది లేకపోవటం శాయన జీవితంలో చెరగని ముద్రవేశాయి.

తన ఏడవ ఏట పై చదువులకోసం మొత్తం కుటుంబం ఏలూరు చేరింది. మిషనరీ స్కూలు అధికారుల దయలో ఆయన చదువు సాగింది. మెట్రిక్యులేషను ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై 16వ ఏట ఎఫ్. ఎ. చదివేందుకు బందరులోని నోబుల్ కాలేజీలో చేరాడు. ఇక్కడనే సహాధ్యాయి ముట్నూరు కృష్ణారావు, ఆచార్యుడు రఘుపతి వెంకటరత్నంనాయుడుగారల సహచర్యం, సాంగత్యం లభించాయి.

ఎఫ్. ఎ. పరీక్షలో ప్రథమశ్రేణితో ఉత్తీర్ణుడై ఉపకార వేతనంతో ఒక ఉదారుని సహాయ్యంతో 1898లో మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో బి. ఎ.లో చేరాడు. అప్పటి ఆయన జీవితం నెలకు 10–50 రూపాయలతో పరమ సంతోషంగా గడిచింది. అదే సంవత్సరం మహాత్మా గాంధీని చూడటం, కాకినాడకుచెంది, గోదావరి జిల్లా బోర్డుకు ఉపాధ్యక్షుడైన గంజాం వెంకటరత్నంతో పరిచయ

మేర్పడటం జరిగాయి. తన 18వ ఏట కాని కట్నంలేకుండా వెంకటరత్నంగారి కుమార్తెతో పట్టాభి వివాహం జరిగింది.

బి. ఎ. తదనంతరం, మామగారి ధనసహాయంతో వైద్య కళాశాలలో చేరాడు పట్టాభి. ఆ రోజులలో అలా చేరే ఆంధ్రులు చాలా అరుదుసుమా!

తన 26వ ఏటనే ఎం. బి. సి. యం. పరీక్ష పూర్తిచేసి బయటికొచ్చిన పట్టాభి, అప్పటికే 1898, 1903లలో మద్రాసులో జరిగిన కాంగ్రెసు మహాసభలు చూడగలిగాడు. పిఠాపురం మహరాజా వారి కోరికను కాదని బందరులో డాక్టరుగా జీవితాన్ని ఆరంభించాడు పట్టాభి.

*　　　*　　　*

బందరు జీవితం పట్టాభిని తీర్చిదిద్దింది. నాటి 'త్రయం' ఆంధ్రప్రాంతాన్ని అమితంగా ప్రభావితం చేసింది—పట్టాభి సీతారామయ్య, కోపల్లె హనుమంతరావు, ముట్నూరు కృష్ణారావుగారలు. కృష్ణారావుగారు 1902లోనే 'కృష్ణాపత్రిక'ను స్థాపించారు. పట్టాభి 1907 నాటి కాంగ్రెసు సభలకు హాజరై స్వదేశీ నినాదంమీద ప్రసంగించాడు. అదే సంవత్సరం 'లాల్, బాల్, పాల్' త్రయంలోని బిపిన్ చంద్రపాల్ ఆంధ్రలో పర్యటించాడు. దాని ఫలితంగా కోస్తా ఆంధ్రలో జాతీయోద్యమానికి నూతన ఉత్తేజం చేకూరింది.

1908లో మద్రాసులో జరిగిన మొదటి మితవాద కాంగ్రెసుకు పట్టాభి హాజరయ్యాడు. బందరులో జాతీయ కళాశాల స్థాపన ఉద్దేశ్యం ఏర్పడింది. దానికి పూర్తిగా తనకాలాన్ని వినియోగించేందుకుగాను హనుమంతరావు తన ప్లీడరీ ప్రాక్టీసుకు స్వస్తి చెప్పాడు. 1910లో బందరులో ఆంధ్రజాతీయ కళాశాల స్థాపించబడింది. ఆ కళాశాలలో 1914లో కుటీర పరిశ్రమలూ, 1916లో చేనేత ప్రవేశపెట్టారు. గాంధీజీ ఈ కళాశాలను 1921, 29లలో దర్శించి సంతోషించారు.

1916లో మొదటిసారిగా పట్టాభి మద్రాసు కాంగ్రెసు కమిటీ సహాయంతో ఎ. ఐ. సి. సి. సభ్యుడయ్యాడు. రాజకీయాలకు, వృత్తికి కుదరక 1916 సెప్టెంబరులో తన వృత్తికి స్వస్తి చెప్పాడు. నాటికి పట్టాభి వయస్సు 36 సంవత్సరాలు.

*　　　*　　　*

పట్టాభి రాష్ట్రరాజకీయాలలో మొదటిసారిగా జిల్లాబోర్డులో ఉత్సాహం చూపనారంభించి, ఘంటసాలకుచెందిన గొట్టిపాటి బ్రహ్మయ్యను బలపరచసాగాడు. మీర్జాపూర్ రాజా జాతీయ కళాశాలకు 50000ల రూపాయలు విరాళమిస్తానంటే కాదన్నాడు. చల్లపల్లి రాజాకు వ్యతిరేకంగా బ్రహ్మయ్యను జిల్లాబోర్డు అధ్యక్షుడుగా చేసి తాను కార్యదర్శిగా పనిచేశాడు.

1937లో ప్రకాశంగారు మద్రాసు మంత్రివర్గంలో రెవిన్యూ మంత్రి కావటంతోనే, పట్టాభి ఎపిసిసి అధ్యక్షుడయ్యాడు. బ్రహ్మయ్యను కార్యదర్శిగా నియమించాడు. సహాయ కార్యదర్శిగా నీలం సంజీవరెడ్డిని నియమించాడు. రాయలసీమనుంచి మొదటిసారిగా ఒక రాజకీయ కార్యకర్తను గుర్తించిన ఘనత పట్టాభికే దక్కుతుంది.

ఆర్థికంగా కార్యక్రమాలరీత్యా ఎపిసిసి చాలా సమర్థవంతంగా పనిచేసిందనుకుంటే పట్టాభి హయాంలో మిగతా రంగాలలో అల్లకల్లోలం చెలరేగింది. పట్టాభి వ్యక్తిత్వము ముక్కుకు సూటిగాపోయే గుణము, మాటలలో పరుషత్వము, అప్పుడప్పుడే తలఎత్తుతున్న కమ్మ—రెడ్డి భావాలు, చివరగా ఆయన చర్యలూ— ఈ అల్లకల్లోలానికి కారణాలు.

రశీదులులేని సభ్యత్వాలను నిరాకరించటం, ఎఐసిసి ప్రతినిధిగా పుచ్చలపల్లి సుందరయ్యను నిరాకరించటం, అయ్యారి సత్యనారాయణ రాజుమీద క్రమశిక్షణచర్య తీసుకోవటం ఈ కోవలోకి చేరతాయి. 1939లో అప్పుడే తనమీద పోటీచేసి కాంగ్రెసు అధ్యక్షుడుగా ఎన్నికైన సుభాష్ చంద్రబోసు పక్షంవారలకు సన్మానాలు పనికిరావని నిషేధిద్దాము అనేంతదూరం పోయాడు పట్టాభి.

కళా వెంకట్రావు, గొట్టిపాటి బ్రహ్మయ్య, బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డిగారలు పట్టాభివర్గంగా రాజకీయాలలో ప్రోత్సహించారు.

అయినా 1946లో మద్రాసు కాంగ్రెసు మంత్రివర్గపు ముఖ్యమంత్రి విషయంలో పట్టాభి ప్రకాశంగారినే బలపరిచాడు.

1951లో సంజీవరెడ్డి చేతుల్లో 5వోట్ల తేడాతో ఆచార్య రంగా ఓడిపోవటానికి పట్టాభి అదృశ్యహస్తం ముందంటారుకొందరు. 1953లో ఆంధ్రరాష్ట్ర మేర్పడటంతో రాష్ట్ర రాజకీయాలలో పట్టాభి ప్రాబల్యం తగ్గిపోయింది.

*　　　*　　　*

జాతీయ రాజకీయాలలో పట్టాభికి తుల్యమైన పాత్రను పోషించిన ఆంధ్రులు లేరు. ప్రకాశంగారికి రాష్ట్ర రాజకీయాలలో పలుకుబడి తిరుగులేనిదయినా 1922లోనే కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సభ్యుడైనా 1929నుంచి మాత్రమే వర్కింగ్ కమిటీ సభ్యుడైన పట్టాభిపాత్ర ముందు ఆది సరిరాదు. 1929నుంచి సభ్యుడుగానో లేక ప్రత్యేక ఆహ్వానితుడుగానో పట్టాభి తరువాత తరువాత అగ్రనాయకులకు తప్పనిసరివ్యక్తి అయ్యాడు. గాంధీజీకి అతి విశ్వాసపాత్రుడయ్యాడు.

ప్రథమంలో 'లాల్—బాల్—పాల్'ల అతివాద ధోరణిపట్ల మొగ్గుచూపినా రాను రాను పట్టాభి గాంధీజీకి దగ్గర కాసాగాడు. తన 'సతిజ్ఞాత్రయాన్ని' తూచా తప్పకుండా పాటించాడు. తాను అసెంబ్లీలో ప్రవేశించలేదు, ప్రభుత్వం నడిపే విద్యాలయాలకు తన బిడ్డలను పంపలేదు. తన కుటుంబమంతా ఖద్దరుధారులే.

1919 అమృతసర్ కాంగ్రెసు, 1920 నాగపూర్ కాంగ్రెసు, 1922 గయా కాంగ్రెసు, 1921 జులై ఎ. ఐ. సి. సి, 1922

నవంబరు ఎ. ఐ. సి. సి, 1925 పాట్నా ఎ. ఐ. సి. సి.లు, ఆయన అసమాన ప్రతిభకు తార్కాణాలు. కాంగ్రెసుకు ఒక 'మాన్యుయల్' కావాలనీ, ఎ. ఐ. సి. సి. కి ఒక బడ్జెట్టుండాలనీ, పరిశోధనా శాఖను నడపాలనీ 1929 బొంబాయి ఎ. ఐ. సి.సి.లో పట్టాభి ప్రతిపాదించిన తీర్మానాలన్నీ ఆమోదింపబడ్డాయి. 1931 కరాచీ కాంగ్రెసులో కూడా పట్టాభి ప్రముఖ పాత్ర వహించాడు.

1931లో ఏర్పడ్డ జాతీయ పతాక కమిటీకి కన్వీనరూ, ప్రాథమిక హక్కులు మరియు ఆర్థిక కార్యక్రమ సంఘంలో సభ్యుడూ అయిన పట్టాభి బందరులో జరిగిన ఈ హక్కుల కమిటీ సమావేశాల లోనే భూసంస్కరణలు భాషాప్రయుక్త రాష్ట్రాలలో అల్పసంఖ్యాకుల భాషను గురించిన రక్షణలను ప్రతిపాదించాడు.

1935 అఖిల భారత జాతీయ కాంగ్రెసు స్వర్ణోత్సవ సంవత్సరము, రాజేంద్రప్రసాద్ సలహామీద పట్టాభి కాంగ్రెసు చరిత్రను వ్రాస్తున్నాడు. అది నిజానికి జైలులో కాలక్షేపంకోసమూ, ఆంధ్ర జాతీయ కళాశాల విద్యార్థులకు చెప్పేందుకని వ్రాసుకొనిన నోట్సు— వీటి సహాయంతో రెండు వేలకుపైగా పుటలతో కాంగ్రెసు చరిత్రను రచించి, కార్యదర్శి కృష్ణదాస్‌కు సమర్పించాడు.

"కాంగ్రెసు చరిత్ర" రెండవ సంపుటము 1947లో వెలువడింది. దానిలోని బాగోగులను గురించి ఎవరు ఎంత విమర్శించినా దానిని మించిన గ్రంథం ఇంతవరకు రాలేదు, రాబోదు—అది ఒకవ్యక్తి చేతిమీదుగా సాధింపబడిన మహత్తర కార్యమనే విషయాన్ని ఎవ్వరూ విస్మరింపగూడదు.

తరువాతి ఘట్టము 1939లో 'నేతాజీ' సుభాష్ చంద్ర బోస్ చేతిలో కాంగ్రెసు అధ్యక్ష పదవికి పోటీ, పరాజయం. పరిస్థితుల ప్రాబల్యంవల్ల తనకు తెలియకుండానే గాంధీజీ కోరికవల్ల పట్టాభి కాంగ్రెసు అధ్యక్ష పదవికి అభ్యర్థి అయ్యాడు. 3000 వోట్లలో, 203 వోట్ల మెజారిటీతో సుభాష్ చంద్రబోస్ ఎన్నికయ్యాడు. తరువాత బోస్ రాజీనామా చేయుటం రాజేంద్రప్రసాద్ కాంగ్రెసు అధ్యక్షుడు కావటం చరిత్రకు తెలిసిన సంగతే.

1939 సెప్టెంబరునుంచి ప్రథమ ప్రపంచ సంగ్రామపు మేఘాలు మనదేశాన్ని అలుముకోవటం ప్రారంభించాయి. దానితో కాంగ్రెసు అధ్యక్షు డెవరైనా, వార్ సబ్ కమిటీ అధ్యక్షుడుగా నెహ్రూ ప్రముఖ స్థానాన్ని ఆక్రమించసాగాడు.

కాన్స్టిట్యుయెంట్ ఎసెంబ్లీకి మద్రాసునుంచి ఎన్నికై, రాజ్యాంగ రచనలో పట్టాభి చేసిన సేవలను వర్ణించాలంటే ఎంతైనా చాలదు.

చివరకు 1948 జైపూర్ కాంగ్రెసు అధ్యక్ష పదవికి తిరిగి టాండన్‌తో పోటీ తప్పలేదు. 1891లో ఆనందాచార్యులు, తరువాత 1926లో శ్రీనివాస అయ్యంగార్ తప్ప ఏ దక్షిణ భారతీయుడూ కాంగ్రెసు అధ్యక్ష పదవి అలంకరించలేదు. 1926 నుంచి 1948 దాకా ఈ అధ్యక్ష పదవి దాదాపు ఏడుగురు వ్యక్తుల ప్రత్యేక స్థానంగానే మిగిలిపోయింది. 1891 తరువాత 1948లో రెండవ ఆంధ్రుడు కాంగ్రెసు అధ్యక్ష స్థానాన్ని అలంకరించగలిగాడు. కాని అప్పటికి పట్టాభిని ఆ స్థానంలో చూడాలని కోరిన మహాత్ముడు లేడు.

*　　　*　　　*

దురదృష్టవశాత్తు ఈ సీనియర్ కాంగ్రెసు నాయకుడికి స్వాతంత్ర్య భారతంలో ఏ పదవీ లభించలేదు. దీనికి ఎందువల్లనో పట్టాభి అంటే నెహ్రూజీకి గల వైముఖ్యమే కారణం. రాజేంద్రప్రసాద్, అజాద్, రవిశంకర్‌శుక్లాల జోక్యంతో ఎట్టకేలకు రవిశంకర్ శుక్లా రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌కు గవర్నరుగిరి లభించింది. 1952 జూన్‌నుంచి జూన్ 1957దాకా గవర్నరుగా కొనసాగాడు పట్టాభి.

దానికీ గవర్నరుగా పట్టాభి ఏమిచేయాలో, ఏమి చేయకూడదో చెపుతూ నెహ్రూ అతిదీర్ఘమైన ఉత్తరం వ్రాశాడు. అయిదు సంవత్సరాల కాల నికీకూడా ముక్కలు ముక్కలుగా ప్రసాదించాడు పండిట్‌జీ. జూన్ 1957న రిటైరయిననుంచి 1959 డిసెంబరు 16న తన్ను మూసేదాకా హైదరాబాద్‌లో జీవితాన్ని గడిపాడు పట్టాభి. బృహత్తరంలో ఆయన జీవితమది.

II

ఆంధ్ర రాజకీయాలు, వాటి అస్తిత్వాలు—దాదాపు ఆంధ్రులందరికీ తెలిసిన అంశాలు వివరించడమే. కాని ఆంధ్రులకైనా పట్టాభిని గురించి ఎక్కువగా తెలియని ఒక రంగాన్ని ఇక్కడ పరిచయం చేయటానికి ప్రయత్నం జరుగుతున్నది.

స్వాతంత్ర్యానికి పూర్వంగల స్వదేశీ సంస్థానాల ప్రజలకోసమై 'ఆల్ ఇండియా స్టేట్ పీపుల్స్ కాన్ఫరెన్స్' ఉండేది. 1923 ఆగస్టు 15న ప్రప్రథమంగా ఎన్. సి. కేల్కార్ ఢిల్లీలో సమావేశం జరిపి దీనికి అంకురార్పణ చేశాడు. 1927 సమావేశాలలో దీనికి నామకరణం చేయటం జరిగింది. బొంబాయిలో జరిగిన సమావేశాలలో ప్రముఖ ఆంధ్రుడు సర్ మోచర్ల రామచంద్రరావు అధ్యక్షతన, 1500మంది ప్రతినిధుల సమక్షంలో ఈ 'ఆల్ ఇండియా స్టేట్ పీపుల్స్ కాన్ఫరెన్సు' ఆవిర్భవించింది. ముఖ్యంగా కేల్కార్, వి. వి. పట్వర్ధన్‌లు దీనికి కారణభూతులు.

1928 అక్టోబరులో సర్ రామచంద్రరావు, అభయంకర్, చుడ్‌గార్, సేత్‌లతో కూడిన రాయబార వర్గమొకటి ఇంగ్లండ్‌లో పర్యటించి అక్కడ అనుకూల వాతావరణాన్ని సృష్టించటానికి ప్రయత్నం చేసింది.

1929లో బొంబాయి సభలలో ఇంకొక ప్రముఖ ఆంధ్రుడు సర్ సి. వై. చింతామణి దీనికి అధ్యక్షుడయ్యాడు. అలాగే 1931లో రామానందఛటర్జీ.

కాని 1935దాకా అఖిలభారత కాంగ్రెసునుంచి ఈ కాన్ఫరెన్స్‌కు సరిఅయిన ప్రోత్సాహ సహకారాలు లభించలేదు. దీనికి కారణాలు రెండు. ఒకటి తన వ్యవహారాలతో సతమతమవుతూ తనే ఇంకా

పూర్తిగా బలపడని దశలో కాంగ్రెసు ఉండటం, రెండు నిలయినచోట స్వదేశీ సంస్థానాధిపతుల సహాయాన్ని స్వాతంత్ర్యసమరంకోసం పూర్తిగా పొందాలన్న భావన కాంగ్రెసులో బలంగా ఉండటం. వీటన్నిటిని సాను కూల్యంగా పరిష్కరించి, రెండు సంస్థలు చెట్టాపట్టాలతో నడవ గలిగేటట్లు చేసిన ఘనత పట్టాభికి దక్కుతుంది.

1936 జులైలో కరాచీలో జరిగిన లయిదవ మహాసభలలో, పట్టాభి ఈ పీపుల్స్ కాన్ఫరెన్సుకు అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. భారత జాతీయ కాంగ్రెసు, భారత జాతీయులందరిదనీ, అందునుంచి స్వదేశీ సంస్థానాల ప్రజలను విడవేయటానికి వీలులేదన్నాడు. కాబట్టి పీపుల్స్ కాన్ఫరెన్స్, జాతీయ కాంగ్రెసును అనుసరిస్తుందన్నాడు. ఈ కరాచీ సమావేశాలలోనే, పీపుల్స్ కాన్ఫరెన్స్, 1935 ఇండియా యాక్టును నిరాకరించింది.

ఈ కాన్ఫరెన్సుకు ఒక ఉద్దేశ్యాన్నిచ్చి, దాని యంత్రాంగాన్ని సంస్కరించటానికి పూనుకున్నాడు. దానికిగాను సంస్థానాలలో అతి విస్తృత పర్యటనకు పూనుకున్నాడు. రాజకీయ ఉపన్యాసాల మీద నిషేధమున్న సంస్థానాలలో కూడా పర్యటించాడు. ఒరిస్సాలో ఆయన పర్యటించిన తరువాత, వెంటనే ఒరిస్సా స్టేట్ పీపుల్స్ కాన్ఫ రెన్సుకు అధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. ఎక్కడపర్యటించినా, కాంగ్రెసు గమ్యమూ, పీపుల్స్ కాన్ఫరెన్సుల గమ్యమూ ఒక్కటే అని స్పష్టం చేశాడు.

1937 ఎన్నికలలో, దేశంలోని రాష్ట్రాలలో కాంగ్రెసు అధిక సంఖ్యలో ఎన్నుకోబడటం, పీపుల్స్ కాన్ఫరెన్స్‌కు కూడా, ధైర్యాన్ని, బలాన్ని ఇచ్చింది. 1936 కరాచీ కాంగ్రెసు తర్వాత, మైసూరు, తిరువాన్కూరు, కొచ్చిన్, ఒరిస్సా ప్రాంతాలలోని సంస్థానాలలో ప్రజా ఉద్యమాలు ప్రారంభమయాయి. ఒరిస్సా ప్రభుత్వం, ఒరిస్సాకు చెందనివారు ఉద్యమాలలో పాల్గొనకూడదని పరోక్షంగా పట్టాభిని నిషేధిస్తే, నైజాం ప్రభుత్వం బహిరంగంగానే, 1938 జూన్‌లో పట్టాభి హైదరాబాద్‌రాగూడదని నిషేధించింది. పట్టాభి సలహాతో ఇక్కడి కాన్ఫరెన్సు "ఏ పీప్ ఇంటూ హైదరాబాద్" పుస్తకాన్ని ప్రచురించారు. మొత్తంమీద 1936–38 లలో సంస్థానాల ప్రజ లలో అమితమైన జాగృతి కలిగింది. దీనికి పట్టాభి పూర్తిగా బాధ్యుడు.

1938 ఫిబ్రవరిలో, పట్టాభి ప్రయత్నంవల్ల, హరిపురా కాంగ్రెసుకు ముందుగానే, నవసరిలో పీపుల్స్ కాన్ఫరెన్స్ సమావేశాలు ఏర్పాటు చేయబడ్డాయి. జాతీయ కాంగ్రెసు తమపట్ల చూపుతున్న అశ్రద్ధతో ప్రతినిధులు, కాంగ్రెసుపట్ల తీవ్ర విమర్శలు కురిపిస్తే, పట్టాభి తన చాకచక్యంతో వారిని సర్దాడు. దీనివలన తరువాత జరి గిన హరిపురా కాంగ్రెసులో, కాంగ్రెసు వారిలో ఎక్కువమంది, సంస్థా నాల పట్ల తమకుగల బాధ్యతలను గుర్తెరిగిన సూచనలు పూర్తిగా కనపడ్డాయి. నవసరీ సమావేశంలోనే, పట్టాభి కోరిక ప్రకారం 'స్టేట్స్ పీపుల్స్' అనే పత్రిక ప్రారంభించాలని నిర్ణయింపబడింది. ఇంతెందుకు ? నవసరిలో పట్టాభి తయారుచేసిన తీర్మానమే, హరి పురా కాంగ్రెసులో ఆమోదింపబడటమే కాకుండా, కాంగ్రెసు అధికార తీర్మానంగా ప్రతిపాదింపబడింది. తన అధ్యక్షోపన్యాసంలో సుభాస్ చంద్రబోస్, వ్యక్తిగతంగా కాంగ్రెసు నాయులు ఈ ఉద్యమంతో సంబంధం పెట్టుకోవటాన్ని హర్షించాడు కూడా !

1938 లో గాంధీజీ కూడా బహిరంగంగా ఈ ఉద్యమానికి మద్దతు నివ్వ ప్రారంభించాడు. ఆయన జన్మదినమైన, అక్టోబరు 2 నే 'స్టేట్స్ పీపుల్' ప్రారంభించబడింది.

ఈ ఉద్యమానికి ఇంకా ఘనతను చేకూర్చేందుకుగాను, 1939 లో దాని అధ్యక్ష స్థానాన్ని వహించమని పట్టాభి పండిట్‌జీని కోరాడు. నెహ్రూ దాని కంగీకరించి, 1939 లూధియానా సభలకు అధ్యక్షత వహించాడు. అదే సంవత్సరము, కాంగ్రెసుకూ, ఈసంస్థకూ సంబంధాలు ఇంకా దగ్గర చేసేందుకు ఏర్పాటు కాబడిన ఉప సంఘంలో గాంధీజీ, నెహ్రూ, పట్టాభిలు సభ్యులు.

1939 నుంచి 1948 వరకు, నెహ్రూకున్న ఇతర కార్య భారాల కారణంగా, పేరుకు ఆయన అధ్యక్షుడైనా, కార్యభారమంతా 'వర్కింగ్ ప్రెసిడెంట్' అయిన పట్టాభే మోశాడనిగాని 1942 క్రిప్స్ మిషను సందర్భంలో, ఈ ఉద్యమం తరఫున క్రిప్స్‌ను కలిశాడు పట్టాభి.

1946లో కాన్‌స్టిట్యుయంట్ ఎసెంబ్లీ చేత ఏర్పాటు చేయ బడిన స్టేట్స్ కమిటీలోనూ పట్టాభి ప్రముఖ పాత్ర వహించాడు. 1947 లో నెహ్రూ కోరికమీద, షేక్ అబ్దుల్లాకు అనుకూలంగా, అధ్యక్ష స్థానానికి పోటీ నుండి విరమించాడు. ఇక 'ఆల్ ఇండియా స్టేట్ పీపుల్స్ కాన్ఫరెన్సు' అవసరం తీరిపోవటంతో, 1948 ఆఖ రులో దీనికి ముగింపు జరిగింది.

పట్టాభిగారి చరిత్రలో అనేక మంది ఆంధ్రులకు తెలియని భాగమిది.

చాలా విచిత్రమయిన విషయమిది. దేశాన్ని భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా విభజించాలని కృషి సలిపిన పట్టాభే, ఇదే దేశంలో స్వదేశీ సంస్థానాలనబడేవి మట్టుకు పూర్తిగా ఐక్యం కావాలని అత్యం తంగా శ్రమించాడు.

ఇంకో విషయాన్ని కూడా మనం స్పష్టంగా చెప్పుకోవచ్చు. రంగంలోకి పట్టాభి దూకి, 1936 నుంచి 1947దాకా, అత్యంత శ్రద్ధాసక్తులతో పనిచేయకపోయి ఉండినట్లయితే, బహుశా సర్దార్ పటేల్ పని అంత సులభంగా నడిచేదికాదు సుమా! కాని దురదృష్ట వశాత్తు ఈ రంగంలోనూ ఆయన పేరు అంతగా బయటికి రాలేదు.

III

ఎంత సౌమ్యుడుగా, నెమ్మదిగా కనిపించినా, పట్టాభి అవసర మొచ్చినపుడు చాలా నిష్కర్షగా మాట్లాడగలిగిన వ్యక్తి. బహుశా ఒక్క గాంధీజీ తప్ప ఎంత పెద్ద వారైనా, వారితో ఢీకొన్నాడు, నిశితమైన తర్కంతో ఎదుర్కొన్నాడు.

1908లో, 28 సంవత్సరాల వయస్సులో మద్రాసు కాంగ్రెసుకు హాజరైన పట్టాభి, దక్షిణ భారతంలో రాజకీయ నాయకుడుగా పేరు ప్రఖ్యాతులు గడించిన వి. కృష్ణస్వామయ్యర్‌ను ఢీ కొన్నాడు. కాంగ్రెసు సబ్జక్ట్సు కమిటీకి, మద్రాసు రాష్ట్రంలోని ఉత్తర, దక్షిణ భాగాలకు న్యాయం కలిగేటట్లు సభ్యుల ఎన్నిక జరగాలనీ, మద్రాసు నగరమే ఈ విషయంలో గుత్తకు తీసుకోకూడదని వాదించాడు. కృష్ణస్వామయ్యర్, సుందరయ్యర్‌లు పట్టాభిని వ్యతిరేకించారు. అయినా కృష్ణస్వామయ్యర్ జాబితాకు ప్రతి జాబితాను ప్రతిపాదించాడు. ఈయన జాబితా ఓడిపోయినా, అంత చిన్న వయస్సులో కృష్ణస్వామయ్యర్‌ను వ్యతిరేకించిన పట్టాభి ధైర్య సాహసాలు అందరినీ ఆశ్చర్యపరిచాయి.

1915 బొంబాయిలో కాంగ్రెసు సబ్జక్ట్సు కమిటీ సమావేశాలు జరిగాయి. భాషా ప్రయుక్త రాష్ట్రాల విషయమై పట్టాభి వ్రాసిన తీర్మానాన్ని, మోచర్ల రామచంద్రరావు ప్రతిపాదించాడు. పట్టాభి దానిమీద మాట్లాడాడు. గోపాలరాఘవన్ లాటి కమిటీ సభ్యులు పట్టాభికి అడ్డు తగిలారు. దానితో సురేంద్రనాథ బెనర్జీ సలహాతో, సబ్జెక్ట్సు కమిటీ అధ్యక్షుడు సిన్హా, టైము లేదంటూ, పట్టాభి తీర్మానాన్ని త్రోసివేశాడు. తరువాత సురేంద్రనాథ బెనర్జీ నాలుగు తీర్మానాలు ప్రతిపాదించాడు. పట్టాభి వెంటనే లేచి ఆ తీర్మానాలకూ టైము లేదంటూ, సమావేశం ముగిసిందని ప్రతిపాదించి, సమావేశాన్నే ముగింప చేశాడు.

శ్రీమతి అనిబిసెంట్ అంటే పట్టాభికి ఎనలేని గౌరవముంది. ఆమెను 1917 సెప్టెంబరులో ఉదక మండలంలో నిర్బంధించినపుడు, తానూ రెండు నెలలు ఉదకమండలంలో గడిపి ఆమెను తరచు కలుస్తుండేవాడు. ఆమెనూ, ఆమె సహచరులనూ వదలకపోతే ఎ. ఐ. సి. సి. సభ్యులెవ్వరూ మాంటేగు భారతదేశం వచ్చినపుడు ఆయనతో సహకరించగూడదని ఒకతీర్మానం ఆమోదించమని 1917 ఎ. ఐ. సి. సి. కి లేఖ వ్రాశాడు.

కాని దురదృష్టవశాత్తు, ఎందువల్లనో అనిబిసెంట్‌కు భాషా ప్రయుక్త రాష్ట్ర విభజన ఇష్టం లేదు. 1917 కలకత్తా కాంగ్రెసు సభలలో ఆంధ్రులకు ప్రత్యేక కాంగ్రెసు కమిటీ కావాలని ఒక తీర్మానాన్ని ప్రతిపాదించేందుకు నోటీసిచ్చాడు పట్టాభి. ఆ సభలకు అనిబిసెంటు అధ్యక్షత వహించాలి. ఈ యుద్ధంలో పట్టాభి ఏకాకి. ఆయన కెవ్వరూ సాయం చేసేవారు లేరు.

ఈ తీర్మానం ఎలాగొలా ఎ. ఐ. సి. సి. లో లోకమాన్య తిలక్ సాయంతో గట్టెక్కింది. అక్కడ అనేకమంది మద్రాసు నాయకులు, అనిబిసెంట్ వ్యతిరేకించినా, తిలక్ లేచి అనుకూలంగా మాట్లాడటంతో, ఎవరి అడ్డంకి లేకుండా పాసు అయింది. కాని అసలు యుద్ధం సబ్జెక్ట్సు కమిటీ మీటింగులో ఆమోదింపబడటంలో ఉంది.

ఇది నిజంగా 'చారిత్రిక వాగ్వివాద'మే సుమా! అనిబిసెంట్ అధ్యక్షత వహించింది, దాదాపుగా కేవలం ప్రతికూలురను పట్టాభి మీద దండయాత్ర చెయ్యనియ్యటమే కాకుండా, తానే స్వయంగా ఆయనమీద దండయాత్ర చేసింది. 300మంది సభ్యుల సమక్షంలో, రాత్రి 7–30 గంటల నుంచి 10 గంటల దాకా ఏకాకిగా పట్టాభి వాదిస్తూనే ఉన్నాడు. కాంగ్రెసు వ్యవస్థా నిర్మాణానికీ, ఒసదులకూ, విరాళాలకు, అన్నిటికీ ఆంధ్రులకొక ప్రాంతీయ కాంగ్రెసుంటే, కాంగ్రెసుకే అది లాభమన్నాడు. చివరికీ విధంగా వాదించాడు :

"ది ఫ్యూచర్ ఆంధ్రా ప్రావిన్స్ విల్ బి మోర్ దేన్ ట్వైస్ ది సయిజ్ ఆఫ్ స్కాట్‌లాండ్, ఐయిర్‌లాండ్, బల్‌గేరియా ఎండ్ గ్రీస్ ఎండ్ మోర్ దేన్ 5 టయిమ్స్ ది సయిజ్ ఆఫ్ స్విట్జర్‌లాండ్ ఆర్ ఎ లిటిల్ లార్జర్ దేన్ టర్కీ ఎండ్ ఎ లిటిల్ స్మాలర్ దేన్ ఇటలీ. ఇట్ విల్ డెవలప్ ది ఎకనామిక్ ఎండ్ మారల్ రిసోర్సెస్ ఆఫ్ ది పీపుల్. ఇట్ విల్ ప్రమోట్ ఎడ్యుకేషన్, గుడ్ గవర్నమెంట్ ఎండ్ ఎవ్‌రీ మార్క్ ఆఫ్ ప్రాస్పెరిటీ ఎమాంగ్‌స్ట్ ది ఆంధ్రాస్. ఇట్ విల్ ఫెసిలిటేట్ ఎండ్ హాస్టెన్ ది రియలయిజేషన్ ఆఫ్ ది అయిడియల్ ఆఫ్ సెల్ఫ్ గవర్న్‌మెంట్. ఇట్ విల్ ఎన్‌రిచ్, స్ట్రెంగ్‌తెన్, ఇన్‌విగరేట్ ది ఫ్యూచర్ ఇండియన్ నేషనాలిటీ."

పట్టాభి ఈ వాగ్ధోరణితో విజయం పొందగలడని గ్రహించిన అనిబిసెంట్, పట్టాభి ఈ రంగంలో మెజారిటీ పొందగలిగినా, అధ్యక్షురాలిగా తాను, కాంగ్రెసు రాజ్యాంగం ప్రకారం రాష్ట్రం వారీగా వోటు వేయమని, పట్టాభి తీర్మానాన్ని ఓడించగలనని అంది.

పట్టాభి ఈ సవాలుకు కూర్చోలేదు. వెంటనే లేచి తానూ అధ్యక్షురాలిని కాంగ్రెసు రాజ్యాంగంలోనే తిరిగి ఓడించగలనన్నాడు.

"ఎలా" అంది అనిబిసెంట్.

కాంగ్రెసు రాజ్యాంగం ప్రకారం, కాంగ్రెసుకు ఇద్దరే కార్యదర్శులుండాలనీ, కాని అనిబిసెంట్ సి. పి. రామస్వామయ్యర్‌ను మూడవ కార్యదర్శిగా నియమించిందనీ, దాని కోసం ఆమె కాంగ్రెసు నిబంధనావళి సవరణను కోరితే, తాను దానిని ఓడిస్తానన్నాడు.

ఎట్టకేలకు ఆరాత్రికే పట్టాభి తీర్మానం ఆమోదింపబడింది. ఈ విధంగా 1917లో నేటి భాషా ప్రయుక్త రాష్ట్రాలకు, ముఖ్యంగా ఆంధ్రకు పునాది వేసిన ఘనత పట్టాభికే దక్కుతుంది.

రచయితలకి మనవి

రచనలలో ఇంగ్లీషు లిపి అధికంగా ఉంటే అచ్చు కూర్పుకి ఇబ్బందిగా ఉంటుంది కనుక 'భారతి'కి తమ రచనలు పంపేవారందరూ వీలయినంత వరకు తెలుగు లిపినే వాడాలని మనవి చేసుకుంటున్నాము.

సంపాదకుడు.

దీని ఫలితంగా 1918లో సింధుకు, 1919లో కర్ణాటకకు ప్రత్యేక కాంగ్రెసు కమిటీలు లభ్యమయ్యాయి.

1917లోనే పట్టాభి ఇంకా 16మంది ఆంధ్ర నాయకులతో కలిసి భాషాప్రయుక్త రాష్ట్రాలు కావాలంటూ మాంటేగ్‌ను కలిశాడు. అలాగే 1918 నవంబరులో సౌత్‌బరో కమీషనుముందు సాక్ష్యమిచ్చాడు.

1919లోనే 'జన్మభూమి' ఆంగ్ల వారపత్రికను స్థాపించి, అడ్వొకేట్ జనరల్ సర్ సి. పి. రామస్వామయ్యర్‌పోటి వారికందకుండా దానిని నడిపాడు. మోతీలాల్‌నెహ్రూ "ఇండిపెండెంట్" పత్రికకు సంపాదకుడుగా రమ్మన్నా "బాంబే క్రానికల్"వారు రమ్మన్నా బందరువదిలి వెళ్ళటం ఇష్టంలేని కారణంగా నిరాకరించాడు. 1930లో ఆయన జైలుకెళ్ళటంలో 'జన్మభూమి' మూతపడింది.

1920లో నాగపూర్ కాంగ్రెసులో సహాయ నిరాకరణంమీద చాలా దీర్ఘమైన చర్చలు సాగాయి. 15000ల మంది ప్రతినిధులు హాజరయ్యారు. బ్రిటిష్ లేబర్‌పార్టీ తరఫున ఒక సుహృద్భావసంఘం కూడా హాజరయ్యింది. కల్నల్ వెడ్జివుడ్ దాని నాయకుడు. వెడ్జివుడ్ సబ్జెక్ట్సు కమిటీ సమావేశంలో ప్రసంగిస్తూ సహాయ నిరాకరణాన్ని వానివేయమనీ లేకపోతే ప్రజాహిత కార్యాలను కాంగ్రెసు బహిరంగంగా చేయలేదనీ, పోలీసులు వాళ్ళవెంట పడతారనీ, భారతీయులతో న్యాయవాదులు తమ "సావరిన్"పట్ల విధేయతతో ఉంటామని తీసుకున్న ప్రతిజ్ఞ వమ్ముఅవుతుందనీ, అన్నిటికీమించి బ్రిటన్‌లోగల భారతీయాభిమానులంతా దూరమవుతారంటూ ప్రసంగించాడు.

వెడ్జివుడ్ ప్రసంగం విన్న వెంటనే 40 సంవత్సరాల పట్టాభి లేచి వెడ్జివుడ్‌ను దులిపివేశాడు :

"కాల్‌నెల్ వెడ్‌జివుడ్ హేస్ కమ్ ఆల్ ది వే ఫ్రమ్ ఇంగ్లాండ్ టు థ్రెటెన్ అస్ సేయింగ్ దట్ ది పోలీస్ వుడ్ బి ఆఫ్టర్ అస్ ఇన్ కేస్ వీ నాన్-కో-పరేటెడ్. లెట్ మీ టెల్‌హిమ్, యాస్ ది యంగెస్ట్ మెంబర్ ఆఫ్ దిస్ హవుస్ దట్ డ్యూరింగ్ ది పాస్ట్ 14 యియర్‌స్ ఆఫ్ మయి పబ్లిక్ లయిఫ్, ఇన్ విచ్ వి హేవ్ స్టార్టెడ్ ఎ నేషనల్ కాలేజ్ ఎండ్ కలెక్టెడ్ ఫండ్‌స్ దేర్‌ఫర్, ఎవ్రీ రుపీ దట్ వుయి హేవ్ కలెక్టెడ్ హేస్ బీన్ కలెక్టెడ్ అండర్ ది షాడో ఆఫ్ ది రెడ్ టర్‌బన్ ... ది డేస్ ఆఫ్ లాయల్‌టీ ఆర్ గాన్ — గాన్ — నోమోర్ టు రిటర్న్... లెట్ మి ఫ్రాంక్‌లీ బట్ రెస్పెక్ట్‌ఫుల్లీ సే దట్ వుయి హేడ్ నో ఫ్రెండ్‌స్ ఇన్ ఇంగ్లాండ్ ఎండ్ హేవ్ నన్. అవర్ ఫ్రెండ్‌స్ ఆర్ ఇన్ ఇండియా ఎండ్ ఇండియా ఈస్ ది ప్లేస్ ఇన్ విచ్ వుయి షుడ్ లుక్ ఫర్ అవర్ ఫ్రెండ్‌స్."

ఈ సమాధానంతో సభ దిగ్భ్రాంతిచెందింది. వెడ్జివుడ్ బిత్తరపోయాడు. తరువాత పట్టాభి కనపడితే నవ్వుతూ 'నాకింకా ఏమైనా ఉందా?' అని అడిగాడు. పట్టాభి చిరునవ్వు నవ్వుతూ తనను అపార్థం చేసుకోవద్దనీ వెడ్జివుడ్‌పట్ల వ్యక్తిగతంగా తనకెలాంటి దురభిప్రాయం లేదని క్షమాపణలు చెప్పుకున్నాడు.

స్వరాజ్యపార్టీ నాయకులు ఎప్పుడూ పట్టాభి విమర్శలకు గురి అవుతూనే ఉన్నారు. వ్యక్తిగతంగా చిత్తరంజన్‌దాస్‌పట్ల ఎంత గౌరవభావమున్నా 1923లో ఒక మద్రాసు సభలో గాంధీజీని 'ఎ సెల్ఫ్-ఎఫేసింగ్ సెయింట్' అనీ, సి.ఆర్.దాస్‌ను 'సెల్ఫ్-ఎడ్వర్టయిసింగ్ ఛార్లటాన్' అనీ వర్ణించాడు.

1925 పాట్నా ఎ. ఐ. సి. సి. సమావేశాల్లో మోతీలాల్ నెహ్రూను తీవ్రంగా విమర్శించాడు. ఇది మోతీలాల్‌ను ఎంతగా చికాకు పరిచిందంటే అట్లాంటి ఆరోపణలు చేస్తే తాను కాంగ్రెసు నుంచే రాజీనామా చేస్తానన్నాడు. అగ్నిమీద ఆజ్యంపోసినట్లు పట్టాభి రాజీనామా పరిష్కారమార్గం కాదన్నాడు. చివరకు గాంధీజీ స్వయంగా జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. 1928లో తిరిగి 'ఆనందభవన్'లోనే మోతీలాల్‌తో మాటామాటా జరిగింది.

బహుశా పండిట్‌జీ తన హయాంలో పట్టాభిపట్ల అంత సుముఖత్వాన్ని చూపకపోవటానికి పట్టాభియొక్క ఈ గత చరిత్రే కారణం కావచ్చు.

1945 కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సమావేశంలో స్వతంత్ర భారతానికి ఆర్థికమంత్రిగా సి. డి. దేశముఖ్, జి. ఎల్. మెహతా పేర్లను పట్టాభి సూచిస్తే ఎవ్వరూ ఒప్పుకోలేదు. కాని తరువాత స్వతంత్ర భారతంలో ఈ ఇరువురూ ప్రముఖ స్థానాలను ఆక్రమించారు. 1948లో ఆర్థికమంత్రి ఆర్. కె. షణ్ముఖంచెట్టి ప్రవర్తనను తీవ్రంగా విమర్శించాడు.

ఈవిధంగా పట్టాభి ఒక్క గాంధీజీ విషయంలో మినహా మిగతా అందరిపట్ల తీవ్రవిమర్శకుడే. అయితే రాజేంద్రప్రసాద్, ఆజాద్‌లతో ఎప్పుడూ సత్సంబంధాలే ఉంటుండేవి.

* * *

క్లుప్తంగా ఆయన శతజయంతి సందర్భంగా ఆయనకు సమర్పించగలిగిన నివాళి ఇది. 1880లో జన్మించి 1898లో మొదటిసారిగా కాంగ్రెసు సభలకు హాజరై 1908నుంచి కాంగ్రెసు వ్యవహారాలలో శ్రద్ధతీసుకోసాగి 1916నుంచి తన వైద్య వృత్తికి స్వస్తి చెప్పి కాంగ్రెసు స్వచ్ఛంద సేవకుడుగా మారిన మహానుభావు డీతడు. గాంధీజీకన్న ముందుగానే కాంగ్రెసుతో ఐక్యమైన దేశభక్తుడు, అస్వతంత్ర భారతములో పదవులన్నిటినీ నిరాకరించిన త్యాగపురుషుడు. స్వతంత్ర భారతంలో తన అర్హతకు తగిన ఏ పదవీ లభించని దురదృష్టవంతుడు. ఈ నిరాశ, నిస్పృహలను ఆయన తన స్వీయ చరిత్రలో వ్రాసుకొన్నాడంటారు పెద్దలు. (స్వీయచరిత్ర అముద్రితము)

ఏది ఏమైనా ప్రతివారూ శ్రీమాన్ రాజగోపాలాచారి అంత అదృష్టవంతులు కాలేరు కదా! 1942లో కాంగ్రెసు నాల్గణాల ప్రాథమిక సభ్యత్వంనుంచి కూడా వైదొలగిపోవలసివచ్చిన రాజాజీనే 1948లో భారతదేశపు ప్రథమ గవర్నర్ జనరల్ పదవి వలచి వరించింది.

ప్రపంచంలోకెల్లా అపూర్వ శాంతియుత విప్లవము, సంస్థానాల విలీనీకరణను సాధించిన ఖ్యాతి సర్దార్‌కే దక్కింది. అందులో తప్పులేదు. కాని దానికి సుదృఢ భూమికను నిర్మించి సమాయత్తం చేసి మార్గాన్ని సుగమం చేసిన పట్టాభే ఎవ్వరికీ తెలియకుండా అనామకుడయ్యాడు. ప్రపంచానికి భూమికమీద నిర్మించిన గోపుర శిఖరమే దృగ్గోచరమవుతుంది కాని భూమికకాదు సుమీ అని సరిపెట్టుకోవటం సునహో దీనిని గురించి ఇంకేమి అనుకోగలము ?

పట్టాభిగారు రాజకీయనిరాశలను శాంతచిత్తంతో స్వీకరింపగల మనస్తత్వాన్ని పెంపొందించుకున్నాడు. దీనికిగాను ఎల్లప్పుడూ భాగవతంలో అజాగరుడు ప్రహ్లాదునితో చెప్పిన తాత్త్వికధోరణే తన దృక్పథమంటుండేవారట :

లేదని యెవ్వరి నడుగను,
రాదని చింతింప, పరులు రప్పించినచో
కాదని యెద్దియు మానను
ఖేదము మోదము లేక క్రీడింతు మదిన్.

ఎక్కడో గుండుగొలనులో ఆగర్భ శ్రీమంతుడుగా జన్మించి విధివైపరీత్యంవల్ల సర్వమూ కోల్పోయి ఆ రోజులలో గోచితో పాఠశాలకు పోవ ప్రారంభించి స్వయంకృషితో పైకివచ్చి తన దేశానికి ఇంత చెప్పుకోగలిగిన సేవచేసి నిండు 79 సంవత్సరాల జీవితాన్ని గడిపిన ఆ పుణ్యపురుషునికి ఇంకా ఖేదమెందుకు ?

*　　*　　*

పట్టాభిగారే ఒకచోట మనలను గురించి ఇలా అన్నారు :

"ఆంధ్రాస్ ఆర్...వేస్ట్‌ఫుల్, ఎక్స్‌ట్రావగంట్, లక్జూరియస్, అన్‌యాంబిషస్ ఈసీ గోయింగ్ ఎండ్ ఈవెన్ లేజీ ఎండ్ ఎమోషనల్ టు ఎ డిగ్రీ......"

ఇవ్వన్నీ దుర్గుణాలేనా ? ఒకవిధంగా ఆలోచిస్తే కాదేమో!

ప్రతి ఆంధ్రుడూ అంతరాంతరాలలో రాజకీయోత్సాహి. ప్రకాశం, రంగా, పట్టాభుల వారసుడుసుమా! 'ఎమోషను' ఫలితమైన ఆవేశం లేకపోతే మానవుడు త్యాగి ఎలా అవుతాడు? త్యాగం కొంతమంది దృష్టిలో దుబారా కావచ్చు. నిజమే. తనకు అనవసరమైన విషయాలకు, తనకు లాభించని వాటికోసం ధనాన్ని, కాలాన్ని, జీవితాన్ని త్యాగంచేయుటం లేదా వ్యర్థం చేయటంలో ఏమి లబ్ధి ఉంది? కాని దురదృష్టకరమైనదల్లా ఒక్కటే—అదే సోమరితనం. ఆవేశం, త్యాగంలేని జాతి మనగలుగుతుందా? ఏమో !

పట్టాభిగారి జీవితంలోని అనేకరంగాలను, విద్య, బాషా ప్రయుక్త రాష్ట్రాలు, వ్యాపార రంగాలు గాంధీజీ సూత్రాలకు భాష్యకారిత్వం వీటన్నిటినీ వ్యాసవిస్తరణ భీతితో వదిలివేయటం జరుగుతున్నది. ఆయనలో దోషాలుగా కనపడే స్వల్ప సంఘటనలనూ వదిలివేయుటం జరిగింది. 20 సంవత్సరాల తరువాత ఒకపూర్ణజీవితాన్ని పరామర్శించటంలో అల్పాల్పమైన దోషాలు ఉటంకించతగినవికావు.

అనుబంధము

ఇక్కడ పట్టాభిగారి రచనల జాబితా ఈయటం జరుగుతున్నది.

1 వారి "స్వీయచరిత్ర" అముద్రితము.
2 ఇండియన్ నేషనల్ ఎడ్యుకేషన్ (జాయింట్‌లీ విత్ కె. హనుమంతరావు.) (1910)
3 ఇండియన్ నేషనలిజమ్. (1913)
4 సహాయ నిరాకరణము (తెలుగు) (1922)
5 ఆన్ ఖద్దర్ (1931)
6 హిస్టరీ ఆఫ్ ది కాంగ్రెస్—వాల్యూమ్ I (1935)
7 సోషలిజమ్ ఎండ్ గాంధీయిజమ్ (1938)
8 కాన్‌స్టిట్యుయెంట్ ఎసెంబ్లి (తెలుగు) (1939)
9 కాంగ్రెసు సంస్థానములు (తెలుగు) (1940)
10 వై వోట్ కాంగ్రెస్ (1945)
11 గాంధీ ఎండ్ గాంధీయిజమ్—రెండు వాల్యూములు (1942)
12 ఫెదర్స్ ఎండ్ స్టోన్స్ (1946)
13 ఐ టూ హేవ్ స్పన్ (1946)
14 సమ్ ఫండమెంటల్స్ ఆఫ్ ఇండియన్ ప్రాబ్లెమ్స్ (1946)
15 నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఫ్రీడమ్ ఇన్ ఇండియా (1947)
16 హిస్టరీ ఆఫ్ ది కాంగ్రెస్, వాల్యూమ్ II (1947)
17 కరెంట్ హిస్టరీ ఇన్ క్వెస్చన్స్ ఎండ్ ఆన్సర్స్ (1948)
18 హిస్టరీ ఆఫ్ ది నేషనలిస్ట్ మూవ్‌మెంట్ ఇన్ ఇండియా. (1950)

రోడ్డు క్రాస్ చేస్తా!

శ్రీ నందిని సిధారెడ్డి

జిరా రికార్డు అవుతావా ?
బావిమీద బట్టలుతుకుతున్న శబ్దం వినాలి,
బావురు మంటున్న చంటి పిల్లాడి గుండెకోత వినాలి !
ఈ పూలదండలు కాస్త తీస్తావా ?
పొలానికెళ్లి మెడమీద కాడి మొయ్యాలి,
ప్లాట్‌ఫారమ్ మీదికి కిటకిటలాడే రైళ్లని మొయ్యాలి !
వాహనాల్ని, వాగ్దానాల్ని
మనుషుల్ని, ఎడతెగని అందాల్ని
తప్పించుకుంటూ రోడ్డు క్రాస్ చెయ్యటం కష్టంగావుంది-
చేతుల బేడీలు విప్పమని పుస్తకాల షాపుల్లోంచి పత్రికల
మొత్తుకోళ్లు వినలేరు-
బట్వాడా చెయ్యమని పోస్ట్‌బాక్సుల్లోంచి ఉత్తరాలు
పెట్టుకునే అర్జీలు చూడలేరు-
తప్పదు —
నేనే రోడ్డు క్రాస్ చెయ్యాలి !
వెళ్ళే స్కూటర్‌మీద 'చెట్టు చుట్టూ అల్లుకుపోయిన
తీగల' కేమీ పట్టదు,
తిరిగే వ్యాన్‌లో కళ్లు అతుక్కుపోయిన విగ్రహాల నయనాల
కేమీ పట్టదు,
కార్లలో మొరుక్కుంటూ వెళ్లిపోయే ఆఫీసు కుర్చీలకేమీ
పట్టదు.
చౌరస్తామీద ట్రాఫిక్ లైట్లు పన్చెయ్యవాయె —
ఒక్కడ్నైనా రోడ్డు క్రాస్ చెయ్యాలి ? ?
చెమటంతా లారీల్లో దాటిపోతూనా...?
భవిష్యత్తంతా ఫోన్లమీద ప్రవహిస్తూనా...??
ఇలా చేతివేళ్ల ఉంగరాల సందుల్లో చినిగిపోతూనా ...
ఇండియా ? ? ?
అయ్యో ఇండియా ? ఇండియా ?
క్రాస్ చెయ్యనివ్వకుండా ఈ రోడ్డింత భయంకరంగానా ?

సిగరెట్ పొగలు గుంపులు గుంపులుగా వొచ్చి ఘెరావ్
చెయ్యటం గుర్తుంది —
టోపీలు అడ్డమడ్డంగా వొచ్చి సెక్రటేరియట్ ముందు
లాఠీచార్జి చెయ్యటం గుర్తుంది—
మత్తెక్కి, కాపిటలిస్ట్ కళ్లు తుపాకీ బాయొనెట్‌లోంచి
దూసుకెళ్లి
ధన్‌బాద్ గుండెల్ని చప్పరించిన ఘోరం
అనుక్షణం నన్ను కదుపుతూనేవుంది -
అయినా ...
ఈ రోడ్డు క్రాస్ చెయ్యాల్సిందే !
అవతల పంజరంలో నిలబడ్డ చిలకల్లా గ్రామాలు
పిలుస్తున్నయ్ !
కళ్లలోంచి ముందుకొచ్చిన ఎడార్లు ఆశగా నాకేసి
చూస్తున్నయ్ !
గంగ చీలి దారిచ్చిందట, ఎవడికో...?
రోడ్డా, కాస్త చీలి దారివ్వరాదా నాకోసం !
చెట్లు కోల్పోయిన అడవుల్తో
మేఘాలు కోల్పోయిన ఆకాశంతో
అలలు కోల్పోయిన సముద్రంతో
నా రక్తాన్ని పంచుకుంటానికి నే వెళ్లాలి !
తప్పదూ —
తప్పదూ,
నేనే రోడ్డు క్రాస్ చెయ్యాలి !
ట్రాఫిక్కో,
రోడ్డో,
చీలి దారివ్వకపోతే
ఏ గుండె తీసయినా సరే,
క్రాస్ చెయ్యటానికి
ఎర్రలైట్‌లా వెలిగించుకుంటా !

శ్రీ ముదిగొండ వీరభద్రయ్య

"ఆదర్శ సమాజం-జగన్నాథుని రథం" శ్రీ అరవిందుల సిద్ధాంతం

ఆదర్శ సమాజాన్ని వ్యవస్థాపించడానికి అనేకులు అనేక విధాలైన సిద్ధాంతాలను ప్రబోధించారు. మార్క్సు, ఏంగెల్సు, గాంధీజీ, ఎం. ఎన్. రాయ్, లోహియా, ఇటీవల దీనదయాళ్‌జీలు వారిలో కొందరు. వీరు తమ ప్రబోధంతో జోడించి ఆదర్శ సమాజానికి లక్ష్యంకిగా ఏవేవి ఉన్నాయో కూడా వివరించారు.

ఈ పనిని చేసిన తాత్త్వికులలో అత్యంత ప్రముఖులు శ్రీ అరవిందులు.*

వారు ఆదర్శ సమాజాన్ని 'మనుష్య సమష్టి యొక్క అంతరాత్మయైనట్టి భగవంతుని వాహనమైన జగన్నాథుని యాత్రా రథం'తో సంకేతించారు.

ఆ రథ చక్రాలుగా 'ఐక్యత, స్వాధీనత, జ్ఞానం, శక్తి' అనే వాటిని ఆయన దర్శించారు.

సామూహికాహంకారపు వాహనంవల్ల సమాజంలో వ్యష్టి — సమష్టుల నడుమన సమన్వయం సాధ్యం కాదనీ, అది 'స్వతంత్రాంతర్యామిని కప్పిపుచ్చి బహు రూపియైన భగవత్ప్రేరణను వికృతం' చేస్తుందనీ శ్రీ అరవిందు లన్నారు.

సామూహికాహంకారంతో నడిచే సమాజం వినాశాల్ని తెచ్చిపెట్టడం, ప్రపంచ యుద్ధాలకు కారణం కావడం, పేద దేశాలను తన ఏలుబడిలోకి తెచ్చుకోవడానికి హేతువుకావడం — ఇటీవలి చరిత్రలోనే మనం చూశాము. అటు ఆనాటి జర్మనీ, రష్యా, ఈనాటి చైనా (టిబెట్, మెక్‌మోహన్ సరిహద్దుల విషయంలో) లు చూపిన దురహంకారం అవి సామూహికాహంకార సమాజాలుగా రూపొందడం వల్లనే జరిగింది. మానవుడు 'పూర్ణుడు'గా రూపొందడానికి సమాజమూ తన పూర్ణ స్వరూపాన్ని—గుణాత్మకంగా పరిణమించి రూపొందించుకోవడం అవసరం.

వ్యక్తి — సమాజము అనే రెండు లంశాలు కూడా పరస్పర సమన్వయాలతో పూర్ణత్వాన్ని సాధించుకోవాలి. ఒక దాని వికాసానికి మరొకటి అడ్డు రాకూడదు. ఈ దృష్టితోనే శ్రీ అరవిందులు 'దైవ పూర్ణతా సాధనకు ప్రధానావాంతరమైన అహంకారమే వ్యష్టి సమిష్టుల సమగ్రతకు అవాంతర మౌతుంది—' అని అన్నారు.

పూర్ణ మానవరావిర్భావమే పూర్ణ దైవత్వాన్ని ఆవిష్కరిస్తుంది.

సమాజం సహజమైంది కావాలి. దాన్ని ఏదీ, ఎవ్వరూ నియంత్రించగూడదు. ఎవరికివారు స్వనియంత్రణ చేసికోగల్తే పూర్ణ వికాసాన్ని పొందగల్గాలి. దీనికి భౌతిక వస్తూత్పత్తి, దాని సంపిణీ కూడా ధర్మబద్ధంగా జరగాలని శ్రీ అరవిందులు కాంక్షిస్తూ "రాజు యొక్కయు, భూస్వాముల యొక్కయు ప్రత్యేకాధికార గౌరవములను దొలగించి అందరు జాతీయాధికారమును, ఐశ్వర్యమును, ఉత్సాహ జీవితమును సమానముగ అనుభవించుటకు వీలుండ వలయును. సంఘము నందలి ధనిక వర్గము వారి వెనుకటి స్వార్థపరత్వమును వదలివేసి దరిద్ర ధనిక భేదములను తొలగించి ధనోత్పత్తికి కారకులగు వారికి లేక కార్మికులకు ధనిక వర్గముతో నించుమించు సమాన లాభముండునట్లు ఏర్పడవలయును. సర్వ విధముల మనుష్యుడు తన స్వభావోన్నతిని తెలిసికొని స్వకీయ మహిమాతిశయములను గాంచ వలయును." అని అన్నారు.

వర్గ రాహిత్యం జరిగి ధనికులు — పేదలు అన్న స్థితి నశించి మానవుడు తన ఔన్నత్యాన్ని దర్శించ గల్గాలని వారి ఉద్దేశ్యం. అప్పుడు కాని స్వనియంత్రణ సాధ్యం కాదు. అందుకే జగన్నాథుని రథ చక్రాలలో ఒకటిగా 'స్వాధీనత'ను వారు చెప్పారు. భౌతికాధ్యాత్మిక విషయాలలో సమన్వయం, అవి ఒక దానిని మరొకటి తిరస్కరించక పోవడం ఉన్నప్పుడే స్వాధీనత సాధ్యం అవుతుంది. మానవునికి బైట ఉండే యంత్రాంగం అతనిపై యాజమాన్యాన్ని చెలాయిస్తే అది పరాధీనత **అవుతుంది.**

ఈ పరాధీనత దైవ పూర్ణతా సాధనకు అడ్డంకి. అందువల్ల ఎవరికి వారు స్వాధీన ప్రవర్తనలో ఉంటూ వ్యక్తికీ వ్యక్తికీ నడుమన ఎలాంటి వైరుధ్యాలు రాకుండా శ్రీ అరవిందులు 'ఐక్యత—జ్ఞానము'లను చెప్పారు. ఒక్కొక్కప్పుడు తమోగుణంతో ఉండి, మిడి మిడి

* శ్రీ అరవిందు లీ విషయాల్ని "జగన్నాథేర్ రథ్" అన్న వంగ భాషా వ్యాసంలో తెలిపారు. ఆ వ్యాసాన్ని అనువదించి నా మిత్రులు శ్రీ కె. కనకాచారిగారు నాకీ వ్యాస రచనకు సౌలభ్యాన్ని కల్గించారు.

జ్ఞానంతో తానున్న దుస్స్థితిని దుస్స్థితి అని కూడా తెలిసికోలేక శక్తిహీనుడై, ముందుకు అడుగువేయలేని వాడుగా వ్యక్తి ఉంటాడు. దానికి తోడు అలా ఉండగల్గడమే 'శక్తి' అని కూడా భ్రమపడ్తాడు! ఈ విధంగా వ్యక్తి అశక్తిచేత తక్కిన మూడింటిని కోల్పోకుండటం కోసం శ్రీ అరవిందులు ఈ మూడింటికి 'శక్తి'ని జోడించారు.

ఈ విధంగా ఆదర్శ సమాజం ఏ పునాదుల మీద నిర్మాణం కావాలో జగన్నాథ రథ చక్రాల ప్రతీక ద్వారా శ్రీ అరవిందులు విశదీకరించారు. అయితే ఇదే వ్యాసంలో వారు సమాజానికీ — సంఘానికీ నడుమన ఉన్న భేదాన్ని తెల్పుతూ

''జగన్నాథుని రథపు అసలు పేరు సమాజం కాదు, సంఘం. ఎన్నో విధాల చితికిపోయిన జనసంఘం లేక జనత కాదు. ఏకోన్ముఖమైన ఆత్మజ్ఞాన, భగవత్ జ్ఞానాల శక్తితో, ఆనందంతో నిర్మించబడిన బంధన రహిత అభేద్య సమాహారమీ భగవత్సంఘం.'' అని వివరించారు.

జ్ఞానము (ఆత్మ, భగవత్ జ్ఞానాలు), శక్తి, స్వాధీనత్వం (బంధ రాహిత్యం), ఐక్యత (అభేద్య సమాహారం), ఈ నాలిగింటినీ సాధించుకొన్నదే సంఘమని తాత్పర్యం. ఇవి లేకుంటే సంఘీభావంలో 'ఆనందం' ఉండదు. వికాసం ఉండదు. (గొర్రెల మంద కూడా సంఘీభావంతోనే ఉంటుంది!) ఎప్పటికీ భౌతికంగా కలిసి ఉండడమే కాదు—దానికి తోడు మానవుడు పూర్ణుడుగా పరిణామాన్ని పొందగల్గే అవకాశం ఉండాలి. శ్రీ అరవిందులు ఏతత్సాధనకు ఇవేళ మనకు తెలిసిన సమాజాలు అడ్డంకిగా భావించారు. వారు 'సమాజం' అంటే ఏమిటో నిర్వచిస్తూ

''అనేకుల క్రియా ఫలాన్ని ఒకచోట చేర్చే సంస్థయే సమాజమనే పేర ప్రసిద్ధం. వ్యుత్పత్తి తెలిస్తే శబ్దార్థమూ బోధపడ్తుంది. 'సమ్' అంటే ఏకత్రం. 'అజ్' అంటే గమనం, పరుగు యుద్ధం. ఒకే క్షేత్రంలో కర్మార్థం, కామార్థం, కొందరు ముందు, కొందరు పెద్దలు వేన వేల మానవులు వేర్వేరు గమ్యాలవైపు పరుగెత్తుతారు. దాంతోనే నాశ వినాశము, పోటీ. ఇతర సమాజాలతో మాదిరిగానే తమలో తమకే యుద్ధం, కీచులాట. ఈ కోలాహలం మధ్యలోనే శృంఖలాల కొరకు, సహాయం కొరకు, మనోవృత్తియొక్క చరితార్థత కొరకు పెక్కు సంబంధాల స్థాపనం, పెక్కు ఆదర్శాల ప్రతిష్ఠాపనం. ఫలితంగా ఏదో కష్టంతో సిద్ధించడం — అసంపూర్ణత — అస్థాయి. ఇదే సమాజపు ప్రాచీన ప్రపంచ రూపం.''

ఒకేచోట ఉంటాం. అందరి శ్రమ ఫలితాన్ని ఒక్కచోట వేస్తాం. ఇలా వేసే సంస్థనే 'సమాజం' అని పిలుస్తాం. కాని ఒక క్షేత్రం నుంచి వేరు వేరు గమ్యాల వైపునకు పరుగెత్తుతూ ఉంటాము. దాన్తో నాశ వినాశాలు, పరస్పర స్పర్థలు యుద్ధాలు మొదలౌతాయి. ఈ కల్లోలం నుంచి తప్పుకోవడానికి నియమాలు, నిబంధనలు, అనేక సామాజిక సంబంధాలు — ఏర్పరచుకొంటాము. ఆదర్శాలు నిర్ణయించుకొంటాము. కానీ ఏదీ పూర్ణత్వాన్ని, సమగ్రతను ఈయవు. సమాజం అంటే ఇది. సంఘం దీనికి పూర్తిగా విరుద్ధమైంది. అయినా శ్రీ అరవిందులు 'సంఘం' అనే అర్థంలోనే రూఢిలో స్థిరపడిన 'సమాజ' శబ్దాన్ని వాడుతూ

''ప్రాచీన సమాజానికి ఆధారం అసమానత. ఆ అసమానతల కారణంగా ఏర్పడిన ఐక్యత ఆంశికం — అనిశ్చితం — తాత్కాలికం. ఆదర్శ సమాజ నిర్మాణం సరిగ్గా దీనికి విరుద్ధం. ఐక్యభిత్తి, ఆనంద వైచిత్ర్యానికై—భేదాల ఆటకాదు—పార్థక్య క్రీడ, శారీరక, మనోకల్పిత మరియు కర్మగతైక్యాభ్యాసం ఆత్మగతైక్య సంఘపు ప్రాణం సమాజంలో పొందుతాం'' అని అన్నారు.

బహిరంతర ప్రపంచాల్లో ఐక్యతే సంఘప్రాణం. అలాంటి 'ఐక్యభిత్తి'చేత ఆనందం కల్గుతుంది. మనస్సుకీ, కర్మకీ కూడా ఐక్యత ఉండాలి. కర్మ మనస్సు ప్రేరణచేత జరగాలి. ఎవరో నియంత్రించి, ఆజ్ఞాపించి, శాసించడంవల్ల కర్మచేయడం జరుగితే ఆ సమాజం ఆదర్శ సమాజం కానేరదు. సమాజం ఏర్పడిందే కర్మ కోసం. వ్యక్తులందరిలో ఆత్మగతైక్యతను సాధించుకొని ఈ సమాజాన్ని పూర్ణసమాజంగా చేయాలనిచెప్తూ శ్రీ అరవిందులు

''సమష్టిగత విరాట్ పురుషుని ఇచ్ఛాశక్తి ప్రేరణలో, జ్ఞాన కర్మ భావాల సామంజస్యంలో మరియు ఏకీకరణలో ఆత్మగతైక్యత కన్పించిననాడు, విశ్వవీధులందు 'జగన్నాథుని రథం' బయల్వెడలి దశ దిశలను ద్యుతిమంతం చేస్తుంది. ఇలాతలంలో సత్యయుగం అవతరిస్తుంది. మర్త్యమానవలోకం దేవతల క్రీడాశిబిరమూ, దేవాలయ నగరమూ, ఆనందపురమూ అవుతుంది'' అని అన్నారు. జ్ఞానమూ, కర్మలమధ్య సామంజస్యం ఉండడం అన్నది చాలా ముఖ్యమైన విషయం. వాటి రెండింటిమధ్య ఐక్యత ఉండాలి—అని అంటే జ్ఞానం కర్మకు ప్రాణంగానూ, కర్మ జ్ఞానానికి ప్రాణంగానూ ఉండాలన్నమాట. 'స్వభావతః సంఘం, కర్మ సంబంధ కార్యరంగం' అని సంఘంయొక్క స్వభావాన్ని తెల్పారు శ్రీ అరవిందులు. ఆ సంఘం మానవునికి జ్ఞానాన్ని కల్పిస్తుంది. అలా ఆర్జించుకొన్న జ్ఞానంతో 'స్వాధీనాన్ని' పొంది మానవుడు సంఘానికి ఐక్యతనూ, శక్తినీ కల్గించగల్గుతాడు. ఈ నాలుగు చక్రాలతో మనష్య సమష్టి ఆత్మైక్యతను సాధించుకొని పురోగమిస్తుంది. ఈ ఐక్యతను సాధించుకొన్న ఆదర్శ సమాజానికే శ్రీ అరవిందులు 'జగన్నాథుని రథాన్ని' ప్రతీకగా ఉంచారు.

కేవలం కర్మ (శ్రమ)కు మాత్రమే అధికారాన్నిచ్చి జ్ఞానం నుంచి ప్రజలను దూరం చేసేటట్లుగా నియంత్రించడంవల్ల సమాజం దుర్బలమౌతుందని వేరే గ్రంథంలో శ్రీ అరవిందులు తెల్పుతూ

''హిందూ సంఘమున కర్షక, కార్మిక వర్గములకును, స్త్రీలకును ఇతరులతో సమానముగా విజ్ఞానాధికార గౌరవములు లేకుండుటచే నిదియుగూడ గ్రీక్, రోమన్ సంఘములవలె దుర్బలమగుచున్నది.''[2] అని అన్నారు.

కర్మతో జ్ఞానమూ, అట్లాగే జ్ఞానంతో కర్మా ఎప్పుడూ విడిపడి ఉండకూడదనే శ్రీ అరవిందుల తాత్పర్యం. ఎట్టి పరిస్థితుల్లో కూడా వ్యక్తి స్వాతంత్ర్యం హరింపబడడానికి వీలులేదు. వ్యక్తి స్వాతం

త్ర్యాన్ని సాధించుకోవడానికే జాతి (నేషన్) ఏర్పడుతున్నది. దాని కోసమే ''జాతికన్న విశాలమును, విస్తృతమునగు మనుష్య సంఘ నిర్మాణము నేర్పరచుటయే జాతికి పరమావధియైయున్నది.''[3] చిన్న చిన్న సంఘాలు జాతిగా ఏర్పడి స్థిరపడేటంతవరకు 'నిర్బంధాధికార పద్ధతులు, స్వాధికారస్థాపనము' అవసరమని శ్రీ అరవిందులు భావించినా, జాతి స్థిరపడ్డాకమాత్రం 'ఈ యధికార నిర్బంధము లనవసరములు' అని అన్నారు. అలాంటి నిర్బంధాలు అభివృద్ధికి ఆటంకాలని తెల్పుతూ ''భావనా స్వాతంత్ర్యమునకును, సాంఘిక నైతికాభివృద్ధికిని అటంకముగనున్న మతాధికారవర్గ నిరంకుశత్వమును తగ్గించి వ్యక్తి మానసిక ఆధ్యాత్మికాభివృద్ధికి అవకాశము లుండవలయును''[4] అని అన్నారు.

శ్రీ అరవిందులు వ్యక్తి సమష్టికి బానిస అయి అజ్ఞానిగా, మనోవికాస రహితుడుగా తిరోగమించడాన్ని అంగీకరించలేదు. సమష్టికి—సంస్థారూపంగా వ్యవహారాలు నిర్వహించే ప్రభుత్వ వ్యవస్థ యొక్క అవసరం ఎంతవరకో నిర్ణయిస్తూ వారు

''...ప్రభుత్వ కార్యనిర్వహణమున వ్యష్టి సమష్టి యభివృద్ధులు నిజముగ సిద్ధించునా? నిజముగ నవి సిద్ధించుటలేదు. యథార్థముగ ప్రభుత్వము సంఘమునందలి వ్యక్తుల పరస్పర సహకారమునకు గల యాటంకము దొలగించి సహకారాభివృద్ధికి వలయు వసతులను గలిగించుచున్నది. ఇంతకన్న ప్రభుత్వోపయోగ మెద్దియును లేదు...ప్రభుత్వము సంఘముయొక్క సహకార ప్రయత్నమును తానే వర్తింప యత్నించునెడల యలవిగాని పరిపాలనా యంత్రమును సృజించుట తప్పనిసరిగ నేర్పబడును. దానివలన వ్యక్తి స్వాతంత్ర్యము, ఉత్సాహాభివృద్ధులు భగ్నములగును''[5] అని అన్నారు.

వ్యక్తులు సమాజంలో పరస్పరం సహకరించుకోవడమనేది ప్రభుత్వంయొక్క దమననీతితో జరగడంవల్ల ఏ నష్టం కలుగుతున్నదో వారిట్లా స్పష్టంగా చెప్తున్నారు. రష్యా, చైనాలను స్థూలంగా దీనికి మంచి ఉదాహరణగా మనం భావించవచ్చును. ప్రాచీన యుగాలలో నిజమైన స్వేచ్ఛను అనుభవించగల్గిన ఘట్టాల నుదహరిస్తూ శ్రీ అరవిందులు

''...ఆయా దశలయందు మానవుడు సహజ నిర్మల విశాల స్వభావముతో వర్తించి స్వాభావికధర్మము ననుసరించుచు జీవిత సంకల్పాచరణములందు యుక్తముగ వర్తించుచు తన సన్మార్గ ప్రవర్తనకు బాహ్య నిర్బంధావసరము లేకయే తత్త్వజ్ఞా లాభించు స్వచ్ఛంద స్థితిని గాంచినట్లు దృఢముగ జెప్పవచ్చును.''[6]

మనుష్య సమష్టి ఆత్మైక్యతను సాధించుకోవడంలో వ్యక్తికి ఆ సమష్టిలో లభించేది 'స్వారాజ్యం' కాని నిరంకుశ ప్రభుత్వ దమనకాండకాదు. ఈ స్వారాజ్యం—వ్యక్తి స్వాతంత్ర్య ప్రాధాన్యం ఉన్న సిద్ధాంతం—పూర్వం ఉండేదని అంటూ శ్రీ అరవిందులు

''మనుష్యుని ప్రారంభదశ స్వర్ణయుగముగ నుండెననియు, సందు సంఘము లేకున్నను మనుష్యుడితర మానవులయెడ సద్భావమును జూపుచుండెననియు బాహ్యనియమములచే గట్టుపడకయు నైజ స్వభావ జ్ఞానముల ననుసరించి సన్మార్గమున బోవుచు నితరులను పీడించుటగాని, యితరులచే బీడింపబడుటగాని లేకయే యుండునను టయు నీ ప్రాచీన సిద్ధాంతము''[7] అని తెలిపారు. జ్ఞానంచేత, నైజ స్వభావంచేత సన్మార్గంలో ప్రవర్తించే మానవ సమష్టిని 'సహజ మానవ సంఘం'గా చెప్పవచ్చును. అది క్రమంగా భ్రష్టమయి స్పర్ధలతో, అసంపూర్ణ అసమగ్ర పరిష్కారాలతో కూడిన ఆదర్శాలతో సమాజం ఒక అడుగు తిరోగమించి తిరిగి పూర్ణత్వాన్ని సాధించుకోవడంకోసం 'ఆదర్శ సంఘం' వైపునకు అడుగువేయనున్నది. దానికి ఆలంబకాలైన స్వాధీనత, ఐక్యత, జ్ఞానం, శక్తులకు ప్రతీకలుగా చక్రాలనీ, వ్యష్టి స్వాతంత్ర్యమూ, జ్ఞానమూ, వికాసమూ హరించని సమష్టియొక్క ప్రతీకగా 'జగన్నాథుని రథాన్నీ' భావించి తత్త్వశాస్త్రాన్ని మానవ జాతికి పనికి వచ్చేట్లుగా ఒక అడుగు ముందుకు వేయించారు శ్రీ అరవిందులు. వ్యవస్థారహిత స్వేచ్ఛా సంఘ స్థాపనకు శ్రీ అరవిందులు ఈ విధమైన తాత్త్వికమైన పునాదినిచ్చారు. 19 వ శతాబ్దిలో మార్క్స్, ఏంగెల్స్‌ల **Stateless State** ఆదర్శం, ఆచరణలో వైఫల్యాన్ని పొందినమీదట శ్రీ అరవిందుల ఆలోచన అదే ఆదర్శాన్ని సాధించడంకోసం ఎంత వరకు ఉపయోగిస్తుందో ప్రయోగపూర్వకంగా తెలిసికోవాల్సిన బాధ్యత మేధావులపై ఉన్నది.

సూచి

1 మానవ ఐక్యాదర్శము — శ్రీ అరవిందులు — అనువాదం సూరపరాజు రఘునాథం—పుటలు -155, 156.

2 అదే—పు. 128.

3 అదే—పుట. 155.

4 అదే—

5 అదే—పు. 33, 34.

6 అదే—పు. 22.

7 అదే—పు. 21.

పాపల్లారా! ఎదగకండి!

కల్హార మాలికల్లాగా సుందరంగా
శారద నీరదాల్లాగా నిర్మలంగా
దీపించే .
ఓ చిన్ని పాపల్లారా !
* "ఎదగడాని కెందుకంత తొందర"
* "ఎదర బ్రతుకంత చిందరవందర"
పసితనమే హరప్పా మొహంజోదారా !
పెరిగిన పిదప
దానిని తవ్వుకుంటూ
గత కాలపు వైభవశ్రీలను తలచుకుంటూ
మను పీనుగవటమే మిగులుతుంది !
ఈనాటి చదువులు జంతర్ మంతర్‌లు
వాటికి చింతకాయలు రాలవు !
ఉద్యోగ్యపు ఇంటర్వ్యూల తతంగాలు
తాజమహల్ ధగధగలు !
చూడటానికి సర్వం నేత్రపర్వం
అడుగునమాత్రం గోరీలుంటాయి !
క్వాలిఫికేషన్ల పరంపరలున్నా
కోరుకున్న పోస్టులు
కుతుబ్ మినార్‌లు
పర్ణాంబు పవన భక్షులై
దారుణ తపస్సొనరించినా
అవి అందటం శ్రమాన్వితం !
ఈ సంఘమే ఒక బంగాళాఖాతం
దాని దరికొమ్మున వెలసిన
మహాబలిపుర దేవాలయాలు మీరు !
దిన దినగండం మీ ఉనికి
ఏ గడియలోనో
దాని కర్కశ కల్లోలాఘాతాలకు
మీ జ్వలిత జృంభిత
స్వరూపాలు
క్లిన్నమై భిన్నమై
జీర్ణమవటం నిజం !
అందువలన
ఈ కుంభకోణ సమాజంలో
ఎదగటమే మీకు అరిష్టదాయకం !
అజస్రం కాక పక్ష బాలలుగా
జీవించటమే మీకు శ్రేయస్కరం !

[* శ్రీ ఆరుద్రగారికి కృతజ్ఞతలతో]

సామాన్యుని వేదన!

కుటిలార్థ వంతుల కఠిన పాదాల శిలల క్రిందబడి
నలుగుచున్న వాడనని
క్రూరాధిపతుల బొమముడి కషాయవీక్షణాస్ఫూర్తుల
కల్లల్లాడి చివుకుచున్న వాడనని
బురదలో కుళ్ళి పొరలాడు పురుగు మాదిరి
అవివేకంపు నిద్దుర మత్తులో మునిగి వెట్టి కరణి
మున్నవాడనని
చింపి పాతరలు గట్టుకొని జీర్ణపట కుటీర పాళికా
ప్రాంగణాల వసించుచున్న బికిరంపు వాడనని
హాలా హలనలమె తోడబుట్టులుగా — తోడు నీడల
మెలగుచున్నవాడనని
పర్వత శ్రేణి నిర్ఝర పంక్తులట్లు
ఆశయాలెల్ల అడుగంట మిగిలిన నిర్భాగ్యపు వాడనని
రేయికడుపున చీకటి చాయవోలె
విషాద గర్భ కుహరాన దాక్కొన్న దిక్కుమాలిన వాడనని
నిరంతరం
నా చితిని నేనే పేర్చుకొంటూ
నా జీవితానికి నేనే వీడుకోలుపు గీతిక పాడుకొంటున్న
పిరికి వాడనని

ఉగాదులు ఉషస్సులు లేక
ఊపిరి పీల్చుకుంటున్న నికృష్టపువాడనని
నాకొంగకు చెమ్మగిల్లిన నయనమ్మే లేనివాడనని
పెక్కు భంగుల
అందరూ, నన్నూ, నా అమవసనిశి ఒతుకునూ గురించి
రవంతైనా విసుగూ, విరతి ప్రదర్శింపకుండా
అయ్యో పాపమని
భవభూతులై
అపిగ్రావా రోదతి యని
బండెడు బండెడు కవితలను రచిస్తున్నారు !
ప్రావృడం భోధర స్వాములై
కుండపోతెడు కుండపోతెడు
ఉపన్యాస ధారలను కురిపిస్తున్నారు !
అలా నా అధోగతికి దయనీయస్థితికి
వలవంత జెందుతున్నవారే
నేను
అయ్యా ! మాదాకబళమని గువ్వకుత్తుక నరుస్తూ

వెళ్ళితే
కనికరించి గుక్కెడు మెతుకులు పెట్టకున్నారు !
కసిరికొట్టి కారాలు మిరియాలు నూరుతున్నారు !
గంజిలోనికి రెండుప్పురాళ్ళు వేయండని డగ్గుత్తికన
యాచిస్తూ
తిరిగితే
కరుణించి ఒక పలుకు దానం చేయకున్నారు !
అట్టిపట్టి అగాధంపు టఖాతాలలోనికి విసిరివేస్తున్నారు !
కాని పైకిమాత్రం
సారె సారెకు
ఏటికేడుగా ఏడంతస్తుల మేడగా
నన్నుద్ధరిస్తామని
గగనతలం మారుమ్రోగేటట్లు
కొంగ్రొత్త కవితలను
మరుల మాటలను వినిపిస్తున్నారు !
నా జానెడు పొట్టకు పిడికెడు కూడు
పెట్టజాలని ఆ, కోటి నెఱవిద్దెలవలన
ఏం ప్రయోజనం ?

(కృష్ణశాస్త్రి గారికి కృతజ్ఞతలతో)

శ్రీ కే. కిశోర్ బాబు

శ్రీ కే. అశోక్ బాబు

పరిశీలన

శ్రీ యస్. యస్. రెడ్డి

పరిశీలన
విషయోన్మీలన
విలవిలలాడె భావ ప్రభంజనానికి
అక్షర అంజనం రీవి
చెల్లా చెదరయిన సత్యాలను
వడబోయడం పరిశీలన.
మారుతున్న విలువలకు
మూల్యం కట్టి నిలబెట్టడం అబ్‌సర్‌వేషన్ !
జారుతున్న చరిత్ర తెరను కత్తిరించి
నగ్నసత్యాల లాంగ్‌కోటు కుట్టడం అనుశీలన !
శిథిల సంగతుల
గంగలా పంప్‌చేయడం సమీక్ష
ఆలోచనల బీచికి
అందరిని ఆహ్వానించడం థీసిస్.

తొలి అనుభవం

అనాఘ్రాతమూ అచుంబితమూ అయిన
ఆమెను ఆప్యాయంగా
చేతిలోనికి తీసుకున్నాను.
మనసూ శరీరమూ కంపించాయి, కాస్త !

లాలనగా చుంబిస్తూ
ఆమెలో ఉత్సాహం వెలిగించాను.
ఆవిరులై ఎగసే ఆమె ఆనందం చూస్తూ
ఆ మేఘాల విహరించే
ఆలోచనల ఆనందంలో తేలియాడాను.

కొద్ది క్షణాలలోనే –
వృద్ధాప్యం దాపురించిన
ఆమె నింక భరించలేక
ఆదరించిన చేతితోనే
ఆవలకు తరిమి కొట్టేను !

ఎడబాటూ, అవమానం సహించలేక
లోలో రగిలి, పొగిలి
నా కనులముందే ఆత్మహత్య గావించుకుని
బూడిదై గాలిలో కరిగిపోయింది;
మన్నులో కలిసిపోయింది –
పాపం సిగరెట్ ! !

కన్నీళ్లు

తట్టుకోలేని ఒత్తిడితో
తల్లడిల్లే హృదయం
బద్దలు కాకుండా తెరువబడే
రక్షకద్వారాలు గండికొట్టి
పారలే వరద – కన్నీళ్లు.

అంతశ్శక్తికీ అమృత ప్రేమకూ
ప్రతిరూపాలు, అవి
ఎదటి హృదయాన్ని ద్రవింపజేసే
ఉష్ణ కిరణాలు.

భయానికీ దౌర్బల్యానికీ
బానిసలై వృధాకాకూడనివి.

హృదయంలో విరిసిన
ఆనందపు పరిమళాలు ఎగసి
అశ్రు ముత్యాలు కురుస్తాయి –
పొంగి పొరలే విరహాశ్రువులు
హృద్య సందేశాలై విరుస్తాయి.

భాషలో
వందల పాదాలు అభివ్యక్తీకరించలేని
యెద కుదిపే భావాన్ని
ఆవిష్కరించ కలుగుతుంది
ఒక్క కన్నీటి బొట్టు
మౌనఘోషలో !

మున్నీటికున్నంత శక్తుంది
ముదిత కన్నీటికి !

శ్రీ మేకా సుధాకరరావు

వచన కవితకు లక్షణాలా...?

తెలుగులో వచన కవిత ఈనాడు బాగా ప్రచారంలోకి వచ్చింది. పద్యచ్ఛందస్సు మీదా, మాత్రా ఛ్ఛందస్సుమీదా, వ్యాకరణ నియమాల మీదా తిరుగుబాటే వచన కవిత. ఛందస్సు బందోబస్తులను, వ్యాకరణపు సంకెళ్ళనూ తెంచేసిన ఆధునిక కవితా ప్రక్రియ ఈ వచన కవిత్వం. ఎలాంటి లక్షణాలకూ లోబడక విలక్షణంగా, స్వేచ్ఛగా సాగుతూ ఉన్న వచన కవితకు కొందరు విమర్శకులు ఏవేవో లక్షణాలను ఆపాదించి దానికి మళ్ళీ చట్రంలో బిగించబూనుకొనడం అనవసరం, అసందర్భం, హాస్యాస్పదం.

కొంతకాలం క్రితం సంపత్కుమార, చేకూరి రామారావు గారలు వచన పద్యాన్ని గూర్చిన చర్చ 'భారతి', 'ఆంధ్ర పత్రిక' మొదలయిన పత్రికల ద్వారా జరపడం, అది "వచన పద్యం — లక్షణ చర్చ" అనే పుస్తకరూపంలో రావడం జరిగింది. కాలదోషం పట్టిన ఆనాటి విషయాన్ని మళ్ళీ ఈనాడు చేకూరి రామారావుగారి "వచన పద్యంలో వ్యాకరణం", రావి రంగారావుగారి "వచన పద్యం — పద గణాలు" అనే వ్యాసాలు 'భారతి' ద్వారా ప్రచురింపబడడము వల్ల నేను ఈ వ్యాసం రాయాల్సిన అవసరం ఏర్పడింది.

పై రెండు వ్యాసాలను పరామర్శించడానికి, విమర్శించడానికి ముందు వచన పద్య చర్చ ఏనాడో ప్రారంభించిన సంపత్కుమార గారి రచననూ, దానిని విమర్శిస్తూ రామారావుగారు రాసిన రచననూ పరిశీలించవలసి ఉంటుంది.

భావ కవిత్వంపై తిరుగుబాటుగా వచ్చిన కవితా ప్రక్రియను (అది అభ్యుదయ కవిత్వమైనా కానీయండి, మరేదైనా కానీయండి) వచన పద్యమని మొట్ట మొదట వ్యవహరించింది పఠాభి. ఆయన ఇట్లా అన్నారు: "నా ఈ వచన పద్యాలనే దుడ్డు కర్రలతో పద్యాల నడుములు విరుగదంతాను."[1] ఈ 'వచన పద్యమనే' పేరునే తీసుకొని శ్రీ సంపత్కుమార వచన పద్యానికి లక్షణ నిర్దేశం చేయడానికి పూనుకొన్నారు. వారి మాటలు ఇవి.

"ఈ ఆధునిక ఛ్ఛందస్సు పేరు విషయములో దీన్ని ఉపయోగించే, దీన్ని గూర్చి రాసే వారిలో ఏకాభిప్రాయం కన్పించడం లేదు 'వచన కవిత్వం', 'వచన గేయం', 'ముక్తచ్ఛందం', 'వచన పద్యం' అనే పేర్లతో వ్యవహరించడం జరుగుతున్నది. అయితే దీని అసలు సార్థక నామం ఏదో తేల్చుకోవడం అవసరం.

వచన కవిత్వం అనే పేరు ఏ విధంగానూ సరిపోదు. కవిత్వమనేది గుణం. అది కేవలం పద్యంలోనూ ఉండవచ్చు. కేవలం వచనంలోనూ ఉండవచ్చు. వచన కవిత్వమంటే వచనంలో ఉన్న కవిత్వం అనే అర్థం వస్తుంది. కాని ఛందస్సుకు సంబంధించిన అర్థం రాదు. ఇదే విధంగా వచన గేయం అనే పేరు కూడా కుదరదు."[2]

దీన్ని గూర్చి ఇంకా రాస్తూ శ్రీ సంపత్కుమార ముక్తచ్ఛందంకూడా ఇంతేనన్నారు. అసలా కుదరదని కుదరకపోవడానికి కారణం వారిట్లా వివరించారు. "ముక్తచ్ఛందం అంటే వదలబడిన ఛందస్సు గలది. అంటే ఛందస్సును వదలి పెట్టినది అని అర్థం. హిందీ, కన్నడాదులలో దీనికి ఈ పేరే వ్యవహరిస్తున్నారు, కాని, ఇది ఆధునికమైన ఒకానొక రీతిలోని ఛందస్సు అని భావిస్తూ, ఛందస్సు వదిలిందని చెప్పడం సరికాదు"[3] అంటూ ఇంకా ఏవేవో కొన్ని అంశాలు చెప్పారు. కాని వారి నిశ్చితాభిప్రాయం తెలుసుకోవడానికి పైన చెప్పిన విషయం సరిపోతుందనుకుంటాను. ఇంతకూ శ్రీ సంపత్కుమార చెప్పదలుచుకున్నదేమిటి? అని ఆలోచిస్తే ఆధునిక కవితా ప్రక్రియ ఏదో ఒక విధమైన ఛందస్సును కలిగియుంటుంది కనుక దానికి వచనపద్యమనే పేరే సరిపోతుందనే భావం కలుగుతుంది.

ఏదో గొప్ప సంగతి కనిపెట్టినట్లు "వచనమూ, పద్యమూ వేర్వేరు లక్షణాలు కలవి" అన్నారు. వచనమూ, పద్యమూ ఒకే లక్షణము కలవని చెప్పే వారెవరూ? "పద్యమంటే పాదవిభజన యోగ్యమయిందని అర్థం. వచనానికి ఆ యోగ్యత లేదు. ఆ విధంగానే వచనంలోని కొన్ని గుణాలు — గణ బంధ రాహిత్యం మొదలయినవి — పద్యంలో లేవు. అందువల్ల వచనము, పద్యము అన్న రెండు ప్రక్రియలలోని విశిష్ట గుణాలతో రూపొందింది కాబట్టి వచన పద్యమన్న పేరే సార్థకమయింది"[4] ఈ మాటలు వచన పద్యమనే సార్థక నామధేయాన్ని స్పష్టీకరించడానికి బదులు అయోమయం సృష్టిస్తున్నాయి. కేవలం పాద విభజన మాత్రమే పద్య లక్షణ మనిపించుకోదు. గద్య కావ్యాలుగా పరిగణింపబడే కాదంబరి, హర్షచరిత్రలాంటి సంస్కృత కావ్యాలకు సంపత్కుమారగారు లక్షణాల్ని నిరూపించగలరా?

పద్యం 'పద' అనే ధాతువు నుండి పుట్టినది. 'పద గతౌ' అనే దాన్నిబట్టి 'పద' అనే ధాతువునకు గతి అని అర్థం. గతి అంటే ఇక్కడ గణ యతి ప్రాసాది విశిష్టమైన ఒకానొక నడక. ఇలాంటి నడక ఛందోబద్ధములైన చంపక మత్తేభ సీస గీతాది పద్యాలకు తప్ప ఇతరమైన వాటికి ఉండ వీలులేదు. అందువల్ల వచన గతిలో నడిచే వచనకవితను వచన పద్యమనడం అనుచితం. శ్రీ సంపత్కుమార ఛందశ్శాస్త్రములో విశేషమైన కృషి చేసినవారు కనుక ప్రతి కవితా ప్రక్రియలోనూ వారికి ఛందోలక్షణం ఆభాసిస్తుంది.

"ఇక పద్యాల్లో సాధారణంగా గణాల సంయోజనంలోని ఒకానొక వైశిష్ట్యమువల్ల ఒక విధమైన నడక, తూగు, లయ సిద్ధిస్తాయి. ఆ గణ సంయోజనం నియత పద్ధతిలో సాగుతుంది. కాబట్టి వాటిగతి సహజంగానే ప్రాప్తమవుతుంది. ఉదాహరణకు ఉత్పలమాలను చూడవచ్చు"[5] అంటారు శ్రీ సంపత్కుమార. ఉత్పలమాల పద్యాన్ని ఏ కవి రాసినా నియత గణాలు, నియతములైన

యతి ప్రాసలు ఉంటాయి కదా ? మరి ప్రతి ఆధునిక కవి రాసే ప్రతి వచన పద్యానికి నియతమైన లక్షణా లుంటాయా ? దీన్ని సంపత్కుమారగారు నిరూపించగలరా ? తిలక్ 'నవత – కవిత' అనే ఒక వచన కవిత పాదాల్ని రెండింటిని (తమ లక్షణానికి అనుకూలమైన వాటిని) ఉదాహరణగాతీసుకొని "ఆరెండు పాదాలకూ సమంగా గణ విభజనగాని, మాత్రా విభజన గాని, మాత్రా గణ విభజన గాని మొదటి నుండి చివరిదాకా కుదరదు కాని ఈ రెండు పాదాలకీ ఒక విలక్షణమైన తూగు స్ఫురిస్తున్నది" అని రాశారు. ఆ తూగు ఎలాంటిదో చెప్పలేదు. ప్రతి వచన పద్యానికీ ఇలాంటి తూగు ఉంటుందా ? ఉండదని నిష్కర్షగా చెప్పవచ్చు. దీన్నిబట్టి వారి లక్షణానికి అవ్యాప్తి దోషం చుట్టుకుంది. అతి వ్యాప్త్య వ్యాప్తి దోష జుష్టమైన లక్షణం శాస్త్రీయ మెట్లాగవుతుంది ? అది లక్షణ నిర్దేశం చేయడానికి ఎలా కుదురుతుంది ? "అందుకనే వచన పద్యానికి పద్యాలకు మాదిరిగా ఛందస్సును నియతంగా నిర్ణయించడానికి వీలులేదు" అన్నారు సంపత్కుమార అలాంటప్పుడు వచన పద్య మనడమెందుకూ ? దానికొక నియమాన్ని రుద్దడమెందుకూ ?

సంపత్కుమారగారు బావగణాలనే కొత్త గణాలను సృష్టించారు. అంటే భావస్ఫూర్తినిబట్టి పాదవిభజన జరగడం. వచనంలో భావం పూర్తికావడం తోటే వాక్యం పూర్తవుతున్నది కదా ? వచన కవితలో భావం పూర్తివల్ల, భావాంశ స్ఫూర్తివల్ల పాదం విరగడం జరుగుతుంది దీని కొరకై కొత్తగా బావగణాలు సృష్టించడం అనవసరం ఈనాడు వేల కొలది వచన కవితలు పత్రికలలో నైతేనేమి, పుస్తక రూపంలో నైతేనేమి ప్రచురింపబడుతూ ఉన్నాయి వాటన్నిటికీ శ్రీ సంపత్కుమార లక్షణాన్ని నిర్దేశించగలరా ? కొన్ని ఉదాహరణలిస్తాను వాటికి బావగణ లక్షణాన్ని, ఏదో తూగు, లయ అన్నారే దానిని నిరూపించగలరా ?

"పోనిద్దురూ
పైటగాలికి పులకలురేగి పరవశించిపోతున్నాడు
పొరక్కట్టు తీస్తారేం
పరమోత్కృష్టమైన 'శృంగారమే' సింగారించుకొన్నాడు
పశువు కాదు, పిచ్చాడు !"[6]

"ఈనాటికీ వున్న అవశేషాలతో
గతించిన లోకంలో
తాత -- అమ్మమ్మల తరం
రాజరికాల అరికాళ్ళ కింద చెమట రాల్చి
భయం భయంగా
బంగారాన్ని పండించింది."[7]

"వచనపద్యం స్థితి సామాన్యంగా పాదాలను విభజించడంలోనే నిరూపితమవుతుంది. ఈనాడు అనేక వచనపద్య రచయితలు ఆయా పాదాలను అక్కడి కక్కడికే ఎందుకు విభజిస్తున్నారో అర్థం కాకుండా పోతుంది." అని శ్రీ సంపత్కుమార అన్నారు. అసలు ఆధునిక వచన కవులు నియమాలకు కట్టుబడి వుంటే కదా, పాద విభజన విషయంలో లక్షణాన్ని పాటించడం ? "పాదాలను అక్కడి కక్కడికే ఎందుకు విభజిస్తున్నారో" అని వాపోవడమెందుకు ? చివరకు శ్రీ సంపత్కుమార తమ వ్యాసాన్ని ఇట్లా ముగించారు.

"ప్రధానంగా నియతమైన వాటిని అనియతంగా ప్రయోగించడం వచన పద్యం యొక్క ఆత్మ లక్షణం." అంటే ఏమిటో ?

సంపత్కుమారగారి ఈ భావాలను ఖండిస్తూ శ్రీ చేకూరి రామారావు "వచన పద్యం · ఆభాసలక్షణ నిరాకరణం"[8] అనే వ్యాసం రాశారు. అందులో వారు ఆధునిక కవితా ప్రక్రియకు ఎన్నో పేర్లు ఉన్నా సంపత్కుమారగారి వలెనే వచన పద్యం అని వాడారు. తమ వ్యాసంలో రామారావుగారు సంపత్కుమారగారి భావగణ విధానాన్ని ఖండించి పెద్దగా చర్చ సాగించి చివరకు "వచన పద్యానికి లక్షణాలుగా చెప్పబడుచున్నవేవీ లక్షణాలు కావని పైన నిరూపించాను. అందువల్ల వచన పద్యం, పద్యం కాదని గద్యమేనని సిద్ధాంతం. గద్యానికి ఏ నియమాలూ లేవు. వచన పద్యానికీ అంతే. నియమ రాహిత్యమే వచన పద్య లక్షణం."[9] అన్నారు ఇది సరైన తీర్పు కాని రామారావు గారు కూడా ఏ నియమాలూ లేని వచన కవిత్వాన్ని వచన పద్య మనడ మెందుకో తెలియదు

రామారావుగారి వ్యాసాన్ని విమర్శిస్తూ శ్రీ సంపత్కుమార "వచన పద్యం – లక్షణ నిరూపణం"[10] అనే పేరుతో మళ్ళీ ఒక వ్యాసం రాశారు "వచన పద్యాన్ని పద్య మనడానికి నేను ప్రతిపాదించిన ప్రధానాంశం దాని పాద బద్ధత. దీన్ని అనుసరించి చేసింది భావ గణ ప్రతిపాదన" అంటూ శ్రీ సంపత్కుమార మళ్ళీ వెనక్కు వెళ్ళి 'పాడిందే పాటరా పాసుపండ్ల దాసరీ' అన్నట్లు గణాలనూ, లక్షణాలనూ చర్చించి, కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా వెదికి వెదికి 'బుక్కుల్లో పాద విభజనకు సంబంధించిన ఒక సూత్రం కన్పించింది' అంటూ జైమినీయ మీమాంసా సూత్రాన్ని ఉదాహరించారు.

వారు ప్రతిపాదించే లక్షణాలు ఈనాడు అసంఖ్యాకంగా వస్తున్న వచన కవితకు సరిపోతున్నవా అంటే అదేం కుదరడం లేదు. తాము చెప్పదలుచుకున్న లక్షణానికి అనుకూలమైన ఏ రెండు మూడో కవితా ఖండికల భాగాలను తీసుకొనడం, వాటికి లక్షణ నిర్దేశం చేయడం జరిగింది. 1965లో హనుమకొండలో మిత్ర మండలి వార్షికోత్సవాల సందర్భములో వచన పద్యానికి లక్షణ సమాకలనం చేస్తూ శ్రీ సంపత్కుమార ఒక వ్యాసం చదివారట. అందులో ప్రతిపాదించిన పాద విభాజక సూత్రాన్ని ఆ సమావేశానికి వచ్చిన శ్రీ తిలక్, శ్రీ కుందుర్తిగారలు హర్షించి తమతో ఏకీభవించారని శ్రీ సంపత్కుమారగారు చెప్పుకున్నారు. దీన్నిబట్టి తిలక్, కుందుర్తి గారలు వచన పద్యం అనే పేరును ఒప్పుకున్నట్లే అవుతుంది కదా ! అయితే కుందుర్తిగారు గానీ, తిలక్‌గారు గానీ ఎప్పుడూ ఎక్కడా గూడా వచన పద్యమనే పేరు వాడినట్లు కన్పించదేమి? శ్రీ కుందుర్తి తొలినాళ్లలో 'వచన గీతం' అన్నారు. ఆ తరువాత వచన కవిత్వమనే వ్యవహరిస్తూ వచ్చారు. ఇప్పటికి కూడా వారు అట్లే వ్యవహరిస్తూ ఉన్నారు.

కాలదోషం పట్టిన 'వచన పద్యమనే' పేరును తీసుకొని 'నియమ రాహిత్యమే వచన పద్యం' అని ఘంటా ఘోషంగా చెప్పిన శ్రీ చేకూరి రామారావు మళ్లీ ఈనాడు "వచన పద్యంలో వ్యాకరణం"[11] అనే వ్యాసం రాశారు. వ్యాస ప్రారంభంలో "వచన పద్యం -- లక్షణ చర్చ" అన్న గ్రంథంలోని పీఠికలో సంపత్కుమార, రామారావు గారలు చెప్పుకొన్న మాటలు ఉటంకించారు. ఆ మాట లివి.

"వచన పద్య తత్త్వాన్వేషణ ధ్వన్యేతర మార్గాల్లో జరగాలని కూడా మా అభిప్రాయం. అయితే ఈ అన్వేషణకు భావ, భావాంశాలు సహాయకారులని సంపత్కుమార మతం. భావగణ ప్రతిపాదనకు మూలం ఇదే. మరి భావ వ్యక్తీకరణ భాషలో వాక్యాల ద్వారా జరుగుతుంది, కాబట్టి భావం ఒక్కటే అయినా వ్యక్తీకరణ భేదాల్ని బట్టి వాక్య భేదాలుంటాయి. కాబట్టి వాక్య నిర్మాణ ప్రయోగరీతులు ఆధారంగా పరిశోధన సాగాలని రామారావు మతం."

ఈ మాటలను బట్టి వచన పద్యం ఛందస్సును అనుసరించి నడుస్తుందని సంపత్కుమారగారి అభిప్రాయంగానూ, భాషా వ్యాకరణాల ననుసరించి నడుస్తుందని రామారావుగారి అభిప్రాయంగానూ మనకు అవగతమవుతున్నది. అందువల్లనే "వచనపద్యంలో వ్యాకరణం" అనేవ్యాసం రామారావుగారు రాయడం జరిగిందని స్పష్టమవుతున్నది. ఈ అంశాన్ని వారి కింది మాటలు బలపరుస్తున్నాయి.

"వాక్య నిర్మాణ రీతుల్ని కళాదృష్టితో పరస్పర సంబంధాన్ని కల్పిస్తూ కూర్చటం ద్వారా వచన పద్యానికి స్వరూపం ఏర్పడుతున్నదని పైన నిరూపితమయింది."[12]

తెలుగు వచన పద్యంలో వ్యాకరణాంశాలను నిరూపించడానికి అసంఖ్యాకములైన వచన కవితలుండగా రామారావుగారు తమ వ్యాసంలో ఒకానొక ఇంగ్లీష్ పద్యాన్ని తీసుకొని దానికి తెలుగు అనువాదం చేసుకొని చర్చ సాగించారు. వారు నిరూపించడానికి యోగ్యమయిన వచన కవిత తెలుగులోనిది ఒకటైనా వారి దృష్టికి రాకపోవడం ఆశ్చర్యకరం మరొక విషయం. పై ఇద్దరి విమర్శకుల 'వచన పద్యం — లక్షణ చర్చ' అనే పుస్తకం వ్యాసాల మాదిరిగా వ్యాప్తిలోకి రాలేదని వాపోయారు. పాపం! రామారావుగారు. ఎందుకు వ్యాప్తిలోకి వస్తుంది ఆ పుస్తకం? వ్యాప్తిలోనికి రావలసిన అవసరమేముంది? ఎలాంటి లక్షణాలకు, నియమాలకు లొంగక విలక్షణంగా స్వేచ్ఛగా సాగిపోతున్న వచన కవిత్వానికి (పూర్వ కవిత్వానికి మాదిరి) లక్షణ గ్రంథం ఎవరికి కావాలి? ఆ గ్రంథాన్ని ప్రచురించడమే అనవసరం.

మొత్తంమీద సంపత్కుమార, రామారావుగారల చర్చవల్ల తెలుస్తున్నదేమంటే ఆధునిక కవితా ప్రక్రియ పేరు వచన పద్యమనీ, ఏదో ఒక విధమైన ఛందో వ్యాకరణ భాషా లక్షణాలు వచన పద్యానికి ఆధారమని ప్రతిపాదించడం. ఐతే వారిద్దరు ప్రతిపాదించిన లక్షణాలు గానీ, నియమాలు గానీ నేటి వచన కవితకు ఎంతమాత్రం పట్టవనీ, కనుక వారు చేసిన చర్చ అంతా వట్టి దండగమారి రాత అనీ చెప్పక తప్పదు.

ఇక రావి రంగారావుగారి "వచన పద్యంలో పద గణాలు"[13] అనే వ్యాసాన్ని పరామర్శించవలసి ఉంది.

సంపత్కుమార, చేకూరి రామారావుగారల వలెనే రావి రంగారావుగారుకూడా వచన కవితను వచన పద్యమనే అన్నారు. సంపత్కుమార గారు వచన పద్యానికి భావ గణాలున్నాయని లక్షణ నిర్దేశం చేస్తే, రావి రంగారావుగారేమో పద గణాలున్నాయని తెలిపారు. సంపత్కుమార గారిమీద తనకు గౌరవమున్నదంటూ రంగారావుగారు వారి భావ గణాలను త్రోసిరాజని తమ పద గణాలను ప్రతిపాదించడం ఎలాంటి గౌరవము చూపించడమో తెలియదు. అయితే వచన పద్యానికి సంపత్కుమారగారి భావగణాల్ని ప్రమాణంగా తీసుకోవలెనా? లేక రంగరావుగారి పద గణాల్నా? శ్రీ సంపత్కుమార ఇచ్చిన తిలక్ "ప్రతి మాటకీ శక్తి ఉంది" అనే కవితా పంక్తులనే రంగారావుగారు తీసుకొని పద గణాలను విభజించి చూపారు. సంపత్కుమారగారి భావ గణాలు, రంగారావుగారి పదగణాలు వచన కవితను అయోమయంలో పడవేస్తున్నాయి.

రంగారావుగారు పదగణ విభజనకై మరికొన్ని ఉదాహరణలు చూపారు. అందులో ఒకటి కుందుర్తిగారి "ఆశ" అనే కవిత.

"నీకు కలం వుంది, ప్రజలకు బలం వుంది
నీకు హృదయం వుంది, ప్రజలకు ఉదయం వుంది"

(భా. మే. పుట 46)

దీన్ని రంగారావుగారు తమలక్షణమునకు అనుగుణంగా నాలుగు పాదాలుగా ఖండించి గణ విభజన చేశారు. అలాగే కుందుర్తి గారి "కాలం ఆగిపోయింది" అనే మరో కవితా ఖండిక

"వివ్వచ్చుని బాణంలా విచారం దూసుక పోయిన గుండెతో
దిగులుతో, దైన్యంలో, బరువుతో, బాధతో
బ్రతుకు బజార్లో నిలబడింది"

(భా. మే. పుట 47)

ఈ కవితా ఖండికను శ్రీ రంగారావు గణ విభజన కొరకై తమకు నచ్చిన రీతిలో ముక్కలు చేశారు. ఈ విధంగా ఒక కవితను ఇష్టం వచ్చినట్లుగా మార్చే అధికారం రంగారావుగారి కెవరిచ్చారో? స్రవంతి మే సంచికలో "జన వ్యవహారాను గుణంగా అర్థస్ఫూర్తి కోసమో, నొక్కి చెప్పడానికో కవి ఎంతవరకు అవసరమనుకుంటే అంతవరకు మాత్రమే వాక్యంలోని శబ్ద క్రమాన్ని మార్చుకుంటాడు" అని కుందుర్తిగా రంటుంటే రంగారావుగారేమో పై కవితా భాగన్ని ఇట్లా మార్చి చూపించారు.

"బ్రతుకు
బజార్లో నిలబడింది
దిగులుతో, దైన్యంతో, బరువుతో, బాధతో
వివ్వచ్చుని బాణంలా
విచారం దూసుకుపోయిన గుండెతో."

(1980 భా. మే. పుట 47)

ఈ విధంగా మార్చి రాసి చూపడం లయను స్పష్టంగా నిరూపించడం కోసమట. ఇట్లా మార్చి చూపినంత మాత్రాన ఇది వరకు లేని లయ ఏమి స్ఫురిస్తున్నదో అర్థం కాదు. అంతేకాదు బ్రతుకు అనే పదాన్ని మొదటి పాదంగా మార్చి చూపడంవల్ల భావ స్ఫూర్తి చేకూరిందని రంగారావుగారి అభిప్రాయం. కవి రాసిన పాద క్రమ రీతి భావస్ఫూర్తికి దోహదం చేస్తుందో, లేక రంగారావుగారు మార్చిన రీతి దోహదం చేస్తుందో సహృదయులు ఆలోచించగలరు. (రంగారావుగారు తాము ప్రతిపాదించ దలుచుకున్న పద గణ విభజన కోసం, భావస్ఫూర్తికోసం ఆధునిక కవుల కవితల నన్నింటినీ ఆపరేషన్ చేయకపోవడం మన అదృష్టం.)

ఆధునిక కవుల వచన కవిత లన్నిటికీ తాము పదగణ లక్షణాన్ని నిరూపించడం రంగారావుగారికే కాదు వారిని మించిన వారికి గూడా సాధ్యం కాదని బల్లగుద్ది చెప్పవచ్చు.

రంగారావుగారు ఉదహరించిన ఒక అనులక్షణాన్ని చూపిస్తాను.

''నా కలాన్ని ఉలిగా మలచి
దానవుల్ని దేవుల్ని చేస్తాను
నా పాళీకి ప్రాణం పోసి
ఇంటింటా పన్నాలు ప్రయోగిస్తాను

(భా. మే. పుట 48)

ఇక్కడ ఒకటి మూడు పాదాలకు అంత్యప్రాస కూడా సరిపోతుందన్నారు. 'మలచి', 'పోసి',లనేవి అంత్యప్రాసలుగా సరిపోతాయా? రచయితకు అంత్యప్రాస లక్షణం కూడా తెలియదని దీనివల్ల రుజువవుతున్నది.

చివరకు రంగారావుగారు తమ పరిశీలనలో తేలిన విషయాలు కొన్నిటిని పొందుపరిచారు. వాటిలో

(1) ''ఒక్కో యూనిట్‌లోని పాదాల సంఖ్య నియతంకాదు'' అన్నారు. పాదాల సంఖ్య నియతం కానపుడు పద్య లక్షణ మెలా అవుతుంది ?

(5) ''పాద విశ్రాంతి సరిపోయేటట్లుగా ఒకయూనిట్ రెండు సమానమైన భాగాలుగా వుంటే ఒక్కో సగభాగాన్ని సబ్‌యూనిట్ అనవచ్చు'' అన్నారు. పాద విశ్రాంతి అంటే ఏమిటో రచయిత మొత్తం వ్యాసంలో ఎక్కడా చెప్పలేదు. అది సరిపోవడమంటే **ఏమిటో వారికే తెలియాలి ?**

(8) ''సబ్‌యూనిట్లకు గాని, యూనిట్లకు గాని ఆద్యక్షర మైత్రి ఉంటే ఉండవచ్చు. లేకపోతే లేకపోవచ్చు — అలాగే ప్రాస, అంత్యప్రాసలుకూడా'' అంటారు. ఇదేమి పద్ధతి ఉంటే ఉండవచ్చు, లేకపోతే లేకపోవచ్చు ఏమిటి? సంశయాత్మకాలైన ఇలాంటి వాక్యాలలో లక్షణ నిర్దేశం చేయడమా ?

(9) ''విశేష భావస్ఫూర్తి కోసం అక్కడక్కడ కొన్ని పాదాల్లో కొన్ని పదగణాలు ఎక్కువగానూ ఉండవచ్చు, తక్కువగానూ ఉండవచ్చు'' అంటారు. ఒక క్రమం, ఒక పద్ధతి, ఒక రీతి, ఒక రివాజు లేని ధోరణితో లక్షణం చెప్పడం రంగారావుగారికే చెల్లింది.

ఇక ఆధునిక కవితా ప్రక్రియ వచన పద్యమా ? వచన కవిత్వమా ? అనే విషయాన్ని తేల్చవలసియున్నది. భావ కవిత్వాన్ని మొదట అభినవ కవిత్వం, నవ్య కవిత్వం మొదలైన పేర్లతో పిలిచినట్లుగానే, భావ కవిత్వంపై తిరుగుబాటుగా వచ్చిన కవితా ప్రక్రియను సరియైన అవగాహన లేని ప్రారంభ దశలో వచన పద్యమనీ, వచన గేయమనీ, కవులు విమర్శకులు పండితులు వ్యవహరిస్తూ వచ్చారు. ఈ కవితా ప్రక్రియకు ఒక స్థిరత్వం, ఒక గుర్తింపు వచ్చి బహుళ ప్రచారం జరిగాక ''వచన కవిత్వం'' అనే పేరు నిర్ణయింపబడింది. ఈ పేరునే ఎందరెందరో కవులు విమర్శకులు వ్యవహరించిన తీరు తెన్నులను ఇక్కడ ఉదహరిస్తున్నాను.

ఆధునిక సాహిత్య విమర్శకులలో ఒకరైన శ్రీ టి ఎల్. కాంతారావు ''వచన కవిత్వం ఎందుకు పుట్టింది, తెలుగులో వచన కవిత, వచన కవిత — వర్తమాన తరం, వచన కవిత — అభిమానుల అత్యుక్తులు — ఒక పరిశీలన''[14] అనే శీర్షికలతో వచన కవితను గూర్చి వ్యాసాలు రాశారు.

ప్రముఖ అభ్యుదయ కవి శ్రీ సోమసుందర్ ఇలా అన్నారు. ''ఆధునిక కవితా స్వరూపం సర్వదా నేడు వచన కవిత్వం అని పిలువబడుతుంది''[15] ''ఎక్కడో వెయ్యి సంవత్సరాల లోతుగా పాతుకున్న స్మృతులను కదల్చడానికి వచనకవితనే సాధనంగా స్వీకరిస్తున్నారు.''[16]

వచన కవితా పితామహులైన శ్రీకుందుర్తి అభిప్రాయాలు ''నవ్య సాహిత్య పరిషత్ యుగానికి 'వైతాళికులు'గా వచన కవితా యుగానికి ప్రతినిధిగా నిలువదగిన ఒక సంకలనం వేయాలని''[17]

''వచన కవిత్వం బాగోగులనూ, ఇటీవలి కాలంలో దాని విస్తృతినీ ప్రజాదరణనూ గురించి చర్చించే ముందు ఆధునిక యుగంలో తెలుగులో వచ్చిన అభ్యుదయ కవితా విప్లవ స్వరూప స్వభావాలను స్థూలంగానైనా తెలుసుకోవలసి వుంటుంది''[18]

''బైరాగి నిర్వచించిన ఉత్తమ కవిత అతని కావ్యంలోనే కాక ఉత్తరోత్తరా తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' లో, తొలి నుంచీ కుందుర్తి కృతులలో కనిపించడం వచన కవితకే గర్వకారణం''[19] అంటారు శ్రీ ఆరుద్ర

''దిగంబర కవులలో వచన కవిత నూతన రూపాన్ని పొందుతుంది''[20] డా. యస్ టి నర్సింహాచారిగారి అభిప్రాయం.

''సాహిత్య ప్రక్రియల సంస్కరణల్లో ఆధునిక యుగావసరంగా వచ్చిన రూప నవనీతమే వచన కవిత''[21] అంటారు శ్రీ జ్వాలాముఖి

ఈ విధంగా ప్రముఖులెందరో ఆధునిక కవితను వచన కవిత అని ఉద్ఘాటిస్తూ, ఈ కవితకు ఎలాంటి లక్షణాలు, నియమాలు లేవని చెబుతూ ఉంటే బలవంతపు బ్రహ్మణార్థంగా వచన కవితకు

వచన పద్యమని పేరు పెట్టడం, దానికి ఈ ఈ లక్షణాలు, ఈ ఈ నియమాలు ఉన్నాయని చర్చించడం అనుచితం, అసమంజసం ఇలాంటి రాతలతో విలువైన 'భారతి' పుటల్ని నింపడం శోచనీయం. విమర్శకులు ఇలాంటి దండగమారి రాతలుమాని వచన కవితయొక్క ఆంతరిక లక్షణాలను గూర్చి చర్చిస్తే ప్రయోజనాత్మకంగా ఉంటుంది.

ఈనాడు ఆంధ్ర కవితా భాగీరథి మూడు పాయలుగా ప్రవహిస్తున్నది. (1) పద్య కవిత (2) గేయ కవిత (3) వచనకవిత. ఇది కాదనలేని కాదనరాని సత్యం. తిరుగులేని తత్త్వం.

అ ధ స్సూ చి క లు

1 ఫిడేలు రాగాల డజన్.
2 'భారతి' జూన్ 1965.
3 ,, ,,
4 ,, ,,
5 ,, ,,
6 కె. వి. రమణారెడ్డి — తరం తరం.
7 నిఖిలేశ్వర్ — తరం తరం.
8 ఆంధ్రపత్రిక పరీధావి సంవత్సరాది సంచిక.
9 ,,
10 'భారతి' జూలై 1972.
11 'భారతి' ఫిబ్రవరి 1980.
12 ,, ,,
13 'భారతి' మే 1980
14 కవితాలోకలనం.
15 శేషేంద్రజ అం.
16 ,,
17 తిరం తరం పీఠికలో.
18 స్రవంతి మే 1980.
19 సమాలోచనం . వచన కవిత — ప్రయోగ వైవిధ్యం.
20 దిగంబర కవిత — ఒక పరిశీలన. సాహిత్య సమితి వ్యాసావళి3.
21 చూపు — 'చూపు' నిశితం కావడానికి ముందు.

శ్రీ వేముగంటి నరసింహాచార్యులు

ఎంత ప్రకాశమిప్పుడు!

శ్రీ గుమ్మనూరి రమేషబాబు

శతాబ్దాలనాటి
ఈ నిశ్శబ్ద మైదానంలో
నా కళ్లు చూస్తున్న
ఆ విహాయసా నిశానీలంలో
మినుకు మినుకు మంటున్న నక్షత్రాలు
ఎక్కడో సుదూర మానస యామంలో
కళ్లిప్పలేని నా నేత్రాలకుమల్లే !
ఇంతలో ...
నెలవంక పుట్టుకొచ్చింది
విచ్చుకొన్న రెప్పలమాటు రెటీనా వెలుగులా !
ఎంత ప్రకాశమిప్పుడు !
నిశ్చలంగా !
నిర్భయంగా !

హెచ్. జె. ఐసెన్క్

జ్యోతిష్యం శాస్త్రమా? మూఢనమ్మకమా?

జనం యిప్పుడు అభిమానించుతున్నంతగా జ్యోతిష్యాన్ని ఇంతకు ముందెప్పుడూ అభిమానించి వుండలేదు, దాదాపు అన్ని వార్తా పత్రికలూ, ప్రజలు అధికంగా కొంటున్న మాసపత్రికలూ జ్యోతిష్యానికి కొన్ని 'కాలములను' లేదా పుటలను కేటాయించుకున్నాయి—మత్స్యరాశిలో లేదా మకరరాశిలో లేదా మరో రాశిలో జన్మించినవారి జీవితాలను గురించి చర్చలకు కొన్ని పత్రికలు కొన్ని పుటలను కేటాయిస్తున్నాయి ఫలానా రాశిలో జన్మించినవారి జీవితం ఫలానా విధంగా వుండబోతున్నదని వ్రాస్తున్నాయి. అయినప్పటికీ శాస్త్రవేత్తలు జ్యోతిష్యం మూఢనమ్మకమనీ, హేతువాద చర్చ పరిధిలోకి అది రాదనీ ఏకగ్రీవంగా ప్రకటిస్తున్నారు జ్యోతిష్యం ఒక మోసమనీ, భ్రమ అనీ ఆధునిక సమాజానికి దానివల్ల నిజమైన ప్రమాదం కలదనీ నోబెల్ బహుమతుల విజేతలతోసహా 186మంది ప్రసిద్ధ శాస్త్రవేత్తలు ఒక ప్రకటనమీద యిటీవల సంతకాలు చేశారు. ఆధారాలతో, సాక్ష్యాలతో పరిశీలించి ఆ మూఢనమ్మకాన్ని తొలగించుకోవలసిందిగా ప్రజలను వారు కోరారు.


నిజానికి జ్యోతిష్యంలో నమ్మకం కలవారి దృక్పథం అశాస్త్రీయమని ఆ శాస్త్రవేత్తలు ఎంతగా ఆక్షేపించారో, వారి ఆ ప్రవర్తన కూడా అంత అశాస్త్రీయంగా వున్నది. శాస్త్రీయ సాహిత్యంతో యేమాత్రం పరిచయంలేకుండా కేవలం అనుభవాన్ని మాత్రమే వారిలో కొంతమంది గైకొని జ్యోతిష్యాన్ని అలా ఖండించి వుంటారు. ముందుగా కొన్ని కారణాలను వూహించుకొని వారు అలా ఖండించి వుంటారు. కాగా వారిలో ఎవరూ కూడా మంచి సలహాదారులు కాజాలరు. జ్యోతిష్యాన్ని వారు అలా తెగనాడటం ఒప్పే కావచ్చు. కానీ, విషయం తెలుసుకోనకుండా ఒక అంశం శాస్త్రీయమయినదని నిరసించడంమాత్రం సరయినపని కాజాలదు.

ఒక అధ్యయనాంశం శాస్త్రీయమైనదా కాదా అనే అంశాన్ని నిర్ణయించటం వాస్తవానికి చాలా కష్టం. ఇది శాస్త్రీయమైనది కాదు మరి అది కాదు అనే సరిహద్దును నిర్ణయించే సమస్య తత్వవేత్తలను చాలాకాలంగా చీకాకు పరుస్తున్నది. వాస్తవాలన్నింటినీ సమగ్రంగా సంతరించి, వాటి ప్రాతిపదికన సిద్ధాంతాలను రూపొందించాలని ప్రతిపాదించిన బేకన్ యీ అంశంగురించి మీమాంస చేసిన తత్వవేత్తలలో మొదటివాడు. 'లాజికల్ పాజిటివిజమ్' సిద్ధాంతాన్నివియన్నా జిజ్ఞాసపితులు సూచించారు సిద్ధాంతాలను రూపొందించడానికి అవి సరయినవో కావో తేల్చడానికి పరిశోధనలు' మంచి పద్ధతి అని వారు ప్రతిపాదించారు. కానీ యీ ప్రతిపాదనను కారల్ పాప్పర్ ఖండించాడు ఎందుకనంటే ఫలానా పని ఫలానా విధంగా జరుగుతుందని లేదా ఫలానా వ్యక్తి ఫలానా విధంగా ప్రవర్తిస్తాడని వూహించారను కొండి అలాంటి ప్రశ్నలలో కొన్నింటిని మాత్రమే పరీక్షచేసి, అవి తప్పో, ఒప్పో తేల్చగలుగుతాం అలాంటప్పుడు మన పరీక్ష జరపకుండా వదలివేసిన కొన్ని పైన పేర్కొన్న సిద్ధాంతం సరయినది కాదని రుజువు చేయవని అనుకోనడం ఎలా సాధ్యపడుతుంది? పైన పేర్కొనిన సిద్ధాంతానికి ప్రత్యామ్నాయంగా పాపర్ మరొక శాస్త్రీయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. తప్పు అని రుజువు చేయడానికి వీలయిన యే సిద్ధాంతమయినా యీ సిద్ధాంతం ప్రకారం శాస్త్రీయమైనదే. ఈ సిద్ధాంతాన్ని శాస్త్రవేత్తలలో చాలామంది ఆమోదించారు. కానీ, సరయినదని నిరూపించే సిద్ధాంతాల్లో వున్న లోపమే పాప్పర్ సూచించిన సిద్ధాంతంలోకూడా వున్నది. ఒక సిద్ధాంతం సరయినదో, కాదో నిరూపించి చూపడం సాధ్యంకాకపోతే, అది అబద్ధమని నిరూపించడం కూడా సాధ్యం కాజాలదు ఎందుకనంటే మనం ప్రయోగంచేసి రూపొందించే ఫలితాలలో మనకు కనిపించని తప్పేదో ఉండివుండొచ్చు. పరిశోధన జరిగిన సిద్ధాంతం ప్రాతిపదికకంటే గట్టి ప్రాతిపదికయే దానికి వుండి వుండొచ్చు—కొన్ని వాస్తవాలు, అప్రత్యక్ష వాస్తవాలూ దానికి ప్రాతిపదిక కావచ్చు. ఇదంతా ఎందుకు ప్రస్తావించవలసివచ్చినదంటే—ఒక సైన్సును సైన్సుగా ఎలా గుర్తించాలనే అంశంగురించి ఇప్పటికీ చాలా వాదోపవాదాలున్నాయి.

శాస్త్రీయపద్ధతి కాదు

ఫ్రాయిడ్ సిద్ధాంతాలనూ, మార్క్సిజమునూ, జ్యోతిష్యాన్నీ శాస్త్రాలు కాని శస్త్రాలుగా కార్ల్ పాప్పర్ ఉదహరించాడు వీటన్నింటిలోనూ సిద్ధాంతం చాలా క్లిష్టంగా వుంటుందనీ, వాస్తవం వుండదనీ అందువల్ల పొరపాటు పడేందుకు అవకాశంవుండే వూహకు వాటిలో అవకాశంలేదని పాపర్ వాదించాడు. ఒక స్థాయివరకూ ఫ్రాయిడ్ సిద్ధాంతాలు, మార్క్సిజమ్ విషయాలలో యిది నిజమే. ఆ సిద్ధాంతాల ప్రకారం కూడా భవిష్యత్తు గురించి వూహలుచేయడం సాధ్యమేనని నా అభిప్రాయం. మరి ఆ వూహలు నిజాలని ధృవపడలేదు.

తమాషా యేమిటంటే ఒక సిద్ధాంత ప్రవక్త శిష్యులూ, అనుచరులూ, తమ ప్రవక్త వూహాలు తప్పిపోవడానికి యేవేవో కారణాలు పేర్కొని తమ గురువును సమర్థించుకుంటారు. కానీ ఇది శాస్త్రీయ పద్ధతి కానేకాదు. ఈ రెండు సిద్ధాంతాలూ ఇందుకు ప్రబల నిదర్శనాలు. పాప్పర్ ప్రతిపాదించిన పరీక్షకు జ్యోతిష్యం నిలబడుతుంది. జ్యోతిష్యం భవిష్యత్తులో యిలా జరుగుతుందని గట్టిగా చెబుతుంది. వాటిని క్షుణ్ణంగా పరీక్ష చేయవచ్చు.



అడ్డం -- రాశి గుర్తులు.
నిలువు:- బాహ్యపరివృత్తి పరిమాణం అంకె.

గట్టి జ్యోస్యాలకు ఒక ఉదాహరణ ఇస్తాను. దాన్ని గురించి స్వయంగా నేను జరిపిన పరీక్షగురించికూడా చెబుతాను. అది సమంజసమైన జోస్యం అవునో కాదో ప్రస్తుతానికి చర్చించను—ఏదయినా సార్వత్రిక సిద్ధాంతంనుంచి ఆ జోస్యం రూపొందినదా? లేక చాలా కాలం జరిగిన పరిశీలన ఫలితంగా ఆ వూహ జరిగిందా అనే అంశాలను కూడా ప్రస్తుతానికి చర్చించను. భవిష్యత్తులో ఇలా జరుగుతుందని గట్టిగా చెబితే—అంతవరకూ పాప్పర్ సిద్ధాంతానికి సరిపోతుంది. ఆడంబరంగా, పటాటోపంగా ప్రవర్తించేవాడు మేషరాశి, మిధునరాశి, సింహరాశి, తులారాశి, ధనుర్రాసి, కుంభరాశిలలో దేనిలోనైనా జన్మించి వుండవచ్చునని జ్యోతిష్యం చెబుతుంది స్వోత్కర్ష స్వాతిశయ స్వభావం గలవారు వృషభరాశి, కర్కాటకం, కన్యారాశి, వృశ్చికరాశి, మకరరాశి, మీనంవంటి సరి సంఖ్యల తేదీలలో జన్మించి వుంటారని జ్యోతిష్యం చెబుతుంది. ఈ వివరణ చాలా జ్యోతిష్య గ్రంథాలలో కనిపిస్తుంది. దానికి సంబంధించిన పరిశీలనలేమో అప్పటికి జరిగివుండలేదు. చాలా ఖచ్చితంగా చెబుతున్నది. మరి పరిశోధనలో అది ఏవిధంగా రుజువవుతుంది ?

ఈ జోస్యం యీనాటిదికాదు. దాదాపు రెండువేల కిందట జరిగింది. జె.మేయో అనే జ్యోతిశ్శాస్త్రవేత్త తన గ్రంథంలో అచ్చంగా యిదే జోస్యం వ్రాశాడు. ఇలా నిర్ణయానికి రావడానికి ఆధారపడిన వూహ సరయినదనో లేదా సరయినది కాదనో ధృవపరచే విషయంలో అతను నా దగ్గరకు వచ్చాడు. అందుకు ఉపయోగపడే అధ్యయనం కలసి చేద్దామని అతను అన్నాడు బహిర్ముఖతత్వం, అంతర్ముఖ తత్వం గురించిన కొన్ని ప్రశ్నలను చాలా కాలంగా నేను రూపొందిస్తున్నాను. వాటిని ఉపయోగించి 916 మంది పురుషులను, 1407 మంది స్త్రీలనూ మేము పరీక్షించి వారి పుట్టిన తేదీలు ఖచ్చితంగా తెలుసుకున్నాము. ఒక రాశిచక్రంలో ఒకవ్యక్తి జన్మించాడంటే దాని అర్థం ఫలానా సంవత్సరంలో ఫలానా కాలంలో అతను జన్మించాడని. సూర్యుని చుట్టూ భూమి తిరుగుతూ వెనక్కిపోయి వివిధ సజీవరాసులనుంచీ కదలిపోతున్నందున ఇది ఇలా జరుగుతుంది. ఈ పరిభ్రమణానికి గుర్తుగానే ప్రాచీనులు రాశి చక్రాలను ఉపయోగించినట్టు కనిపిస్తుంది. ఈ అంశాన్ని ధృవపరచే అంశాలు జ్యోతిష్యంలో చాలా తక్కువగా వున్నాయి కాబట్టి యీ అధ్యయనంవల్ల ప్రయోజనకరమైన అంశ మేమీ తేలుతుందని నేను ఆశించివుండలేదు. మనోవిశ్లేషణ సిద్ధాంతాలన్నింటి గురించి నాకు సందేహాలున్నాయి. కాబట్టి యీ సిద్ధాంతమూ వాటిలోనిదేననుకున్నాను.

ఆశ్చర్యకర ఫలితాలు

.కానీ పైన పేర్కొనిన పరిశీలన ఫలితాలు. ముందుచేసిన వూహాలు సరయినవని సూచించసాగినవి. 2,323 మందిని పరిశీలన జరపగా బహిర్ముఖతత్వంగల వ్యక్తులు ఆరు బేసి సంఖ్యల తేదీలలో జన్మించారు. వారందరూ సగటు తెలివి స్థాయికి మించినవారు. సరి సంఖ్య తేదీలలో జన్మించినవారు సగటు తెలివితేటల స్థాయికంటే దిగువ స్థాయివారు. ఇంతకుముందు జరిగిన వూహకు సరిపోయినవి యీ ఫలితాలు. మనోవిశ్లేషణ ప్రయోగాలలో ఇలాంటి ఫలితాలు చాలా అరుదయినవి అందువల్ల ఆ ఫలితాలను ప్రచురించినప్పుడు ఫలితం చాలా ఎక్కువగా లేకపోయినప్పటికీ చాలామందికి చాలా సంభ్రమం కలిగింది సరిసంఖ్య రాసులలో జన్మించిన వారికంటే బేసిసంఖ్య రాశులలో జన్మించిన వారి కంటే ఎక్కువ బహిర్ముఖతత్వం గలవారుగా వుండేవారు ఈ రెండురకాల వారిమధ్య తేడా చాలా తక్కువ ఒక వ్యక్తి స్వభావాన్నీ శీలాన్నీ చాలా జ్యోతిష్యాంశాలు నిర్ణయిస్తాయి ఒకవ్యక్తి జనన కాలంలో సూర్యుడు ఎక్కడ వున్నాడనేది అలాంటి అంశాలలో ఒకటిమాత్రమే ఒక వ్యక్తిని గురించిన జోస్యం చెప్పేప్పుడు వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలని జ్యోతిష్యులు చెబుతారు.

మరికొన్ని పరిశోధనలు

ఇంకా చాలామంది పరిశోధకులు యీ ప్రయోగాన్ని తిరిగి తిరిగిచేసి ఫలితాలు ప్రయోజనకరంగా వున్నాయని నివేదించారు. మనోవిశ్లేషణ పరిశీలనలలో యిలాంటి ప్రయోగాలు తరచు విఫలమవుతూంటాయి. అదే ప్రయోగం రెండవసారి జరిగితే ఫలితాలు మొదట

జరిగిన ప్రయోగం ఫలితాలవలెనే వుంటాయి. ఇలా కొన్నిసార్లు జరిగిన ప్రయోగాల ఫలితాలు ఒకేవిధంగావుంటే, ఫలితాలు ఇంతకుముందు కంటే ధృవపడతాయి—నమ్మదగిన వవుతాయి.

సౌర కుటుంబంలోని యేదో ఒకరాశిలో జన్మించిన వారిలో కొందరికి వారి వ్యక్తిత్వం స్వభావంగురించి ముందుగా కొంత తెలుస్తుందనుకోండి. ప్రశ్నావళికి వారు ఇచ్చిన సమాధానాలు తమకు ముందుతెలిసిన అంశాలకు అనుగుణంగావుండే అవకాశంలేదా? ఇలాంటి సందర్భాలలో మరికొన్ని పరిశీలనలు అవసరమవుతాయి. జ్యోతిష్యం గురించి తెలిసినవారనీ, తెలియనివారనీ రెండువర్గాలుగా విభజించి మేయో ప్రశ్నలడిగాడు. ముందు జరగబోయేవాటిని గురించిన వూహకు సంబంధించినంతవరకూ యీ రెండువర్గాలవారికి ఆట్టే ఎక్కువ తేడా లేదని అతను కనిపెట్టాడు.

ఒక విమర్శకు కావలసిన జవాబు దీనినుంచి లభించినట్లు కనిపించుతుంది. అయితే యీ పరీక్ష అంత కుణ్ణంగా జరిగి వుండక పోవచ్చు. జ్యోతిష్యం గురించి కొందరికి యేమీ తెలియకపోవచ్చు. జాతకం వ్రాయగలిగేటంతవరకూ పరిమితం కావచ్చు కొందరి పరిజ్ఞానం. ఇంతేకాదు జ్యోతిష్యం గురించి ప్రతిఒక్కరికి యేదో కొంత తెలిసి వుండవచ్చు. మేయో ప్రశ్నకు సమాధానం చెప్పినవారు అతని ఉద్దేశం పూర్తి పరిజ్ఞానం అని అతని ఉద్దేశమని బహుశా వారు అనుకొని వుండొచ్చు. కనుకనే తమకు యేదో కొంత తెలిసినా కూడా యేమీ తెలియదని మేయో ప్రశ్నలడిగినవారు సమాధానం చెప్పారు. వార్తాపత్రికలలో వెలువడే రాశిఫలాలను చూస్తూనేవుంటారు గదా! తమ రాశికి వ్యక్తిత్వం ఎలా వుంటుందో కొంతయినా తెలియకుండా వుంటుందా ?

ఆయా కారణాలవల్ల యీ ప్రయోగం మళ్లీ జరిగింది. ఈసారి జ్యోతిష్యాన్ని గురించి ఇంకా వివరంగా ప్రశ్నలు అడగడం జరిగింది. ఫలితంగా జ్యోతిష్యం గురించి యేదో కొంత తెలిసినవారు చాలా మంది వున్నారు—అసలేమీ తెలియనివారూ, చాలా తెలిసినవారూ చాలా కొలదిమంది మాత్రమే వున్నారని తేలింది. మేము ఒక అడుగు ముందుకువెళ్ళి పిల్లలను పరీక్షించాము. జ్యోతిష్యం గురించి వారికి యేమీ తెలియదు సాధారణంగా. వారి వ్యక్తిత్వం గురించిన జోస్యానికీ, సౌరరాశి చిహ్నానికీ వారిలో కూడా సంబంధం కనిపించలేదు. దీనినిబట్టి యేమి అనుకొనవలసి వస్తున్నదంటే జ్యోతిష్యం గురించిన నమ్మకాలు కొన్ని వున్నవారు, కొంత పరిజ్ఞానం వున్నవారు తమ వ్యక్తిత్వం గురించి కొన్ని అభిప్రాయాలను ఏర్పరచుకొని, సౌరరాశి చిహ్నాల ఫలితాలను వాటితో మేళవించి ప్రశ్నలకు సమాధానాలు చెప్పివుంటారు.

ధృవీకరణ ప్రాతిపదిక

ఈ ప్రయోగాలకు సంబంధించినంతవరకూ సైన్సు ధృవీకరణ పరీక్షలో జ్యోతిష్యం విజయవంతం కాలేకపోయినది. పోతే తప్పు అని తేల్చే పరీక్షలో అది ఖచ్చితంగా విజయవంతం అయినది. ఎందు రూపొందించగలిగినది జ్యోతిష్యం. సైన్సా, కాదా అనే సమస్యను నిర్ణయించటం ఎంత ముఖ్యమో దీన్నిబట్టి విదితమవుతుంది. ధృవీకరణ పరీక్ష యీ సందర్భంలో తగినదని నా సొంత అభిప్రాయం. రెండవ రకం పరీక్ష అభివృద్ధిచెందిన సైన్సులకు బాగా ఉపయోగపడుతుంది. కాన గురితింపుకోసం యత్నిస్తున్న సైన్సులకు ధృవీకరణ చాలా ముఖ్యమయినది.

నేనూ, మేయో జరిపిన ప్రయోగాలు వాస్తవానికి చాలామంది జ్యోతిష్యులు ఆమోదించనట్టివి. జ్యోస్యశాస్త్ర విజ్ఞానకోశంనుంచి కొంతభాగాన్ని లేదా కొన్ని అంశాలను విడదీసి చేసే ప్రయోగాల వల్ల నిర్మాణాత్మక ఫలితాలు వస్తాయని ఆశించడం పొరపాటని వారి వాదన. గ్రహాలకు సంబంధించిన చాలా అంశాలమీద, చంద్రుడు అప్పుడు ఎక్కడ వున్నాడనే అంశంమీద, సూర్యుని స్థానంమీద ఇంకా చాలా అంశాలమీద వ్యక్తిత్వ నిర్ణయం ఆధారపడి వుంటుందని వారు అంటారు. వీటిలో ప్రతి ఒక్కదానిమీద మిగతా అంశాల ప్రభావం వుంటుంది. కాబట్టి యీ రకం పరీక్ష జ్యోతిష్యానికి న్యాయం చేయజాలదు. ఇంతకంటే న్యాయంగావుండే పరీక్ష జరపడం సాధ్యమా ?

మనోవిశ్లేషణ పరీక్ష

పైన పేర్కొనిన పెక్కు అంశాలను పరిగణనలోకి తీసుకునే ఒక పద్ధతిని మన శాస్త్రవేత్తలు రూపొందించారు. దీన్ని 'మాచింగ్ మెథడ్' (ఏ వ్యక్తి జాతకం యేదో సరిగ్గా చెప్పే పద్ధతి) అంటారు. ఇది అందరకూ తెలిసిన పద్ధతి. ఈ పద్ధతిని జ్యోతిష్యానికి 1980 తర్వాతి సంవత్సరాలలో ప్రసిద్ధిచెందిన అమెరికన్ మనస్తత్వశాస్త్రవేత్త వెర్నన్‌క్లార్క్ వర్తింపజేశాడు. అయిదుగురు స్త్రీలనూ, అయిదుగురు పురుషులనూ అతను ఎంచుకున్నాడు. అందరకూ తెలిసిన వృత్తులు చేసేవారు వారందరూ. ఒక గాయకుడు, ఒక బుక్‌కీపర్, జంతుశాస్త్రవేత్త, సరీసృపముల శాస్త్రవేత్త ఒకరు, ఒక కళాధ్యాపకుడు, ఒక విమర్శకుడు, కీలుబొమ్మలాడించేవాడు, గ్రంథాలయోద్యోగి, ఒక వేశ్య, ఒక శిశువైద్యుడు వున్నారు. ఆ పదిమందిలో వారి జాతకాలను వ్రాశారు. వాటిని ఇరువది మంది జ్యోతిష్యులకు పంపించారు. ఆ వ్యక్తులు యేమి వృత్తులు చేస్తున్నదీ మాత్రమే జ్యోతిష్యులకు చెప్పారు. ఆ జాతకాలలో యే జాతకం యే వృత్తిచేసే వ్యక్తిదయినదీ సరిగ్గా తేల్చవలసినదిగా జ్యోతిష్యులను కోరారు. ఉజ్జాయింపుగా చెపితే చాలు.

ఈపరీక్షలో జ్యోతిష్కులు కానివారు కొంతవరకూ మాత్రమే నిలబడగలిగారు. జ్యోతిష్యులు చెప్పిన ఫలితాలు గణనీయంగావున్నాయి.

'భవిష్యత్తు' చెప్పడంగురించి కూడా వెర్నన్ క్లార్క్ యీ పరీక్ష జరిపాడు. పది జతల జాతకాలను జ్యోతిష్కులకు ఇచ్చారు. ఆయా వ్యక్తుల జీవితాలలోని ప్రధాన సంఘటనల చరిత్రను ఆ జాతకాలతో జతపరచారు. జాతకాలలో ఒక జత జాతకం చరిత్రకు సంబంధించినదనీ, రెండవ జత దాదాపు అదేకాలంలో

వేరనీ జోతిష్కులకు చెప్పారు. ఆ జాతకాలలో యే జాతకం యే చరిత్ర వ్యక్తికి సరిపోతుందో చెప్పవలసినదిగా జ్యోతిష్కులను వెర్నన్ క్లార్క్ కోరాడు. ఈ పరీక్షలో కూడా జ్యోతిష్కులు గణనీయమైన విజయాన్ని సాధించారు.

మూడవ పరీక్ష జరిగింది. పరీక్షకు గైకొన్న ప్రతిరెండు జాతకాలలో ఒక జాతకం తాలూకు వ్యక్తి మెదడు పక్షవాతం రోగి. రెండవ వ్యక్తి జాతకం కూడా మొదటి జాతకం వలెనే వున్నది. ఆ వ్యక్తి కొంచెం ఎక్కువ తెలివిగలవాడు. ఏదో ఒక రంగంలో విశేష ప్రజ్ఞ గలవాడు. వాటిలో యే జాతకం యే వ్యక్తిదో జ్యోతిష్కుడు నిర్ణయించాలి. ఆ సందర్భంలో కూడా ఫలితాలు చాలా తృప్తికరంగా వున్నాయి. మొత్తం మూడు ప్రయోగాలు శాస్త్రీయ పద్ధతిలో జరిగాయి గదా. జ్యోతిష్కులు తమ సామర్థ్యాన్ని చూపించే అవకాశం ప్రతి ఒక్క ప్రయోగంలోనూ వున్నది. జ్యోతిష్య పద్ధతికి విలువ నిచ్చే ఫలితాలు ప్రతి ఒక్క ప్రయోగంలోనూ వచ్చాయి.

ఇంత పరిశీలనా జరిగినప్పటికీ, ఫలితాలను ధృవపరచే ప్రయోగాలు మళ్ళీ జరగకపోవడం ఆశ్చర్యం. వాటిని నమ్మవచ్చునో లేదో మనకు తెలియకుండాపోయింది. వెర్నన్ క్లార్క్ మోసం చేసి వుండవచ్చు. లేదా ఇదంతా అతనే కల్పించి వుండొచ్చు. లేదా విశ్లేషణలో తప్పులుచేసి వుండవచ్చు. వీటిలో యేదో ఒకటి అతను చేశాడని నేనూ సూచిస్తున్నట్టు ఒక్క క్షణమైనా ఎవరూ భావించరాదు. కానీ వాస్తవమేమిటంటే ప్రయోగాలను కొందరు వ్యక్తులు కొన్నిసారులు తిరిగి తిరిగి చేస్తేనేగాని, వాటి ఫలితాలను అతిగా నమ్మడం మంచిది కాదు. కొన్ని సైన్సులలోనయినా, ఎంత సమర్థుడయినా ఒకే ఒక శాస్త్రవేత్త చేసిన ప్రయోగమే ఖరారు ప్రయోగమని ఎవరూ భావించరు. విశేషించి ప్రయోగం ఫలితం ముందు అనుకున్న దానికంటే భిన్నంగా, ప్రజల నమ్మకాలకు విరుద్ధంగా వుంటే యీ మాట మరీ నిజం.

మిచెల్ దంపతుల ప్రయోగాలు

ఫ్రెంచి మనశ్శాస్త్రవేత్తలు మిచెల్, అతనిభార్య ఫ్రాంకోయిస్ గాక్యులిన్ యీ రంగంలో ఇరువది సంవత్సరాలుగా కృషి చేస్తున్నారు. వారొక ప్రయోగంచేసి చాలా వివరాలు సంతరించారు. ఒకే విధానంలో ఒక పరీక్షను వారు ఎన్నోసారులు చేశారు. కనుక దాన్ని సులభంగా వివరించవచ్చు ఒకే వర్గానికి చెందిన కొంతమంది వ్యక్తులకు వారు మొదట ఒక పద్ధతిని స్పష్టంగా చెప్పారు. ఆ తర్వాత 8089 మంది వస్తాదులనూ, 1409 మంది ప్రఖ్యాత నటులనూ, 3647 మంది శాస్త్రీయ రంగంలో ప్రసిద్ధి చెందినవారినీ వారు ఎంచుకున్నారు. పారిస్‌లోని గ్రంథాలయంలో ఒక వ్యక్తి జీవిత చరిత్ర వుంటే (అచ్చయి) ఆ వ్యక్తి ప్రసిద్ధి చెందినవాడని వారు పరిగణించారు. ఆ విధంగా లక్ష్యం పూర్తిగా నిష్పాక్షికంగా వుండినది.

జన్మస్థలం. పుట్టిన తేదీ సమయం

గాక్యులిన్ దంపతులు ఆ తర్వాత ఆయా జాతకాలకు సంబంధించిన వ్యక్తుల జన్మ స్థలాలను, జన్మించిన సమయాన్నీ ఖచ్చితంగా తెలుసుకున్నారు. ఆ తర్వాత ఆయా వ్యక్తులు పుట్టిన సమయాలలో ఏయే గ్రహాలు ఎక్కడెక్కడ వున్నవీ నిర్ణయించారు. అంగారకుడు, బృహస్పతి, శని ఆయా వ్యక్తుల జనన కాలంలో ఎక్కడ వున్నవీ ముఖ్యంగా గుర్తించారు. శుక్రుడు, బుధుడుకు సంబంధించిన వివరాలను కూడా వారు ప్రచురించారు.

క్లుప్తంగా యిలా చెప్పవచ్చు పయి వివరాలను. సూర్యుడు రోజూ మనకు ఎలా కనిపిస్తాడు? తూర్పున ఉదయించి, మన తలల మీదకు ఎగ్రబాకి, పడమటన అస్తమించి, ఆ తర్వాత భూమిలోకి చొచ్చుకుపోయి, మళ్ళీ మరునటి ఉదయం తూర్పున ఉదయించినట్టు కనిపిస్తాడు. ఇదే విధంగా గ్రహాలు కూడా రోజుకొకసారి భూమి చుట్టూ తిరిగివస్తున్నట్టు కనిపించుతుంది. తాను పరిశీలించిన జాతకాల వ్యక్తులకూ, గ్రహాలు పుట్టినప్పటి నాలుగు స్థితులకూ సంబంధం వున్నదని గాక్యులిన్ దంపతులు కనిపెట్టారు. ఉదయించినప్పటిస్థితీ, పయికి ప్రాకినప్పటి స్థితీ, ప్రధానమయినవి. గ్రహం అస్తమించిన సమయం, అది భూమి కిందికి పోయిన సమయం ఈ రెండూ, ఇతర సమయాలు.

గాక్యులిన్ దంపతులు కనిపెట్టిన అంశాలను క్లుప్తీకరించితే తేలే అంశాలివి — అంగారకుడు పయిన వివరించిన క్లిష్టదశలలో

వుండగా క్రీడాకారులు జన్మించే అవకాశం వున్నది. పయిన వివరించిన దశలలో బృహస్పతి వున్నప్పుడు నటులు జన్మించివుండే అవకాశం వున్నది. శని క్లిష్టదశలలో వున్నప్పుడు శాస్త్రవేత్తలు జన్మించి వుండవచ్చు. ఈ ఫలితాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. కాకతాళీయంగా ఆ ఫలితాలు తయారయివుండే అవకాశం లేనంత అధిక ప్రాముఖ్యం వాటికి వున్నది.

కొత్తగా కనుగొన్న యీ అంశాలవల్ల చాలా కలవరం కలిగిందనుకోండి. సిసలయిన శాస్త్రవేత్తలతో కూడిన బెల్జియన్ కమిటీ ఒకటి ఖగోళశాస్త్రవేత్త అధ్యక్షతన ఇదే ప్రయోగం మళ్ళీ చేసింది. ఫలితాలు ఖచ్చితంగా యిలాగే వున్నాయి. స్వతంత్రంగా జరిగిన ప్రయోగమది. ఇది క్రీడాకారుల విషయంలో మళ్ళీజరిగిన ప్రయోగం. ఇతరుల విషయంలో కూడా యిలాగే తిరిగి ప్రయోగాలు జరిగాయి. ఫలితాలు ఖచ్చితంగా పూర్వం మాదిరిగానే వచ్చాయి. కాబట్టి వాటి చెల్లుబాటును గురించి సందేహానికి ఆస్కారం లేదు.

వ్య క్తి త్వా లు

వివిధ వర్గాలలోని వ్యక్తుల జీవిత చరిత్రలలోని వర్ణనలు ఆధారంగా ఆయా వ్యక్తుల వ్యక్తిత్వాలను గురించి కూడా గాక్యులిన్ దంపతులు ప్రయోగాలు జరిపారు. ఆ పరిశీలనలలో "నమూనా" వ్యక్తిత్వం ఒకటి తేలింది. అంటే క్రీడాకారులు శక్తివంతులుగా వున్నారు, దృఢచిత్తులుగా వున్నారు. శాస్త్రవేత్తలు అంతర్ముఖులుగా, కొంచెం సిగ్గుగా, శ్రమపడి పనిచేసేవారుగా వుంటారు. ఒక్కొక్క వర్గంలోని ఎక్కువ మంది మూర్తిమంతం (వ్యక్తిత్వం) నుంచి నమూనా వ్యక్తిత్వాన్ని రూపొందించారు. అంతేగాక ఆ వర్గంలోని అందరకూ ఆ లక్షణాలుండకపోవచ్చు, కొంతమంది శాస్త్రవేత్తలు అంత మొహమాటస్థులుగా, జంకేవారుగా కనిపించలేదు. అలాగే క్రీడాకారులలో కలహప్రియులు కానివారున్నారు. నమూనా వ్యక్తిత్వ లక్షణాలకు భిన్నంగా వుండిన శాస్త్రవేత్తలూ, నటుల లక్షణాలను ఆ లక్షణాలకు భిన్నమైన లక్షణాలు కలవారితో ప్రతి వర్గంలోనూ గాక్యులిన్ దంపతులు పోల్చి చూచారు. నమూనా వ్యక్తిత్వం గలవారికి మాత్రమే గ్రహరాశి లక్షణాలతో సంబంధం కలదని వారుకనిపెట్టారు. గ్రహరాశి కనుగుణమైన వ్యక్తిత్వ లక్షణాలు కలవారు సరయిన గ్రహరాశిలో జన్మించలేదని తేలింది. ఒక వ్యక్తి జన్మించినప్పుడు ఏ గ్రహం ఎక్కడ వున్నది అనే అంశం ప్రభావం ఆ వ్యక్తి శీలంమీద కనిపిస్తుంది. అతను చేసే వృత్తి ఆ స్థితిని బట్టి వుండదని పయిన పేర్కొన్న వివరాలు తెలియజేస్తాయి. ఆయా వ్యక్తుల వ్యక్తిత్వాన్ని బట్టి వారుఎంచుకునే వృత్తివుంటుంది కాబట్టి యీ అంశాన్ని యీ విధంగా వివరించడం జరిగింది.

గాక్యులిన్ దంపతులతో కలసి నా భార్య కూడా పనిచేసింది. జీవిత వివరణల జాబితాలలోని నామవాచకాలనూ, విశేషణాలనూ, అవ్యయాలనూ పరిశీలించింది ఆమె. ఇలాంటి ప్రశ్నావలికి వచ్చే సమాధానాలను పరిశీలించి మదింపుచేయటంలో ఆమెకు చాలాకాలం అనుభవం వున్నది. క్రీడాకారులూ, నటులూ, శాస్త్రవేత్తలలో ఎవరు అంతర్ముఖులో మరెవరు బహిర్ముఖులో ఆయా జాతకాలను బట్టి ఆమె నిర్ధారించింది. ఈ రెండుకోవల వ్యక్తిత్వాలకూ చెందనివాటిని ఆమె వదలివేసింది. క్రీడాకారుల జాతకాలూ, నటులూ, శాస్త్రవేత్తల జాతకాలన్నింటినీ కలిపి వాటితో వ్యక్తిత్వ స్వభావాంగాలను చేర్చి — వారివారి జన్మరాసులలో కంప్యూటర్‌లోకి పంపించారు. అంతర్ముఖ స్వభావం గలవారు శని క్లిష్ట దశలలో ఒక దానిలో వుండగా జన్మించినట్టు స్పష్టమయినది. బహిర్ముఖస్వభావంగలవారు అంగారకుడు లేదా బృహస్పతి క్లిష్టదశలలో ఒకదానిలో వున్నప్పుడు జన్మించినట్టు స్పష్టమయినది. జనన కాలమందు గ్రహస్థితికీ వ్యక్తిత్వానికీ సంబంధం వున్నట్టు యీ ప్రయోగం సూచిస్తున్నట్టు కనిపించుతుంది. వృత్తికంటే వ్యక్తిత్వ నిర్ణయం యీ ప్రయోగంలో అధికంగా తేలటం గమనార్హం.

ఆస క్తి క లిగించే అం శా లు

గాక్యులిన్ దంపతులు చాలా ఆసక్తి కలిగించే అంశాలు కనిపెట్టారు. శిశువు జన్మించినప్పుడు గ్రహాలు ఏ స్థితిలో వుంటాయో తల్లి జననకాలమందలి గ్రహస్థితి కూడా అదే విధంగా ఉంటుందనేది వాటిలో ఒకటి. ఇక్కడ ఒక మినహాయింపు యేమిటంటే శిశువు సహజంగా జన్మించి వుండాలి. ఆపరేషన్ చేసి, బయటికి తీసిన శిశువు గ్రహరాశికీ, తల్లి జననకాలమందలి గ్రహస్థితికీ పోలిక యేమీ వుండదు. పరిశోధనలకూ పరీక్షలకూ నిలబడే పెక్కు అంశాలను గాక్యులిన్ దంపతులు కనిపెట్టారు. మనోవిశ్లేషణ పరీక్షలకూ, సాంఘిక విశ్లేషణ పరీక్షలకూ అవి నిలబడతాయి. వాటన్నింటినీ యీ వ్యాసంలో చర్చించాను గానీ వారు కనుగొనిన అంశాలు జ్యోతిష్యాన్ని ఎంతవరకూ సమర్థించుతాయనే అంశం గురించి మాత్రం చర్చించుతాను.

జ్యోతిష్యం శాస్త్రం అని సమర్థించుకొనడానికి చాలామంది జ్యోతిష్యులు యీ రోజులలో గాక్యులిన్ దంపతులు కనుగొన్న అంశాలను ఉదహరిస్తున్నారు. కానీ, గాక్యులిన్ సోదారు యీ ఫలితాలను ఆ విధంగా పరిశీలించటంలేదు.

పురాతన జ్యోతిష్య నమ్మకాలకు తమ ఫలితాలు అనుగుణంగా లేవనీ, ఫలానా మనిషి జీవితంలో ఫలానా విధంగా జరగబోతున్నదని, జ్యోతిష్యం ఫలితాలను వూహించదనీ వారి వాదన. అయినా కారణాల వల్ల ప్రాచీన జ్యోతిశ్శాస్త్రాన్ని బలపరచేవి కావు వారి ఫలితాలు. కొన్ని విశ్వ జీవశాస్త్రానికి ఆ ఫలితాలు ప్రారంభమవుతాయి. గ్రహస్థితికీ, మనస్తత్వ, శారీరక సంఘటనలకూ సంబంధాన్ని వివరించేది విశ్వ జీవశాస్త్రం అని వారి నిర్వచనం. ఒకరకంగా చెప్పాలంటే గాక్యులిన్ దంపతుల వాదన రెండు రకాలుగా వున్నది. జ్యోతిష్యులతో వారు కలవరు. అందుకని జ్యోతిష్యులు ఆ దంపతులను విమర్శిస్తారు. పోనీ శాస్త్రవేత్తలతో కలుస్తారా అంటే అదీ కనిపించదు. ఎందుకనంటే గాక్యులిన్ దంపతులు కనుగొన్న అంశాలకూ సైన్సుకూ కొంచెం

సంబంధం అయినా వున్నదేమో పరిశీలించడానికి శాస్త్రవేత్తలు అంగీకరించరు. గాక్యులిన్ దంపతులూ, శాస్త్రవేత్తలూ, జ్యోతిష్యులూ జరిపిన వాదోపవాదాలలో గాక్యులిన్ దంపతులదే పైచెయ్యి అయింది. వారిని విమర్శించే వారికి వివిధాంశాలా బొత్తిగా తెలియవు — వారిది పాక్షిక దృష్టి. ముందుగా కొన్ని అభిప్రాయాలనేర్పరచుకొని వివిధాంశాలనూ వారు చర్చిస్తారు. గాక్యులిన్ దంపతులు విమర్శలను స్వీకరించరు — మనసులో యేమీ పెట్టుకొనకుండా వాస్తవాలతో విమర్శకులకు సమాధానాలు చెప్పారు. వారి పద్ధతులను మెరుగు పరచేందుకు ఉపయోగపడే సూచనలు వస్తే వాటిని వారు ఎప్పుడూ స్వీకరించరు. ఫలితంగా వారి వాదనకు కొత్తబలం అమరింది. గాక్యులిన్ దంపతుల వాదన జ్యోతిష్యాన్ని సమర్థిస్తుందో — కొత్త శాస్త్రానికి ఆ ఫలితాలు ప్రారంభమో పాఠకులు నిర్ణయించుకోవాలి— వారిని నిర్లక్ష్యం చేయుటం మాత్రం సాధ్యం కాదు.

మనస్తత్వ శాస్త్రంలో గాక్యులిన్ దంపతులు చేసిన కృషిని భౌతిక శాస్త్రంలో జాన్ హెచ్. నెల్సన్ చేసిన కృషితో ఒక విధంగా పోల్చవచ్చు. నెల్సన్ ఎలక్ట్రానికల్ ఇంజనీర్. రేడియో తరంగాలలో వచ్చే ఎగుడుదిగుళ్లకూ (ఖగోళ) గ్రహరాశికి సంబంధం యేమయినా వున్నదేమో కనిపెట్టవలసినదిగా ఆర్. సి. ఎ., నెల్సన్‌ను కోరింది. ఈ ఎగుడు దిగుళ్ళను గురించి ముందుగా వూహించి చెప్పగలిగితే వాణిజ్యరీత్యా చాలా ప్రయోజనం వుంటుంది. కాని విజయం అంత త్వరగా సిద్ధించలేదు. ఖగోళ రాశిస్థితి తను కనిపెట్టవలసిన అంశానికి ముఖ్యమేమో సూచించే వరకూ నెల్సన్ ఆట్టే యేమీ చేయజాలక పోయినాడు. అలాంటి సంబంధం వుంటుందనే భౌతికశాస్త్ర సిద్ధాంతమేమీ లేదు. అందువల్ల ఆ అంశం గురించి నెల్సన్‌కు చాలా సందేహం కలిగింది. కానీ తుదకు ఆ అంశం గురించి పరిశోధన చేశాడు. రేడియో తరంగాలలో ఎగుడుదిగుళ్ళు ఆయస్కాంత(తుపాను) శక్తి ప్రభావం ఎలా కలుగుతాయి? సూర్యునికి ఒకేవైపున రెండూ లేక ఇంకా ఎక్కువ గ్రహాలున్నప్పుడు ఆయస్కాంత శక్తికి తుపానులు కలుగవచ్చు. లేదా సూర్యుడికి 180 డిగ్రీలు, 90 డిగ్రీల స్థానంలో అవి వున్నాగూడా అయస్కాంతశక్తికి తుపానులు కలుగవచ్చునని ఆయన కనిపెట్టాడు ఈ అంశం ఆయనకు ఎంతో ఉపయోగపడింది. దాని ఆధారంగా రేడియో తరంగాలు ఎప్పుడు ఎలా వుండేది ముందుగా వూహించగలుగుతున్నాడు.

ఆయన చేసిన కృషిని జ్యోతిశ్శాస్త్రంగా పరిగణించవచ్చునా? అందుకాయనే ఇష్టపడరు. పోనీ విశ్వజన జీవి శాస్త్రం అనవచ్చునా?

రేడియో తరంగాలలోని ఎగుడు దిగుళ్లను గురించి జ్యోతిశ్శాస్త్రం వూహాగానాలు చేయదు. కాని 90డిగ్రీలూ, 180 డిగ్రీల అంశానికి జ్యోతిశ్శాస్త్రంలో ప్రాముఖ్యం వున్నది. రేడియో తరంగాల ఎగుడు దిగుళ్ళ సంగతి ఇందులో కొంత వున్నదని వాదించవచ్చు. కానీ అలా వాదించటం, గ్రహరాశి స్థితినీ, ఆధునిక భౌతిక పరిస్థితులలో గల చారిత్రక ప్రాముఖ్యాన్ని అతిగా చెప్పడమే కాగలదు.

ఇదంతా సరే. మరి జ్యోతిష్యం శాస్త్రం అని తీర్మానించుకుందామా? లేదా అదో మూఢ నమ్మకం అని తోసేద్దామా? ఈ అంశం గురించి ఇంతవరకూ వ్రాసినవారందరూ ఏదో వాదనను సమర్థించారు. ప్రస్తుతానికి ఏమి నిర్ణయం చేయడం వివేకం కాదని నేను అనుకుంటున్నాను. తత్వశాస్త్రంలో వూహించిన వాటికంటే **చాలా అంశాలు అటు అంతరిక్షంలోనూ, ఇటు భూమి మీదకూడా** వున్నాయి. అన్నింటినీ సైన్సు కనిపెట్టింది, ఇక కనిపెట్టవలసినదేమీ లేదని నటించడం అసందర్భంగా వుంటుంది. ఇదే విధంగా ఇంతవరకూ కనిపెట్టిన అంశాలు సంపూర్తిగా, సూచనలుగా మాత్రమే వున్న దశలో, సాక్ష్యాలూ, ఆధారాలూ ఇంకా పూర్తిగా లభించని స్థితిలో జ్యోతిష్యం సైన్సు అని వాదించడం కూడా సబబు కాదు. ఇలాంటి పరిస్థితులలో ఇంతవరకూ జరిగిన వాటి ఎక్కువ పరిశోధనలు ఇంకా బాగా జరగాలని నా అభిప్రాయం. అన్ని అంశాలు జ్యోతిష్యానికి తెలుసు. తెలుసుకోవలసినవీ, కనిపెట్టవలసినవీ ఇక యేమీలేవని వాదించే జ్యోతిశ్శాస్త్రజ్ఞులూ, శాస్త్రవేత్తలూ కూడా ంబా రకం పరిశోధనలకు పెద్ద అవరోధంగా వున్నారు. గాక్యులిన్ దంపతులూ, జాన్ నెల్సన్, పెర్సన్ క్లార్క్ వంటి వారి కృషిని అందరూ గుర్తించి, ఆ అంశాలను గురించి మళ్ళీ ప్రయోగాలు చేయడమవసరం. వాటిని గురించి విశేషంగా ప్రచారం చెయ్యాలి. ఈ రంగంలో చక్కగా పరిశోధన చేయడం కష్టమేమీ కాదు. ఈ అంశంపట్ల ఆసక్తిగల మంచి శాస్త్రవేత్తలను సంతరించడమే కష్టం.

ఇకపోతే ప్రస్తుతం యేమి జరుగుతున్నదీ ? రెండు రంగాలలోని పరిశోధకులూ ఒకరినొకరు నిందించుకుంటున్నారు. జ్యోతిష్యం గురించి సందేహాలు వెలిబుచ్చితే జ్యోతిష్కులకు ఆగ్రహం. మానవాళి ప్రవర్తనమీద గ్రహరాశి ప్రభావం వుంటుందంటే శాస్త్రవేత్తలకు ఆగ్రహం. ఈ పరిస్థితి మారితే తప్ప జ్యోతిష్యం శాస్త్రమా — మూఢ నమ్మకమా ? అనే ప్రశ్నకు సరయిన సమాధానం రాదు.

['ఎన్‌కౌంటర్' పత్రిక నుంచి .... శ్రీ వి. ఎస్. అవధాని]

శ్రీ వేగుంట మోహనప్రసాద్

బతికిన క్షణాలు

ముందుమాట

ఈ పద మూర్ఛనలు వచ్చిన తర్వాత చెప్పే మొదటి మాటలు. కలల అలికిడికి లేచిన మంచినీళ్ల గ్లాసు అలల గల గల. భౌతిక జీవితంలోంచి దూసుకొచ్చిన ఎప్పుడో గుచ్చుకున్న గవర్మెంట్ తుమ్మముళ్ళు. ఆలోచననీ అనుభూతినీ కలగలిపి రైలెళ్లి పోయిన తర్వాత మిగిలిన పట్టాలమీద కూచుని చూస్తున్న అనుభవపు చారికలు.

వాస్తవాన్ని అధివాస్తవికంగా మలచుకొనే ప్రయత్నంలో వచనం విరిగి ముక్కలయి ఆ గాజు పెంకులు పద్యానికి గుచ్చుకొంటాయి.

గ్రూప్ ఫొటోలో ఒక్కొక్కళ్ల రెండు కళ్లనీ సుతారంగ కత్తిరించి చివరికి మిగిలే జల్లెడ చిత్రంలోంచి వచనపు తుంపుర్లని విచారహస్తాల్లో పట్టుకుని జల్లిస్తున్నాను.

ప్రతి నేనుకీ ఒక మేనుంటుంది. నేను లోంచి మేము, మనం అవటానికే ఏ రచన అయినా. తారీఖులూ దస్తావేజులూ ఏమీలేని అనామక స్వీయ జీవన చిత్రణ ఈ 'బతికిన క్షణాలు.' దృశ్యం అదృశ్యంగానూ శబ్దం నిశ్శబ్దంగానూ రంగులు పులుముకుని మాటలుగా మ్రోగుతయ్.

అంతాలో ఎంతో కొంత యిది.

ఎక్కువ మాట్లాడేవాడు ఏమీ చెప్పడు.

నిశ్శబ్ద క్షణంలో శాశ్వత శతాబ్దాన్ని పట్టుకోవాలని ఈ నూత్నయత్నం.

– రచయిత

నా మొదటి గుర్తు కర్వేపాకు, దాని కాయ వాసన, కొమ్మ విరక్కుండా రెమ్మ దూయటం, కాయ చిదపటం, చేతికందిన కాయ చెమ్మని పీల్చటం, ఇసికతో కాళ్లవేళ్ళ దున్నుతూ చారికలుగా నడవటం, వాపాదాల స్పర్శని ఇసిక నాఘ్రాణింప చేయటం, చెరుకుపల్లిలో.

నా మొదటి స్పర్శ లాగుతూన్న బండిని మోస్తూన్న ఎద్దుని కొట్టినపుడు నా వీపుమీద పడిన బండివాడి చర్నాకోలు. నా మొదటి శబ్దం వాడు తిట్టిన తిట్టు. కొవ్వలిలో.

నా మొదటి ఆశ కలరా ఉండని తిందామని. మిలమిలా మెరిసి పోతూ ఎందుకో తెలీని కాంతి పంపించిన సంకేత కిరణం అమ్మమ్మ వాళ్ల ఊళ్లో కిరాణా కొట్లో.

ఎవరేనా నాకిచ్చిన శాంతాక్లాజ్ మా పెదమామయ్య. సంస్కృతం హిందీ చదువుకొన్న పెదమామయ్య దగ్గరకు పిలిచి కొనిచ్చిన ఎర్ర ఐస్క్రీమ్ బిళ్ల చనుబాలులా చీకిన స్తనం.

దేవుడు నాకు తొలిగా కన్పించింది వాడి గూట్లో అణాబేడాలు చూపించినప్పుడు తీసుకోమని మొహమాట పెట్టినపుడు, అదీ అమ్మమ్మ పడక్కుర్చీ వెనకాల నుంచుని ఎక్కాల బొక్కు చూస్తూ ఎక్కాలప్ప చెప్పినపుడు.

అంతా చీకటిగా ఉన్నపుడు తోచిన ప్రథమ కిరణం అమ్మమ్మ చచ్చిపోయినపుడు వెలిగించిన ఆముదపు ప్రమిద. నేనెందు కేడవలేదో నని నా కెంతో సంతోషంగా ఉందిపుడు. విషాదమల్లా ఏడవటానికి కారణాలు తెలిసినపుడే.

కక్ష తాతయ్యమీద. రైలుకీ రైలాగే అరుక్కీ మధ్యన ఇరుక్కుపోయిన కాలుతో నడిచిన తాతయ్యను ఎలా అయినా చంపేద్దామని పడుక్కున్నపుడు పక్కమీద పల్లేరుగాయలు చల్లుదామని ప్లాను. అనుకున్నదీ అనుకోనిదీ మధ్యఉన్న జగత్తుకి అర్థం ఎలియట్ని చదివేదాక గాని తెలీలా.

నేరానికీ పాపానికీ తేడా తెలీని బాల్యంలో చేసిన పది రూపాయిల దొంగతనం చచ్చేదాకా గర్వకారణం. అదిపెట్టి తిన్న హోటలు అట్లూ, కొనుక్కున్న సిరా కన్పించే కలవూ, తాగిన సిగిరెట్లూ ఇంటి కొచ్చి తిన్న తిట్లూ, కొట్లూ, ఈ జన్మాంతానికి చేయబోయే పాపాల్ని అన్నిటేనీ కాచుకొనే శిక్ష.

రాయపూడి జామ తోటల్లో దొంగతనంగా కోసుకొచ్చి లాగూ జేబుల్లో ఒళ్లో చేతుల్లో దాచుకొచ్చి తుళ్ళూర్లో మాలపల్లిలో అమ్మిన డబ్బుల్తో కొనుక్కున్న బీడీల పొగ ఆఖరు క్షణాల దాకా సరి పోతుంది పీల్చడానికి.

అరటికాయ వేపుడని తినిపించిన మాంసపు ముక్కలు ఇక తినలేనుగాక తినలేను. వాడిపుడు ఏంజేస్తున్నాడో స్కూల్లో నాకంటే జులాయి వెధవ.

*　　　*　　　*

ఆకాశవాణి ప్రసారారంభంలో వయొలిన్ కాసేపేడుస్తుంది. ఎక్కడా సఫలం కాని ప్రేమ ఎదురుబడినాక గాని షహనాయ్ అంత కంటే బాగా ఏడుస్తుందని అర్థం కాలా. కార్టర్ విల్ నుంచి చికాగోకి అన్నాయి కారు తోల్తున్నప్పుడు ఇంకా బాగా ఏడ్చాను వేంక టేశ్వర సుప్రభాతం విని. పారా పలుగుల తీక్ష్ణానికి కారాగినపుడు భానుమతి ఏడ్చింది మల్లీశ్వరిలా.

నా పుస్తకాల గూట్లో అంటోన్నాడు వజీర్రహ్మాన్ 'ఎచటికి పోతావీ రాత్రి ?'

"పరమ దారుణ కసికంత్రీ !
ఎచటికి పోతావీ రాత్రి
రేగిన
చెలరేగిన
గాలి హోరులో
శోక ఆకసాన. ."

చిన్నప్పుడు చించేసిన, కావలని ఆ అమ్మాయిముందే, చూపిం చకనే చించేసిన ప్రేమలేఖల ముక్కలే ఇవ్వాళి పక్షులయి మళ్లీ ప్రతి రాత్రీ నా గూటికి చేరుకొంటాయి.

ఎస్సెల్సీలో ఉన్నప్పుడు నాతో చదూకునే దాశరథి అందమైన గొంతుతో 'ఎంకి పాటలు' పాడి అమ్మాయిల్ని గుంపేసుకున్నప్పుడు ఆ నల్లని వాడిమీద ఎంత అసూయో ఈవాడు నామీద నా కంత జాలి – పాటలు పాడే వాడిని ప్రజలు ఆర్టీసీ కండక్టరు చేసినందుకు.

వేపాకులు రాలిపడ్తున్నప్పుడు మంగలి నిర్దయగా కూచోబెట్టి మిషన్ కత్తెరేస్తున్నప్పుడు రాల్తున్న వేపాకుల్ని ఒక్కొకటే పట్టు కోవాలని తహ తహ. ఇవ్వాళ క్షౌరం చేయించుకోటానికి జుట్టెక్కడిది అంతా ఎండిన వేప చెట్టులా తల.

బురదలో బొటనవేళ్లు గుచ్చి మరీ నడవాలి ఆ బురద నల్ల రేగడి స్కూలు రోజుల్లో పడిపోకుండా నడవాలంటే జాగర్తగా. ఇరవై రెండు సంవత్సరాల తర్వాత అదే స్కూలుకి వెళ్లి హెడ్మాస్టరు లేని ఆదివారాన అంతా కంకర పరచిన ఆవరణలో బోగన్ విల్లాలు నవ్వుతూన్నప్పుడు నోటీసు బోర్డుమీద ఒక పాత విద్యార్థి అని రాసి వొచ్చానొక గొప్ప విజిటర్ ననుకొని. కాలంమీద ప్రతివాడూ సంతకం చేస్తాడు కొన ఊపిరి పొట్టి సంతకంతో.

ప్రథమంగా ఆత్మకు విప్పించింది వయొలిన్. ఆపైన జోగ్, బిస్మిల్లాలు కలసి విషాదించారు నా 1965 లో ఒక రాత్రిపూట దుఃఖం ఉంగలుగా చుట్టుకొన్నప్పుడు ఆ ఏడుపుకి 'వయొనాయ్'అని పేరు పెట్టుకొన్నప్పుడు, ఆత్మవిచారం ఎర్ర లంగొట్టుకొని నిశి దారాల సాంబ్రాణి పొగలో రింగులు తిరిగినపుడు.

*　　　*　　　*

సుడిగుండం అలల వడిని ముడివేస్తుంది. మళ్ళీ అదే విప్పు తుంది ముడి. లాంచీమీద ప్రయాణం – బాహువులు చాచి ఆకాశం, ఒళ్లంతా పొర్లించి కృష్ణానదీ. డబ డబ డబమని ఓమూడు గంటలు శబ్దించి శరీరం ఆ లయకు నినదించి ఎలా అయితేనేం దిగుతాంతాంచీ మళ్లీ నీటిని ముట్టకుండా – ఊగే విరుగుతుందేమోనని భయమేసే చెక్కముక్కమీంచి. అక్కణ్ణించి జట్కావాళ్లతో గొడవ. ఇంకా ఎక్కించుకోడేం? నీరు దాటినా నిప్పు దూకినా చక్రమెక్కినా ఎందుకీ డబ్బు ?

డబ్బులూ, మార్కులూ, అన్నాయి తొడిగిన బట్టలు వచ్చే ఏడాది నేను వేసుకోవటాలూ, ఎవర్ని ఎదిరించుదామన్నా ఎత్తినచేయి విరుగుతుందేమోననే భయం, అసలెందుకు రోజూ బడికెళ్లటం ఇలాగే లాంచీ నించి జట్కా నించి రైలెక్కి వట్లూరెళ్లి సెలవులంతా సంవత్సరాలై పోతే పోతా? ఏదీ ఎందుకు పోదు ? ఏదీ ఎందుకు పోనీ విలవదు ?

1854 మార్చి 30న అమ్మ శవాన్ని తీసుకుని బ్రిడ్జి అప్పుడే కట్తున్న ఎండిన కృష్ణానది బస్సుల దారిన లారీలో వేసుకుని కరణం మునసబుల సర్టిఫికెట్‌తో వెళ్తున్నపుడు అపుడూ ఇపుడూ లారీల మీద వేసికెళ్లే సర్కసు పశువులు గుర్తు. చీకట్లోంచి చీకట్లోకి వెళ్తూ దారంతా ఏదో వస్తువు కోసం వెదుక్కుంటూ ఇంకా ముందుందేమోనని ఇంకా వడివడిగా వెళ్తూ అసలు వస్తువు లారీ లోనే ఉందని తెలిదప్పుడు.

యూజీన్ అయొనెస్కో నాటకం "యామెడీ ఆర్ హౌటు గెట్ రిడ్ ఆఫ్ ఇట్" చదివినాక తెలిసొచ్చింది. చచ్చిపోయిన వాళ్లని పూడ్చి పెట్టటానికో దహనం చేయటానికో ఎంత తొందరపడ్తామో కాళ్లూ కాళ్లూ తొక్కుకుంటామో, ఎలాగోలా వదిలించుకోవాలి, ఎంత తొందరగా అయితే అంత మంచిది. ఈలోపల రావాల్సిన వాళ్లందరూ ఎంత తొందరగా వొస్తే అంతమంచిది. దేహం నిలవ ఉండదు. స్నానాలు చెయ్యాలి. ఇంక ఏడుపు ఆపుకోవాలి. అందరూ ఎంగిలిపడాలి.

నిద్ర భయం, మెలకువ భయం, నిద్రపొలిమేరల్లో పొలికేకలు, జాగరణ ఆవరణలో కునికిపాట్లు, మేనమామ కొత్త చొక్కాలు కుట్టించడం ఆచారం ఎందుకోగాని మంచిదే. ఒకరి మృత్యువు మరొకరి మరణాన్ని కాపాడుతుంది.

సుడిగుండం గిర గిరా తిప్పుతుంది దేహాన్నే గాదు మనసుని కూడ. అంతశ్చేతనంలో అన్నీ దాక్కుంటాయి మళ్లీ తేల్తాయి ఎట్లాగో ఉలిపిరికాయితాల్లా.

*　　　*　　　*

అసంబద్ధత కూడ సంభవిస్తుంది. అబద్ధం కూడ సబద్ధమవుతుంది. అనిజం అసత్యం కాకనే నిజమవుతుంది. తెల్లారితే ఎస్సెల్సీ లెక్కల పరీక్ష. గడ్డిమీద పరుపు వేసుకొని ఎడ్లబండిమీద అనురావలి వెళ్లి అక్కడ రాయాల్సిన పరీక్షలు అలా వెళ్లటం వల్ల ఉత్సాహం. ఎవరెవరు ఎలా వస్తున్నారో తెలుసుకొని స్నేహాలు కలగలుపుకొని నేనొక్కడ్నే ఆ బండిలో మా క్లాస్‌మేట్ అమ్మాయితో పరుపుమీద కూచుని వెళ్తున్నానని తెలుపుకొని గర్వంగా వెళ్లి రాసిన పరీక్షలు.

తెల్లారితే లెక్కల పరీక్ష. ఆ ఊళ్లో అప్పటికి రెండు సినిమా డేరాలున్నాయ్. ఒకటి శివభక్తితో కన్ను పొడుచుకుంటుంది సాలీడున్నది మొగటాటలో కన్ను పీక్కున్న ఆశ్చర్యం కాలమూ దూరమూ వేగమూతో సరిపోలదు రెండో డేరాలో మా వెంట పరీక్షలు రాయించటానికొచ్చిన డ్రిల్లు మాష్టారి కన్ను గప్పటం. జీవిత కాలమంతా రాని లెక్కలు ఒక రాత్రి రెండో ఆటకి వెళ్లలేక పోవటంవల్ల వస్తాయా? ఒక్క గ్రాఫ్ లెక్కల్లో మాత్రం ఆశ నిరాశల నిమ్నోన్నతాలు కన్పించేవి. అందులోనూ ఆ సన్న సన్న గళ్ల కాలాన్ని కొలిచే క్షణాలు బిందువు నుంచి బిందువు దాకా ఆకర్షించేవి.

మొదటి ఆటకీ రెండో ఆటకీ మధ్యలో ఉన్న సమయం కూడ సగర్వం. ఆ కాస్త గంటలో సమస్తకాలమూ స్తంభించి ఆ క్లాస్‌మేట్‌ని పలకరించగలగటంలో పులకరింత 'ఫ్రీజ్'అయి బాల్యం అంతా 'జామ్' అయింది.

తెల్లారేలేచి తుండుగుడ్డలు తీసుకొని మరొక సహవిద్యార్థితో కృష్ణలో స్నానం. పొగ్గు తెలిని చెయ్యి, హద్దుల్లేని కాళ్లు కృష్ణలోంచి బయటికొచ్చేప్పటికి డ్రిల్లు మాష్టారి కంటపడి పరీక్షకి ఇంకొక అరగంట మాత్రమే ఉందనగా ముందు నేను, వెనుక మా కృష్ణాస్నాన సఖుడూ సైకిలుమీద పరుగో పరుగు.

చూచి నేర్చుకోవాల్సినయ్ ఎన్నో ఉంటై విషయాలు ముఖ్యంగా లెక్కల పరీక్ష హాల్లో. బాల్య స్నేహాలు ప్రతిఫలాన్ని కోరని సహాయాలు చేస్తూంటై. ఒకడి రహస్యాలు ఒకడికి చెప్పుకున్న ఉత్సాహం, అందునా కల్పిత రహస్యాల్ని విప్పారిన కళ్లతో ఒలక బోసుకున్న క్షణాలు వృధాపోపు లాగు జేబుల్లోనూ చొక్కా చేతుల్లోనూ ఉండవు పక్కచూపులు, స్నేహ సహాయాలు.

అస్తిత్వంలోని శూన్యత్వాన్ని ఆమోదించటమంటే మేరీ వార్నాక్ మాటలు గుర్తుకొస్తున్నాయ్. ''కాన్షస్ బీయింగ్స్ హేవ్ నో ఎసెన్సెస్. ఇన్‌స్టెడ్ ఆఫ్ ఎన్ ఎసెన్షియల్ కోర్ దే హేవ్ నతింగ్''

ఎవరూ ఎవర్నీ కళ్లల్లోకి చూడలేరు. పక్కచూపులేచూస్తారు. ఒక్కోసారి చూపుకందరు. దృశ్యా లదృశ్యాలౌతాయి. రూపాలు రూపాంతరం చెందుతాయీ అరూపాలవుతాయీ విరూపాలౌతాయీ నైరూప్యాలవుతాయీనూ.

*　　　*　　　*

దేహం ఉన్నది. ఉంటూనే ఉన్నది. 'సరే' కాదు — ఇవ్వాళ నేనున్నాను చూడు అంటోంది. నన్నేం చేసుకొంటావ్ నాతో నువ్వేం చేయగలవో ఆలోచించు అంటుంది

బిందువు ఉన్నది. అలానే దానిచుట్టూ వలయం ఉన్నది. చిన్న చుక్క చుట్టూ ఒక గొప్ప సున్నాని చుట్టినప్పుడు దేహాన్ని ఏం చేసుకోవచ్చో తెలుస్తుంది అపుడు ప్రథమంగ మనసు స్ఖలిస్తుంది.

ఈ రికగ్నిషన్‌ని, ఈ డిస్కవరీని ప్రకటితం చేయలేని ఆందోళన ఏవేవో ఇతర మార్గాల ద్వారా వ్యక్తమవుతుంది చచ్చిపోయిన గాడిద, కరి కళేబరం, బందరు రైలుస్టేషన్‌నించి హిందూ కాలేజిదాక మధ్య వ్యాపించిన విస్తృత శూన్యత్వం, గాలిలో కలిసిపోయి మిన్నాగు విషపు వాయువు నీస్తున్న మొగిలిపూలూ, విస్తృతాకాశపు పొడారిలో అవితలికి కొట్టుకుపోతున్న ఎండమావుల కెరటాలూ, ఆరోజే కొనుక్కున్న చాపి, తలదిండు జేబులో భద్రంగా దాచుకొన్న పాసింగ్‌షో సిగరెట్ పెట్టె కలగలుపయి కాలేజి ద్వారాల దగ్గర 'కల్లేడ' అయి హారంలో దారం లయి ఒక ఆకాశం చీకట్లో వెనక్కి మళ్లీ మూతపడి, ప్రయాణానంతరం మరో ఆకాశం విచ్చుకొని ఉప్పట్లో విడుదలయిన సినిమాలో పాట ''చల్లని రాజా! ఓ చంద మామా! నీ కథలన్ని తెలిసాయి ఓ చందమామా'' గాలిలో కొట్టుకొస్తూ నేను వింటూన్నప్పుడు కృష్ణకిశోర్ సినిమా హాలు ముందు నుంచోని కిళ్లీ కట్టించుకొంటున్నపుడు సంపాదించుకొన్న కొత్త స్నేహాలు కొత్త అయిష్టాలు వ్యక్తావ్యక్తాలుగ స్ఖలిత చేతనని అలల చేతుల్తో మనస్సుని తట్టి లేపుతాయి.

మేక కాలర్ టీ షర్టు ఓటుండేది ఆ రోజుల్లో. డాండీయిజం అంటే తెలీని రోజుల్లో రోజూ లేక రోజు విడిచి రోజూ అదే వేసుకుంటూ జుట్టు ఆ రోజుల్లో ఎలా దువ్వుకోవాలో అలా దువ్వుకుంటూ ప్రదర్శనకీ ఆకర్షణకీ మనసుని లగ్నంచేసి ఎంత అపరిణత చేతనో ఆనాడు!

పొదుల అన్నీవిడువు ఏదీ కావాలనకు ఒక్క నిన్నుమాత్రం ఒదులుకోకు దేన్నించేనా సరే రక్షించుకో బయటంతా శబ్దమే. ఒక్క నీలోనేఉంది నిశ్శబ్దం. అందులోకి కూరుకుపో. విఫల ప్రేమలూ అవ్యక్త ప్రేమలూ అన్నీ నీ ఒక్కడిలోనే సఫలమవుతాయ్ ఇదీ ఈనాటి బావ స్థిరత్వం.

అది భావధార. ఆనాటిది అపుడపుడూ బద్ధకంగా బందరు స్టేషన్‌కి వచ్చేపోయే రైళ్ల కూతల్ని లెక్కపెట్టటం, చేసిన తప్పుల్ని చెయ్యని తప్పుల్తో హెచ్చవేసుకొని దాన్ని చెయ్యకుండా ఉంటేతో భాగారించుకొని వచ్చిన శేషాన్తో తక్కువేనని సంతృప్తి పడటం, కలగా పులగంగా కలిసిన మిత్రులు చెల్లాచెదరవటం. కృష్ణశాస్త్రి అన్వేషణ పద్యాల్ని 'తలిరాకు జొంపముల సందుల త్రోవలలో' వెదుక్కోవటం అంతవరకు చూడని హంపీ క్షేత్రాన్ని కొడాలితో బాటు అదృశ్యమై వెళ్లి చూడటం!

*　　　　*　　　　*

భయపడిన బావురుమన్న చేతులు నిర్భయాస్పందిస్తున్న బాహువుల్లోకి జారినపుడు, తొలిత ఈనిన ఆవు గుండ్రటి కళ్లతో లేగని నాకినపుడు, నగిరంలో రహస్య కాంక్షలదారుల చీకటి వెలుగులకు ఊగుతున్న పురపాలికల వెల్తురు గాజుబుడ్లు పగుల్తాయేమోనని భయపడినప్పుడు, అన్వేషణలో తోడుగా తెచ్చుకొన్న వాడెంతకీ తెమిలి బయటపడని ఒంటరి బాహ్యవలయ విలయంలో సందేహ సంకోచ సంతాప లజ్జా విచ్ఛిన్న వదనంలో ఎటోకటు ఎగిరి మళ్ళీ ఈముఖాన వాలకుండా పారిపోదామనే కళ్లు, మళ్లీ రద్దులోకి గుంపులోకి ఏమీ ఎరుగనట్టే అమాయిక మూకలోకి జొరబడి మామూలు సాదావస్తువులు బేరవాడి చేతులూపుకుంటూ కాళ్లు స్వచ్ఛవెన్నెల్లోకి మైదానాల పవిత్రతలోకి బార జాపుకుంటూ ఇంకనయం బ్రతికిపోయాను ఆకర్షణలోకి మండి మసయిపోలేదని నుసయిపోయిన చిచ్చు నూదుకుంటూ.

ఒక పొట్లకాయి ఒక సొరకాయి బెలూన్లు కొని దూరమెళ్లిన తర్వాత వాటిని పళ్లతో కొరికి, రామ్మనిపించి, వేరుసెనగ పప్పులు వేడివేడివి ఊదుకొని పొట్టు ఒలుచుకుని తింటూ

రక్షించావురా ఆత్మారావుడా ఆ తడి బురదల బజారు కాంక్షల్నించి ఎవరు గెల్చారెవరు నిల్చారా చిక్కని చీకటి నల్ల నక్షత్రాల వెలుగు కిరణాల వ్రణాల సూదుల సంమల సుందని

గదిలో బడి సముద్రాల్ని చిలుకుతున్న సీలింగ్ ఫాన్‌కింద సంశయాందోళనల గ్రంథ సముచ్ఛయాల పుటలు గాలికి ఎగిరిపోతూ బ్రిటిష్ హిస్టరీ హండ్రెడ్ ఇయర్స్ వార్ చరిత్రగతిని ఆత్మికంగా వంద సంవత్సరాల జీవనానికి అన్వయించుకొని

కామానికీ కామ్యానికీ మధ్యనున్న కామాని ఫుల్‌స్టాప్ చేసి రేపటికి చదవాల్సిన పాఠాల్ని గుక్కబట్టి బట్టీపట్టి ఇంతలోనే మనసు చూసే పక్కచూపుల్ని ఎక్కుబట్టి విల్లంబుల్ని 'విల్' అంబుల్తో వెనక్కి మళ్లించి

కాలేజి తరగతి గదిలో ఆ అబ్బాయీ ఆ అమ్మాయీ పేర్లు గోడలమీద శుభలేఖల అచ్చేసి అది చూసుకొని స్వయంతృప్తితో ఆటో సజెశ్చన్‌తో నుచ్చటపడి

వ్యక్తం అయ్యే భావాల్ని గోడమీద రాతలుగా అవ్యక్తంచేసి ఆ తెల్లారి ఆ నాలుగు కళ్లూ దిగులుతో పగలటం చూచి అచింత్యమమేయ మగాధ మపూర్వమైన ఆనందాన్ని పొంది విలువిద్యలో పలు విద్యలున్నాయన్న గొప్ప సాడిస్టిక్ సత్యాన్ని ఆ నూత్న క్షణకణంలో గ్రహించి

ఓహో మానవులంతా ఒకేరకమైన దిగులుతో పొగిలి కుమిలి బూడిదవుతారుగదా అని నిర్మలానందంలో నిముక్తాకాశంకింద అరచెయ్యి మెత్తని తలకింద నున్నని జుత్తుగా పెట్టుకొని అభీర నిద్రా గగనంలోకి మునిగిపోయానక్కడ కలలులేవు కాంక్షలులేవు చీకటిదారుల రహస్య వెలుగులులేవు– ప్రేమనించి ఓడిపోయినా ప్రేమేనను ఈ ఇరవై సంవత్సరాలూ ఆత్మహత్యనించి రక్షించిందని నేర్పిన బుద్ధుడ్నించి పీకి పెట్టుకున్న ఆ రెండుకళ్లు.

*　　　　*　　　　*

సంధ్యకేసి చూడటం ఒక గొప్ప అనుభవం ముఖ్యంగా త్రివేంద్రం కోవలం బీచీలో ఆ జర్మన్ కన్యకాపరమేశ్వరి ఇటలీనుంచి లేపుకొచ్చిన గడ్డం ప్రియుడితోబాటు చౌకబారు బీడీలు తాగుతూన్నపుడు ఆమె ముక్కెరలో మెరిసిన విరిసిన నవ్వు పగిలిన పగడాల కాటేసే విషపు బుడగ పగిలిన సంధ్యను చూడటం గొప్ప అనుభవానంద అతీత అవ్యక్త విషాద మాధుర్యం. పుట్టుగ్రుడ్డి అయినవాడే చూడగలడా వెల్తురు కిరణాన్ని.

రోజా హోటల్ నాలుగో అంతస్తులో అద్దపు కిటికీ కీవల ట్రిపిలెక్స్ రమ్ నారింజరసం సంజ కెంజాయలో కలుపుకుని నాలుగో పెగ్‌లో ఊగుతూన్నపుడు ఈ దేశపు బెల్ ఎయిర్ ఒటేళ్లన్నీ నాలాంటి దేశదిమ్మరులకు నాల్కలు చాచి నా ఇండియన్ ఎయిర్ లైన్స్ బాగ్స్‌ని నాకి చేతులరా ఆహ్వానించితే ఎంత బావుండునని స్వామి వివేకానందలా ఒకే ఒక్క తూరుపుదిక్కుకేసి దృక్కుల్ని నిలిపి ముక్కుమీదనుంచి కళ్లచూపుల ముక్కోణాకారాల్ని దింపి ఆ అఖాతంలో కేప్ కామొరిన్‌ని సందర్శించినపుడు

నా భుజం తట్టినవాడు డా. అయ్యప్ప పణిక్కర్ లండన్‌లో లింగ్విస్టిక్స్ చేసి సరాసరి లుంగీ కట్టుకొని వచ్చినవాడు. నిద్రలో ఆగిన ఊయలని మళ్లీ ఊపినవాడు డా. పణిక్కర్. ఆ మధ్యాహ్నమే రష్యన్ సాంస్కృతిక రాయబారుల్ని దవడలు పగిలేట్లు ఆహ్వానించుకున్న పణిక్కర్.

సలలితరాగ సుధారససార కొబ్బరిబోండాం నీళ్లు ఐదురూపాయిన్నపుడు కాటేజి గుడిసెలు పేదరిక విలాసమన్నపుడు మసాజ్ పార్లర్‌కి యాభయ్ నోటుని మర్దనా చేయాలన్నపుడు కోరల్ గుళ్ల పేరు ఇరవయ్యారన్నపుడు ఆరునూరయినా అంతకంటే బేరం లేదన్నపుడు

నాకు ఆ నిశ్చల సాగరంలోకి దూకాలనీ అలనై ఏదేనా వలలో చిక్కుకోవాలనీ తలంటిపోసుకున్న కొబ్బరి చెట్లన్నీ ఒక్కట్నే ఎక్కాలనీ ఈ ప్రపంచాన్నే పూరీల పిండిలా ఒత్తాలనీ బత్తాయికాయల బొత్తాలన్నీ విప్పాలనీ సముద్ర స్మశానంలో ఒక్కట్నే ఆల్చిప్పల పుర్రెలన్నీ రుద్రాక్షల్లా ధరించాలనీ సంధిజ్వరాన్ని సహించాలనీ ఒకటేపిచ్చి మృత్యూహ జనించింది నూత్నప్రాణం పోసుకొని.

చైతన్యంలోంచి జడంలోకి వెళ్లటం చాల తేలిక. ప్రతిసారీ ఈ ప్రపంచంలో కన్పించే మనుషులు — మొహంపుల్లలు నవుల్తూ, చెంబట్టుకొని/ఎండిన కాలవ గట్లంట వెళ్తూండే ఈ మనుషులు కలల విస్మృతుల్లోకి తప్పుకోవటం కనికట్టంత సులభం. దూరాన్ని దగ్గరకు పిలవటం పొలిమేరల్ని పొలికేకతో పిలవటం తేలిక. చెవిపో టొచ్చినపుడు మబ్బుల్ని చెవిలో దూర్చుకోవటం సునాయాసం.

కానీ కన్పించని ఆవలి తీరాల వలల ఆవతలి తరాల మనుషుల్ని కేకెయ్యలేం. సమయానికి పిలుపు అందదు. తీరా వచ్చేప్పటికి సంస్కారం అయిపోతుంది. ఈ అరేబియన్ తొడల్నించి అట్లాంటిక్ హృదయంవరకు ఎంత ఈదినా చివరికి రొప్పేగాని ఎవరి మెప్పూ కాదు.

ఒట్టి కట్ డ్రాయరేసుకొని సూర్యోదయానికి చేతులుజాస్తూ పద్యాల్ని దోసిళ్ల నీళ్ల కొసల్నించి విడుస్తూ మంగినపూడి ముక్కోటి ఏకాదశినాడు మునిగి తేలేదాక నాకు ఎవరన్నా లెక్కాలేదు. సీమా సమయాల్ని జయించేదాక జమాలేదు. డా. పణిక్కర్‌కి తెలుసా విషయం.

*   *   *

ఏమి రాసినా చీకట్లో రాయాలి వెలిగే కలంతో. ఏమి చెప్పినా నిద్రలోంచి కలల్లోకి మేల్కొని జోకొట్టుకోవాలి. పలచని ఎండ ఈ ప్రపంచంమీద నాకు తెలిసి ఇప్పటికెన్నో వేల పగళ్ళు పగిలింది. అవన్నీ నల్లనిరేయి అలలకి కొట్టుకుపోయినయ్. నేలంతా నునుపయి జారిపడి మళ్లీ నేకువనే లేచి చూచుకుంటాం.

నాలుగువేపులా కూచుని ఈ ప్రపంచానికి కేరమ్‌బోర్డు ఆడు కున్నాం. నీకెక్కువ కాయిన్లు రావాలని రెడ్‌కూడ కొట్టుకోకుండ చేతకానట్టు ఒదిలేసాను. అదే గొప్ప దెబ్బతీసింది. దివాళా తీసాను.

నాలుగు పంవత్సరాలు పట్టువదలని విక్రమార్కుడిలా ప్రేమ శవాన్ని మోసిన మిత్రుడికి అర్ధరాత్రిపూట బావినీళ్ళు చన్నీళ్లేఅయినా తోడిపోసి కుంకుడుగాయ రసమంటి కొత్తపంచె కట్టబెట్టి తెల్లా తెల్లారి బళ్లారి రైలుకెక్కించితే వాళ్లిపుడు రెండు భూతాలై చెరొక కొమ్మా ఎక్కి కూచున్నారు. వాళ్లిప్పుడు వ్రేలాడే గబ్బిలాలు. పిల్లలు అసహాయ అసౌందర్య గుడ్లగూబలు.

మెలకువనించి ప్రజ్వరిల్లిన పగటి వెల్తురుకి తట్టుకోలేక స్వర్గాతీత ఆనందాన్ని కప్పుకోలేక లక్నోనించి తుఫాన్ మెయిల్లో వస్తూ వారణాసి స్టేషన్లో దిగి మొదటిసారిగాకొన్న సారా సీసాతో సరాసరి సారనాధ్ వెళ్లిపోయాను. సాంచికి లాంచీమీదే వెళ్లాలి. అజంతా గుహలకి హలంతాలందరూ వెళ్లితీరాలి. ఎల్లోరాలో ఏకాంత మసలే పనికిరాదు. సౌందర్యం గడ్డకట్టిన రాళ్లవక్షస్థలాలమీద సంగీతాన్ని రంగరించాలి. ఏకాంతసేవ బానిసత్వం.

ప్రపంచంలో మూగవాళ్లెందరుంటే అంతమందీ చెవిటి వాళ్ళుండితీరాలి. ఒట్టి కళ్లుంటే చాలు. చల చంచల సర్పాల సెల యేళ్లు నిశ్చల శతాబ్దాల పర్వతాల ఒరవడి ఇరుకుల్లోంచి దూరి వస్తాయి విషపు నాల్కలు చాచుకొంటూ.

వృథాప్రయత్నానికి వ్యర్థవాక్యం వృద్ధాప్యంలోలా తోడు ఉండాలి. అది గంగలో శవంలా మునుగీతలీదులూ తేలుతూ దశాశ్వ మేధఘాట్‌కి కొట్టుకుపోతుంది. పగిలిన గాజులు చిరిగిన చేతుల్ని చీరుతూంటాయి.

రామ్‌లీల మైదానంలో ప్రతి రావణాసురుడూ తగలడ్తాడు. రహస్య రాత్రిలోంచి కేకేస్తూ వచ్చిన ప్రతివాడూ సూర్యోదయానికి బూడిదయిపోతాడు. గోనె సంచీలో మూటకట్టిన ఖండిత శిరస్సు దాని ఓనర్ ఎక్కడున్నాడోనని కేకలేస్తూ అరుస్తుంది. పిలిచినా రాదు మొండెం. అది కూర్చుంటే నుంచోలేదు. నించుంటే కూర్చోలేదు. అందుకనే అది గాలిలో తేలే కుర్చీ. భూమ్యాకాశాలమధ్య వేలాడు తూన్న నిచ్చెన. దానిలో మెట్లు ఒకటి విడిచి ఒకటి విరిగో వేలాడు తూనో ఉంటై. జీవించటం అంటే భూమ్యాకర్షణ శక్తికి తట్టు కోవటం. ఎగిరిన రాయి కిందపడిందంటే అది చచ్చిందన్నమాటే. కర్త కర్మ క్రియల్లోకి బిర్రబిగిసిన వాక్యం శవంతో సమానం. సమా సాలూ సంధులూ కుదిరిన వాక్యానికి మానం కోల్పోయిన శీలం. మర మేకులు మరీ ఘోరం.

అటు పార్శీ ఇటుపార్శీ మూడో బెర్త్‌మీంచి రాలిపడినప్పుడు గానీ తెలీదు మనకి నిజంగా అది రైలు ప్రయాణమని. విమానం లెవేటరీలో కూచుని సిగరెట్ వెలిగించినపుడు వెలుగుతుందాక ప్రమా దపు దీపం. ఏ యామీ బీచ్‌నుండు బీరుసీసాల పేళ్లు వేళ్ల గొడ్ళతో పగలేస్తున్నపుడు గొంతుకు గుచ్చుకున్న గాజుపెంకు తిరుగు తుంది గ్రామఫోను ముల్లులా సైగల్ రికార్డుమీద.

ఒంటిమీద రాసుకున్న దిగంబర కవిత్వంలో అక్షర ఆత్మ అశ్లీలాలున్నాయని ఒంటేలు పోసుకోరెవరూ జడుసుకొని. గిన్స్‌బర్గ్ బహిరంగంగా ఆత్మను చుట్టిన వలువల్ని విడిచేసినపుడు కన్పించిందే ప్రాదేశిక సౌందర్యం. అపొలెనార్ మెదడు చిద్రుపలు చిద్రుపలై నపుడే అతని కవిత్వంలో అక్షరాల వానకురిసి మొహమంతా తడిసింది. బొదెలేర్ మలార్మేల నగ్నప్రేమల, సుఖవ్యాధుల గాధల్నించి మొలిచిందే ఆధునిక ప్రతీకవాదం.

సముద్ర జలానికి గీజర్ ఆన్‌చేసి దేశదేశాల స్నానశాలల్లోకి బొట్లుబొట్లుగా పంపిస్తే ఆ వేడి కన్నీళ్లలో సబ్బునురగలో ప్రపంచ పౌరులందరూ నాని ప్రేమ టర్కిష్ తువాళ్లతో ఒళ్లు తుడుచు కోవాలి. ఇది ఒక్క అట్లాంటిక్ తీరాననే సాధ్యం. హిందూమహా సముద్రంలో, బే ఆఫ్ బెంగాల్‌లో మరీ చేపల వాసన. అరేబియన్ సీలో ష్రింప్‌లన్నీ పింప్‌లు. దుబాయ్‌లో కష్టం సుఖం తెలిసిన బాబాయ్ ఎవడైనా ఉంటే మరీ మంచిది. మాస్కట్‌లో మస్క్ పూసుకున్న కస్తూరీ మృగంలా తిరిగితే మరీ మంచిది. ట్రౌట్‌లు తినడం టౌట్‌ల సావాసం.

వెల్లివిరిసిన ఇంద్రధనుస్సు పుల్లలు విరిస్తే ఎల్లలన్నీ వెల్ల బోతాయి. నడుస్తూన్న నల్లని శవాల ప్రాణం వరదాలు తొలగిం

చటం ఒక మృత్యు సరదా. వేసిన తాళాలు వేసినట్టే ఉండి కవిత్వపు గదిలో దాచిన వస్తువులన్నీ మాయమైపోతాయి వాక్యం రాసినపుడు. దసరాకయినా సరదావేషం వేయకూడదు వేసామో పులులమయి కూచుంటాము. ఏది చేయకూడని పనో దాన్నిచేస్తే చెయ్యాల్సిన పనిని చేసి తీరినట్టే.

మేడమెట్లు ముందు పురుషుడు ఎక్కకూడదు. ముఖ్యంగా స్త్రీ వెనకున్నప్పుడు. ఎందుకంటే జఘనాల్ని ఘనంగా సత్కరించాలి. మేడమెట్లమీంచి నది కిందికి దూకుతూన్నప్పుడు ఆ ప్రవాహంలో ప్రిమ్‌రోజెస్‌లా మనం రాలిపోవాలి రక్తం కక్కుకుంటూ.

గంటకొకసారి ఆగి దినానికొక దారి వెతుక్కుని దశాబ్దాన్ని శతాబ్దంలోకి కలుపుకుని చివరికెప్పుడో అలారం పెట్టుకుని అది మోగినప్పుడు గతుక్కుమని గ్రాండ్ కాన్యన్‌లోకి కూరుకుపోవాలి. మిలీనియమ్స్ తర్వాత మన దంతాలు, నఖాలు, కేశాలు, మోహాలు మెరుస్తూ పెరుగుతూ చిక్కుబడి దొరుకుతాయి యాంత్రొపాలజిస్టులకి. మనం ఉమిసిన ఉమ్మిలోనూ కక్కిన కళ్లెలోనూ పెరిగిన క్రిమి కీటకాలు కళ్లువిప్పి చూస్తుంటాయి కిర్మీరాల్లా కొత్తకాంతి సంవత్సరాల చీకట్లలో.

ప్రాణం ప్రసక్తి వచ్చినపుడల్లా ప్రతివాడూ ఒక ప్రవక్త అవుతాడు. చేయని మంచికీ చేసిన చెడుకీ మిగిలే సగర్వ సంతృప్తిలో బాంధవ్యాల బంధనాలు పటపటా తెగిపోతయ్. ఆత్మ ఒక్కటే గాలిపటంలా ఎగురుతూ శరీరాన్ని సర్వే చేస్తుంది. గాయపడిన కాయాన్ని గాలంవేసి లాక్కెళుతుంది.

*   *   *

మనసు నిశ్శబ్ద పీచికలలో పొర్లాడినపుడు ఎండు రావిఆకులు గాలిలో తేలి గలగలలాడినపుడు గోదారిమీద రైలు తెడ్లు వేసుకొని ఈదుతూన్నపుడు మనసుకంటే వేగంగా చూపులు ఆ గతంలోకి చొచ్చుకుపోయినపుడు జాక్వెలిన్ ఓ జాక్వెలిన్ నీ కరచరణాలకు స్ప్రింగేమిటి ఇంటీరియర్ కారిడార్స్ ఆఫ్ డిజైర్‌లో గుట్టలుగుట్టలుగా పోసిన కాబేజీ పూవులు ఉల్లిపాయలు తెగనరికిన ఆధునిక దారుశిల్పపు కొయ్యలో విన్పించిన కాబరే సంలీనపు నృత్యం జాక్వెలిన్ ఓ జాక్వెలిన్ నీ అస్పృతానికి స్ప్రింగేమిటి ?

రహస్యంగా ప్రతివాడూ రామకోటి రాస్తుంటాడు. దగాపడిన జాక్వెలిన్‌లకోసం బీరుతప్ప నోరువిడిచి సీరడగని సిల్కుపూలకోసం నకిలీ నవ్వుల నగిషీలకోసం ప్రతి ఇన్గ్రిడ్ బెర్గ్మన్ వస్తాడు.

కలలో అద్భుతంగ తిరిగిపడిన తల. ఒకటే దాహం. ఎంత విస్కీపోసినా గొంతుదిగదు. రహస్య సుఖాల సిల్కుపరదాల జిలుగు దారాల వెనుక పట్టుపురుగు పడుకున్న పందిరిమంచం పామై కాటేస్తుంది. పర్సులోంచి వస్తుంది విషమంతా. దాంట్లో దానికోరల

ఫోటో ఉంటుంది. కాలం కరచిన కడపట పాలవాడి కేక విన్పిస్తుంది కాఫీ ఆవిర్లు కక్కుతుంది.

ఎట్లా ? ఎట్లా ? భయాన్నుంచి కాపాడుకోవటం అట్లాంటిక్ సముద్రతీరాన్నంతా ఆక్రమించి పడుకున్న పై పెదని నిర్భయాన్ని కాచుకోవటం ? ఎట్లా ? ఎట్లా ?

నేనింకా తలుపులు తీయలేదు. తీయను. అసలు తాళం చెవి ఎక్కడో పోయింది. దొరికినాగాని తీయను. తాళం కప్పకంటే విలువ యిందేమీ లేదులోపల. నేనే తాళాన్ని నేనే చెవిని. నా చెవికి 'కీ' యిచ్చినా తాళం తీనుగాక తీయను.

ఒద్దొద్దు. లోపల పూలు తగలడుతున్నాయ్. ఆ శవాల సుమాల దగ్గ పరిమళం ఆఘ్రాణిస్తే నీ శ్వాసకోశాలు పొగచూరిపోతయ్. గోళ్లతో గీరినా పోదామసి. ఉండుండి అదే రాల్తుందిలేమసి.

వొచ్చెయ్. మళ్లీ వెనక్కిమళ్లు. అటు వెళ్లకు. దారంతా ఆస్తమవాడు మునిగిన గోతులు. కుంటివాడు క్రకాళ్లు గుచ్చిన ముళ్లు. కుష్ఠువాడు రాసుకున్న పొగడ్డర్ ధూళి. గుడ్డివాడు అలుక్కున్న పేడ.

ఇటొచ్చి ఆనందంగ నవ్వు. ప్లేటులో వెన్నెల టూటిఫ్రూటీని చల్లగా చప్పరించు. మంచులో తడిసిన సొరపూవుల్నిమృదువుగాచూడు.

ఎటొచ్చీ వెళ్లిన చోటికే మళ్లీ వస్తుంటావు. వచ్చినచోటికే మళ్లీ వెళ్తుంటావు. మనసుమీద వాలిన ఈగ కంతిరీ కందిరీగని తోలటానికి శరీరం గింగరాయిలు తిరుగుతుంది. ఈ పృథ్వీచుట్టూ పరిభ్రమిస్తుంది

భ్రమలోంచి తేరుకోవటానికి స్మైల్‌లాంటి ఓ సూర్యకిరణం విచ్చుకోవాలి. అర్ధరాత్రి అయినా సూదిలా పొడవాలి. వెల్తుర్ని నరాల్లోకి పొడవాలి. కండరాల్ని నరాల్ని ఎంత బిగబట్టితే ఇంజెక్షన్ అంత నొప్పి. ముందు మనసుని ఈగివాలిన మనసుని స్పిరిట్‌తో తడిసిన మబ్బుతో తుడవాలి. రైలు ఇంజన్ నుదుటెని ఢీకొన్నపుడు హాయిగా తేలికగా గాలిలోకి నవ్వేయాలి. అపుడైతే నొప్పి ఉండదసలు. రాసిన రామకోటి నందరికీ చూపించాలి !

*　　　*　　　*

అచేతనాలన్నీ సచేతనాలయినపుడు అన్నీ ఆరురూపాయిలే. కిస్‌మిస్ ద్రాక్షపళ్లు కిలో అరురూపాయిలు. రంగురంగుల లంగా ఒక్కొక్కటీ ఆరురూపాయిలు. తూచి ఇస్తాం. తీసి ఇస్తాం గుట్టల్లోంచి. అరటిపళ్లు ఆరు డజన్లు ఆరురూపాయిలు. అరూపాలన్నీ రూపాలయినప్పుడు అన్నీ రూపాయిల్లోనే లెక్కకడ్తాం. ఒలికిన హృదయాల్లో వెళ్తున్న ఆ పన్నెండుమందీ నిజానికి ఆరుగురే. వాళ్ల ఒక్కొక్కళ్ల నెత్తిమీదా అర్ధరూపాయే ఉంది. అర్ధరూపాయంటే అర్ధనగ్నంగా ఉన్న పాపం ఖరీదు. ఆరు కొబ్బరి బోండాలు ఆరురూపాయిలు. ఆ రూపాలన్నీ విరూపాలయినప్పుడు అన్నీ కారుచౌక !

బేరవాడ్తాం. మనకొచ్చే నష్టం ఎంత మనకుపోయే లాభం ఎంత అని. గీచి గీచి గొంతు అరిగి కీచుగొంతుకయినాసరే. మూడడుగులు ముందుకీ ఆరడుగులు వెనక్కీ శతాబ్దాల సాయంత్రాలనుంచీ వేస్తూనే ఉన్నాం. ఎన్నో మిలీనియమ్స్‌నుంచీ బేరవాడిన వాడిన వాడికి మాత్రమే తెగుతున్నై అరటిపళ్లు, ఊగుతున్నై ద్రాక్షపళ్లు, చేజిక్కుతున్నై ఆంతరిక వస్త్రాలు.

ఎక్కాల బొక్కు ఎవడు రాసాడు ? పెదబాల శిక్షను రచించిన దెవరు? కూడికల డొక్కల్లో తీసివేతల తన్ను తన్నిందెవడు? కీకారణ్యంలో క్రావడి పెట్టినదెవరు?

ఎవడు ఏం కొనుక్కుపోతున్నాడు ? ఎవడు ఏం కట్టుకుపోతున్నాడు? వచనానికి నిర్వచనం ఏమిటి ? తగలడుతున్న నిశ్శబ్దాన్ని గంటలకారు ఎర్ర ఏనుగులావొచ్చి ఘీంకరించి ఆర్పుతుంది ఆసుపత్రిలో తెగిన ఆఖరి పేగుని డాక్టరు మెళ్లో వేసుకుని ఇంటికెళిపోతాడు. నర్సు మూలుగుల మాలికల్ని కంఠసీమ నలంకరించుకొంటుంది.

ఆరేళ్లో అరవై ఏళ్లో బతుకుతాం. ఆరేళ్లముందు ఎలా పుట్టామో ఎవడికీ తెలీదు. అరవై తర్వాత ఎలా చస్తామో మనకీ తెలీదు తీసుకు తీసుకుని తడిసిన నులక మంచానికి తప్ప. ఆరునుంచి అరవైదాక ఈలోపల బేరంవాడ్తాం. చివరికి గిట్టుబాటవుతుందితప్పక.

ఒకే కవితకు ఆరు అర్థాలు ఒస్తాయని ఒకడు అమ్మ చూపుతాడు. ఆరూ అనర్థాలే. ఆసలర్థం అమ్మేవాడికే తెలీదు. కొనేవాడు నూరర్థాలు అడుగుతాడు—ఓ శతాధిక గ్రంథకర్తని. శతపత్ర సుందరిని అరవైఏళ్ల ఆంధ్ర కవిత్వాన్ని ఆరురూపాయిలకే అచ్చెయ్మంటాడు ఆరసున్నాలకి అమ్ముడుపోయేవాడు.

శకటరేఫాల తోపుడు బళ్లమీద కుళ్లిన అరటిపళ్లు, ఈగలు ఇరుక్కున్న ఖర్జూరాలు, ఎండిపోయి సీలలు ఊడిన సీసపద్యాలు అన్నీ ఆరురూపాయిలకే అమ్ముతుంటాడొకడు ఆరున్నొక్కటి అనికూడ అనడా ఏడుపు ముఖంవాడు.

ఇది అర్థానుస్వార ప్రపంచం. అర్థశూన్య ప్రపంచం. శూన్యార్థ ప్రపంచం. దీనిమీదనొక ఆరడుగుల అరుగు కట్టాలి. కట్టి ప్శుతంలో శోకించాలి. పుట్టినందుకూ పుట్టనందుకూ జీవించినందుకూ జీవించనందుకూ మరణించినందుకూ మరణించనందుకూ అరకొరగా ముక్కు మూసుకుని ఆరు అరనిమిషాలు ఏడవాలి. చివరకి ఆరున్నొక్కోసారి.

*　　　*　　　*

కలల కళ్లు మెలకువలో పగిలిపోతయ్. గోళీలాడుకునేప్పుడు ఒక కన్ను వెళ్లి ఇంకొక కన్నుని గురి తప్పక కొట్తుంది. కలల మైదానంలో గోల్ఫ్ ఆడుకుంటాం. ఆవలింతల క్రల్తో బంతుల్ని సొరంగాల్లోకి నెట్టేస్తాం.

ప్రతి పదార్థానికీ ఒక చైతన్యం ఉంటుంది. ఉల్లిపాయ నన్నొలవమని అదే పనిగా అడుగుతుంది. బాత్ రూం పిలుస్తుంది బట్టల్ని విడవమని. రాయి బెకబెక లాడుతుంది. నీరు రాయయిపోతుంది. కంద మూలం పిలకేస్తుంది. బంగాళదుంప రామ్ములక్కాయ కూరలో కలిసి

పొమాటో అవుతుంది. పాలు తాగే పసిపాప అన్నం కుండకేసి చూస్తుంది.

కొండకి పందుపెట్టేవాడు రంధ్రంలో కూరుకుపోయి పేలిపోతాడు. రిక్షా లాగేవాడికీ రక్షాబంధనం కావాలి. కండెమ్డ్ సెల్‌లో ఉన్న హంతకుడి అహంతకి కాస్తంత తోడు కావాలి. ఉరికొయ్య నన్ను నరికెయ్యమంటుంది. పలుగే తవ్వుతుంది వజ్రాన్ని. వేలు జారిన ఉంగరం వేలికి తగుల్తుంది. కాలుజారిన అమ్మాయి రూపాయిల చేతులకు చిక్కుకొంటుంది. అలల్లో వలలోకి కవల చేప పిల్లలు చిక్కుకుంటాయి.

చీకట్లోనూ పడుతుంది భారంగా వంగి నడుస్తూన్న వాడి మోస్తూన్న బస్తాల నీడ. నడుం విరిగినపుడు మాత్రం నీడ సాఫీగా పడుకుంటుంది. రూపాయిలు ఎండలో ఎగుర్తూన్నపుడు మాత్రం వాటి స్వార్థపునీడ కళ్లల్లో పడుతుంది. వెన్నెల్లో చిల్లరమోగినపుడు నక్షత్రాలు మిణుకు మిణుకు మంటాయి. వాటిని అందుకొనే గోళ్ళు కాంతులీనుతాయి.

ఆశల కాంతులు నిరాశలో నీడలవుతాయి. వీడిన శ్వాసలే ఈ ప్రపంచమంతా వీచే గాలి. పోయిన ప్రతివాడూ ఎగిరి తామ్మని పగిలిన రబ్బరు బూర.

అంబరంలో మబ్బుల సంబరం. వాటి ఛాయా చిత్రాలే ఈ కొండలు. దిగివచ్చిన సెలయేళ్లే ప్రవహించిన కన్నీళులు. వాటిని మళ్లించి గట్లు కట్టుకొని నదులుగా మలచుకొని డామ్‌లూ రిజర్వాయర్లూ కట్టుకొని పంటపొలాల్ని పండించుకొంటాం.

కలత నిద్రలో కళ్ళ కాళ్ళు నిరిగి క్రకళ్లవుతాయి టకీ టకీమని గడియారం అలారం చప్పుడికి. అలారం గుక్కపట్టి ఏడ్చే పసిపాప.

స్మశానం శవాన్నొక్కసారి వచ్చిచూచి సంతృప్తిగా వెళ్లిపోతుంది. వార్డునిండా పగిలిన మందుసీసాల గాజుపెంకుల ఎముకలు. ఎలుకలు చచ్చిన ఫినాయిలు వాసన. దుఃఖంలో విసర్గని తీసేస్తే అది మహాకావ్యంలో సర్గ. సర్పసరాల సామూహిక దాంపత్య పరిష్వంగంలో కోరికలు పెనవేసుకొంటై. పాముల జడలత్నేవాడి చేతుల్నిండా పుట్టేడు విషం. విషాద కషాయంలో కాస్తంత టీ పొడుంతోబాటు నిమ్మరసం పిండితే ఓ చుక్క అది చక్కనిచుక్క అవుతుంది— ఆ జర్మన్ కన్య ముక్కు బేసరిలా ముఖం బేసిన్‌లో మెరుస్తూంటుంది. లీల అవలీలగా చైతన్యం పొందుతుంది. సహజా ఓ సహజా!

అర్ధరాత్రి కూచుని ఎందుకీ రాయటం? అర్ధప్రపంచం నిద్రార్ధభాగంలో కప్పుకున్న చీకటి దుప్పటి నెందుకిప్పుడు లాగటం? కట్టేయండి రేడియోలు. ఇదే ఆఖరి శ్వాసల ప్రసారం. హాలీడే ఇన్‌లో ఆఖరి డిస్కో అయిపోయింది. మొరిగి మొరిగి వీధికుక్క చచ్చిపడింది. కవిగాడి ఆఖరి ఆశ్వాసాంత పద్యం మృత్యువుచేత పట్టుకొచ్చిన ఆశ్చర్యాంతకంతో ముగిసింది. చింపండి సర్పసంకలనాల పుటలు.

నేనున్నాననుకొన్నాను. ఉంటూన్నాననుకొన్నాను. ఉంటాన్నే ఇంకా అనుకొన్నాను. నిశ్శబ్ద నిశీధిలో మూలుగునై ముగిసాను. అమెరికన్ సంగీతం అసహ్యం. జబెన్ మెహతా తీగలు సాగినపుడు యాహూదీ మెనిహన్ ఊహాలోకాల తీగలు సాగదీసినపుడు డ్రమ్స్ ఆఫ్ ఇండియా రికార్డులో రవిశంకర్ తాళం వేసినపుడు బిస్మిల్లాఖాన్ తాటాకు నరాల బూరలు దారాలుగా ఊదినపుడు బీర్‌లో బ్రాందీ కలిపి ఆ గుండిగలో చచ్చిపడిన ఎలుకల్లా పాదాల్ని వెచ్చజేసుకున్నపుడు అలిసిన ఆత్మకు కూటికూర పొగడ్డర్ పులుముకున్నపుడు పుసులుకట్టిన కళ్ల పుళ్ళల్లోకి బొద్దింకల విషాన్ని నిమ్మరసంలా పిండుకున్నపుడు గొంతులోకి కుంకుడుగాయి వేడికషాయాన్ని వొంపుకున్నపుడు ఆల్ఫ్స్ పర్వతాలమీద ఎగురుతూ నా మరణ కాల శ్వేతవస్త్రాన్ని విమానం మీంచి విసిరేసినపుడు హీత్రూ విమానాశ్రయంలో సగమానం కప్పుకున్న గమ్‌బూట్స్ తొడుక్కున్న అమ్మకాల సుందరిని నా కళ్ళు కాళ్ళు టర్లీ బిర్లీ పరికిణీ అంచులా తిరిగినపుడు—ఎప్పుడన్నా అప్పుడప్పుడు బతికిన గుర్తులు లీలగా మాయగా బేలగా.

కట్టేయండి కట్టేయండి రేడియోలు. కొట్టండి కొట్టండి గొడ్డళ్లతో పగలకొట్టండి టీవీలు పూడ్చిపెట్టండి పెట్టండి మీ కళ్ల కేమేరాలు. పిళ్లి పీకేవాళ్ళు, దర్జాల దర్జీలు, మ్యూజియం కళాఖండాలని తుపాకుల్తో కాపలా కాచేవాళ్ళు, లిబర్టీ స్టాట్యూ పాదాలకింద గొంతుకూర్చున్న దేశ దేశాల బానిసలు, భంగు నల్లమందు ఎల్‌ఎస్‌డి మరియు దానా బస్తాలు మోసేవాళ్ళు, చికాగో రహస్య నగర మఫియా ముఠాల్ని సంరక్షిస్తూన్న రక్షక దళాల దళారీల గుర్రాలు, ఫిలడెల్ఫియాలో క్రాకిచ్చిన లిబర్టీ కన్ను, వాషింగ్టన్‌లో ఒక చేయిచాచిన నల్లని చాకు, బయటకు పిండిన ఒక నీగ్రో నగ్న స్తనం, డాలర్లు స్టెర్లింగ్‌లు యెన్నులు రూబుల్స్ ఫ్రాంక్‌లు రూపాయిలు వేయేల అన్నీ అవన్నీ వాళ్ళూ వాళ్లంతా మసై నుసై శవాల స్మశానాల మంటల గోతులై పోవాలి. ఆకాశం ఒక్కటే విముక్తంగా విశుద్ధంగా ఆశా శిశువుగా పసిపాపగా ఉండాలి.

నాకు సంగీతం వొద్దు. చిత్రశిల్ప కళాఖండాలొద్దు. బొక్కలొద్దు బుక్కులొద్దు. ప్రార్థనలొద్దు ప్రాణాచారాలొద్దు. సమాజాలొద్దు సమాధులొద్దు. కాయిర్స్ ఒద్దు కాఫిన్స్ వొద్దు.

మట్టే కావాలి. కన్నీళ్లతో పిసికిన నల్లరేగడి నేలేకావాలి. తడి బురదలో జారే బొటనవేలే కావాలి. గ్రాండ్ కాన్యన్‌లోకి రాలి విరిగి ముక్కలైన విమాన విహంగపు చెక్క రెక్కలే కావాలి. కాలానికి అతీతాన ఎప్పుడో చెప్తుంది అసలు వేదనా రహస్యం ఆ మిగిలిన బ్లాక్ బాక్స్ ఒక నల్ల కవిత!

* * *

విధ్వంసమైన బతుకుని ధ్వంస రచనచేసి బాగు చేసుకోవచ్చును. గడియారాన్ని నేలకేసి కొట్టినపుడు టైమ్ దానంతటదే కుదుటపడుతుంది. లక్షణాల విలక్షణత్వాన్ని అలక్ష్యంచేస్తే సామాన్యార్థకాలు సిమిలిట్యూడ్స్ విడివడిపోతయ్. నిర్లక్ష్య నిర్లజ్జా నిగర్వాంధకారంలో అన్ని చీకటిదారులూ కాంతి పుంజాలే.

మారుతీనగర్ పల్లంలో పక్కనే మురుక్కాలువ. ఆ గదితో చీపురుండదు తుడవటానికి. గులాం గౌస్, ఖాదర్ మొహిద్దీన్‌ల అతి

మానసిక సంస్కారాన్ని శుభ్రం చేసుకోవాలంటే బ్రూవ్‌స్టిక్ కల్చర్ ఖరీదు ఐదువొందల రూపాయిలు. తలంటోసుకోవాలంటే అప్పటికప్పు డెల్లి అప్పేసి తెచ్చుకోవాలి నాలుగో ఐదో కుంకుడుగాయలు. మిట్ట మధ్యాహ్నమెపుడో నీళ్లొచ్చిన తర్వాత ఎసట్లో బియ్యం వేసుకోవాలి. ఆ గదులకు తాళాలుండవ్ తలుపులుండవ్. అందుకనే పుస్తకాలుతప్ప ఎవరూ ఏమీ కొట్టెయ్యరు. పప్పెవరు బాగా ఉడికిస్తారు ఉప్పెవరు బాగా కసిం చేస్తారని పందాలు వేసుకొంటారీ పారిషియన్ పొయిట్స్. అవనత వదనంతో ఏ ఐదారింటికో ఉడుకుతుంది సూర్యుడి వొణ్ణం. ఈ అన్నం ఉడికీ ఉడకగానే వెచ్చని గోరుముద్దలు తినిపిస్తారు తులసీ ఉషాలు. అడుక్కొచ్చో కొట్టేసో రహ్మాన్ కాలుస్తాడు సిగరెట్. ఆ పొగని తీగలు లాగుతూ నేనూ రెండున్నర దమ్ములు లాగుతాను.

చలం ఇంకా జీవిస్తున్న ఈ నేలమీదే ప్రేమల, పెళ్లిళ్ల సాఫల్య వైఫల్యాల భయాలు. ఆనందాన్ని భరించటం ఎంత బాధో నేను సోదాహరణాత్మకంగా నవ్వుతూ చెప్తాను. వాళ్లందరూ ఏడవ బోయి కూడ చిర్నగవులు చిందిస్తారు. క్రమీణా చీకటి రాలుతూంటుంది గదిపైన అల్లుకున్న బూజు బురుజుల్లోంచి. ఎవరి తల వాళ్లే అంటుకోవాలి. ఎవరి నెత్తి వాళ్లే కొట్టుకోవాలి. ఎవడిపళ్లెం మాత్రం వాడు కడగకూడదు. చేతులే అన్నపు పళ్లాలు.

'కాళ్ల' వేసిన మార్క్స్ చిత్రపటం అలమారలో అష్టంతిరిగి పడుకొంటుంది. మార్క్స్ గడ్డం రోజురోజుకీ పెరుగుతూంటుంది. సంశయాల సాలీళ్లను విదల్చాలంటే ఐదువొందల రూపాయిలు కావాలి. మల్లీశ్వరి సినిమా చూచొచ్చిన తర్వాత కూడ మనుషులు మౌనం పాటించరు. నవ్వనూ నవ్వరు. తుఫాను వేడికి కొట్టుకుపోతూన్న గాలిలో మధ్యాహ్నం ఒక్కటే మౌనంగా ఉంటుంది.

చీకటడిన తర్వాత లైట్ లేకుండ సైకిల్ తొక్కితే దొంగలు పట్టుకొని ఎర్రని బుట్టల్లో నాలుగు రోజులు అలా ఉంచేస్తారు. స్మశానంలో సైకిల్ తొక్కుతూన్నపుడు కూడ లైటెందుకు? కొరివి దయ్యాలు ఎర్రటోపీలు పెట్టుకొని ఆగాగు అంటాయ్. రాయని కవితలు నాలుగో ఐదో జేబులో పెట్టుకొని వచ్చేస్తాను రాత్రికి యింటికి మారుతీనగర్ డౌన్‌నించి.

హవిస్సులుగా...

శ్రీ కె. ఏ. ఎస్. రాఘవన్

అంతరిక్షంనుండి నాతో జారిన నక్షత్రాలు కొన్ని
    తమను తాము మరచి
చుట్టూ చీకటి తెరలు దించుకొని
దివిజ భాగీరథీస్రోతస్సును
మురికి కాలువల్లోకి మళ్లిస్తున్నాయి
ద్యావా పృథ్వ్యులమధ్య
బిందువుకు వృత్తానికి మధ్య
అనుభవానికి కావ్యానికి మధ్య
నేను నిర్మిస్తున్న సువర్ణ సేతువును
ప్రాణం పోసుకున్న రాక్షసత్వం
కూల్చివేయాలని చూస్తుంటే
భగ్గుమన్న మహ సంకల్పాగ్నిని చీల్చుకొని
ప్రభవిస్తున్నారు
శార్ఙ్గనందక సుదర్శన గదాంకులు
సితాంభోద మూర్తులు, రుద్రులు వీరభద్రులు
ఒక్కొక్కరు
సహస్ర శీర్షులు సహస్రాక్షులు సహస్రబాహులు
హృదయ కుసుమాలు వెదజల్లి
పూర్ణకుంభంతో స్వాగతం పలకండి
సత్యంకల్ప జనిత తేజశ్చక్రాలు
దిగివస్తున్న దేవతలకు మహాయుధాలు
సరళ రేఖను సుందర వృత్తంగా మారుస్తూ
హిమాలయాన్ని మహోదధితో కలుపుతున్న
మహాయజ్ఞానికి
అలసత్వపు గూళ్లను చెదరగొట్టి
హవిస్సులుగా కదలి రండి
నాకు తెలుసు :
దివిజ రాక్షస మహాసంగ్రామంలో
అగ్ని మూర్తుల కపజయం లేదని
నాకు తెలుసు ! ఒకనాటికి
ధాత్రిపై శరజ్జ్యోత్స్నామృత వర్షం కురుస్తుందని
మధుర మనోజ్ఞ ప్రసన్న మూర్తులు
ధాత్రిని పాలిస్తారని
అంతవరకు నేను
ప్రజ్వలిస్తున్న మహసంకల్పాన్ని
అశాంతిగా తిరిగే అగ్ని నక్షత్రాన్ని.

శ్రీ రేకళిగెమఠం వీరయ్య

శివయోగి సిద్ధరామేశ్వరుడు

దక్షిణ భారతమున బసవ యుగము నందు ప్రారంభమైన సమ సమాజ నిర్మాణ కార్యము దేశమందంతట వ్యాపించుటకు, కారణ పురుషులగు శివశరణుల శ్రేణియందు, శివయోగి సిద్ధరామేశ్వరుడు కూడ చేరతగినవాడు. అతడు అనుభవ మంటపమునందు తన అనుభావ జ్ఞానమును, తన 'వచనముల' రూపమునందు నిర్మోగమూటముగా తెలిపిన యోగి శ్రేష్ఠుడు.

సిద్ధరామేశ్వరుని వచనముల సంఖ్య అరువది యెనిమిది వేలని అతడే తెలిపియున్నాడు. కాని మనకిప్పుడు లభించినవి కొన్ని వందలు మాత్రమే. ఆ వచనములను కన్నడదేశమునందు సాహితీపరులు, పరిశోధకులు పరిష్కరించి, పరిశోధించి ప్రకటించియున్నారు. అతని కొన్ని వచనములను మచ్చునకు గాను అనువదించి ఆంధ్ర సోదరుల కందజేయుచున్నాను.

సిద్ధరామ శివయోగిని గురించిన సాహిత్యము కన్నడమున పుష్కలముగానున్నది. హరిహరుడు తన 'రేవణ సిద్ధరగళె'యందును, ఇతర శివశరణుల రగళెల యందును సిద్ధరామయను గురించి కొంత ప్రాసంగికముగ తెలిపియున్నాడు. రాఘవాంకుడు "సిద్ధరామ చారిత్ర్య" మను పేరుతో నొక ప్రత్యేక కావ్యమును రచించియున్నాడు. తర్వాత కవులు కూడ కొందరు తమ తమ రచనలయందు ప్రాసంగికముగను, మరికొందరు ప్రత్యేకముగను రచించి అతని గురించి తెలిపియున్నారు. చామరసు తన 'ప్రభులింగ లీల' యందు సిద్ధరామ యను గురించి మరికొన్ని వివరములను తెలిపియున్నాడు.

సిద్ధరామేశ్వరుని గురించి కన్నడమున విపులమగు సాహిత్యమున్నను, తెలుగునందు మాత్రమంత యెక్కువగా లేరు. పాల్కురికి సోమనాథుడు, తన బసవ పురాణమునందు సిద్ధరాముడు సొన్నలి పురమునకు, శ్రీగిరినుండి మల్లికార్జునని దోడ్కొనివచ్చి, అచ్చట నిలిపి లక్షా తొంబది యారువేల శివలింగములను స్థాపించి, ఆ పురమును అభినవ శ్రీగిరిగా ప్రసిద్ధి యగునట్లు చేసెననియు, అన్నపానీయములను విడిచి భక్తి పెంపునను 'ముక్కంటి వేల్పును మెప్పించి నొసలి కన్నును బడసె' ననియు, 'మహిత యోగానంద లీలనుండె'ననియును తెలిపియున్నాడు. అంతేగాక అతడు బసవేశ్వరుని దర్శించు నుద్దేశముతో కైలాసమునకు బోయి అచ్చట (అతడు) రుద్ర గణాధీశ్వరులను ప్రమథ గణములను సర్వ సమ్మనులను గాంచిన విధమును, పరమేశ్వరుని హృదయాబ్జమునందు బసవేశ్వరుడు ఇష్టలింగోపాసకుండై యున్నటులు, (సిద్ధరామయ) జూచిన విధమును కూడ వర్ణించియున్నాడు. కాని సిద్ధరాముడు అల్లమ ప్రభువును సందర్శించిన తదుపరి అతని మానసమునందు కలిగిన పరివర్తనము మొదలగు ముఖ్య విషయములను, సోమనాథుడు తన బసవ పురాణమునందు తెలుపలేదు.

చామరసుని 'ప్రభులింగ లీల'ను, పిడుపర్తి సోమనాథుడు అనువదించిన ద్విపద ప్రభులింగ లీలయందు ఆ విషయములను కొంత తెలిపియున్నాడు. కాని సిద్ధరామేశ్వరుని జననము, బాల్యముల గురించిన వివరములను అతడు కూడ తెలుపలేదు. శివయోగి సిద్ధుండగు, సిద్ధరామయ జననము ఒక శివయోగ సిద్ధుల (రేవణ సిద్ధుని) అనుగ్రహము వలన కలిగినదని అతని గురించిన కన్నడ సాహిత్యము వలన తెలియవచ్చుచున్నది.

సుమారు ఎనిమిది వందల సంవత్సరములకు పూర్వము సొన్నలి పురము (నేటి శోలాపురము) చిన్ని రాజధానిగా నుండెను. రేవణసిద్ధుడను నొక రాజ గురువు ఆ నగరమునందు నివసించుచుండెను. సత్య సదాచార సంపన్నులగు ముత్తయ్య, సుగ్గలమ్మ యను వృద్ధదంపతులును ఆ నగరమునందు నివసించుచుండిరి. వారు వయస్సు మీరినందున సంతానము లేని కొరతను మరిచి, శివభక్తి పరాయణులై, దాసోహమానసులై, శివార్చన, శివచింతనమునందు కాలమును గడుపుచుండిరి.

ఒకనాడు ఈశ్వర ప్రేరణము వలన, రేవణసిద్ధ శివయోగులు పాదచారియై ఆ వృద్ధదంపతుల ఇంటికి పోవుటను చూచి, రాణి చామలాదేవి "కాలినడకతో ఎక్కడికి వెళ్ళుచున్నా"రని గురుదేవుని విచారించెను. గురువర్యుడు 'సాక్షాచ్ఛివ స్వరూపుండగు నొక మహా శరణుండు పుట్టబోయెడు నొక పుణ్యదంపతుల ఇంటికి పోవుచున్నా" నని పలికి పోయెను. రేవణ సిద్ధులు తమ ఇంటికి వచ్చినది చూచిన ఆ వృద్ధదంపతుల ఆనందమునకు మితిలేకపోయెను. వారు అత్యంత భక్తితో గురుదేవుని పాదపూజ యొనరించి పాదోదక ప్రసాదములుగొని "అనుభావ జ్ఞానబోధ యొనర్పు"మని వేడిరి. రేవణసిద్ధులు, సుగ్గల మాత గర్భముపై తన అభ్యుత హస్తము నుంచి, "నీకు శివాంశ సంభూతుండగు నొక కొడుకు బుట్టు"ననియు, ఆ శిశువునకు "సిద్ధ రామయ యను పేరును బెట్టు"మనియు సెలవిచ్చెను. ఆ వృద్ధపత్ని "వృద్ధాప్యమున సంతాన ప్రాప్తియా!" అని ఆశ్చర్యానందములను తెలిపెను. సిద్ధసంకల్పుండగు రేవణసిద్ధుండు "ఈశ్వర సంకల్పము వలన అంతయు సౌఖ్యముగానే అగు"నని ఆశీర్వదించిపోయెను.

సిద్ధుని వాక్యములు సత్యమయ్యెను. ఒకనాడు శుభముహూర్తమున వృద్ధ సుగ్గల మాత యే తాపత్రయములు లేక సునాయాసముగా నొక కొడుకును గనెను. ఆదంపతులు బహునాళ్లకు గలిగిన సంతానమని తలంచి సిద్ధరామయయను పేరునకు మారుగా ధూళిమా

కారయ్య యను తమ ఇలవేలుపు పేరును బెట్టిరి. సిద్ధుల వాక్యము నుపేక్షించినందులకు కాబోలు, ఆశిశువు ఇతర సామాన్య శిశువులవలె ఏడ్వక, పిల్లలాటల నేమియు నాడక, కన్నులు విప్పక, ముగ్ధ భావములో పెరుగుచుండెను. 'ధూళిమాకారయ్య'యని పిలచిన పలుకక ప్రక్కనైనా మలుపకుండెను. కాని సిద్ధరామయ్యని పిలచిన వెంటనే కన్నులు తెరచి, చూచుచు నవ్వుచుండెను. కాని అంతరంగికముగా సిద్ధరాముడు యోగసాధనయందు మగ్నుడై యుండుచుండెను.

ఆ వృద్ధ దంపతులు తమ కొడుకు ముగ్ధుడుగా పెరుగుచున్నాడని తలంచి, బహు కాలమునకైన సంతానమైనను, సంతోషమునుమాని సంతాపము చెందుచుండిరి. "బాలుడూరక ఇంటియందు ముగ్ధుడుగా నుండిన వానియందు బుద్ధివికసింపక మరింత మాంద్యముగ నేమో,"యని తలంచి ఇంటి పశువులనైన కావ పంపిన "తోడి బాలురతో మాట ముచ్చటలాడుచుండుటవలన, సిద్ధరాముని ముగ్ధత్వము కొంతనైనా తగ్గునేమో"యని తలంచి పశువులను కాపరిగా పంప మొదలు పెట్టిరి.

సిద్ధరామయ్య ప్రతిరోజు తాను గొనిపోవుచున్న సద్ది ముల్లెను తోడి బాలురకిచ్చి, తన పశువులను కూడా చూడుడనిచెప్పి తాను అడవి యందలి ఏకాంత స్థలమున శివార్చన, శివధ్యానములయందు మగ్నుడగుచుండెను. పరమేశ్వరుండా ముగ్ధభక్తునియందు జ్ఞానజ్యోతిని వెలిగించు నుద్దేశముతో ఒకనాడొక జంగమ వేషమున ఆ బాలుడున్న చోటునకు వచ్చి, "చేలయందలి కాపిల్లను పెట్టు"మని అడిగెను. సిద్ధరామయ మనసు నందు యెనలేని ఆనందము కలిగెను. వెంటనే చేనులోనున్న కాపిల్లను తెచ్చి శుభ్రపరచి, ఆజంగమ మూర్తికి ఇచ్చెను. ఆ జంగమలింగము అత్యంతానందముతో వానినిదిని, తన ఆకలి ఇంకను దీరలేదని, ఇంటికిబోయి అంబలిని చల్లను తీసుకొని రమ్మని కోరెను. సిద్ధరామయ లానవి తెచ్చువరకు ఆ జంగమమూర్తిని అచ్చటనే కూర్చుండి యుండుమని వేడెను. ఆ జంగమమూర్తి అట్లేననెను. కాని ఎందుకో సిద్ధరామునకు నమ్మకము చాలక, అతని పేరును, ఊరును అడిగెను. అతడు తన పేరు 'మల్లయ్య' అనియు అతని ఊరు శ్రీశైలమనియు తెలిపెను.

అది విని సిద్ధరామయ్య సంభ్రమానందములతో ఇంటికి పోయి తన తల్లిని అంబలిని చల్లను తొందరగా సిద్ధపరచి ఇమ్మని కోరెను. ఆతనితల్లికి పట్టరాని సంతోషము కలిగెను. తినుమన్నా తిననని అను తన కొడుకు నేడు తనంతట తానే అడుగుచున్నాడని ఆనందముతో ఒక ముంతలో చల్ల, మరొక గిన్నెలో అంబలినికట్టి సిద్ధరాముని చేతులకు అందించెను. సిద్ధరామయ్యని తీసుకొని పరువు పరువున చేనికి వచ్చెను. అచ్చట చూడగానే అతనికి దిగులుకలిగెను. జంగమయ్య లేడు. అటు ఇటు చూచి మల్లయ్య జాడకనిపించనందున దుఃఖించుచు, 'మోసము జేయుదువా మల్లయ్యా' అని గట్టిగా పిలువసాగెను. ఎంతకును మల్లయ్య మారుపలక నందున, నిజముగా మల్లయ్య తనను మోసగించిపోయినాడని భావించి, అతనినిచిక్కించు కొని బుద్ధిచెప్పె తనను సాహసమును వహించి, ఒక చేత చల్ల ముంతను మరొక చేత అంబలిబాన పట్టుకొని 'మల్లయ్య...మల్లయ్య'అని పిలుచుచు, వృద్ధ తల్లిదండ్రులెంత వారించినను వినకుండ పోసాగెను. చెట్లు, గట్లు, రాళ్ళు, గుండ్లు, ముండ్లు, ఎండ వాన గాలి దేనిని లెక్కించ పోవుచునే వుండెను. వూళ్ళు, లడవులు దాటి పోవుచునే వుండెను. ఆకలి, దప్పి, నిద్ర లేవియును అతని దృఢనిశ్చయము సడలింప లేక పోయినవి. అలసట బడలిక లేవియును అతని అడ్డు రాక పోయినవి.

ఆ సమయమున మహాశివరాత్రి పర్వ దిన సందర్భమునందు శ్రీశైలమునకు పోవుచుండెడి యాత్రికులు, ఆ బాలుని పిలుపును, విలపింపును విని తమ వెంట వచ్చిన మల్లయ్యను చూపించెదమని తెలిపిరి. అప్పుడు సిద్ధరామయకు మల్లయ్యను చూచినంత సంతసము కలిగెను. అతడు వారి వెంబడి పోసాగెను. యాత్రికులొకనాడు శ్రీశైల పర్వతమును చేరి 'ఇది శ్రీశైలమ'ని తెలిపిరి. "నా మల్లయ్య ఉండే ఊరు ఇదేనా! మల్లయ్య ఇక్కడనైన దొరకడా!" అను ధీమాతో సంతసించెను. పర్వతప్రదేశమును దాటి, మల్లికార్జున దేవస్థానము మహాద్వారమును దాటి గర్భగుడియందు ప్రవేశించిన యాత్రికులు మల్లికార్జున జ్యోతిర్లింగమునుజూపి, "ఇతడే శ్రీశైలమల్లయ్య"అని బాలునకు చూపిరి. సిద్ధ రామయ్య అదిచూచి "ఈ మల్లయ్య నేను చూచిన మల్లయ్య కాదు. ఇది కూడా యొక మోసమేనా?" అనుచు జ్యోతిర్లింగమును లక్ష్యింపక, "తన పేరు, వూరును తెలిపి, తనకు కనిపించి మోసగించిపోయిన మల్లయ్యనిక్కడ తప్పక కనుగొనెద"నను దృఢనిశ్చయముతో శ్రీశైలమందలి అడవినంతయును గాలించమొదలు పెట్టెను. సిద్ధరామయ్య స్థిరప్రతిజ్ఞను పరీక్షించనెంచి మల్లయ్య అతనికి కనిపించక అతనిని కనిపెట్టుచునుండెను.

సిద్ధరామయ మల్లయ్యను వెతికి వెతికి వేసారి, "నేను వెతికిన దొరకని మల్లయ్య నన్నే వెతుకుచు వచ్చునట్లు చేసెద"నని దృఢ మనస్కుడై ఎత్తగునొక పర్వతశిఖరము నెక్కి నలు దిక్కుల పారజూచెను. మల్లయ్య జాడ కనుపించలేదు. భయంకరమును, భీకరదాకారమును నగుభైరవుడు 'ఆ'అని నోరుదెరుచుకొని తనను మ్రింగుటకు వచ్చినటులు కొండ శిఖరాలమధ్యగల లోయ అతనికి కనిపించెను. దానినిచూచి అతడు భయకంపితుడు కాక, 'ఓ మల్లయ్యా!' అని బిగ్గరగా అరచుచు కన్నులు మూసుకొని ఆలోయలోనికి దూకెను. భక్తవత్సలుండగు మల్లయ్య ఆ బాలునకు ఏ అపాయమును కలుగకుండ, మధ్యంతరముననే యెత్తుకొని కాపాడెను. కొంత సేపటికి సిద్ధరామయ్య నిద్రమేలుకొని చూచినట్లు కన్నులు విప్పి చూచెను. ఆనాడు మోసగించిపోయిన మల్లయ్య, తనను అతని తొడపై పరుండ బెట్టుకొనినట్లు, సేదదీర్చుచున్నట్లు కనిపించెను. సిద్ధరామయ్య సంభ్రమానందములలో మునిగెను. పరవశుండై నోటమాట రాక కొంతసేపు మల్లయ్యను చూచుచుండెను.

అప్పుడు మల్లయ్యనే "సిద్ధరామా! నీ దృఢ భక్తికి నేను మెచ్చితిని నీకు యోగసిద్ధి కలిగినది. అయినను నీవలన మానవలోకము ఉద్ధారము కావలసియున్నది. కనుక నీవు నీ వూరికి బోయి అక్కడ మానవోద్ధరణ క్రమములను జేయుచు కొనకు నా సాయుజ్యమును పొందు"మని ఆజ్ఞాపించెను.

సిద్ధరామయ్య 'నిన్ను విడిచి నేను వూరికి పోలేను, పోను' అని అనెను. అప్పుడు మల్లయ్య "నేను కూడ నీ వెంబడే వచ్చెదను. నీ సొన్నలిపురమునందే వుండెదను. నీకు ఎల్లప్పుడును తోడునీడగా నుండెదన"ని అశ్వాసనమిచ్చెను. సిద్ధరామయ్య నొసలికన్నును ఇచ్చెను. సిద్ధరామయ్య సొన్నలిపురమున భవ్యమగు నొక మల్లికార్జున దేవాలయమును గట్టించి, కపిలసిద్ధ మల్లికార్జునుడను మహాలింగమును ప్రతిష్ఠించి, తన ఇష్టదేవతగా నారాధించుచుండెను. ముందుకు తన అనుభావ వచనములను "కపిలసిద్ధ మల్లికార్జునా!" అను ముకుటములోనే వచించెను. తన భక్తి మహిమల వలన, లింగ ప్రతిష్ఠల వలన ఆ పురము రెండవ శ్రీశైలముగా ప్రసిద్ధి యగునట్లు చేయుచుండెను.

సిద్ధరామయ నొసలికన్నును బడసి మిక్కిలి మహిమాశాలియై తాను తలంచిన, గుళ్ళను, గుండములను అత్యంత సంభ్రమముతో కట్టించుచుండెను. సిద్ధరామయ తాను జేయవలసిన యోగసాధనను సాగించి, శివయోగియై, శివసాయుజ్యమును పొందు మార్గమును మరిచి, కర్మ యోగియై, బాహ్యాడంబరమునే తన యోగ పరమార్థమని తలంచి వూరి యందు ఒకదాని వెనుక మరొక లింగ ప్రతిష్ఠ చేయించుచు గుళ్ళను గుండములను కట్టించుచు, కాలమును వృధా జేయుచుండెను. అప్పుడు మరల సిద్ధరామయకు మార్గదర్శకత్వము అవసరమయ్యెను. సిద్ధరామయ ఇష్టదైవంబగు కపిలసిద్ధ మల్లికార్జునుడు మరల అల్లమ ప్రభువు రూపమున అతనికి దర్శనమిచ్చి, మార్గదర్శన మొనరించెను.

అల్లమ ప్రభువు, 'మాయనుమాయలబెట్టి',గెలిచి, మాయా కోలాహలుండై, దేశమునందు సంచరించుచు, సాధకులకు శివయోగ సాధనమును బోధించుచు, వారి భవ బాధలను బాపుచు,సిద్ధరామయకును శివయోగసిద్ధిని తెలుపుటకై, సొన్నలిపురమునకు ఏతెంచెను. అచ్చట సిద్ధరామయ్య కట్టించుచున్న గుళ్ల గురించి, కోనేర్ల గురించి, రాళ్ళు, ఇటికె, సున్నము, ఇసుక, కలప, రాసులురాసులుగా గుట్టల వోలె పడియుండుటను; ఉప్పరులు, వడ్రంగులు, కమ్మరివారు, కూలీలు మొదలగు పనివాండ్రందరును బహుఉల్లాసముతో పనిచేయుచుండుటయును ప్రభువు చూచి,"తనయందలి ఆత్మలింగమును గానలేక బాహ్యాడంబరమునకు లోనై సిద్ధరాముడు వెర్రి రాముడై గుళ్ళను కట్టించుచున్నాడా"యని, పనివాండ్రను అడిగెను. "ఇతడు మన గురువును తూలనాడుచున్నా"డని పనివాండ్రు భావించి కోపించి ప్రభువును తిట్టుట కొట్టుట మొదలుపెట్టిరి. కాని మాయా కోలాహలుండగు ప్రభుదేవుడు వారికి చిక్కక, వారిని హింసింపక, బహు భంగుల అలసట చెందచేసెను. తాను సిద్ధరామయకు యోగసిద్ధి మార్గమును తెలుపుటకు వచ్చియున్నాననియు, అందుకు అతని

తోడ్తెమ్మనియు ప్రభువు వారికి తెలిపెను. ఐనను పనివాండ్లు మిక్కిలి కోపించి, 'మేమే నీకు బుద్ధిచెప్పగలము, మా గురువెందుల' కని, అందరును తమ తమ పరాక్రమములను ప్రభువుపై చూప నారంభించిరి. కాని విఫలులైరి. తమ పరాజయమును తమ గురువు నకు తెలుపుటకుబోయి, అతనికి అక్కడజరిగిన సమాచారమంతయును తెలిపిరి. సిద్ధరామయ్యయును కోపోద్దీపితుండై వచ్చి, ప్రభువును చూచి గద్దించుచు తన నొసలి కన్నును తెరిచి అగ్నిని కురిపించ సాగెను. ప్రభువు అది చూచి, "ఇట్టి మంటమారితనము యోగు లకు తగదని" తెలిపెను. తనను సమీపించుచున్న 'ఛటల్ ఫటల్' అను మంటలకు, తన పాదమును జూపెను. ఆ మంటలు ప్రభువు పాదముల నంటలేక తిరిగి పురమును పురజనులను కాల్చదొడగెను. ఊరియందలి హాహాకార ధ్వనులు, రోదన నినాదములు మిన్నుముట్ట సాగెను.

సిద్ధరామయ్య తన ఉద్ధటతనమునకు సిగ్గుపడి తలవంచుకొని 'రక్షింపు'మనుచు, ప్రభుదేవుని పాదములపై బడెను. ప్రభువు కరు ణించి, తన అభయ హస్తమును జూపి అగ్నిని చల్లార్చెను. సిద్ధ రామయ్యను పైకి లేవనెత్తి, 'యోగులకు కోపము చెల్ల'దని తెలి పెను. సిద్ధరామయ్య "తన మందిరమునకు దయచేసి, తనకు సుజ్ఞా నమును బోధించు"మని ప్రభువును వేడెను. "సన్మార్గోపదేశమునకు వసమేమి? గృహమేమి?"అనుచు సిద్ధ రామేశ్వరునకు ప్రభువు అచ్చ టనే సదాచారమును బోధించి, సుజ్ఞానివై వెలయు"మని ఆశీర్వ దించెను. కల్యాణమునందు జరుగుచుండిన బసవనిభక్తి ప్రశంసను, అతని భృత్యాచార పరాయణత్వమును తెలిపెను. సిద్ధ రామయ్య, బస వని భక్తిప్రభావమును విని, లోకకల్యాణ కారకమగు కల్యాణ పట్టణ మును సందర్శించి బసవని భక్తిప్రసారమును పొందవలయునను తన కోర్కెను ప్రభువున కెరింగించెను. ప్రభువు అందులకు సమ్మతించి సిద్ధరామయను వెంబడించుకొని కల్యాణనగరము చేరెను. సిద్ధరామయ బసవని భక్తిప్రభావమును జూచి ముగ్ధుండయ్యెను. ప్రభువు వెంబడి అనుభవ మంటపమునందు ప్రవేశించెను. బసవన, చెన్నబసవన, మొద లగు ప్రమథుల శివానుభావ వచనములను విని, తననుకూడ శివాను భావి యగునట్లు అనుగ్రహించుమని ప్రభువును వేడెను.

మహా జ్ఞానియు, షట్స్థల చక్రవర్తియునగు చెన్నబసవేశ్వ రుండు, ప్రభువు ఆజ్ఞానుసారము, సిద్ధరామయ్యకు లింగ దీక్షా సంస్కారమొనరించి లింగాంగ సామరస్యాచారమును బోధించెను. సిద్ధరామయ అనుభావ సంపన్నుండై, శివయోగియై అనుభవ మంట పమునందు ప్రముఖ స్థానమును పొందగలిగెను. అనుభవ మంటపము నందలి అనుభావ గోష్ఠులందు సిద్ధరామయ్య వచనములు గూడ గణుతికెక్కెను.

సిద్ధరామ శివయోగి, అనుభవ మంటపమునందలి అనుభావ గోష్ఠులలో పాలుగొనుచు అనుభావ సంపదను బొంది తన వచనముల వలన తన అనుభావ జ్ఞానమును ఇతరులకు తెలుపుచు కల్యాణమునం దుండెను. కొన్నాళ్లకు కల్యాణమున చెలరేగిన విప్లవమునకును, రక్త పాతమునకును తమ సమ్మతి లేనందున, బసవాది ప్రముఖులలోని ముఖ్యులు కల్యాణమును విడిచి పలు దోవలయందువెళ్లి చెదరిపోయిరి. అప్పుడు సిద్ధరామ శివయోగి, తిరిగి సొన్నలి పురమునకు వచ్చి, అను భావ బోధ మొనరించుచు, భక్తజనోద్ధరణము చేయుచుండెను. దివ్య రకు ఒకనాడు యోగదృష్టియందు తన అంత్యకాలము సమీపించిన దని తెలియుకొని తాను నిర్మించిన కొలనునందు సమాధిని నిర్మించు కొని, అందులో ప్రవేశించి లింగ నిష్ఠయందుండి నిర్బయలయ్యెనని అతని చరిత్ర తెలుపుచున్నది.

నేడును సొన్నలి పురము [శోలాపురము]నందు అతని సమాధి స్థానము 'సిద్ధరామేశ్వర దేవాలయము'ను పేరుతో సుప్రసిద్ధ యాత్రాస్థానమై భక్తజనాభీష్ట ప్రదాయనియై ప్రభవించుచున్నది. ప్రతి సంవత్సరము పుష్యమాసమునందు నారోత్సవములు, రథోత్సవ ములు [జాతర] జరుగును. రథోత్సవ కాలమునను, ప్రతి నిత్య కాల ముల యందును, వేలాది జనులు వివిధ ప్రాంతములనుండి, కులమత వివక్షతలులేక, సిద్ధుని సమాధిని సందర్శించి, సేవించి, ఇష్టార్థ సిద్ధుల బొందుచున్నారు.

ఆజన్మబ్రహ్మచారియై, కర్మయోగియై ప్రసిద్ధిజెందిన, సిద్ధ రామయ, శివయోగియై, సిద్ధిబొంది వచించిన వచనములు సాహి త్యపు విలువ వలనను, తాత్త్విక అనుభావము వలనను, వచన సాహి త్యమునందు గణుతికెక్కినట్టి పరిగణింపబడుచున్నవి. అతని వచన ములు శివాద్వైత సిద్ధాంత బోధకములే గాక, లౌకిక సిద్ధాంతముల కును ఆకరములు. ఆనాటి శివశరణుల ధార్మిక సామాజిక సంస్కరణ ములు సిద్ధరామేశ్వరుని వచనములయందు గానవగును.

సిద్ధరామేశ్వరుడు తెలిపినటులు అరువది యెనిమిదివేల వచ నములనే గాక, అనేక గీతములను, 'బసవస్తోత్రత్రివిధి', 'మిశ్రస్తోత్ర త్రివిధి', 'అష్టావర్ణ స్తోత్రత్రివిధి' యను ఇతర రచనలనుకూడ రచించివిపులమగు సాహిత్యమును సృష్టించియున్నాడని తెలియుచున్నది. సిద్ధరామశివయోగి 'నూతన పురాతన ప్రమథులు' రచించిన కోటాను కోట్లలెక్కకుమించిన వచన సాహిత్యముండగా "కుత్సిత కావ్యాలంకార సాహిత్య రచన"ను మెచ్చువారిని అవివేకులని గర్హించియున్నాడు.అట్టి వారిపై "కపిలసిద్ధ మల్లికార్జునుడు పాడిమన్నునుపోయు"ననికూడ తెలిపియున్నాడు. "లింగాంగ సామరస్యానుభావమును బోధించునట్టి వచన సాహిత్యముండగా, నవరసాలంకార భరితమగు విషయాపేక్షలకు పురిగొలుపు వర్ణనలతో గూడిన సాహిత్యము గర్హనీయమనియు, అట్టి సాహిత్యమును సృష్టించువారిని, పోషించువారిని కపిలసిద్ధ మల్లికార్జునుడు మన్నించడ"నియు కూడ అతడు తెలిపియున్నాడు.

శ్రీ ఆర్. హెచ్. వి. రమణ

గండికోట - పెమ్మసాని వారు

ప్రజల సహకారం అండదండలు లేనిదే ఏ రాజు ఏ రాజ్యం సరిగా పని చేయలేదు, పని చేయలేవు. విజయనగర రాజులు కూడ హైందవ మతోద్ధారణ సల్పినారంటే, సజీవశిల్పాలతో దేవాలయాలు కట్టినారంటే, వీధులలో వజ్ర వైడూర్యాలు కుప్పలుగా పోసి అమ్మినారంటే, దానికి కారణం కేవలం ఆనాటి రాజులు మాత్రమే కాదు, వారికి చేయూత ఇచ్చిన దండనాయకులు ప్రజలు కూడ కారణమే. విజయనగర రాజులకు చేదోడు వాదోడుగా విజయం చేకూర్చిన దండనాయకులలో పెమ్మసానివారు ఒకరు.

యాడికి గండికోట దుర్గపాలకులైన పెమ్మసానివారు నాయుళ్ళు. నాయుళ్ళను రాయలసీమ ప్రాంతంలో కమ్మవారినిగా, కోస్తా ప్రాంతంలో బలిజవారినిగా లెక్క కట్టారు. కాని ఈ పెమ్మసాని వారు యాడికి గండికోట మొదలగు దుర్గాలను పాలించే రాయలసీమ ప్రాంతం వారగుటవల్లనారిని కమ్మజాతి వారినిగా లెక్కకట్టాలి.

పెమ్మసాని వారి ఇంటి పేరును గూర్చి, వారి మూల పురుషుడు ఆలం వెంకటపతి నాయున్ని గురించి ఒక పేజి వ్యాసాన్ని శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు 1929 Vol VI Part II 'భారతి'లో వ్రాశారు. దాన్ని అనుసరించి "పెమ్మసానివారిది ముసళ్ళ గోత్రమని, వీరి ఇంటి పేరు ముందు పెమ్మసానివారు కాదని, 'ఆలం' వారని, వీరి మూల పురుషుడైన ఆలం వెంకటపతి నాయుడు నెల దినాల పసివాడై వుండగా, తల్లితండ్రులు మరణించగా పెమ్మసాని అనే బొనెగత్తె పసివాడైన ఆలం వెంకటపతి నాయున్ని పెంచి పెద్ద చేసిందని, అప్పటి నుండి వారి ఇంటిపేరు పెమ్మసానిగా మారిందని" తెలుస్తుంది.

పెమ్మసాని వారిలో చాలమందికి తిమ్మానాయుడు పేరుండుట వల్ల వారి కాల నిర్ణయం చేయటం చాల కష్టం. అయినా దొరికిన శాసనాధారాలవల్ల కొన్ని వ్యాసాలను ఆధారంగా చేసికొని ఈ క్రింది విధంగా వారి వంశాన్ని నిర్ణయించవచ్చు. కాని ఇది సమగ్రమని చెప్పలేం.

పెమ్మసాని (ఆలం)
వెంకటపతినాయుడు

- **(A)** (అప్పళాచార్యుల వద్దనున్న క్రీ॥ శ॥ 16లోని ధర్మపత్రం ప్రకారం)
  - పెమ్మసాని గిరియప్ప నాయుడు
  - పెమ్మసాని అకప్పనాయుడు
  - పెమ్మసాని తిమ్మానాయుడు
  - పెమ్మసాని చిన్న తిమ్మానాయుడు
- **(B)** (మల్లంపల్లి వారు వ్రాసిన వ్యాస ప్రకారం)
  - పెమ్మసాని (పావురాళ్ళ) తిమ్మానాయుడు
  - పెమ్మసాని వీర తిమ్మానాయుడు
  - **(C)** (చాటుపద్యం అనుసరించి)
    - పెమ్మసాని రామలింగ నాయుడు
      - **(D)** (తాడిపత్రి కైఫీయత్తు అనుసరించి)
      - పెమ్మసాని తిమ్మానాయుడు
    - పెమ్మసాని పెద్ద తిమ్మానాయుడు
      - పెమ్మసాని చిన్న నాయకేంద్రుడు
      - పెమ్మసాని నారసింహ నాయుడు

మల్లంపల్లివారు 'భారతి' లో పెమ్మసాని మూల పురుషుణ్ణి గురించి వ్రాసి, పెమ్మసాని వారి వంశం వ్రాసేవారికి ఇది ఉపయోగ పడుతుందని ఆయన ఒక పేజీలో వ్యాసాన్ని ముగించాడు. ఆ మహాను భావుని వ్యాసం చదివిన తర్వాత వ్రాయాలనిపించింది ఈ వ్యాసం. చాగంటి శేషయ్యగారు కూడ పెమ్మసాని వారి వంశం వ్రాయాలంటే కష్టం, బహు శ్రమతో కూడిన పని అని తెల్పారు. అయినప్పటికి ఉత్సాహాన్ని అణుచుకోలేక ఈ వ్యాసాన్ని వ్రాస్తున్నాను.

వీరే కాక పెమ్మసాని అరతిమ్మానాయుడు, పెమ్మసాని పెద్ద వీర నృపాలుడు అనే మరో ఇద్దరు వ్యక్తులు కనపడుతున్నారు. వీరు ఎవరో ఎంత పరిశోధన చేసినప్పటికి అంతుపట్టడంలేదు. పై వారిలో ఎవరికో ఒకరికి ఇవి మారుపేర్లై వుండవచ్చు. పరిశీలిద్దాం.

[A] బుక్కపట్నంలో పాంచాల పురుషులైన తాతాచార్యుల సంతతి అప్పళాచార్యుల వద్దనున్న దానపత్రము "**Govt. Oriental Manuscripts Library University Madras**" వారి 'కడప జిల్లా శాసనములు' అనే పుస్తకంలో ముద్రింపబడివుంది.

ఆ దానపత్రం ఈ విధంగా వుంది. "శాలివాహన శక వర్షం బులు ౧౫౩౨ [క్రీ.శ.1610] కుమారతాతాచార్యులుగారికి ముసళ్ల గోత్ర పవిత్రులైన వెంకటపతి నాయనింగారి ప్రపౌత్రులైన గిరియప్ప నాయనింగారి పౌత్రులైన అకప్ప నాయనింగారి పుత్రులైన నరపతి మహారాజు మన్నిరాజు పెమ్మసాని తిమ్మానాయనింగారు వ్రాయించి ఇచ్చిన దేశ సమయాచార పత్రిక............"

పై శాసనాన్ని బట్టి పెమ్మసాని వారికి మూలపురుషుడు వెంకటపతి నాయుడని తెలుస్తుంది. వీరికి కేవలం ఈ శాసనకాలం నాటికి పెద్ద బిరుదులేమీ లేవు. వీరు సరపతులుగా వుండేవారు అంటే కాల్బలం ఎక్కువగా వున్నవారన్నమాట. పెమ్మసాని తిమ్మానా యుని కాలం 1611 అని, అంతకుముందే ఆయన తండ్రులు తాతలు వుండేవారని తెలుస్తుంది. కాని పెమ్మసాని ఆలం వెంకటపతి నాయున్ని గురించి ఒక్కరిద్దరు అక్కడక్కడ పేర్కొన్నారు. కాని మిగిలిన ఆయన కుమారుని మనుమణ్ణి ఎవరూ ఎక్కడా పేర్కొన లేదు. బహుశ వారు అనామకులై వుండొచ్చు.

ఎనుమల చింత గ్రామానికి దక్షిణం ఆంజనేయ దేవాలయం వద్దనున్న శాసనాన్ని బట్టి "......ముసళ్ల గోత్రులైన పెమ్మసాని తిమ్మానాయనింగారి కుమారుడు చిన్న తిమ్మానాయనింగారు తాడి పత్రి........" పెమ్మసాని తిమ్మానాయుని కుమారుడు పెమ్మసాని చిన్న తిమ్మానాయుడని ఇతను బహుశ 1630 ఆ ప్రాంతంలో వుండివుండవచ్చు.

[B] మల్లంపల్లి సోమశేఖరశర్మగారు తన వ్యాసంలో పెమ్మ సాని వంశానికి మూలపురుషుడు పెమ్మసాని ఆలం వెంకటపతి నాయు డని అతని కుమారుడు పావురాళ్ల తిమ్మానాయుడని, ఈ పావురాళ్ల తిమ్మానాయుని కుమారుడే పెమ్మసాని వీర తిమ్మానాయుడని చెప్పచూ వ్యాసాన్ని ముగించాడు. మల్లంపల్లి గారు తనకు దొరికిన నాణెములను శాసనాలని బట్టి ఆ విధంగా పేర్కొన్నట్లు తెల్పారు. కాని వారు వెంకటపతినాయుని కుమారుడైన గిరియప్ప నాయున్ని గురించి పేర్కొనలేదు.

మనకు దాన పత్రాన్ని బట్టి వెంకటపతినాయుని కుమారుడు గిరియప్పనాయుడని, మల్లంపల్లి వారు వ్రాసిన వ్యాసాన్నిబట్టి వెంకట పతి నాయుని కుమారుడు పావురాళ్ల తిమ్మనాయుడని మనకు స్పష్టంగా తెలుస్తున్నది. కాబట్టి మల్లంపల్లివారు పేర్కొనిన పావురాళ్ల తిమ్మానాయుడు దాన పత్రం బట్టి పేర్కొనబడ్డ గిరి యప్ప నాయుడు అన్నదమ్ములని నిర్ధారించవచ్చు.

[C] చాటుపద్య మణిమంజరిలోని చాటుపద్యం వలన

రణమీ పెదతండ్రి రామలింగ విభుడు ముగురు
వజీర్లను మొక్కపఱచె
మీ తండ్రి పెద్దతిమ్మ ఘాతలాధ్యక్షుండు
దస్తూరి ఖానుని మస్తమణంచె
మీ యన్న బలి చిన్ననాయకేంద్రుడు మస్త
ఖానుని బలును చీకాకు పఱచె
అది విచారించి నీ వశ్వరాయని బల
మడచితే జమ్మలమడుగు బయల
అహాహ నీ గెల్పు నెన్నంగ నవనిలోన
దరిమి శేషునికైన ముష్కర తురుష్క
మస్తకన్యస్త చరణ సమస్త శస్త
నవ బిరుదసింహ', పెమ్మసాన్నారసింహ

పై పద్యాన్నిబట్టి రామలింగనాయుడు పెద్దతిమ్మానాయుడు అన్నదమ్ములైనట్లు, పెద్దతిమ్మానాయుని కుమారులుగా చిన్ననాయ కేంద్రుడు, నారసింహనాయుడైనట్లు తెలియుచున్నది.

వీర తిమ్మానాయుని కుమారులుగా రామలింగనాయుడు, పెద్దతిమ్మానాయుడు ఎక్కడా చెప్పబడలేదు, కాకపోతే ఆయనతర్వాత ప్రసిద్ధి కెక్కినవారు వీరే కాబట్టి, వీరిద్దరిని వీర తిమ్మానాయుని కుమారులుగా లెక్కకట్టాలి.

ఒక్కొక్క దండనాయకుని చరిత్ర పరిశీలిస్తాం.

పావురాళ్ళ తిమ్మానాయుడు

ఈ పావురాళ్ళ తిమ్మానాయుని గురించి మల్లంపల్లిగారి వ్యాసంలోను, తాడిపత్రి కైఫీయత్తులోను అక్కడక్కడ చెప్పబడింది.

ఈ తిమ్మానాయుడిని ప్రౌఢదేవరాయలు, పావురాళ్ళ మీద కొల్వు వుంచగా పావురాళ్ళ తిమ్మానాయుడని పేరు వచ్చిందని, ఇతడు ఆలం వెంకటపతి కుమారుడని, ఈ పెమ్మసాని (పావురాళ్ళ) తిమ్మా నాయుడు ప్రౌఢదేవరాయల కాలంలో (క్రీ॥ శ॥ 1423–1446) ప్రాంతంలో రాయలచే తాడిపత్రి తాలుకలోని యాడికి గ్రామాన్ని విస్తరింప చేసేదానికిగాను పంపబడినాడని, తిమ్మానాయుడికి తోడుగా చెన్నమరాజు తండ్రియైన మహాదేవభట్లును, మరి 20 మంది సిబ్బం

దిని పంపినాడని, ఆ తిమ్మానాయుడి భార్య పేరు వెంకటమ్మని, ఆ దంపతులకు చిరకాలం సంతానం లేక చివరకు యాడికిలోని వీరభద్ర స్వామి దయవల్ల ఒక శిశువు జన్మించాడని, ఆ శిశువునకు వీరతిమ్మా నాయుడని నామకరణం చేశారని.

పావురాళ్ళ తిమ్మానాయుడు తన అవసాన దశలో తన కుమా రుని వీర తిమ్మానాయుని, సహదేవభట్లు కుమారుడైన చెన్నను రాజును పిలిపించి శ్రీకృష్ణదేవరాయలని దర్శనం చేసుకొమ్మని వారి అనుగ్రహం పొందుమని తనువు చాలించాడని, వారి తండ్రి చెప్పినట్లే వీరతిమ్మానాయుడు శ్రీకృష్ణదేవరాయ లనుగ్రహంపొంది తిరిగియాడికి గ్రామానికి అధికారిగా వచ్చాడని మల్లంపల్లి వారు వ్రాసిన వ్యాసాన్ని బట్టి తాడిపత్రి కైఫీయత్తును బట్టి తెలుస్తుంది.

పై చెప్పబడిన చెన్నమరాజు, చారుచంద్రోదయకర్త చెన్నమ రాజు తాత. చాగంటి శేషయ్యగారు తెల్పిన చెన్నమరాజు వంశాన్ని పరి శీలించి ఇది గమనింప వచ్చు. ప్రౌఢ దేవరాయల కాలంలో పంపబడిన పావురాళ్ల తిమ్మానాయుడు ఇంచుమించు శ్రీకృష్ణదేవరాయల కాలం వరకు యాడికి గ్రామాధికారిగా వుండినట్లు నిశ్చయించ వచ్చు. అంటే సుమారు 74 సంవత్సరాలు యాడికి గ్రామాధికారిగా వున్నా డన్నమాట. అంటే 30 సంవత్సరాల వయస్సులో యాడికి గ్రామాధి కారిగా వచ్చిన తిమ్మానాయుడు 104 సంవత్సరాలు జీవించాడు అని నిశ్చయింపవచ్చు.

పెమ్మసాని వీరతిమ్మానాయుడు

శ్రీకృష్ణదేవరాయల (క్రీ॥శ॥ 1509–1529) అనుజ్ఞ తీసుకొని తిరిగి యాడికి గ్రామాధికారిగా వీరతిమ్మానాయుడు వచ్చాడు. వీరతిమ్మానాయుడు వేయించిన నాణెములను బట్టి "వీరతిమ్మా నాయుడు తనకు ఇష్టదైవము యాడికి వీరభద్రుని భక్తితో సేవించి, తన ఇష్టదైవమైన వెంకటరమణ ప్రతిమను ముందర ఉండేటట్టు వెనుకతట్టు తన కుల దైవమైన యాడికి వీరభద్ర అనే నాగరం అక్షరాలతో నాణెములు ముద్రించినట్లు తెలుస్తుంది.

ఈ కాలంలో శైవ వైష్ణవ మతాలను సమానంగా ఆదరించే వారన్నమాట. తాడిపత్రి కైఫీయత్తు ననుసరించి వీరతిమ్మానాయుడు తనతల్లి పేరుతో తాడిపత్రికి 2 మైళ్ళ దూరంలో వెంకటాంపల్లి అనే గ్రామాన్ని నిర్మించాడు. పెమ్మసాని వీరతిమ్మానాయుడు పావు రాళ్ల తిమ్మానాయునికి చాలా కాలానికి పుట్టాడు కాబట్టి ఇతడు శ్రీకృష్ణదేవరాయల కాలంనాటికి 40 సంవత్సరాల వాడై ఉండవచ్చు.

పెమ్మసాని రామలింగనాయుడు

ఈ పెమ్మసాని రామలింగనాయుడు పెమ్మసాని వీరతిమ్మా నాయునికి తమ్ముడై వుండుటకవకాశం లేదు. పావురాళ్ల తిమ్మానాయు నికి చాలకాలానికి యాడికి వీరభద్రుని వల్ల ఒకే ఒక్క కుమారుడే వీరతిమ్మానాయుడే పుట్టాడు. కాబట్టి రామలింగనాయుడు వీరతిమ్మా నాయుని కుమారుడుగా నిశ్చయించాలి. పెమ్మసాని వీరతిమ్మానాయుడు శ్రీకృష్ణదేవరాయలని దర్శించు నాటికి 40 సంవత్సరాలు, అతని కుమారుడైన రామలింగనాయునికి 20 సంవత్సరాలు, రెండవ కుమారుడైన పెద్ద తిమ్మానాయునికి 18 సంవత్సరాలు వుండాలి.

చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున విజయనగరద స్వామ్రాజ్యపు అను ౧౮–౧–౨౮ నెంబరుగల కదితను బట్టి పై వయస్సులు నిర్ణయించవచ్చు.

డా॥ నేలటూరి వెంకటరమణయ్యగారు భారతిలో చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున విజయనగరద స్వామ్రాజ్యపు అను ౧౮–౧–౨౮ నెంబరుగల కదితను ప్రచురించారు. దానిలో పెమ్మ సాని రామలింగనాయుణ్ణి గురించి ఈ విధంగా వుంది.

క్రీ॥ శ॥ 15–12–13 ప్రాంతంలో అహ్మదనగర్, విజా పూరు గోలకొండ సేనానులు శ్రీకృష్ణదేవరాయలపై దండెత్తుటకు కృష్ణానదీతీరమున విడిది చేసిరి. శ్రీకృష్ణదేవరాయలు సభయందు పేరుగల నాయకులందరును గూడిరి. అందు ఆర్వేటివారు, తొరగంటి వారు, గబ్బూరివారు, వెలగోటివారు, నందేలవారు, తుళువ దొరలు బోయలు వుండిరి. "వారలలో శ్రీకృష్ణదేవరాయలు పెమ్మసాని రామ లింగనాయుణ్ణి పిలిపించి తురకలు కృష్ణవేణి దాటివచ్చి డెరిజావేసి పాళ్యం దిగినారట యిందులకు యేరీతుల నడువవలెనో అని అడిగెను. అందులకు రామలింగ నాయుడు తురకల కార్యమనంగా ఎంత మాత్రం, దేవరవారి ప్రతాపంవల్ల డెరిజాతాళ్ళు తెగకోసేమో అప్పుడు భేరి తాండవం చేసి నదికైను, తురకలు మూడు తెరగలు వారున్ను పటాపంచలై తిరిగి యుధాయిథలై తమ తమ స్థలాలకు పోయేటట్లు శేసేను." అని విన్నపంశేయగా రాయలవారు చాల సంతోషపడి రామ లింగ నాయునికి పట్టీలు యిచ్చి అంపగా రామలింగనాయుడు పోయి తురకలను జయించి శ్రీకృష్ణదేవరాయలకు జయం చేకూర్చెను. ఈ విధంగా పెమ్మసాని వీర తిమ్మానాయుడు యాడికిలో గ్రామాధి కారిగా, అతని కుమారుడు రామలింగనాయుడు వీరుడై యువకుడై విజయనగర రాజధానిలో నుండి దండనాయకుడుగా శ్రీకృష్ణదేవ రాయలకు సహాయపడేవాడని నిర్ధారించవచ్చు.

తాడిపత్రి కైఫీయత్తులో పెమ్మసాని రామలింగనాయుడు బుగ్గరామ లింగేశ్వర ఆలయాన్ని కట్టించినట్లు చెప్పబడింది.

రామలింగనాయుడు శ్రీకృష్ణదేవరాయల కాలంలోనివాడు అంటే 1509 – 1529 ఆ ప్రాంతంలోనివాడు, కాని గుడిలో శ్రీకృష్ణదేవరాయల అన్న వీరనరసింహరాయల శాసనం (1506) కనపడుతున్నది. శ్రీకృష్ణదేవరాయల కాలంలోని రామలింగనాయుని కంటే ముందే ఆ గుడివున్నట్లు దానికి వీర నరసింహరాయలు దానం చేసినట్లు తెలియుచున్నది.

కాకపోతే పెమ్మసాని రామలింగనాయునికి ఆ గుడి కట్టి వుండ వచ్చు. రామలింగనాయుని కాలంలో శిల్పకళా నిలయాలైన ఉత్తర దక్షిణ ముఖద్వారాలు కట్టబడి విస్తరించబడి వుండవచ్చు.

పతంగ చాటు పద్య మణిమంజరిలో రామలింగనాయుని గూర్చి ఒక పద్యం వుంది.

జూటూరి ముందర శూరత్వ మేర్పడ రణభూమిలో సల్కరాజు గెల్చి
కోరి బేతంచేర్ల కోట ధూళిగా జేసి చింత గుంట్రేనుపతి పంతమణచి
బెడకంటి కయ్యాన భీకరంబుగ నీవు వెండియు సల్కని పారదోలి
సాహసుండైనట్టి సహజయ్య భానుని నదలించి, యాదవసంతలోన
తిమ్మరైనట్టి సల్కయ తమ్మ విభుని త్రుంచి రాయల బట్టాను
నుంచి తేర
పృథుల గెల్పుల సురధాణి పెమ్మసాని చిన్న విభు రామలింగ తేజః

పై పద్యాన్ని బట్టి పెమ్మసాని రామలింగనాయుడు క్రీ॥ శ॥ 1542లో జరిగిన యుద్ధంలో సలకం చిన్న తిమ్మరాజుకు విరోధిగా ఆర్వీటి అళియ రామరాజుగా సహాయంగా పాల్గొనని తెలియుచున్నది. ఈ యుద్ధసమయమునాటికి రామలింగనాయుని వయస్సు 55 సంవత్సరాలన్నమాట. తాడిపత్రికి చుట్టుప్రక్కలగల జూటూరు, బేతంచెర్ల, కోనులి గ్రామాలల్లో ఘోరమైన యుద్ధాలలో పరాక్రమంతో పోరాడి ఆర్వీటి అళియరామరాజుకు సహాయపడి ఆయనతో విశేషంగా సన్మానింపబడి, విజయనగర సామ్రాజ్యం దుర్మార్గులపాలు కాకుండా ఎంతో శ్రమపడినట్లు తెలుస్తుంది. రామలింగనాయుని కాలం వరకు కూడ గండికోటకు వీరు దుర్గాధ్యక్షులు కాలేదు. కాని ఆ ప్రాంతాలల్లో వీరికి విశేషమైన పేరున్నట్లు స్పష్టమౌతుంది.

తాడిపత్రి తాలుకాలోని రామలింగాయిపల్లె ఈయన పేరుతో కట్టబడినట్లు స్పష్టమౌతుంది.

పెమ్మసానివారి వంశంలో రామలింగనాయుడు ఆర్జించినంత పేరు ప్రతిష్టలు మరెవ్వరు సాధించలేదు. ఈయన అనేక యుద్ధాలల్లో పాల్గొని విజయనగర రాజులకు సహాయపడ్డారు. ధనాశకు లోను కాక నీతికి నిజాయితీకి నిలబడి యుద్ధంచేసి వారి వంశ ప్రతిష్ట నిలబెట్టాడు. తర్వాత వచ్చిన పెమ్మసాని వంశీయులకు ఈయన వల్లనే విజయనగర ఆస్థానంలో అపారమైన గౌరవ ఆదరాభిమానాలు లభించాయి.

పెమ్మసాని అర్రతిమ్మానాయుడు

తాడిపత్రి కైఫీయత్తులో సలకం తిమ్మరాజును చంపే దానుకుగా ఆర్వీటి అళియ రామరాజుకు ఎర్ర (అర్ర) తిమ్మానాయుడు లోడ్పడినట్లు చెప్పబడింది.

తాడిపత్రి కైఫీయత్తును పరిష్కరిస్తూ మల్లంపల్లి రామలింగ నాయుని తమ్ముడు పెద్ద తిమ్మానాయుడే అర్ర తిమ్మానాయుడని చెప్పాడు. కాని ఇది అంత సమంజసంగా కనపడదు. ఇంతకు ముందే పెమ్మసాని వంశంలో తిమ్మానాయుడి పేర్లు చాల వుండడం బట్టి రామలింగనాయుడు తన కుమారుడికి అర్ర తిమ్మానాయుడు అని పేరు పెట్టి వుండవచ్చు. అంతేగాక రామలింగనాయుని తమ్మునికి పెద్ద తిమ్మానాయునికి ముందే పెద్ద తిమ్మానాయుడని పేరు కలదు, అటువంటప్పుడు పెద్ద తీసివేసి అర్ర పెట్టవల్సిన అవసరం లేదు. ఈ పెమ్మసాని పెద్ద తిమ్మానాయుడే తాడిపత్రిలోని చింతల వెంకట రమణ స్వామి గుడి కట్టించాడు.

రామలింగనాయుడు, అతని తమ్ముడు పెద్ద తిమ్మానాయుడు శ్రీకృష్ణదేవరాయల కాలంనాటికి యువకులుగా వీరులుగా వుండవచ్చు. క్రీ॥శ॥ 1542లో జరిగిన సల్కరాజుకు అళియ రామరాజుకు మధ్య జరిగిన యుద్ధ కాలం నాటికి వీరికి వయస్సు సడలివుండవచ్చు. ఈ యుద్ధంలోనే అర్ర తిమ్మానాయుడు తండ్రియైన రామలింగ నాయునికి సహాయపడి వుండవచ్చు.

తాడిపత్రి కైఫీయత్తులోనే అర్ర తిమ్మానాయుడు ఆర్వీటి అళియ రామరాజుకు సహాయపడినందుకుగాను, ఆయన సత్కరించి ఇచ్చిన ధనంతో చింతల వెంకట రమణస్వామి గుడి గోడలపై పై కప్పుపై చిత్రపటములు చిత్రింపజేసినట్లు చెప్పబడింది. పై కారణాలవల్ల అర్ర తిమ్మానాయుడు ఆర్వీటి అళియ రామరాజు కాలం నాటికి (1542) యువకుడై తండ్రియైన రామలింగనాయుడికి సహాయపడేవాడని నిర్ధారించవచ్చు.

పెమ్మసాని పెద వీర నృపాలుడు

చారు చంద్రోదయంలో చెన్నమరాజు పెద వీర నృపాలుని గూర్చి ఈ విధంగా చెప్పాడు.

“తన పితామహుడగు చెన్నమరాజునకు తన తండ్రియైన కృష్ణరాజునకు తనయుడగు లింగన మంత్రి, పెమ్మసాని పెద వీర నృపాలుని యందలంబుపై, నుద గజంబొకటి వచ్చి పడుచుండగా, లింగన మంత్రి చూచి దాని కుంభస్థలమున ఒక గ్రుద్దు గుద్ది వెనుకకు మరలించినట్లు” చారు చంద్రోదయంలో చెప్పబడింది.

దీని వలన లింగన మంత్రి పెద్ద వీర నృపాలుడు ఒకే కాలం వారని తెలుస్తుంది. లింగన మంత్రి శ్రీ వెంకటపతి రాయల కాలంలోని (క్రీ॥ శ॥ 1586 -1614) వాడు. కాబట్టి ఆ కాలంలోనే పెద్ద వీర నృపాలుడు వుంటాడు.

కాని ఈ పెద్ద వీర నృపాలుడు ఎవరో అంతు చిక్కడంలేదు. అప్పటికే రామలింగనాయుని తమ్ముడు పెమ్మసాని పెద్ద తిమ్మానాయుడు వయోవృద్ధుడై వుండును.

నూతలపాటిగారు వ్రాసిన ‘విజయనగర చరిత్ర’లో శ్రీరంగ రాయల కాలంలోను (క్రీ॥ శ॥ 1572–1585) వెంకటపతిరాయల కాలంలోను (1585 -1614) పెద వీర నృపాలుడు దండ నాయకుడుగా, వయో వృద్ధుడైన పెద్ద తిమ్మానాయుడు మంత్రిగా వుండినట్లు పేర్కొన్నాడు.

పెమ్మసాని నారసింహనాయుడు

తాడిపత్రి కైఫీయత్తులో ఈ లింగన మంత్రిది ఒక్క శాసనం వున్నది. అందులో లింగన మంత్రి నారసింహనృపాలుని వద్ద ధారాగ్రహీతంగా పొందిన భూమిని సూర్యగ్రహణ కాలాన చింతలరాయ స్వామికిచ్చినట్లు వ్రాయబడింది. అందులో కాలం శాలివాహన శక వర్షంబులు 1516. (క్రీ॥ శ॥ 1590). ఇతను పెమ్మసాని పెద్ద

తిమ్మానాయుని కుమారుడు. ముందు చెప్పిన చాటు పద్యంలో నారసింహనాయుడు అశ్వరాయుని జమ్మలమడుగు బయట జయించినట్లు వుంది. ఈ అశ్వరాయుడు గోలుకొండ ప్రధాని అమీర్ఉస్‌ముల్కు ప్రతినిధి.

పై చెప్పిన పెమ్మసాని (సావురాళ్ళ) తిమ్మానాయుని సంతతి వారంతయు ఎక్కువగా విజయనగర రాజధానిలో వుండి రాయలకు యుద్ధములందు సహాయపడుతున్నట్లు అర్థమౌతుంది.

శ్రీ వెంకటపతిరాయల కాలం వరకు గండికోట నంద్యాల వారి ఆధీనంలో వుండేది. పెమ్మసాని వారు ఈ ప్రాంతంలో నంద్యాల వారి తరపున మంచి పలుకుబడి కలిగియుండి అధికారం చెలాయించే వారు.

క్రీ॥ శ॥ 1589 తర్వాత వెంకటపతిరాయలు, గోలుకొండ ప్రధాని దండెత్తినప్పుడు, తండ్రియైన నందేల నరసింహరాజుకు సహాయం చేయలేదని నందేల కృష్ణమరాజు రాయలకు ఎదురు తిరిగెను. కృష్ణమరాజు సహాయంగా సిద్ధవట్టం కొండ్రాజు, తిరుపతి రాజు, కందనవోలు రాజు గోపాలురాజు తోడు వచ్చిరి. రాయల పక్షాన నుట్ల అనంతన్నపాయుని తండ్రి ఎల్లమరాజు, హండీ దేవప్పనాయకుడు పెమ్మసాని తిమ్మానాయుడు పాల్గొని, నందేల కృష్ణమరాజును ఓడించి వారిభూములను నుట్లవారు, హండీవారు, పెమ్మసాని వారు పంచుకొన్నారు. అప్పటినుండియే గండికోట పెమ్మసాని వారి వశమయ్యెను. ఈ విషయం డా॥ నేలటూరి వెంకటరమణయ్యగారు 'విజ్ఞాన సర్వస్వము'లో పేర్కొన్నారు.

పెమ్మసాని తిమ్మానాయుడు

ఈ పెమ్మసానితిమ్మానాయుడు గిరియప్పనాయని మనుమడు, ఆకప్పనాయని కుమారుడు. ఇతడు క్రీ॥ శ॥ 1592 నుండి గండికోట దుర్గాధిపతిగా అధికారం చేపట్టాడు.

తిమ్మంచిపట్నం ఊరి ముందర రాగిమానుకు పశ్చిమాన ఒక శాసనం వుంది. అది "కడప జిల్లా శాసనములు" అనే పుస్తకంలో ప్రచురింపబడివుంది. ఆ శాసన కాలం శా॥ శ॥ ౧౫౪౪ (క్రీ॥ శ॥ 1622). ఆ శాసనంలో పెమ్మసాని తిమ్మానాయుడు గండికోట అధిపతిగా పేర్కొనబడ్డాడు.

దేవగుడి గ్రామాన తలకంటి దేవాలయానికి కప్పు అడుగున బండకు ఒక శాసనం వుంది. ఈ శాసనం కూడ "కడప జిల్లా శాసనాలు" అనే పుస్తకంలో పేర్కొనబడ్డది. శాసన కాలం శా॥ శ॥ ౧౫౪౫ (క్రీ॥ శ॥ 1623). ఆ శాసనంలో కూడ పెమ్మసాని తిమ్మానాయుడు గండికోట అధిపతిగా పేర్కొనబడింది.

మూడవ చెన్నమరాజు తన చారుచంద్రోదయంలో పెమ్మసాని తిమ్మానాయుని గూర్చి ఈ విధంగా చెప్పాడు.

గరుడ నారాయణ బిరుద ధ్వజంబు బం
గారు పూవుల చంద్రికా విపావ
డయు తురాయి గజంబు హయరత్నమును వీర
మల హరిఘన కంఠమాలికయును
తాళిచేకట్లు ముత్యాల కడియములు
గండ పెండేరమ్ము కత్తి కుచ్చు
వెంకటపతిరాయ విభుని చేతను దెచ్చి
పెమ్మసాని తిమ్మ భూరమణ మణికి

నిచ్చి తదనుజ్ఞ గైకొంటి వెలమి నీవు
రాయదత్తంబులైన కుళ్ళాయి మీద
పాగ దవళ శంఖంబులు పల్లకియును
తాళిచేకట్లు చెన్న ప్రధాన మంత్రి.

చెన్నమరాజు తిమ్మానాయుని ఆస్థానంలో వుండినట్లు తెలుస్తున్నది. పెమ్మసాని తిమ్మానాయునికి చెన్నమరాజు మంత్రియై వెంకటపతి రాయల వద్దనుండి పెక్కు బహుమతులు తెచ్చి తన రాజైన తిమ్మానాయునికిచ్చినట్లు, అందు కొన్ని బహుమతులు తనకిచ్చినట్లు పై పద్యంలో పేర్కొనబడింది. ఈ 3వ చెన్నమరాజు క్రీ॥ శ॥ 1640 ప్రాంతంలో చారుచంద్రోదయమును వ్రాసినట్లు చాగంటి శేషయ్యగారు తెల్పారు. దీన్నిబట్టి తిమ్మానాయుడు 1640 ఆపైన మరికొన్ని సంవత్సరాల వరకు గండికోట అధిపతిగా వుండినట్లు తెలుస్తున్నది.

రామలింగనాయుని తర్వాత పెక్కు బహుమతులు పొందినవాడు పెమ్మసాని తిమ్మానాయుడే అని చెప్పవచ్చు. ఈయన తన కాలంలో గండికోటను బాగా పటిష్ఠంగా చేశాడు.

పెమ్మసాని చిన్న తిమ్మానాయుడు

ఈయన పెమ్మసాని తిమ్మనాయుని కుమారుడని ఎనుములవింతగ్రామ శాసనంవల్ల తెలుస్తుంది. తండ్రికి సహాయపడుతూ తండ్రి తర్వాత గండికోటను చేపట్టియుండును. పెమ్మసాని చిన్న తిమ్మానాయుని గూర్చి చిత్రకవి అనంత కవి తనహరిశ్చంద్ర నలోపాఖ్యానవ్యాఖ్యానంలో ఈ విధంగా వ్రాశాడు.

శ్రీ హనుమద్వర శ్రీలబ్ధ సుకవిత్వ
చతురుండ లక్షణ సార సంగ్ర
హం బొనరించు యుద్వత్కీర్తి విఖ్యాత
డగు చిత్రకవి పెద్దనార్య సుతుడ
విష్ణు చిత్తీయాది వివిధ కావ్యార్థముల్
దెలసి వక్కాణించు ధీర సుతుడ
గండికోటాఖ్య దుర్గ స్థలాధ్యక్షుడై
పృథివి మంతున కెక్కు పెమ్మసాని

చిన్నతిమ్మ క్షమపాల శేఖరుండు
గారవింపగ బహుమాన గౌరవముగ
మనిన ధన్యుండ సభ్య సన్ను తగుధైక
గరిమి వెలయు ననంతాఖ్య కవి వరుండ.

చిత్రకవి అనంతకవి కాలదులను కనుగొనినయెడల ఇంచుమించు ఆ కాలంలోనే పెమ్మసాని తిమ్మానాయుడు వుండేవాడు. చిత్రకవి అనంతకవి తండ్రి పెద్దనార్యుడు క్రీ. శ. 1550 ప్రాంతాన లక్షణసార సంగ్రహంను, రామరాజ భూషణుడు హరిశ్చంద్ర నలోపాఖ్యానమును క్రీ. శ. 1580 ప్రాంతాన వ్రాశారు. కావున రామరాజు వ్రాసిన గ్రంథమునకు వ్యాఖ్య వ్రాసిన అనంతకవి 1580 తర్వాతవాడై వుండును. ఆయన ఆ కావ్యాన్ని 1600 ప్రాంతంలో ఆపైన వ్రాసి వుండవచ్చు.

పెమ్మసాని చిన్న తిమ్మనాయునికి, మీర్ జుమ్లాకు జరిగిన యుద్ధవిశేషాలు గండికోట కైఫీయత్తులో ఈ విధంగా తెల్పబడింది.

"క్రీ. శ. 1649లో విజాపురం సమ్మతిపైన గోలుకొండ నవాబు అబ్దుల్లా కుత్బుషా గండికోటను స్వాధీనం చేసికొనుటకై తన సేనాధిపతి మీర్ జుమ్లాను పంపెను. మీర్ జుమ్లా గండికోటకు 5 మైళ్ల దూరంలో తన సైన్యాన్ని విడిది చేయించి పెమ్మసాని చిన్న తిమ్మానాయుని లొంగిపొమ్మని చెప్పాడు. దానికి అంగీకరించని చిన్న తిమ్మానాయుడు యుద్ధం చేయుటకే నిశ్చయించి గండికోటలో అతిశక్తివంతమైన 'రామబాణం' అనే ఫిరంగిలో 8 మణుగుల (80 కేజీల) మందుగుండు పెట్టి పేల్చగా కోటకు ఈశాన్యములో వున్న 2 పరువుల (5 మైళ్ల) దూరంలోవున్న మీర్ జుమ్లా సైన్యముపై పడి చెల్లాచెదరు చేసెను. అతడు భయపడి ఒంకొక ప్రక్కకు తొలగిపోయెను. ఆ ఫిరంగి శబ్దానికి కోట లోపలవున్న గర్భిణీ స్త్రీల కడుపులు పగిలి శిశువులు బయటికి వచ్చారు. ఎందరో ముసలివాళ్ళు పిల్లలు చనిపోయారు. ఫిరంగి చీలిపోయెను. కొంతకాలం ఇరువురికి యుద్ధం జరిగింది. చివరకు మీర్ జుమ్లా గండికోటను తనకు స్వాధీనంచేస్తే గుత్తికోట ఇచ్చెదనని రాయబారం పంపెను. చిన్న తిమ్మానాయుడు తనకు సహాయంచేయు రాజులు ఎవ్వరు లేకపోయినందున అప్పటికి విజయనగర రాజులు పూర్తిగా పతనమైనందున సంధికి ఒప్పుకోక తప్పిందికాదు.

క్రీ. శ. 1652లో పెమ్మసాని చిన్నతిమ్మానాయుడు గండికోటను వదలివెళ్ళిన తర్వాత, మీర్ జుమ్లా గండికోటను చేరి కమలాపురం తాలూకాలోని హనుమగుత్తి ఇచ్చెదనని మాట తప్పెను. అందుకు చిన్నతిమ్మానాయుడు కోపించి "నీవు నన్ను జోగిని చేశావు. తప్పకుండ నీవు కూడ జోగి అగుదువు" అని శపించి, తన సంసారంతో ధర్మవరం తట్టుపోయిరి. వారి బంధువులు కొందరు హనుమగుత్తిలో చేరిరి.

విజయనగర రాజులకాలంనుండి హిందువుల సంరక్షణలోవున్న గండికోటను పెమ్మసాని కాలంలో తురుష్కుల వశమయ్యింది. వీరప్రతాప పౌరుషములకు పేరుగాంచిన పెమ్మసాని వంశం పతనమైంది.

మీర్ జుమ్లా గండికోటలోని హిందూ గుళ్ళను పడగొట్టించి అందలి విగ్రహాలను కరిగించి ఫిరంగులు తయారుచేయించాడు. నేటికిని గండికోటలో విగ్రహాలు లేక మాధవరాయని, రంగరాయని గుళ్ళు నిర్జీవంగా కనపడ్తాయి. ఆ దేవాలయాలలోని శిల్పసంపద చూస్తున్నప్పుడు ఆశ్చర్యం కలగక మానదు. ఇక్కడ రేఖాచిత్రాలు కూడ కనపడ్తాయి. దేవాలయాలలోని సజీవ శిల్పాలు చిత్రహింసలకు గురియై విషాదగీతాలు పాడుతుంటే రెండు కన్నీటిబొట్లు రాలకతప్పవు. ఆ గండికోటలో మీర్ జుమ్లా గర్భిణీ స్త్రీలచే దారుణంగా పనిచేయించి కట్టిన మసీదులో నేటికి ప్రార్థన చేసుకొనే దానికిగాను మూడు కుటుంబాలు మాత్రం మిగిలాయి. దానికి ఫలితంగా మీర్ జుమ్లా చివరిరోజుల్లో తన పాపాలను పాపుకొనేందుకు మక్కాకు పోయాడు.

ఈవిధంగా పెమ్మసానివారి చరిత్ర గండికోట ముట్టడితో అంతమగుతుంది. ప్రజారంజకంగా పాలించి వీరవిహారం చేసిన పెమ్మసానివారు తెరని శిథిలావస్థలోవున్న గండికోట గోడలు చెప్తున్నాయి. గండికోటలో తుప్పుపట్టిన కత్తులు వారి ఖడ్గ నైపుణ్యాన్ని నెమరు వేసుకొంటున్నాయి. గండికోటలో అడుగడుగున అణువణువున ఆ యుద్ధ విషాదగీతాలు లీలగా వినపడుతేనేవుంటాయి. అక్కడి రాజభవనాలు మొండిగోడలతో స్వాగతం చెప్తాయి. ఆనాటి కోటగోడ తలవాకిటి తలుపులు నేటికి చెక్కుచెదరక గంభీరంగా నిలబడివున్నాయి. గండికోటలోనున్న కోనేరు నీరు ఎర్రగా ఎర్రటి రక్తమా ! అన్నట్లు భ్రమకొల్పుతుంది. పెమ్మసానివారు—గండికోట చరిత్ర చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోతుంది.

అల్పానుభూతులు

శ్రీ శంకరగంటి రంగాచార్యులు

ఆ దిగంతాకాశమున వెల్గు చిరుతార
చలనమే బ్రదుకంచు తెలిపినది నాయెదకు !
వలపు వర్ణమెలేక వనములో వికసించు
విరియొకటి నాగుండె బరువు తగ్గించినది !
ఒక పేరెలేని చిన్నారి పిట్ట బ్రతుకులో
ఆనందమే పరబ్రహ్మమని పాడినది !
ఒక గడ్డిపోచ మామక జీవితమ్ములో
ఉత్సాహమునుపోసి, ఉర్రూతలూచినది !

క్రీ. శే. వేలూరి శివరామ శాస్త్రిగారు

జీవాత్మ - పరమాత్మ

ఆత్మతత్త్వమును గురించి మున్ను మొదట వ్రాసితిని. గీతల మతమున ఆత్మ అనాది, అనంతము; అజము, అవినాశి; నిత్యము, శాశ్వతము, పురాణము; అవ్యయము, అవికారి; సర్వగతము, సర్వవ్యాపి; అవ్యక్తము, అచింత్యము; అప్రమేయము, ఏకము, అద్వితీయము.

పరమాత్మకే లోకులు సాధారణముగా ఈ విశేషణము లుపయోగింతురు. గీతాకారుని మతమున ఇవి ఆత్మకు విశేషణములు. కాని ఏ యాత్మకీ విశేషణములు వేయఁబడెనో ఆ యాత్మను లోకులు జీవాత్మ అని అనుచుందురు.

గీతాకారుఁడు 'జీవాత్మ' శబ్దమును వాడలేదు. అతఁడు జీవాత్మను చెప్పదలచికొనెను గాని అందులకుఁగాను 'ఆత్మ' శబ్దమును వాడెను. పరమాత్మకు వాడిన విశేషణములే ఈ యాత్మకును—అనఁగా జీవాత్మకును వాడెను. దీనివలన 'జీవాత్మయే పరమాత్మ'యని సిద్ధాంతము చేయవచ్చును. గీతాకారుని మతమున ఈ రెంటివడును గీటు లేదు. ఈ రెండును రెండుకావు; ఈ రెండు నొకటియే. కాని ఏయర్థమునం దీరెండును ఏకమో అయ్యెడ మతభేదము లనేకములు కలవు.

శంకర, శ్రీకంఠ, నింబార్క, రామానుజ, విష్ణుస్వామి, వల్లభాచార్యాదులగు పండితులు జీవాత్మకును పరమాత్మకును ఏకత్వమంగీకరించిరి కాని ఈ యేకత్వ శబ్దార్థమును గురించిన మతభేదము గురుతరము. కొందఱు అన్ని అంశములందును ఏకత్వ మంగీకరింతురు. కొందఱు ఏకత్వ మొప్పుకొనియు భేదము స్వీకరింతురు. గీతాకారుఁ డేరీతిగా ఈ రెంటికిని ఐక్యమంగీకరించెనో ఆ రీతి యిచట నాలోచింపవలెను. నేనే మతమునను చేరను. ఏ మతమునేని సమర్థించుటయు నా పనికాదు. ఏ మతమునకు జేరక గీతాకారుని అభిప్రాయమే కనుఁగొందును.

ఐక్యమునకు ప్రమాణములు

(క) ౬.౭ వ శ్లోకమున జీవాత్మ పరమాత్మగాఁ జెప్పఁబడెను. ఆ శ్లోకమిది :

"జితాత్మనః ప్రశాంతస్య పరమాత్మ సమాహితః
శీతోష్ణ సుఖదుఃఖేషు తథా మానాపమానయోః"

=ఆత్మను జయించిన శాంతుఁడు పరమాత్మయగును. మఱియు శీతోష్ణ సుఖ దుఃఖ మానావమానములయెడ సముఁడగును.

(ఖ) ఈ దేహమున ఉన్న పురుషుఁడే 'భర్త' యనియు, మహేశ్వరుఁడనియు పరమాత్మయనియు ౧౩–౨౨వ శ్లోకమునఁ గలదు. (నా లెక్క చొప్పున ౧౩వ అధ్యాయపు శ్లోకములు ౩౫).

"ఉపద్రష్టాను మంతా చ భర్తా భోక్తా మహేశ్వరః
పరమాత్మేతి చా ప్యుక్తో దేహేఽస్మిన్ పురుషః పరః"
(౧౩–౨౨)

(గ) "ఓ కౌంతేయా! ఆదియును గుణములును లేకపోవుటవలన అవ్యయుఁడగు నీ పరమాత్మ దేహమునం దుండియు ఏమియుఁ జేయఁడు. దేనివలనను లిప్తుఁడుకాఁడు.

ఈ పై ప్రమాణముల వలన జీవాత్మయు పరమాత్మయు అన్ని అంశములలోను ఏకమని స్పష్టము.

(ఘ) మనము సాధారణముగా ఏ యాత్మను జీవాత్మ అని అందుమో ఆ యాత్మ 'సర్వగతము'గా చెప్పబడినది. (౨. ౨. ౪)

పరమాత్మకన్న వేఱొకటి సర్వగతము కాఁజాలదు. కావున ఇచట జీవాత్మ పరమాత్మలకు పూర్ణైక్యము చెప్పఁబడినది.

(ఙ) జీవాత్మ సర్వవ్యాపిగాఁ జెప్పఁబడియె. గీతాకారుని భాష యిది:

"యేన సర్వ మిదంతతమ్" (౨–౧౭)
– ఎవనిచే ఈ విశ్వమంతయు వ్యాప్తమో.

పరమేశ్వరుఁ డొకఁడే సర్వవ్యాపి కాగలఁడు. గీతాకారుఁ డందు కనురూపమగు భాషలోనే పరమేశ్వరుని సర్వవ్యాపిత్వమును వర్ణించెను.

ఉదా :

(౧) ౮–౨౨లో అంశముచే పరమపురుషు నుద్దేశించి ఇట్లు చెప్పబడినది—

'యస్యాంతః స్థాని భూతాని యేన సర్వమిదం తతమ్'—
ఎవని లోపల భూతములు కలవో—ఎవనిచే ఈ విశ్వమంతయు వ్యాప్తమో—

(౨) 'నాచే నిది యంతయు వ్యాప్తము.' అని భగవంతుఁడనును. (మయా తత మిదం సర్వమ్. ౯–౪)

(౩) 'ఓ యనంతరూపా! నీచే ఈ విశ్వమంతయు వ్యాప్తము' అని అర్జునుఁడు విశ్వరూపుఁడగు భగవంతు నుద్దేశించి అనును. (౧౧–౩౮)

(ఙ) దేనినుండి భూతముల ప్రవృత్తియో, దేనిచే నిది యంతయు వ్యాప్తమో (యేన సర్వమిదం తతమ్) దానిని తన కర్మచే అర్చించి మానవుఁడు సిద్ధిఁబడయును. ౧౮—౪౬

మన మెవరిని పరమాత్మయని యందుమో ఆ పరమాత్మయే ఈ నాలుగు తావులను చెప్పఁబడెను.

పరమాత్మ యొకఁడే సర్వవ్యాపి. కాని, ౨—౧౭ శ్లోకము, అంశముచే శరీరమునందలి ఆత్మ సర్వవ్యాపి అనుచున్నది. దీనివలన శరీరమునందలి ఆత్మ పరమాత్మయేయనియు, ఈ రెండు ఆత్మలును అన్ని అంశములలోను ఏకమేయనియు తెలియనగుచున్నది.

(చ) గీతాకారుని మతమున దేహమునందలి ఆత్మ అప్రమేయము. (౨—౧౮) పరమాత్ముఁ డొకఁడే అప్రమేయుఁడు. కావున ఈ యెడ గూడ జీవాత్మ పరమాత్మ లిరువురకును ఏకత్వము చెప్పబడినదని సిద్ధాంతము చేయవచ్చును.

(ఛ) మఱియొకరీతి ప్రమాణములు కలవు :

"ఓ భారతా! అంతటను నన్ను క్షేత్రజ్ఞునిగా నెఱుఁగుము." (౧౩—౩)

క్షేత్రమనగా దేహము. దేహరూపమగు ఈ క్షేత్రము నెఱుఁగువాఁడు క్షేత్రజ్ఞుఁడు. (౧౩—౨)

దర్శనముల భాషలో క్షేత్రమనగా విషయమనియు, క్షేత్రజ్ఞుఁడనఁగ విషయి యనియు అగును. ఇంగ్లీషు భాషలో క్షేత్రమనఁగా **Object** అనియు, క్షేత్రజ్ఞుఁడనఁగా **Subject** అనియు అననగును. ఒక్కొక్క దేహమునందలి ఆత్మను విషయియనియు లేక జ్ఞాతయనియు, దేహమునందున్న ఒక్కొక్క ఆత్మకు దేహము విషయమనియు లౌకికముగా మన మనుకొనుచుందుము. దేహములెన్నియో జీవాత్మలన్ని. కాని భగవంతుఁ డిటులనుచున్నాఁడు—'అన్ని దేహములందును నన్నే క్షేత్రజ్ఞునిగా నెఱుఁగుము.'

"భగవంతుఁడే వేఱు వేఱు దేహములందు జీవాత్మరూపముతో ఉండి వేఱు వేఱు క్షేత్రజ్ఞులుగ ఆయెను"—అని దీనివలన సిద్ధాంతమైనది. వేఱు వేఱయిన ఈ క్షేత్రజ్ఞులందఱును అసలు వేఱు వేఱు పదార్థములుకావు. ఈ సముదాయమెల్లయు అద్వితీయమును ఏకమును అగు పరమాత్మయే.

(జ) ధర్మముకొఱకు మనుష్యుఁడు అతికష్టములయిన సాధనలు చేయును; వానివలన దేహమునకు క్లేశము కలుగును; తనకును కలుగును. 'మానవుడెంత కష్టపడుచున్నాఁడు పాపము' అని మనము వాడుచుందుము. అనఁగా జీవాత్మ కష్టమనుభవించుచున్నదని అర్థము. కాని భగవంతుఁ డిటులనుచున్నాఁడు—'ఇట్టి కృచ్ఛ్ర సాధనలచే నన్నే కష్టపెట్టుట యగును, ఏలయనఁగా శరీరమునం దున్నవాఁడను నేను—" (మాం చైవాంతః శరీరస్థమ్ కర్షయంతః—౧౭—౬)

'జీవాత్మకు కష్టము కలిగినది'—అని మనము వదుదుము. కాని అది పరమాత్మకు కష్టము కలిగినది అని యగుచున్నది. కాఁగా పరమాత్మయే దేహము లోపల జీవాత్మరూపముగా ఉన్నాఁడని కానఁబడుచున్నది.

(ఝ) 'తను శరీరములందును, పరుల శరీరములందును ఉన్న భగవంతుని ద్వేషించువారు కలరు.' అని కలదు—'మామాత్మ పరదేహేషు ప్రద్విషన్తః' (౧౬—౧౮)

వేఱు వేఱు దేహములందున్న జీవాత్మను మానవుఁడు ద్వేషించును. కాని ఇచట 'భగవంతుని' అని చెప్పఁబడెను. కాఁగా పరమాత్మయే ప్రతిదేహమునందును జీవాత్మ రూపముగా ఉండెనన్న మాట.

(ఞ) ౧౩ అధ్యాయమున పరమాత్మ నుద్దేశించి—'అది వెలుగులకు వెలుఁగు, అది చీకటికి ఆవల, అది యెఱుక, మఱి యెఱుఁగఁదగినది, ఎఱుకకు ఫలమైనది. అది అందఱి హృదయము లందును అధిష్ఠితము. — 'హృది సర్వస్య ధిష్ఠితమ్' (౧౩—౧౭)

పరమాత్మ అందఱి హృదయములందును గలఁడని చివరి పాదము చెప్పుచున్నది.

(ట) 'నేను అందఱి హృదయములందును ఉన్నాను.'—'సర్వస్య చాహం హృది సన్నివిష్టః' అని ౧౫—౧౫లో కలదు.

౧

ఈశ్వరుఁడు మాయచే భూతములను బొమ్మలవలె త్రిప్పుచు అందఱి హృదయ దేశములందును ఉండును.

"ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా" (౧౮—౬౧)

'ఈశ్వరుఁడు' మానవుల హృదయమునందుఁగాని హృదయదేశమునందు గాని ఉన్నాఁడని ఈ ముందుచోటులఁ జెప్పఁబడెను. హృదయ శబ్దమునకు అనేకార్థములు. హృదయమనఁగా బుద్ధియని పలువురు చెప్పిరి. 'హృత్పిండము' లేక 'హృత్పిండమునందలి ఆకాశము' అని శంకరానందులును వేదాంత దేశికులును రాఘవేంద్రులును చెప్పిరి. ఈ రెండవ యర్థమే ఉపనిషదర్థముతో సరిపోవును. (చూ. బృహ. ౪—౪—౨౨. ఛాందోగ్య ౮—౩—౨, ౩ ఈ మొ) ఏ యర్థము గ్రహించినను 'పరమాత్మ మానవదేహము నందున్నాఁడు' అని తాత్పర్యము. "ఎటులున్నాఁడు?" అని ఇచట ప్రశ్న పుట్టును. జీవాత్మ రూపమున అని సమాధానము. "పూర్ణభావముగా నున్నాఁడా అంశభావముగా నున్నాఁడా ?" అని మరల ప్రశ్న.

ఈ రెండు మతములను సమర్థింపవచ్చును. పరమాత్మ హృదయపిండమునందు పూర్ణభావముచే జీవాత్మరూపముగా ఉన్నాఁడని

కొందరును, అంశభావముచే ఉన్నాఁడని కొందరును అందురు. పైజెప్పఁబడిన శ్లోకములలో చివర ఆఱు శ్లోకములచేతను అంశవాదమును గూడ సమర్థింపవచ్చును. కాని మొదటి ఆఱు అంశములవలన పూర్ణభావమే సిద్ధాంతితమగును.

అంశవాదము

గీతాకారుఁ డొకటి రెండుచోట్ల తేటతెల్లముగనే అంశవాదము తెలిపెను— 'జీవలోకమునందలి జీవభావము నాయొక్కయే అంశము; ఇది సనాతనము. (మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః (౧౫—౭)

ఇది జీవాత్మ విషయమనుటలో సందియమేమియులేదు. ఏలయనిన ఈ శ్లోక తృతీయ చతుర్థ చరణములు—''ఇది (ఈ జీవాత్మ) మనస్సు ఆఱవదిగానున్న ఇంద్రియములను ప్రకృతియందు ఉన్నవానిని ఆకర్షించును'' అని చెప్పను.

జీవాత్మ పరమాత్మయొక్క ఒక అంశమని ఇచట చెప్పఁబడెను. ఈ యంశము నిత్యమును శాశ్వతమును. ఇది యెల్లకాలమును అంశరూపముగనే యుండును. ఈ యంశమునకు ఆద్యంతములులేవు.

సమగ్రమయిన ఒక వస్తువును దాని అంశమును ఎన్నడును ఏ విధముగను ఒక్కటగుటకు వీలులేదు. కావున జీవాత్మ పరమాత్మకంటె కొంచెమువేఱు. ఎల్లపుడును సంపూర్ణముగా వేఱయినది అంశమెన్నడును కాఁజాలదు. తుదకెప్పుడో ఒకప్పుడయినను మూలవస్తువుతో కలిసి యున్నదానినే అంశము అని అనవలసివచ్చును. 'ఎపుడును కలిసిలేదు, కాని ఇది అంశము' అని యిట్టులు కల్పనచేయ వీలులేదు. మఱియు, 'ఈ యంశము నిత్యము' అని అన్నంతనే 'ఈ యంశ మెల్లప్పుడును మూలవస్తువుతో కలిసియున్న'దని అనితీరవలెను. 'ఎప్పుడో ఒకప్పుడు మూలవస్తువుతో కలిసియుండెను గాని యిపుడు మాత్రము కలిసియుండలేదు' అని కల్పన చేసినయెడల నిత్యత్వమునకు హాని.

కావున జీవాత్మ యెప్పుడును పరమాత్మకు అంగీభూతము, మఱియు ఈ రెంటికి నెప్పుడును వేఱిమి ఉన్నది, ఉండఁబోవును. గీతలిట్లు చెప్పుటచే భేదాభేదవాద మంగీకరించినది. భేదరహితమయిన అద్వైతవాదమును స్వీకరించినవారు పై అంశములను తమ మతమున కనుకూలముగా అర్థము చెప్పకొనిరి కాని అవి కృత్రిమములు. ఈ చెప్పఁబడిన పై విషయములలో గీతాకారుఁడు భేదాభేదవాదమును విశిష్టాద్వైతవాదమును స్వీకరించెననుటది ప్రకృతము.

పరప్రకృతి

పరమాత్మకు జీవాత్మతోఁగల సంబంధమును గుఱించి గీతలలో మఱియొక మతముకూడ కనఁబడుచున్నది. నేల, నీరు, నిప్పు, గాలి, మిన్ను, మనస్సు, బుద్ధి, అహంకారము ఈ యెనిమిది భాగములుగా నా ప్రకృతి విభక్తము. (౭—౪) ఈ ప్రకృతి అపర. జీవభూతమగు మఱొక ప్రకృతికలదు. దానిచే ఈ జగత్తంతయు ధరింపబడియున్నది. అది వెనుకటి ప్రకృతికన్న దొడ్డది. అనియు నాదే. (౭—౫) రెండువిధములయిన యీ ప్రకృతినుండియే భూతములు పుట్టెనని తెలిసికొనుము. ఈ జగత్తు పుట్టుటయు గిట్టుటయు నా కడనే. (౭—౬).

పరమేశ్వరునకు రెండు ప్రకృతులు కలవు. ఒకటి అపర—రెండవది పర. ఈ రెండు ప్రకృతులే పుట్టుటకు ఉనికికి గిట్టుటకును కారణము. ఇవి పరమాత్మ యొక్కయే ప్రకృతులు. కావున పరమాత్మయే యిందుకు కారణమని చెప్పఁబడెను.

అపర ప్రకృతి అచేతనమనియు, పరప్రకృతి చేతనమనియు వ్యాఖ్యాతలు వ్రాసిరి. కొందఱు కొందఱు క్షేత్రజ్ఞుఁడే పరప్రకృతియని వ్రాసిరి. పరప్రకృతి యనఁగా పరమాత్మయొక్క తటస్థశక్తియని విశ్వనాథుఁడు మొదలగు వైష్ణవాచార్యులు వ్రాసిరి. ఇచట గీతామతమునకు సాంఖ్య మతమునకునుగల పోలిక చూతము. సాంఖ్యుల తత్త్వము లిరువది అయిదు.

పురుషుఁడు ఒక తత్త్వము.

ప్రకృతియు ప్రకృతిమూలకములగు తత్త్వములు ౨౪. సాంఖ్యపురుషుని స్థలమున గీతలో పరప్రకృతి. గీత సాంఖ్యుల యితర చతుర్వింశతి తత్త్వములను గ్రహింపక ఎనిమిది తత్త్వములనే గ్రహించి వానికి అపరప్రకృతి యని పేరు పెట్టెను. ఈ రెండుమతములకును గల భేదమిది :

సాంఖ్యమతమున ౨౫ తత్త్వములు తక్క వేఱేమియులేదు. గీతామతమున పరాపర ప్రకృతులేకాక, మఱియొక సత్తకలదు. అది పరమాత్మ. ఈ విశేషము గీతలలోనేకాక మహాభారతమునందచటచటఁ గలదు. (చూ. శాంతి—౩౦౫—౩౭, ౩౮)

సాంఖ్యులు పురుషుని, ప్రకృతిని అంగీకరించిరి. గీతలు పరప్రకృతిని (సాంఖ్య పురుషుని) అపర ప్రకృతిని (సాంఖ్యుల ప్రకృతిని) పైని పరమాత్మను అంగీకరించెను.

గీతలలో మఱియొకచోట నెచటను పరప్రకృతి మాటలేదు. (౧౫—౭) అంశము విషయములో 'జీవభూత' శబ్దము వాడఁబడెను. పరమాత్మయొక్క జీవభూతమును సనాతనమునునగు అంశమే దేహముకల ఆత్మరూపముగా ప్రకాశితమగుచున్నదని అంశవాద ప్రకరణమున చూపఁబడినది. ౧౫—౭ శ్లోకమునందును ౭—౫శ్లోకమునందునుగల అంశములకు సామంజస్యముచేసి అర్థము చెప్పచో పరప్రకృతి పరమాత్మని సనాతనముగ ఒక అంశమని తేలును.

ఈ మతప్రకారము గీతలుచేసిన తత్త్వవిభాగమిది:

౧. పరమాత్మ.

౨. పరమాత్మని జీవభూతమగు అంశము. (పరప్రకృతి).

౩. అపర ప్రకృతి (సాంఖ్యుల ప్రకృతి)

ఈ కాలపు ఆదర్శమునుబట్టి గీతాకారుని ఉద్దేశ్యమును వ్యాఖ్య చేయుచో ఇటు లుపపన్నమగును : గీతాకారుఁడు పరమాత్మకు రెండు భావములు స్వీకరించెను. ౧. విశ్వాతీతమగు భావమొకటి. ౨. విశ్వగతమగు భావమొకటి. పరమాత్మ ఒకదెస విశ్వాతీతుఁడు. మఱియొక దెస జగత్తులో చొచ్చియున్నాడు. పరమాత్ముని విశ్వాతీతభావము మనోబుద్ధుల కతీతము. కొన్నిచోఁటుల ఈ భావము అవ్యక్తమనఁబడెను. (౨—౨౫; ౭—౨౪; ౮—౨౦, ౨౧; ౧౨—౧, ౩; ౧౩—౬ ఈ. మొ) ఇది దేశకాలములయందు ప్రకాశముకాదు. కావున మానవుఁడు దీని నిసుమంతయు నెఱుఁగజాలడు. భగవంతుని విశ్వగతభావమే జగత్తును తాల్చుచున్నది. జగత్తునకు ఈ భావముతోడనే సంబంధము. ఈ విశ్వగత భావమునే జీవభూత సనాతనాంశమనియు, పరప్రకృతి యనియు గీతాకారుఁడు చెప్పినోవు. ఈ వ్యాఖ్య యుక్తమగుచో గీతాకారుని తత్త్వవిభాగ మిటులు :

౧ పరమాత్ముని విశ్వాతీతనుగ భావము. (సంక్షేపముగా పరమాత్మ)

౨ విశ్వగతమగు భావము. (పరమాత్ముని సనాతనమగు అంశము లేక పరప్రకృతి.)

౩ అపర ప్రకృతి. (సాంఖ్య ప్రకృతి)

అపర ప్రకృతిని గుఱించి ముందు విపులముగా ఆలోచించెదను. దీనిలో పరమాత్మకు ఎట్టి అంగాంగి భావమును లేదని యిచటఁ దెలిపిన చాలును. కాని పరప్రకృతియొక్క స్వభావమువేఱు. ఇది పరమాత్మయొక్క యే అంశముగాని అంగముగాని అయియున్నది—

ఉపసంహారము

ఈ పై వ్యాఖ్యానము వలన తేలిన సిద్ధాంతములివి :

౧ జీవాత్మయు పరమాత్మయు ఒక్కటే.

౨ కొన్ని కొన్ని అంశములందును, అన్ని అంశములందును గూడ ఈ రెండాత్మలకును ఏకత్వమంగీకరింపబడియెను. కొన్ని కొన్ని అంశములలో జీవాత్మ పరమాత్మకు అంశముగాఁ జెప్పఁబడియెను.

౩ పరప్రకృతి పరమాత్ముని విశ్వగతభావము కానోపును.

మినీ కవితలు

మాధవి సనారా

1

విహాయస వీధుల్లో
రెక్కల్లేకుండా ఎగిరే
పావురాలు
ఉత్తరాలు.

2

పత్రికా
పుత్రిక
యింటికొస్తే
పక్కింటి వారికే
ముందు సంబరం !

3

పత్రికా
మందిరంలోకి
వెళ్ళాలనుకునే
సాహితీ భక్తులకు
సంపాదక పూజారే
గాడ్ ఫాదర్.

4

సుప్రభాత సమయాన
ఇంటింటికీ శ్రీకృష్ణ దర్శనం
వార్తాపత్రికల రూపంలో
విశ్వరూప సందర్శనం.

5

స్టూడియో
దేవాలయాల్లో
నటదేవుళ్ళ లీలలు
సినీ పత్రికల
ఆధ్యాత్మిక గ్రంథాల్లో
తిలకించి పులకించే
ప్రేక్షక భక్తాగ్రేసరులు.

డా॥ ఇంగువ కార్తికేయశర్మ

ఆంధ్రమున శైవము
అమరావతి చతుర్ముఖ శివలింగము

మౌర్య కాలము నుండి బౌద్ధ చైత్యారామములలో జగత్ప్రసిద్ధి గాంచిన గుంటూరు మండలములోని యమరావతి క్రీ. శ. 8–9 శతాబ్ది నుండి శైవ క్షేత్రముగా కూడ పవిత్రమయ్యెను. బౌద్ధ శైవములు రెండునూ సమానముగా గౌరవింపబడినట్లు కోట కేతరాజొసగిన (క్రీ. శ. 1182) యమరావతి శాసనముల వలన తెలియుచున్నది.

అస్తి శ్రీ ధాన్య కటకం పురం సుర పురాత్ పురం
యత్ర అమరేశ్వరః శంభు రమరేశ్వర పూజితః।
బుద్ధ దేవస్య సాన్నిధ్యాత్ యత్ర ధాత్రీ ప్రపూజితా।
చైత్య ముత్యున్నతం యత్ర నానా చిత్ర సుచిత్రితం॥

బౌద్ధ వాస్తు శిల్పగతిని గూర్చి నేనిదివరలో కొన్ని వ్యాసము లను 'భారతి'లో (ఆగస్టు 1975, పుటలు 16–27 మరియు నవంబరు 1976 పు. 5–10), ప్రచురించియుంటిని. ప్రస్తుత మీ వ్యాసమున అమరావతిలో లభ్యమైన యొక మహత్తర ముఖ లింగ మును గూర్చి తెలుపుదును.

భారతి, ఆగస్టు – 1974 సంచికలో గుడిమల్లము శివాలయ మున గావించిన పురావస్తు పరిశోధనల గూర్చి తెలుపుచూ, అచ్చటి శివలింగ ప్రతిష్ఠ క్రీ॥పూ॥ 3–2 శతాబ్దుల జరిగినట్లున్ను, శైవము ఆంధ్రతీర దేశమున పతంజలి కాలము నాటికే ప్రబలియుండినట్లుగా పేర్కొంటిని. కాని బౌద్ధమువలె బహుళ ప్రచారములోనికి వచ్చి నట్లు కనబడదు. ఇచ్చట వివరించబడిన ఈ చతుర్ముఖ శివలింగము క్రీస్తబ్దమున శివపూజా విధాన మేరీతిగ నుండెనో తెలుసుకొనుటకొక ప్రబల నిదర్శనము.

చతుర్ముఖ లింగము

ఈ చిన్న లింగము లేత పచ్చని పలనాడు సున్నపు రాయితో కావింపబడినది. అమరావతిలోని శిల్పములన్నియు నీ రాతి కృతములే. ఈ లింగముయొక్క యెత్తు యేడు సెంటిమీటర్లు, వెడల్పు ఆరు సెంటిమీటర్లు. ఈ శిల్పఖండము 1954-55లో డా॥ రాయప్రోలు సుబ్రహ్మణ్యంగారి వద్ద కెటులో చేరినది. రాజావాసిరెడ్డి వేంకటాద్రి నాయుడుగారి భవంతి–అమరేశ్వరాలయములకు చేరువగానున్న "కోట దిబ్బలనెడి" యెత్తైన పాడు భూములలో లభ్యమైనట్లు తెలియు చున్నది. ప్రస్తుతమీ చిరులింగము హైదరాబాదులోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పురావస్తు ప్రదర్శనాలయమందు భద్రితము. డా॥ రమేశన్ గారు నా యందు దయతో ఛాయా చిత్రముల బొందుట కనుమతించిరి. దాచేపల్లి సుద్దరాయి కాని కొంతమేరకు అరిగిపోయి చిన్న ముక్కలుగా విడిపోయి పైన క్రిందున పగిలిపోయియున్నది. ఈలింగ మును కొయ్య లేక రాగితో చేసిన పీఠముపై నధిష్ఠించినట్లు తోచు మన్నది. అడుగు భాగమున కూడ యించుక యరిగిపోయియున్నది పరిమాణమును బట్టి యీ లింగమొక శివోపాసకుని అర్చలింగముగా దేవతార్చన పేటికలో నుంచబడి పూజాభిషేకను లందుకొను చుండి



చిత్రము–1 : అమరావతి ముఖలింగము (అ. తత్పురుషుడు) (క్రీ. శ. 1-2వ శతాబ్ది)

నదిగా భావింపనగును. ఇట్టిది చల లింగమైన మానుష లింగముల కోవకు చెందినది. చిత్రమేమన రుద్ర లేక పూజా భాగమున నాల్గు దిశల కేంద్రీకరించిన ముఖములుగల్గియుండుట. (చిత్రములు1–4). ఈ ముఖ కవళికలు, శిల్ప శైలినిబట్టి యిది క్రీ॥శ॥ 1–2 శతాబ్ది సాతవాహన కృతమని నిస్సందేహముగా చెప్పనగును. అమరావతిలోని ప్రదర్శనాలయమందున్న అర్ధ శిల్పముల కత్యంత సన్నిహితమైన రీతిలో యా శిల్పులే కావించిరని చెప్పుటకు వీలగుచున్నది.

ముఖ లింగ తత్త్వము

శైవాగమమున సదాశివుడు పరిపూర్ణ స్వరూపుడుగా, మహా యోగిగా, మహాశక్తి సమన్వితమైన నిశ్చలమూర్తిగా పేర్కొనబడినాడు. ఐదు ముఖములున్న నీ లింగ రూప – నిష్కల శివుని తత్పురుష, అఘోర, వామదేవ, సద్యోజాత మరియు ఈశాన స్వరూపునిగా నిర్ణయించిరి. ఈ ఐదు లక్షణములను పంచ బ్రహ్మములుగా కూడా నెంచి – పరమాత్మ, ప్రపంచము, బుద్ధి, యలంకారము మరియు భక్తి విజ్ఞాన తత్త్వముల నాపాదించిరి ఈ పరమేశ్వరుని గూర్చి నారాయణోపనిషత్తు నందలి తైత్తిరీయ అరణ్యకమున (X, 43–47) సద్యోజాతాది మంత్రములలో వివరణ కలదు. వేద భాష్యకారుడైన సాయణాచార్యులవారు శివుని పంచభూత శక్తి స్వరూపునిగా పేర్కొని, నాల్గు ముఖములు నలు దిక్కుల, పై లింగ రూపము ఈశానునిగా ఆకాశమును చూచుచున్నటుల వివరించియుండెను. సాయణాచార్యుడు (క్రీ॥ శ॥ 1336 – 1404) విజయనగర పుర ప్రభువైన రెండవ హరిహరుని కాలమున బ్రాహ్మణ క్రాక – కావలి ప్రాంతములందు పలువురు వేద భాష్యకారులతో కలసియుండునటుల శాసన పూర్వకముగా తెలియవచ్చినది.

ఈ సదాశివ తత్త్వము చాల ప్రాచీనమైనది. క్రీ॥శ॥ 5 వశతాబ్ది నాటి విష్ణు ధర్మోత్తర పురాణమున "శంభోర్ వదన పంచకమ్"– యని సంబోధన కలదు. అపరాజిత పరిపృచ్ఛమను వాస్తుగ్రంథమున ద్వాదశ రుద్రారాధనలో యీ పంచముఖ మూర్తులను గూర్చి ప్రసక్తి కలదు. కారణాగమమున పంచముఖ శివలింగమును "శరాననం" యని వర్ణింపబడుట గమనార్హము. శరమన బాణము. ఐదు ముఖములు గలది. రూప మండనమున ఈశాన్య శివుని స్వరూపము యోగీశ్వరులకు కూడ నంతుబట్టనట్లు చెప్పబడినది.

యోగినామప్య గోచరం

ఈ ముఖ లింగములు పలురకములు. రుద్రభాగమున ఒకటి, రెండు, మూడు, నాల్గు, లేక అయిదు ముఖములుగల్గి నలుదిక్కులు చూచుచున్నవి. పాశుపత శైవులీ సద్యోజాతాది మంత్రముల బీజా మంత్రములుగా నుపాసించిరి. కౌండిన్యుడు పంచార్థ భాష్యమున అట్లే పేర్కొనియున్నాడు. ఆగమశాస్త్రములందు ఈ పంచ ముఖములు పంచభూత శక్తులతో మేళవింపబడెను.

అ. తూర్పు ముఖము (చిత్రము – 1)

త త్పు రు షు డు

ఈ ముఖము వాయుశక్తి స్వరూపముగా చెప్పబడినది విశాలమైన ఫాలభాగము, కనుబొమలు, పొడుగాటి నాసిక, మిడిగుడ్లు, ఆకర్ణాంత కుండలములు భుజస్కంధములపై బడియున్నవి కుడి చెవిని ఘట కుండలము, యెడమ చెవిని ముక్తసర కుండలము, శిరమున బొప్పుటాపలేనున్న కరండమకుటము, దాని యిరువంకల ముకుళిత పద్మములు అలంకరింపబడినవి.

తత్పురుషాయ విద్మహే మహాదేవాయ ధీమహి

తన్నోరుద్రః ప్రచోదయాత్.

ఆ. దక్షిణ ముఖము (చిత్రము – 2)

అ ఘో రు డు

ఈ ముఖము, అగ్ని స్వరూపమును సూచించుచున్నది. "సద్యోతి సౌమ్య రూపేణ దక్షిణం వికటం ముఖం" : ఉగ్రముగా నోరు తెరచుకొనియున్నాడు. శిరమున జటామకుటము నిటారుగా జ్వాలలవలె నున్నది. ఘోర, ఘోరతర లక్షణ సమన్వితమైన రుద్రుని కూడ నీ ముఖమున చూడనగును.



చిత్రము–2 : అమరావతి ముఖలింగము (ఆ. అఘోరుడు) (క్రీ. శ. 1–2 వ శతాబ్ది)



చిత్రము-3 : అమరావతి ముఖలింగము
(ఇ. సద్యోజాతుడు)

అఘోరేభ్యో థఘోరేభ్యో ఘోరఘోరతరేభ్యః
సర్వతః సర్వ సర్వేభ్యో నమస్తే అస్తు రుద్ర రూపేభ్యః॥

ఇ. పశ్చిమ ముఖము (చిత్రము — 3)

సద్యోజాతుడు

భూమికి ప్రతి రూపముగా పూజింపబడునట్టిది సద్యోజాత లేక నంది వక్త్రము. చక్కని ముఖ కవళికలు గల్గియున్నది. తీర్చిన పలువరస, శిరస్సుపై కరండ మకుటమును ధరించియున్నను, యిరు ప్రక్కల జటలు కానవచ్చుచున్నవి. ఫాలభాగమున త్రినేత్రముగా కానవచ్చినది పగిలి — అరిగిపోయిన బాగము. ముక్కు కూడ దెబ్బ తిన్నది.

సద్యో జాతం ప్రపద్యామి సద్యోజాతాయవై నమోనమః
భవే భవేన అతిభవే భవస్వమాం భవోద్భవాయనమః॥

ఈ. ఉత్తర ముఖము (చిత్రము — 4)

వామదేవుడు

మహాదేవుని వామభాగముగా పంచ భూతములలోని జలమును సూచించుచున్న దీ వామదేవ రూపము. కపర్ది జటములతో నొసటి పైని మకుటమణి, పట్టబంధము గల్గి అత్యంత రూపసిగా కనుపించు చున్నాడు. క్రీగంటిచూపు, విశాలమైన కనుదోయులు ఉమా స్వరూపమును మరపించుచున్నది.

వామదేవాయ నమో జ్యేష్ఠాయనమః శ్రేష్ఠాయ
నమో రుద్రాయనమః
నమః కల వికరణాయనమో బల వికరణాయనమః
నమో బల ప్రమథ నాయనమః. సర్వ భూత దమ
నాయ నమో మనోన్మ నాయనమః.

ఈ వామదేవుడు నవ లక్షణముల కల్గియున్నాడు. జ్యేష్ఠ, శ్రేష్ఠ, రుద్ర, కాల, కలవికరణ, బలవికరణ, బలప్రమథన, సర్వభూత దమన, మనోన్మన యని పిలువబడినాడు.

ఐదవ ముఖము

ఈశానుడు

అగోచరమైన, అరూపమైన ఆకాశమును సూచించుచున్నది లింగోపరిభాగము. ఈశానునిగా గ్రహింపబడినది. నిత్యాభిషేక ప్రియుడైన శివుని మున్నటి లింగాగ్రము మహా పవిత్రమైనది. అన్ని విద్యలకు, సర్వ భూతములకు పరమేశ్వరుడు. వేద బ్రహ్మ మహా సదాశివుడు.



చిత్రము-4 : అమరావతి ముఖలింగము
(వామదేవుడు) (క్రీ. శ. 12 వ శతాబ్ది)

ఈశానః సర్వ విద్యానాం ఈశ్వరః సర్వభూతానాం
బ్రహ్మాధిపతిః బ్రహ్మణోధిపతి బ్రహ్మ
శివోమే అస్తు సదా శివోం !

పైన చూపబడిన ముఖములపై నెక్కడను మూడవ కన్ను కానరాదు. కాని ఆగమముల వామ దేవునికి తప్ప తక్కిన ముఖములు త్రిలోచనముల కల్గియున్నవి. (త్రిలోచనమ్ సర్వాణి వామదేవం ద్విలోచనమ్). ఈ కోవకు చెందిన లింగముల పైని ముఖములు స్తన సూత్రము వరకుమాత్రమే నుండవలెను. కాని యిచ్చట కేవలము కంఠము వరకు ముఖములుండుట గమనింపవలసియున్నది. ఈ లక్షణముల బట్టి ఈ ముఖలింగము ఆగమ శాస్త్రములకు పూర్వకృతిగా నెరుంగవలయును. క్రింద భాగము యించుక ఛిద్రమైనది.

అమరావతిని శైవము

ఈ చతుర్ముఖ లింగమిచ్చోట లభ్యమగుట చాలా బాగుప్రాకరమైన పరిశోధనలకు నాంది బూతమైనది. ప్రాచీనముగా శైవ మేరీతిగా యుండెనో ? యెట్లు వ్యాప్తి చెందెనో ? కారకులెవరో ? యెక్కడి వారో? మొదలగు ప్రశ్నలుద్భవించుచున్నవి.

అమరావతి—ధరణికోటలు శాతవాహన—ఇక్ష్వాకుల బౌద్ధములకు కూడలి సంగమములై బహుముఖ ఖ్యాతి గాంచినవి. ఈ అర్వాచీన చరిత్ర యుగమున శైవము ఈ తీరాంధ్రమున వ్యాప్తికి రాలేదని పలువురు దృఢముగా బల్కిరి. శైవమున్నటుల నిరూపించుటకెట్టి వాస్తుకట్టడములుగాని, శిల్ప శిలాశాసనాదులుగాని తెలియరాలేదు. పైన చూపిన శివలింగమును బట్టి అమరావతిని మహేశ్వరుని పూజ, క్రీ. శ. 1–2వ శతాబ్ది సాతవాహనుల రాజ్య పరిపాలనలో యాచారముగానుండెనని నిర్దుష్టమగు చున్నది. కొన్ని శతాబ్దుల తరువాయి, పంచరామ క్షేత్రములలో నొకటిగా ఖ్యాతి గాంచినది యమరావతిలోని అమరేశ్వరాలయము. కృష్ణానదిగట్టున విశాలప్రాకారములతో దక్షిణముగా గోపురద్వారశాలతో ఈ పట్టణమున విలసిల్లినది. తక్కిన నాల్గు ఆరామక్షేత్రములలో, చేబ్రోలులోని భీమేశ్వరాలయము లక్కవరగలావి గోదావరితీరమున గలవు. ఇవి సామర్లకోటలోని భీమేశ్వర క్షేత్రము, ద్రాక్షారామములోని భీమేశ్వరాలయము మరియు పాలకొల్లులోని క్షీరారామము. ఈ శివ క్షేత్రములన్నియు చాళుక్యనృపతియగు భీమేశ్వరుని (క్రీ. శ. 892-921) కృతములు. ఈ ఆలయములన్నింటిని గర్భగృహములోని లింగము దాచేపల్లి సున్నపురాయి కృతమై రమారమి 6 మీటర్ల యెత్తుగా నున్నది. చాలా పొడవుగానుండుటచే కాబోలు గర్భగృహము రెండంతస్తుల భవంతిగా నిర్మితమయ్యెను. క్రింద యంతస్తున లింగముచుట్టు పెద్ద పీఠమున్నది. అర్ఘ్యపాద్యాదులు ఈ పీఠముపై జరుగుచున్నవి. లింగము యొక్క బ్రహ్మభాగమెంతలోతున పీఠములో అమర్చబడినదో? ప్రతిష్ఠ విధానమెట్లు? యెప్పుడు? చేయబడెనో చెప్పజాలము. గుడి మల్లము గర్భాలయమున జరిగినట్లుగా, యిచ్చట గూడ ఖనన పరిశోధన చేయవలసిన యవసరమెంతేని కలదు. దేముడు పూరుకొన్నను, మూఢ నమ్మకముతో మునిగియున్న పూజారులు యిట్టి శోధనలకనుమతించరు. విష్ణు, రుద్ర భాగముల చూపుటకుగా లింగార్ధభాగమున బ్రహ్మసూత్ర రేఖ గావించిరి. లింగోపరిభాగమున చతురస్రపు గుంట గలదు. అభిషేకము పై అంతస్తు నుండి చేయుదురు.

ఈ పొడుగైన లింగము, నలుపలకల స్తంభమువలె చాలా పెద్దది. బౌద్ధ స్తూపములందు ఆయక స్తంభముల పోలియున్నది. లింగాగ్రమున కానవచ్చు గుంట, స్తంభముపైని గూర్చెడి చిహ్నముల బిగింపుకై నుద్దేశింప బడినది. ఈ చిహ్నములు—ధర్మ చక్రము, యేనుగ, వృషభము, చైత్యము మొదలగు పూర్ణశిల్ప ఫలకములు. శైవులిట్టి ఆయక స్తంభము గుండ్రము చేసి, ఉపరి భాగమున లోహపు శేష నాగమునో లేక అభిషేక కుంభమును యలంకరించిరి. ఈ శైవ క్షేత్రము లైదున్ను, బౌద్ధ స్థలముల నెలకొన్నవగుటచే ''పంచారామము''లన్న పేర్లు వాడుకలోనికి వచ్చినట్లు తోచుచున్నది.

సాతవాహన కాలమున శైవము

సాతవాహన రాజులు బౌద్ధమునాదరించినను ఆ మతము నవలంబించలేదు. మొదటనుండి కూడ వైదిక ఆచారముల, ధర్మ క్రతువులను మిక్కిలి శ్రద్ధతో పాటించిరి ఈ వంశజులు విష్ణుభక్తులు. సూర్యనారాయణుడు వీరి కులదైవము. కాని క్రీ.శ.1—2వ శతాబ్దినుంచి కుషాణ— క్షత్రపులతోటి వీరికి సంబంధము పెరిగినది. అంతవరకు విజృంభించియున్న బౌద్ధము, పాళీ—ప్రాకృతముల ప్రాబల్యము క్రమేణ క్షీణింపసాగెను. వైదిక సాంప్రదాయము, ముఖ్య బ్రాహ్మణమతములైన శైవ — వైష్ణవములు పైకి వచ్చినవి. పరదేశీయులైన క్షత్రప—కుషాణ చక్రవర్తులను యీ వైదిక మతము, శైవ—వైష్ణవ—శాక్తములు మిక్కిలిగా యాకర్షించినవి. మధుర గొప్ప కూడలియైనది. సంస్కృతమును వీరు శాసనభాషగా మొట్ట మొదట గుర్తించిరి. ఈ వంశజులు వారి అనుయాయులు హిందూ నామములకూడ పెట్టుకొనిరి. మహాక్షత్రపరుద్రదమన, వీర దమన, యశోదమన మున్నగునట్టివి పేర్కొననగును.

శాతవాహన సామ్రాట్టు గౌతమీపుత్ర సాతకర్ణి వైదిక ధర్మముల కడుశ్రద్ధతో పాటించెను. ఆయన సంతతి కూడ బ్రాహ్మణ మతము నవలంబించిరి. తమ కుమారులకు నామములు గూడ శివస్కంద సాతకర్ణి, శివశ్రీ పులమావి యని పెట్టుకొనిరి. రుద్ర సాతకర్ణి, విష్ణురుద్ర శివలానంద సతకర్ణి యనికూడ నీ సాతవాహన వంశ బంధువులుకూడ పిలువబడిరి. దక్షిణాదిన యజ్ఞశ్రీ సాతకర్ణి మొట్టమొదటగా శాసనములందు సంస్కృత భాషను ప్రవేశపెట్టినట్లు తెలియుచున్నది. ఇవన్నియు నిశితముగా పరిశీలించిన సంస్కృత భాష, శైవములకు మిక్కిలి యవినాభావసంబంధమున్నటుల, క్షత్రప—సాతవాహనులకాలమున పునరుజ్జీవములైనట్లు తేలుచున్నది. ఆ తరువాత సాతవాహనాంతరీకులైన ఇక్ష్వాకులు విష్ణుకుండి రాజులు పల్లవులు శైవ—సంస్కృత శైవములను మిక్కిలిగా పోషించి రాజశాసనములందు భాషగా సంస్కృతమునే వాడిరి.

శైవ వ్యాప్తికి వీరొనరించిన సేవ, వీరు గావించిన ఆలయములు, దేవతామూర్తులు మరొకచో వివరింతును.

ఇటీవల కొన్ని ప్రాచీన శైవాలయములుకూడ బయల్పడినవి. జలాంతర్గమైపోవు శ్రీశైలము జల విద్యుత్ ప్రాజెక్టు లోయలలో కృష్ణా—తుంగభద్ర—భావనాశి నదుల సంగమ స్థానములలో పెక్కు శైవాలయ కూటములున్నవి. ఇవన్నియు కళ్యాణి చాళుక్యుల [క్రీ. శ. 7వ శతాబ్ది] కాలమునుండి విజయనగర ప్రభువుల కాలము వరకు మహత్తర తీర్థక్షేత్రములుగా విలసిల్లినవి. ఇవిగాక ఖనన పరిశోధనలలో నిటీవల కొన్ని ప్రాచీన యిటుక దేవాలయములు బయల్పడినవి. కాలాంతరముగా శిథిలమైన ఈ కట్టడముల స్థానముననే చాళుక్యరాజులు రాతి దేవాలయములు గావించుట తీర్థక్షేత్ర మహిమను కాపాడుటయే. ముఖ్యముగ గమనింపవలసినదేమన అన్ని ఆలయములు శైవాగమ నిర్మాణములు.

ముఖ్యమైన కొన్నింటిని మాత్రము యిచ్చుట పేర్కొన వీలగును. మహబూబునగరు జిల్లాలోని కూడలి సంగమేశ్వరము, రంగాపురము, కర్నూలుజిల్లా నందికొట్కూరు తాలూకాలోని సిద్దేశ్వరము, వీరాపురము మున్నగుచోట్ల బయలుపడిన యిటుక దేవాలయములు చాల ప్రాచీనమైనవి. వీరాపురమున కృష్ణానది కుడిగట్టున షుమారు 14—చిన్నఆలయములు ప్రాకారముతోసహా వెలికివచ్చినవి. ఒక్కొక్కగుడి మూడుమీటర్ల చతురస్రపు కట్టడము. అర్ధచంద్రాకారపు మెట్లుతో ద్వారము, గర్భాలయమున మధ్యగా నెత్తైన యిటుక అరుగుపై స్వయంభువ లింగముంచబడినది. కొన్నింట అరుగుపై రాతిపీఠము ప్రణాళికతోసహా వున్నది. దీనినిబట్టి అభిషేక —అర్చనలు జరుగుచుండెడివి. ప్రణాళిక ప్రక్క గోడలో నొక చిన్న మూయబడిన యిటుక కాలువను చేర్చబడినది. అభిషేక జలము బయటికి పోయెడి విధముగా నమరిక గలదు. ప్రదక్షిణము వెలుపలగా చేయవీలగు యిటుక పరుపునేల కలదు. ఈ చిన్న ఆలయములు ఒక దాని కొకటి యెట్టి సంబంధము లేదు. ద్వారముఖము కూడ యే ఒక్కదిక్కున నిర్దేశించబడినట్లులేదు. అట్లే ప్రణాళికలుగూడ. గర్భాలయమున వెలుపల లభ్యమైన మట్టిపాత్రలు, సీసపు నాణెములు ఈ కట్టడముల కాలమును నిర్ణయించుటకెంతో యాధారభూతములు ముఖ్యముగా సీసపునాణెములు మని యిప్పటి రూపాయంపతె పెద్దవి. యేనుగు చిహ్నము గలదు. అంచున గుండ్రముగా బ్రాహ్మీ లిపిలో — [1] మహారథి శివ ఖడ... .. [2] మహారథి శివ...... ఖుమావిస—యున్నగు రాజులపేర్లు తెలుపుచున్నవి. ఈ మహారథి వంశజులు, సాతవాహనుల కాలమున కర్ణాటకములోని వనవాశి, చిత్రదుర్గ ప్రాంతములు, తెలంగాణములోని కరీంనగరు, వరంగల్లు, ఆదిలాబాదు జిల్లాలలోను చిన్న సంస్థానాధీశులుగా కొంత మేరకు పాలించుచుండిరి. వీరి నాణెములు క్రీ. శ. 1వ శతాబ్ది మొదటి భాగమున చలామణి యగుచుండెను. గౌతమీ పుత్ర సాతకర్ణి దక్షిణ దిగ్విజయముచేసి యీ చిన్న స్వతంత్రరాజ్యముల సాతవాహన సామ్రాజ్యమున కలుపుకొనెను. ఈ మహారథివంశీయులు పూర్వపు సాతవాహనులతో బాంధవ్యమును బొందియుండిరి. పైన లభించిన సీసపు నాణెముల వలన, మృణ్మయ పాత్రల వలన యీ యిటుక ఆలయములు అన్నియు క్రీ.శ. 1వ శతాబ్దిగా నిశ్చయముగా చెప్పవచ్చును అదేకాలమునకు చెందిన మరియొక ఆలయపు పునాదులు రంగాపురమున చోట లభ్యమైనవి. కర్ణాటకములోని వనవాశి, బనవాశిలోని రాతి దేవాలయముల క్రింద, యిటుక ఆలయముల పునాదులు లభ్యమైనవి. సాతవాహనుల పూర్వము ఈ కట్టడముల నిర్మితి యెట్లైనట్లు నిశితముగా తెలియుచున్నది. యజ్ఞశ్రీ సాతకర్ణి సీసపునాణెములు ఈ దేవాలయ స్తరములలో లభించుటచే, శైవ వాస్తు — శిల్పముల సాతవాహనుల కాలమునాటికే స్థాపింపబడినవని దృఢముగా చెప్పవచ్చును. తదనంతర రాజ్యమునకు వచ్చిన చాళుక్య వంశీయులు, యిట్టి పవిత్ర స్థలముల తీర్థక్షేత్రములను వృద్ధిగావించి, రాతికట్టడములను శిల్ప శాసనముల గావించిరి.

ఉత్తర దేశమున యుద్భవించిన వైదిక — బ్రాహ్మణ మత యాచారములు, పెక్కు శైవశాఖలు ముందుగా ఆంధ్రదేశమున సుస్థావరము లేర్పరచుకొన్నవి. కాలానుగతముగా వృద్ధిబొంది దక్షిణ దేశమునకు వ్యాప్తిచెందినవి.

రాతి మనిషి

శ్రీ జెట్టిగుండ్ల రఘునాథరెడ్డి

రాళ్లలో రాగాలు పలికించాలని
అహర్నిశలూ శ్రమించాను
నాదస్వరం పుచ్చుకుని.
రాగాలు రాలకపోగా
రాల్చిన విప్పురవ్వలు
గుప్పు గుప్పున
మీదికొస్తుంటే
తట్టుకోలేక
రాతి కవచాన్ని
అతికించుకున్నాను గుండెకి.
యిప్పుడు తెలిసిందా
రాతిమనిషి ఎందుకయ్యానో నేను.

పొద్దు పొడిచిన యిన్నాళ్ళకు...

నా స్వేచ్ఛకు
నేనే గిరిగీసుకుని
విశాల విశ్వాన్ని
దేశాలుగా, రాష్ట్రాలుగా, జిల్లాలుగా, తాలూకాలుగా
కుదించుకుని,
పచ్చిక బయళ్ళవంటి
నా పథంలో
నాకు నేనే కులమత వర్గభేదాల పల్లేర్లు జల్లుకుని,
అవి గుచ్చుకుంటున్నా నొచ్చుకోక
వెలుతు రాకాశంవంటి
నా బ్రతుకులో
నాకు నేనే చీకటిని పండించుకుంటూ
నన్ను నేనే దేవుడు దెయ్యాల సంకుచితపు కట్టుబాట్ల
గర్భగుడుల్లో ప్రతిష్ఠించుకుని, మూఢత్వపు జాడ్యంలో
మగ్గుతూ;
కాంతి గోళాలవంటి
నా కళ్ళకు
నాకు నేనే గంతలు కట్టుకుని
దొంగాటలాడుకుంటూ, నన్ను నేనే దొంగను చేసుకుంటూ,
దోచుకుంటూ
పడుకుంటూ లేసుకుంటూ
గంగిగోవువంటి
నా మనసులో
నాకు నేనే కల్మషాన్ని కలుపుకుంటూ
నన్ను నేనే వంచించుకుంటూ, మభ్యపెట్టుకుంటూ,
మట్టుపెట్టుకుంటూ
అంధకారంలో అక్రమంగా—అగమ్యంగా
యుగాల అగాధాలు దాటుకువస్తున్న
నాలో పొద్దుపొడిచిన యిన్నాళ్ళకు
నన్ను నేనే చూసుకుంటుంటే
నామీద నాకే అసహ్యం వేస్తోంది—
ఔను !
మనిషినైన
నా మనసు యింత సంకుచితమా ! అనిపిస్తోంది —
అందుకే ...
మారుతున్నాను...
ఆ సంకుచితపు గర్భగుడుల్లోంచి బైటపడాలని
శతథా ప్రయత్నిస్తున్నాను ...
మేల్కొన్న మానవత్వంతో
వసుధైక గీతాలు విరచిస్తున్నాను...
మమతా సుప్రభాతాల్తో
మనసును పునీతం చేసుకుంటున్నాను... !

ఎడారిలో...

అడుగడుగునా అవరోధాల్ని ఎదుర్కొంటూ
అవమానాల్ని అపహాస్యాల్ని భరించుకుంటూ
నా అభిమానాన్ని అహంకారం చావమోదుతున్నా
సహించుకుంటూ,
పగబట్టినట్టు విజృంభించి ఋతువులు మెరుపుదాడి
చేస్తున్నా
ఓర్చుకుంటూ,
చిక్కుళ్ళో చీకటిలో నన్నునేనే
ఓదార్చుకుంటూ,
భగ్న ఆశయాల, సమాజపు నగ్న ఆంక్షల
క్షుద్ర మనస్తత్వాల, కుటిల నీతుల, కులతత్వాల
సంకుచిత సాంప్రదాయాల
జటిల సమస్యల ఎడారిలో
జీవనయాత్ర సాగిస్తున్న
పథికుణ్ణి నేను !
ఆపదల సంపదలో అందరికంటే
అధికుణ్ణి నేను !

అందుకే ...
కాళ్ళు పీకుతున్నా
కూర్చునేది లేదు -
నన్ను మోసుకు వెళ్ళడానికి
ఏ ఊహాల ఒంటెరాదు కాబట్టి...!
అవయవాలన్నీ అలసిపోయినా
ఎక్కడా ఆగడానికి వీల్లేదు –
అలపు తీర్చుకోడానికి
ఏ చల్లని కలల డేరా లేదు కాబట్టి... !

నా భాగ్యం
నన్నలా చిన్నచూపు చూస్తుంటే
నన్ను ఘోరంగా వంచిస్తుంటే
పులిమీద పుట్రలా
గ్రీష్మం అర్థంలేని ఆవేశంలో
నిప్పులు చెరుగుతోంది !
ఇసుక వేడెక్కి కసి తీర్చుకుంటుంటే
గుండెలో బాధల యిసుక తుఫాను చెలరేగుతోంది !
అది చాలదన్నట్టు
ఇది నాకో పెద్ద పరీక్షన్నట్టు
ప్రాణాలు తోడేస్తూ దాహం వేస్తోంది !

కానీ –
ఎప్పుడో తడారిన ఎడారిలో
నీరెక్కడిది, ఎండమావులు తప్ప...?
కళ్ళైనా స్రవించడంలేదు,
ఆశగా దిక్కుల్ని వెతకడం తప్ప -
ఆకాశంలో మబ్బుముక్కయినా కానరాదు,
ఆవరిస్తున్న చీకటితప్ప –

ఇంక లాభంలేదు !
ఎటుచూసినా శూన్యమే !
కీకారణ్యమే !
ప్చ్...!
పెదవులు నిట్టూర్చాయి !
నాలుకను దహిస్తోంది దాహం !
నాలుక వుండలు చుట్టుకుపోతోంది దాహంతో !
ఒళ్ళు తూలుతోంది !
కళ్ళు మూతలు పడుతున్నాయి !
కాళ్ళు తడబడుతున్నాయి !
ఓహ్ ... ...
ఏ సమగ్రత లేకుండానే, ఏం సాధించకుండానే
ఇంక యీ జీవన యాత్ర యింతటితో ముగుస్తుందా... ?
ఉఁ... హుఁ...!
అలా ఎన్నటికీ జరగదు !

సహనం నన్నంటేవుంది !
నాలో చైతన్యం రగులుకొంటూనేవుంది !
సాహసం నన్ను ఉసిగొల్పుతూనేవుంది; ముందుకు
సాగిపొమ్మని –
ఇంక నన్నే దాహం అడ్డుకోలేదు !
ఇక యీ సమస్యల ఎడారి హనుమంతుడి తోకలా
ఎంతగా పెరుక్కుపోయినా వెనుదీసేదిలేదు !
సమస్యల ఎడారిలో చివరికంటా
యీ జీవనయాత్ర సాగిస్తూనేవుంటా;
ఎప్పుడో ఒకప్పుడు పరిష్కారపు ఒయాసిస్సును కనుగొంటా
ననే నిండు విశ్వాసంతో !
తప్పక విజయం సాధిస్తాననే బండెడు ఆశతో !
విశ్వాసం నా ఊపిరి !
ఆశ నా ఆసరా !

ఖ మొద్దీన్



కృష్ణశాస్త్రిగారి మహతి

ఆధునిక ఆంధ్రసాహిత్యంలో భక్తిభావ భరిత విశిష్ట గేయకావ్యం కృష్ణశాస్త్రిగారి "మహతి." ఆంధ్రసాహితికి అపూర్వమైన, అమూల్యమైన ఆభరణం "మహతి". శతకాలు తామర తంపరులుగా వున్నని మనకి, సంప్రదాయపు కవచం చాటున హృదయస్పందన విన రాకుండా అణగిపోయిన రచనలు చాలా కనబడతవి. భక్తి అనగానే ఏదో ఒక మత సిద్ధాంతాన్నో ఏదో ఒక అభిమాన దేవతనో ఆశ్రయించిన వీరావేశంతో పారవశ్యంతో రచన సాగుతుంది. సంప్రదాయపు ఒరవడి దాటలేక సంకుచిత భావపరిధిని వదలలేరు. తన ఇష్టదైవమే పూజనీయుడనీ, మిగిలిన మూర్తులందరూ లెక్కకురాని "పెక్కురు ఒక్క దైవాలనీ" నిరసించిన భక్త కవులపుతే ఎక్కువగా వున్నారు.

ఇటువంటి రచనలను ఎంతో దూరంగా ఎంతో ఎత్తుగా నిలబడగల భక్తికావ్యసంపుటి మహతి. ఒకేమతానికి అభిమతమైన సిద్ధాంతాలు అదే పనిగా పలికించే ఏకతార కాదు. అనంత కోటిమానవ హృదయాల వివిధ విశ్వాసాలకే ఆధారమైన ఆరాధనతో ఝంకరించే మహతి! అలనాటి ఋషి వాటికలనుండి పరిలింపిన ఆమ్నాయపూత గంగ ప్లుతంతో, బోధివృక్షచ్ఛాయల్లో సెలలైన భావ్య శీతల జలంతో సిలువ గద్దియ మీద పరలిన రక్త కవోష్ణ ధారలతో, అరవీయుల ఎడారులలో కారిన విశ్వాస ఘర్మవారితో తడసి పదను వారిన పావన విశాల హృదయం ఆలపించిన ఉజ్వల భక్తి కావ్యం "మహతి". విశాల విశ్వమంతా పవిత్ర దేవాలయంగా దర్శించగల పరిపక్వ మానవ దృష్టితో విరచించిన విమలగీత వితానం ఈ "మహతి". అందుకే ఈ కవికి లోకం "కుటిలశృంఖలములులేని, కఠిన కుడ్యములు లేని, చెఱలు లేని, ఇరులు లేని" కరుణాలయం. ఇందులో కొలువున్న వేలుపు దీనజన హృదీశ్వరుడు, జ్ఞానప్రభాకరుడు, శాంతిసుధాకరుడు, హృదయాధినేత, మానవ భాగ్యవిధాత. ఈ పవిత్ర విశ్వాసమే కవిగానానికి ప్రాణం

కృష్ణపక్షపు నీడలలోంచి కవి హృదయం కాంతిపథాన్ని అన్వేషిస్తూ బయలుదేరింది. "ఉపశమింపని తపనయే నాకున్న భాగ్యము కన్నతండ్రీ!" అని నమ్రంగా నివేదించి, తీరని వేదనతో తరగని గవేషణతో కదులుతుంది కవి హృదయం. ఆశ, నిరాశ, నిస్పృహ, ఆనందం, విషాదం దాగుడు మూతలాడే బాటలో పాటలు పలికిస్తూ పోతుంది. ఒకప్పుడు ప్రియుని కౌగిలిలో ఒదిగిన ప్రియురాలి పారవశ్యం కనిపిస్తుంది. ఇంకొకప్పుడు ప్రియుణ్ని ఎన్నటికీ కలుసుకోలేననే నిర్వేదం వినిపిస్తుంది. ఈసంయోగవియోగాలు ప్రకృతిదృశ్యాలలో ప్రతిఫలించి, కవి భావనదిద్దిన రంగుల నద్దుకొని వింత సోయగంతో భాసిస్తాయి. కరుణాకరుడైన పరమాత్మ సన్నిధికోసం కవి ఆత్మలో రగిలే ఆరాటం ప్రతి పంక్తిలోనూ మెరుస్తుంది. చైతన్య, విద్యాపతి, చండీదాస్, మీరా, కబీర్ వంటి భక్త కవుల గేయాలలో పొంగిన మధుర భావధార, రవీంద్ర గురుదేవుని మృదుల శైలీ విన్యాసం కృష్ణశాస్త్రిగారి "మహతి"లోని రచనలకి విశిష్టమైన ఆకర్షణని సమకూర్చినవి. ఆనందంలో కవి హృదయం ఒక్కసారి పొంగిపోతుంది. ప్రియుడు తనకోసం వెతుక్కుంటూ తరలి వచ్చినట్లు కవి భావన చేస్తాడు. "నీలనీరద రథనేమి నిస్వనము విశాలగగన వీధి" తెలగ, గంభీర గర్జా విజయ శంఖారవాలు హరిదంతా క్రాంతమై మొరయగా విభుడు విచ్చేసాడు. నిరుపమ మధుర ప్రణయానంద సుధాశీత కిరణుడు. అతడే ప్రాణ సఖుడు. అతని సన్నిధి తరగని పెన్నిధి. ఈ ఆనందంతో ఉర్రూత లూగే పాటలుహృదయాలకి పన్నీటి జల్లుగా చల్లగా తాకుతవి.

"రండు రండు ప్రాణేశుడు
రాకరాక వచ్చె నేడు!" అనే ఉల్లాసం
"కనులు విచ్చి కనుడీ
మన మలరగ కనుడీ!
లోక మోహన కరుడు భయ
శోక హరుడు, వరుడు
రాకరాక నేడు మన
ప్రభుడు వచ్చినాడు!" అనే ఉత్సాహం
"వరదుడు పతిత పావనుడు ప్రాణేశుడు
పరువు పరవు నప్రభుడు నాకొఱకె నాకొఱకె
ఆనంద సాగరుడు అరుగుదెంచె నేడు
అమల వీక్షణముతో నభయ హస్తముతో
నమృత జీవన మొసగ నా కొఱకె
నాకొఱకె..." అనే ఉద్రేకం.

మరికొన్ని గేయాలు ఎన్నటికైనా సందర్శన భాగ్యం ఈ పేద బ్రతుక్కి లభిస్తుందా అనే సందేహం, ఆవేదన, నీ గోరుకొనలే నాకు పరమ పదం. నీ పాదధూళిని తలదాల్చటానికైనా, నీ చరణ దాసిగా మసలటానికైనా తగనంత క్షుద్రజీవితం నాది అనే తీవ్రబాధ తన జీవితంలోకి తొంగిచూసుకున్నప్పుడు అంతా నికృష్టంగా, కృపణంగా గోచరిస్తుంది. హృదయం "కలుష దుర్దాంత పంక సంకలిత కుహరం"గా కనబడుతుంది. బతుకంతా కర్దమాంకితంగా తోస్తుంది. ఎంత తుడిచినా ఎగసి పడే ధూళితో అలుముకు పోయిన పాతకొంప. "అడుగులే యందునా? అమృత జీవనధనా! ఏగుణములేని నాకేలాగు దొరుకునో!" అనే సంకోచంతో కవి హృదయం కృంగి పోతుంది.

ఈ వినమ్ర భావంతో చూడగా ఈశ్వరుని ఔన్నత్యం హిమాలయోత్తుంగ శృంగంగా కనబడుతుంది. "రాజరాజేశ్వర కిరీట రాజఘటిత రత్నమాణిక్యకాంతి నీరాజనార్చి తాంఘ్రి నీరేజ యుగళుడు" "తారకారత్న భాసుర తారహార సుప్రభా మాలి కాజాల శోభితుడు; రాజరాజేశ్వరుడు" అంతటి విభునికీ అంధకూపపు బతుకులో అల్లాడే తనకూ,

"మలయు దీపము లేక మసలు చూపులు లేక
తెలుపుమాటే లేక వలపు పాటే లేక
తెరువు బరువై పోయిన తనకు", సంయోగం సంభవమా?

"ఏదారి కలదోయీ ! ఇం
కే సుఖమున్నదోయీ !
ఈ దీన పథికునకు హృదయేశా !"

అని కవి హృదయం ఆక్రోశిస్తుంది.

కాని, ఈశ్వరుడు ప్రేమమయుడు, దయాసింధువు అనే ప్రబల విశ్వాసం "మహతి"లో వున్న రచనలకి పునాది. రాబర్ట్ బ్రౌనింగ్ "గాడ్ ఈజ్ లవ్, ఐ బిల్ట్ మై ఫెయిత్ ఆన్ దట్" అనే సూత్రం హృదయవాదులైన భక్త కవులందరి రచనలలోనూ గోచరిస్తుంది. షెల్లీ మహాకవి అన్నట్లుగా "ది వరం బెనీత్ ది సాడ్ ఇన్ లవ్ అండ్ వర్షిప్ బికమ్స్ వన్ విత్ గాడ్." అనే పవిత్ర విశ్వాసం పిపీలికవి బ్రహ్మతో ఏకంచేయుగల మహోత్తర మైత్రీ బంధం కవి హృదయంలో ఆశాకిరణాలు మెరిపిస్తుంది. ఈ దివ్య ప్రేమ మహిమని ప్రకటించటంలో "మహతి" ఉచ్చస్వరంలో ఉన్మత్తస్థాయినందుకున్నది.

"మంద మంద శీత మధురా నిల తరంగ
మందు తూగాడు ఆనంద సందేశం"గా

ప్రాణేశు ప్రణయోత్సవాహ్వానం విని పులకించింది కవి హృదయం. ఇరుల రేలలో కటికురాలలో నిర్భయంగా ముందుకునడిపించి, కాలమే యున్నంత వరకు, గానమే యున్నంత వరకు సాగిపోయే ధైర్యాన్ని ప్రసాదించింది. ఈ ప్రణయం కవి కళ్ళు తెరచి తన దీన హీనస్థితిని గుర్తింపజేసింది. కాని ఆ బరువుతో అణగారి పోకుండా ఒక కొత్త ఆశ చిగురింపజేసింది. పరమ పావనుడైన ప్రియుడు కరుణా భరణుడు,

"కురియుమురా కన్నీటిని, మరి మరి విలపింపుమురా
సరము గూర్చి పరమేశుడె దాల్చునురా పాపీ !"

అనే విశ్వాసంతో పరితాపాశ్రువులతో మాలిన్యాన్ని కడిగివేసు కున్నాడు కవి. ఈ కన్నీటిచుక్కలు తప్ప తన పేదబ్రతుకు హృదయేశునికి అర్పింపగల కానుక ఏముంది? మనసారా వలపూర కలతతీర హృదయనాథునికి నివేదింపగల వలపు కానుక ఈ పరితాపం. ఇవి 'కృష్ణపక్షం' లోని కన్నీళ్ళు కావు ఇవి వ్యర్థం కావు. ఇవి స్వామి పాదసీమలో పరమపావన జాహ్నవీ ప్రతిభలో ప్రవహించ గలవు. తన అశ్రుధార విభుని హృదయంలో అక్షయ కరుణధారని మేలుకొలుపుతుంది. కర్దమాంకిత మైన ఖిన్న జీవితం "ప్రత్యూషస్నుష మహిమ ప్లావితమై పారిజాతమై ప్రభుని పాదపీఠికని అలంకరిస్తుంది" మలిన పంకము నుండి నలినమువలె" కవి హృదయం వికసిస్తుంది.

ఈ కరుణవృష్టి కోసమే కవి హృదయం చాతకమై పరితపిస్తుంది "ఎటుల నిలవగలను ?" అని విలపిస్తుంది. ఎంత కాలము నాథా! దురంతచింత? చెంత జేరక ఇటులింతంత చీకట్ల దిరుగ? అని ఆవేశపడుతుంది. అక్షయమైన ఈ ప్రేమ మీద చెదరని విశ్వాసం కుదిరిన హృదయం "ప్రళయ భీషణమూర్తి" ని "ప్రణయ శీతల వర్తి"గా గుర్తించి రుద్రనేత్రాలు చూసి బెదరి పోదు.

"వెలుగులతో, ఇరులతో, సుధవీచితోడ మరుగు విషకీలతోడ,
సుమధుర మధురమైన బ్రతుకది కమ్మిమ్మలేని వలయు"

అని బతుకుని మహాప్రసాదంగా, అనంత వైవిధ్యంతో భాసించే వలపు కానుకగా కవి హృదయం శిరస్సున ధరించింది.

ఆ నవ్యదృష్టితో చూసిన కవికి లోకమంతా అక్షయ పాత్రగా అవనీశు హస్తమే అన్నపూర్ణమ్మగా కనబడింది. లోకాలనేలు ఏకైకరాజు క్రూరాత్ముడని శంకించే వాళ్లకి లోకం కంటకమయం. కాని తననోట పలికేది విభుని వలపు పాట అయినప్పుడు, మానవాంతరంగం అమృత వీణ అయినప్పుడు లోకమంతా కరుణాలయంగా పేరోలగంగా దీపిస్తుంది. జగమంతా ప్రశాంత మధుర బృందావనమై పోతుంది. ప్రతినవ్వు పలికించు పంచు పున్నమియె, ప్రతి గుండె పులకించు పాల కడలి, అవుతుంది. పారవశ్యం కలిగించే ప్రణయానందంతో కవికి తలపు తలపూజ్యోతి, పలుకు పలుకూ గీతి

"ప్రతి ఇంట సిర్పి ప్రతిగుండె పిల్చి
పలికింతు వీణ సందేశము
సాటేదిలేని సంసారము స్వర్గము
జగమంత మధుర బృంద వనము."

అని మహతి ఝంకరిస్తుంది.

వేదన తన సాధనగా వినియోగించుకుని, హాలాహలంలో అమృతాన్ని చవిచూసింది కవి హృదయం ... గివ్ మీ ది బ్రెడ్ ఆఫ్ ఎఫ్లిక్షన్ అండ్ వయిన్ ఆఫ్ టియర్స్" అన్న ఏసుప్రభువు పలుకులలోని పరమార్థం గ్రహించి అశ్రుధారలతో మనస్సును ప్రక్షాళనం చేసుకోవాలని తపించారు.

కబీరు నాను దారిలో, సాగుతూ

"అలయమ్మున గంట అందించె నాహ్వానము
ఆలకించిన, పికము లాలపించెను ప్రణవము
గుడిని శంఖము మెరిసె, విడెను వాటికి ద్వారము
ఎడద యెడదను నిండె గుడినుండి యా దైవము"

మానవుని గుండెలలో నిలచిన మాధవుని కవి దర్శించారు. ఆ దర్శనమే 'మహతి' లోని పాటల సొంపు!

నిజంగా 'మహతి' అపూర్వ భక్తి కావ్య సంపుటం. ఇందలి పాటలు ప్రభుని మృదుపదాలు నొవ్వకుండా కవి పరచిన మల్లెపూల బాటలు, తెలుగు పలుకులలోని తీయని తేనెల ఊటలు, వన్నెలవిరుల తోటలు, ఆధునిక భారత సాహిత్యంలో రవీంద్రుని భక్తిగీతాల కోవకు చెందిన అద్భుతగేయ రచనతో దేవులపల్లి వారిది అందె వేసిన చెయ్యి. తీయని మెత్తని చిన్నారి పలుకులతో సముద్రమంత లోతైన భావాలు

(మిగతా 75వ పేజీలో)

కలగూరగంప

కీ. శే. ప్రొఫెసర్ బి. జి. ఎల్. స్వామిగారు

"నేను చిన్నవయసులోనే మా నాయనగారి దగ్గిర ఆముక్త మాల్యద చదివి ఉంటి," అన్నారు స్వామిగారు. ఖాకీ నిక్కరు, బనియనులో ఆయన ప్రెసిడెన్సీ కాలేజి ప్రిన్సిపల్‌లాగే లేరు. ఎంతో సరదాగా మాట్లాడారు. తమ తెలుగు చదువుని గురించి ఏదేదో చెప్పారు. ఎంతో బెరుకుగా ఆయనని చూడటానికి వెళ్లిన మేము ఆశ్చర్యపడి, సంతోషంగా తిరిగి వచ్చేశాము. ఆయన మైసూరు యాసని గమనించిన మాలో ఒకతను మాత్రం "ఇది ఆముక్త మాల్యద చదివిన మొహంలాగే ఉంది." అని తమాషాకి అన్నాడు. అందరం నవ్వుకున్నాము.

ఆముక్తమాల్యదేకాదు ఇంకా ఎంతెంత చదువుకున్నారో స్వామిగారు ఇంచుమించు ఒక దశాబ్దం పరిచయంమీద తెలుసుకున్నాను.

బెంగుళూరు గుండప్ప లక్ష్మణస్వామిగారు సుప్రసిద్ధ కన్నడ సాహిత్యవేత్త కీ. శే. డి. వి. గుండప్ప (డి వి జీ) గారి కొడుకు. వృక్షశాస్త్రం లేదా బాటనీలో డాక్టరేటు తీసుకుని, హార్వర్డు యూనివర్సిటీలో కొంతకాలం ఉండి భారతదేశానికి తిరిగివచ్చిన తరువాత ప్రెసిడెన్సీ కాలేజిలో చేరారు. ఆ కళాశాలలో బాటనీ ఛీఫ్ ప్రొఫెసరుగా రిటైరయ్యారు. కొంతకాలంపాటు ప్రిన్సిపల్ పనిచేశారు కాని పరిపాలనా బాధ్యతలు తక్కిన పనులకి అడ్డం వస్తున్నాయని మానుకున్నారు. [ఒకసారి ఆయనకి బెంజమిన్ రోలాండ్ భారతదేశపు కళలని గురించి రాసిన పుస్తకం ఇచ్చాను. తాము హార్వార్డ్ విశ్వవిద్యాలయంలో ఉన్నప్పుడు తమ చిత్రపటాల ప్రదర్శనని రోలాండ్ ఆవిష్కరించాడని స్వామిగారు చెప్పేదాకా ఆయన అక్కడ పనిచేసినట్టు తెలీదు. ఎప్పుడూ ఏదో విషయాన్ని గురించి మాట్లాడటమేతప్ప తమనిగురించి అంతగా చెప్పుకునే అలవాటులేదు ఆయనకి.]

దేవనహళ్లిని వదిలి వచ్చేశాము కాబట్టి మేము స్థిరపడిపోయిన బెంగుళూరునే నా ఇంటిపేరుగా తీసుకున్నాను—అని ఆయన 'ఇనిషియల్' మార్పుకి కారణం విడమరిచి చెప్పారు.

స్వామిగారు ప్రిన్సిపల్‌నుంచి మళ్లీ "ఉత్తి ప్రొఫెసర్"గా మారినప్పుడు ఆయన కింద పనిచేసిన శ్రీ రామచంద్రన్‌గారు [తెలుగువారు, ఒకప్పుడు పుదుచ్చేరి ముఖ్యమంత్రిచేసిన రెడ్డిగారి అల్లుడు, ప్రస్తుతం తమిళనాడులో డయిరెక్టర్ ఆఫ్ కాలేజి మేట్ ఎడ్యుకేషన్ ఉద్యోగం చేస్తున్నారు] ప్రిన్సిపల్ అయ్యారు. ఆయనకి స్వామిగారి నిక్కరు, బనియను వేషం నచ్చేదికాదు. మొహమాటపడి నేరుగ చెప్పలేక చివరికి ఒక సర్క్యులర్ వెలువరించారు—"ఉపాధ్యాయ సిబ్బంది సరయిన వేషంలో రావాలి" అని. ఒకరోజు హఠాత్తుగా జుబ్బా, పయిజామాలలో వచ్చిన స్వామిగారు నవ్వుతూ ఆ సర్క్యులర్ చూపించారు. ఇంట్లో ఎప్పుడూ గళ్లలుంగీ ఒకటే ధరించటం ఆయన అలవాటు.

ఇంట్లో కోలారుప్రాంతం పుదూరు ద్రావిడుల అరవం మాట్లాడినప్పటికీ స్వామిగారు బాగా పెద్దవారయిన అనంతరం నేర్చుకున్న తమిళాన్ని, బాగా రాయగలరన్న పేరు తెచ్చుకున్నారు. ఆయన 'సాహిత్యభాష' కన్నడం. ఇందులో ఆయన రాసిన 'కాలేజిరంగ'ని చివరికి సినిమా తీశారు. 'హసరు హొన్ను' (ఆకుపచ్చ బంగారం)కి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమానం వచ్చింది. ఫ్రెంచి, జర్మనీ, స్పెయిన్ దేశాల భాషలు కాకుండా స్వామిగారికి లాటిన్ కూడావచ్చు. తెలుగు కవిత్వం విషయంలో ఆయన అభిరుచి నిర్దుష్టమయినదని నా నమ్మకం. ఒకసారి గుండప్పగారికి పండితారాధ్య చరిత్ర, బసవపురాణం కావలసివచ్చాయి [సంగడి సమాధి ఎక్కడ, అన్న ప్రశ్నమీద చెలరేగిన వివాదంలోకి ఆయన దిగినప్పుడు.] స్వామిగారు నన్ను అడిగితే ఇచ్చాను. "మీరు చదివి ఉన్నారా?" అని అడిగారు. లేదని అన్నాను. "మంచి కావ్యశైలి. చదవవలె" అన్నారు. ఆయన చెప్పటంవల్లనే బసవపురాణం చదివాను. ఆయన ఋణాన్ని ఎన్నటికీ తీర్చలేను ఇంకా అనిపిస్తూ ఉంటాను. భారతి స్వర్ణోత్సవ సంచికలో శ్రీ సుల్లంపల్లి శరభయ్యగారి పద్యాలు కొన్నిపడ్డాయి. స్వామిగారు వాటిని చదివి చెప్పిన తరువాత ఎన్నో అందాలు తెలిశాయి. [శ్రీ శరభయ్యగారు నాకు సంస్కృతం నేర్పటానికి ప్రయత్నించారని అంతదాకా ఆయనకి తెలీదు.]

ప్రతి ఆదివారమూ మా ప్రొఫెసరు బంట్వాల్ రామచంద్ర పయిగారు నన్నూ, ఇంకొక స్నేహితుడినీ సెంథోమ్‌దగ్గిరేఉన్న స్వామిగారి 'ఫ్లాట్'కి తీసుకువెళ్లేవారు. అక్కడనుంచి అల్పాహారంతోబాటు మాకు ఎన్నో వింత విషయాలమీద ఉపన్యాసాలని ఇస్తూ ఉండేవారు స్వామిగారు.

కాలభ్రు లెవరు? స్మార్తులనేవారు ఉన్నారా? తేవారం కవుల కాల నిర్ణయం, తమిళ సంగం యుగం, పల్లవుల మతం, స్థలపురాణాలు, చిదంబరం నటరాజుగుడి పుట్టుపూర్వోత్తరాలు, భాషాశాస్త్రం...... [స్మార్తులని గురించి మొదలుపెట్టిన పరిశోధనల ఫలితంగానే తమిళదేశంలో గోళకీమఠాల రచన వెలువడింది. ఇది భారతిలో పడింది. నటరాజాలయంమీద పుస్తకం ఈ మధ్యనే వచ్చింది. ఇది ఒకప్పుడు ఒక శైవమఠంగా ఉండేదని స్వామిగారి అనుమానం.]

స్వామిగారు బాగా బొమ్మలు వేసేవారు, మంచిశిల్పి, సంగీతం బాగావచ్చు. ఇదంతా ఆయన పేరుమోసిన శాస్త్రజ్ఞుడన్న యథార్థాన్ని కొంత మరుగుపరుస్తూ ఉంటుంది. ఆయన వ్యాసాలు కేంబ్రిడ్జి ఫిలసాఫికల్ రివ్యూలాంటి పత్రికలలో పడేవి. అయినా స్వామిగారికి విదంబనం అన్నది ఏమాత్రమూ ఉండేదికాదు. [ఒకసారి నేను ఎంతో సందేహించి ఒక ప్రశ్న వేశాను. నా ఆలోచనలే అయోమయంగా ఉండటంచేత ఆ ప్రశ్నని సూటిగా వెయ్యలేకపోయాను. ఆయన సంతో

షంగా నవ్వు'ని నా ప్రశ్నని తేటపరిచారు. ఇంగిలీషు మాట్లాడే దేశాలలో తప్ప తక్కిన దేశాలలో డార్విన్—వాలాస్ సిద్ధాంతాన్ని బోధించరని చెబుతూ స్వామిగారు ఒక జర్మని భౌతిక శాస్త్రజ్ఞుడు ఎన్ని వేల తరాలలో ఒక జాతి ప్రాణి మరొక జాతి ప్రాణిగా మారుతుందో లెక్కవెయ్యటానికి ప్రయత్నించాడని అన్నారు. చరిత్ర, సాహిత్యంతోబాటు ఇలాంటి వస్తువులమీద కూడా స్వామిగారు మామూలు వాళ్ళకోసం వ్యాసాలు రాస్తే ఎంతబాగా ఉండేది, అనిపిస్తుంది.]

ప్రొఫెసర్ బి. జి. ఎల్. స్వామిగారు మంచి కార్టూనిస్టు అంటే ఎందరు నమ్ముతారు? ఆయన హాస్యప్రియుడు. కాని సున్నితమయిన హాస్యం అంటేనే ఆయనకి ఇష్టం. 'హాయిమాన్ కా ప్లాన్'ని నాకు పరిచయం చేసినది ఆయనే......

తమిళసంగం సాహిత్యం సుమారు ఎనిమిదవ శతాబ్దానిదేనని ఆయన అభిప్రాయం. [కాల్డ్వెల్ అది ఇంకా తరువాతిదని అనుకున్నాడు.] భారతికోసం దీనిమీద ఒక పెద్ద వ్యాసం తయారుచేస్తానని ఆయన అన్నారు చిత్తు ఒకటి రాసి చూపించి బాగా రాసి ఇస్తానని మళ్ళీ తీసేసుకున్నారు. ఇంతలో హటాత్తుగా గుండెపోటువచ్చి పోయారు.

"[illegible], [illegible] [illegible] [illegible] విషయాలను గురించి ఎందుకు ఆలోచిస్తావు? ప్రేరణ ఏమిటి?" అని ఎప్పుడయినా అడిగితే ఆయన నవ్వి ఊరుకునేవారు. నాకు ఒక అనుమానం ఉంది. ఎంతకాదన్నా స్వామిగారు జాతీయాభిమానం కలవారే. అందుకనే ఆయన ఎంతో నిజాయతీతో చరిత్రని పరిశీలించేవారు. ఆయన శాస్త్రీయదృష్టి కొన్నివర్గాల అసూయకి పనిపిచ్చేది. ["నువ్వు బ్రాహ్మణుడివి, కన్నడం నాడికిందే చెలామణి అవుతున్నావు, రిటయిరయిన తరువాతనే తమిళ సాహిత్యం, చరిత్రమీద వ్యాసాలు ప్రచురించు" అని ఆయన శ్రేయోభిలాషులు స్వామిగారిని హెచ్చరిస్తూ ఉండేవారు. ఒకసారి ఆయన ఆర్కియాలాజికల్ సొసయిటీ ఆఫ్ సౌత్ ఇండియా సభలో చేసిన ప్రసంగం కొందరు తీవ్ర తమిళాభిమానులకి కోపం తెప్పించింది. కొన్ని పత్రికలు ఆయనని దూషించాయి. అదృష్టవశాత్తు ఆయనకి ఏ ఇబ్బందీ రాలేదు.]

ఛీఫ్ ప్రొఫెసరుగా రిటయిరయినా కొంతకాలంపాటు స్వామిగారు ఎమెరిటస్ ప్రొఫెసరుగా ఉన్నారు. ఆ తరువాత ఆయన పూర్తిగా బెంగుళూరుకి మారిపోయారు. "అదే నా ఊరు. అక్కడి వాతావరణమే నాకు ఇష్టం" అనేవారు. మరణానికి ముందు ఆయన ఆల్కాలికంగా మైసూరు విశ్వవిద్యాలయంలో పనిచేసేవారు.

ఎన్నో భాషలు వచ్చి, ఎన్నో విషయాలు తెలిసినవారు కొందరితో నాకు పరిచయం ఉండేది. ఉందికాని బి. జి. ఎల్. స్వామిగారిలాగ అందంగా జీవించగలిగినవారెవరూ తెలియదేమో అనిపిస్తూ ఉంటుంది. వసంతాస్వామిగారికి, ఆయనకి సంతానం కలుగలేదు.

రా.

భారతిలో కవితలు - లేఖలపై ఒక లేఖ

1980 జనవరి సంచికలో శ్రీ ఆచార్య తల్లోజుగారి లేఖ, దానిపై 1980 మార్చి సంచికలోని శ్రీ లింగంపల్లి రామచంద్రంగారి, మరియు 'మే' సంచికలోని శ్రీ బెడిద రాజేశ్వర్‌గారి విమర్శలు చదివాకా ఈ లేఖ వ్రాయక తప్పటం లేదు.

'భారతి' పత్రికలో ప్రచురిత మవుతున్న వచన కవితలు సామాన్యులకు అర్థం కావడంలేదన్న తల్లోజుగారి అభిప్రాయాన్ని శ్రీ ఎల్. రామచంద్రంగారు విమర్శిస్తూ "తల్లోజుగారూ! 'భారతి' పాత సంచికలు సావధానంగా చదివి చూడండి. కవితలు అర్థమవుతాయో లేదో తెలుస్తుంది" అని అన్నారు. అంటే కొత్త సంచికలలోని కవితలు అర్థం కావటంలేదని పరోక్షంగా ఆయన అంగీకరించినట్లే అయింది. అంటే శ్రీ లింగంపల్లి రామచంద్రగారు తల్లోజుగారి అభిప్రాయాన్ని సగంవరకూ సమర్థించినట్లే అయింది.

1980 మే సంచికలో శ్రీ బెడిద రాజేశ్వర్‌గారు తల్లోజుగార్ని నిశితంగా విమర్శించారు ... 'భారతి'లోని కవితలన్నీ అర్థమవుతున్నాయి అన్నారు ... కాని, నేను ఈ అభిప్రాయంతో ఏకీభవించను.

అసలు కవిత్వం ఎవరికోసం ?

ప్రజల కోసమా? కవుల కోసమా ?

'భారతి'లోని కవితలు కవులకు, పండితులకు అర్థం గావచ్చు కాని, సామాన్యులకు అర్థం గావడంలో లవలేశమైనా అతిశయోక్తి లేదు.

కొన్ని కవితల్ని క్రింద ఉదహరిస్తున్నాను.

1980 జనవరి సంచికలో శ్రీ కాసల నాగభూషణం వ్రాసిన 'తేజోఽవతరణం' కవితలోని భావం సామాన్యులకు అందుబాటులో ఉండదు. అలాగే అదే సంచికలో శ్రీ రంధి సోమరాజుగారు వ్రాసిన 'పాషాణ నేత్రం' కూడా అంతే.

1980 మార్చి సంచికలో శ్రీ యస్. జి. డి. చంద్రశేఖర్‌గారి 'కనిలా తరంగాలు' కవితలోని భావం సామాన్యుడికి అర్థంకాదు. కాని, ఆయన ప్రాసకోసం పడిన పాట్లు ఇందులో ఎక్కువగా కనిపిస్తోంది.

1980 ఏప్రిల్ సంచికలో శ్రీ సాంధ్యశ్రీగారి 'రసావిష్కరణ' కవిత కూడా అదే కోవకు చెందినది. ఇదే సంచికలో శ్రీ విలమకూరి రామబ్రహ్మంగారి 'ఈగలు ముసిరిన బెల్లం' కవితలో

'...పరుగులు మంటలు ఆకలి
ఝుం ఝుం తత్త్వం సోహం రసోవైసః
... అని సామ్యగానాల రోదాలు చేస్తూ
ముసిరిన ఋత్విక్కుల మాటున

మనక మసగ్గా కనబడుతూ
బుల్లిక్కులచే పీక్కు తినబడుతూ
అంతటా తానేయై అడుక్కుంటూ
తినకుండానే ఉంటున్న

యజ్ఞ పురుషుడు .. .. '' ఈ వాక్యాలిక్కని అర్థం సామాన్యులకు అందదు.

1980 మే సంచికలో శ్రీ అడిదం పాపారావుగారి 'ఆతడు' కవిత కూడా ఇదే కోవకు చెందినది. ఇదే సంచికలో శ్రీ గూడ శ్రీరాములుగారి 'నిరీక్షణ' కవిత పై విధమైనదే.

నేను ఉదహరించిన కవితలు సామాన్య జనుల కర్థం గావడంలో ఇసుమంతైనా అబద్ధం లేదు. ఈ నా అభిప్రాయాన్ని బలపరుస్తున్నట్లు 1980 ఫిబ్రవరి సంచికలో శ్రీ హరిశ్చంద్రారెడ్డి గారు తన 'బ్రహ్మవాత' కవితలో

'' . చేతిలో వంకర టింకర గీతలు
అర్థంగాని గీతలు అవి నాకు
ఏం భాషయ్యా - బ్రహ్మయ్యా
. .. .
. . ..
మన కవులు కొందరు కవితలు వ్రాస్తారు
ఆ కవితల కర్థం వారికే తెలియదు . ''

అంటూ బ్రహ్మవ్రాత వంటి కవుల వ్రాతల గురించి చక్కగా వివరించారు.

నా దృష్టిలో కవిత్వం అనేది కవుల కోసం కాదు. ప్రజల కోసం ... దీని కనుగుణంగా 'భారతి'లో ప్రచురించబడిన కవితల్ని రెండు రకాలుగా విభజిస్తున్నాను

(1) సమాజం కోసం వ్రాసినవి.

(2) సమాజానికి ప్రయోజనం చేకూర్చనివి.

ఏ విధంగానూ సమాజానికి ప్రయోజనాన్ని చేకూర్చని కొన్ని కవితల్ని క్రింద ఉదహరిస్తున్నాను.

1980 జనవరిలో శ్రీ పవని ఆర్. హరినాథ్ వ్రాసిన ''స్మృతి''

''సమీరం సుతారంగా
శరీరాన్ని తాకిన
ఏ ప్రాతః కాలాన్నో
మెలకువ నిద్ర లేపుతుంది ''

ఈ కవితలో సమాజానికి మేలుకొలుపు ఏమాత్రం లేదు.

1980 ఫిబ్రవరి సంచికలో 'కన్న'గారు వ్రాసిన ''ఎందుకో... ఎందుకో ...''

''కదలివచ్చే మొయిలు
పిల్ల తెమ్మెర సోక
జల్లు జల్లుగ సాగి
ఒళ్ళంతా తడిపింది

ఈ కవితలో సమాజానికి పనికివచ్చే విషయం కాగడా వేసి వెతికినా కానరాదు

1980 మార్చి సంచికలో శ్రీ తిరునగరి వ్రాసిన ''ఆహుతి''

నీ పగడాల పెదవుల లోంచి తళతళ మెరసే
మల్లెమొగ్గల దంతాలను మరీ మరీ చూచుకొని
ఒయ్యారంగా కదిలే నీ ఒంటి సొంపుల లకు
పొంగిపోతున్నావు ... . '

ఈ కవితలో సమాజానికి చెప్పేది వ్యంగ్యం.

1980 ఏప్రిల్ సంచికలో శ్రీ కె. మల్లికార్జునరావు వ్రాసిన 'స్మృతి'

''సెలయేటి ఎడద అడుగున
దాగిన కడలి ప్రోతలో
వెలికి వచ్చి పలికే విరహాగీతి ''

ఈ కవితవల్ల సమాజానికి ఒరిగేదేమీ లేదు.

అలాగని, సమాజానికి ఉపయోగపడే మంచి కవితలు కూడా చుక్కల్లో చంద్రుడిలా ప్రచురింపబడక పోలేదు. ఉదాహరణకు కొన్ని మచ్చు తునకలు.

1980 జనవరి సంచికలో 'మొదటి తరగతి ప్రయాణీకులు వేచియుండు గది' కవితలో

' ..మేనమామ కొడుకు సంపాదనలో
వాటాలు కుదరక అత్తగారింటికి రమ్మంటున్నారు
అశోకుని ధర్మచక్రాల టోపీలు ధరించిన చట్ట రక్షకులు

అని ఒక పచ్చి నిజాన్ని చెప్పారు శ్రీ ఆత్మకూరి కామేశ్వరరావుగారు. అలాగే 'కవులు — బహుపరాక్' కవితలో శ్రీ దేశపతి గోపాలకృష్ణ

కవి చేతిలో దేశద్రోహులు
గరుత్మంతుని నోటి పాములు
నరసింహం కొరికి పారేసిన
హిరణ్య కశిపులు
వీరభద్రుడు కోసిన శిర్షహీన
పశ్చాత్తప్త దక్ష ప్రజాపతులు ...'

అని కవియొక్క శక్తిని చక్కగా వివరించారు.

1980 ఫిబ్రవరి సంచికలో శ్రీ మదార్ వేణుగారు 'సం — దేశం' కవితలో

తాటాకు కలుగుల్లో
చితికిపోతున్న తొండలు
పెంకుల గూడుల్లో
ఎండిన అస్థిపంజరాలు
సత్యం గుండెల్లో దూసుకు
పోతున్న తుపాకీ గుళ్ళు

అంటూ చక్కని సందేశాన్ని యిచ్చారు.

1980 మార్చి సంచికలో శ్రీ బి. బి. జి. తిలక్‌గారు

'... ఓ అశాంతి కాముకులారా!
ఓ ఏసు
ఓ గాంధి
ఓ మార్టిన్ పుట్టని మీ సమాజాన్ని
పటిష్ఠం చేసుకోండి
మీ శాంతిని మీరే స్థాపించుకోండి. ''

అంటూ శాంతి సందేశాన్ని చక్కగా అందించారు.

1980 మే సంచికలో 'నా గీతం' శ్రీ కె. దినకర్‌గారి కవిత బహుచక్కనిది

1980 ఫిబ్రవరి సంచికలో 'కిం కవేస్తస్య కావ్యేన ' కవితలో శ్రీ తిరువగిరి

నీతి శతకాన్ని దాటేసి
నాతి కోసం మల్లెదండ కొంటున్న నాగరికుడు
కేమిస్ట్రియాల, యూకలిప్టస్‌ల పేజీలను గాలికి
రెప రెప లాడిస్తున్న ఆధునిక కవితను
ఛీత్కారంగా చూసి
కేళీరంగానికి పదిరూపాయల 'ప్లేకార్డ్స్ సెట్టు'
కొనుక్కుంటున్న విద్యావంతుడు . . .''

అంటూ సాహిత్యానికున్న నేటి ప్రజాదరణ గురించి చక్కగా వివరించారు. అంతలోనే వారికి ప్రియురాలు జ్ఞాపకం వచ్చిందేమో, అందుకే మరుసటి సంచికలో

'... రా చెలీ!
జీవితాన్ని రసరమ్యమైన ప్రణయ కావ్యంగా
రచించుకుందామురా
పరవశించి పాడుకుందామురా ...''

అంటూ ఊహాలోకాల్లో తేలియాడసాగారు.

ప్రజలకు కావలసింది మనస్సును మభ్యపెట్టే కవిత్వం గాదు ... వెన్నుతట్టి మేధకు పదునుపెట్టే కవిత్వం కావాలి.

'భారతి'లోని కవితల్ని పైన చెప్పినట్లు రెండు విధాలుగా ఈ క్రింది పట్టికలో పొందుపరుస్తాను

నెల	సమాజమునకు ఉపయోగపడే కవితలు	సమాజమునకు ఉపయోగపడే కవితల శాతం (సుమారుగా)	సమాజమునకు ఉపయోగపడని కవితలు	సమాజమునకుపయోగ పడని కవితల శాతం (సుమారు)
1980 జనవరి	3	27	9	73
1980 ఫిబ్రవరి	6	36	9	64
1980 మార్చి	4	28	10	72
1980 ఏప్రిల్	4	26	11	74
1980 మే	4	32	8	68
1980 జూన్	4	26	11	74

అంటే జనవరి 1980 నుంచి జూన్ 1980 వరకూ గల మొత్తం 'భారతి' సంచికలలో సమాజం కోసం ఉపయోగపడే కవితలు 29.16% (సుమారుగా) మాత్రమే ప్రచురితమయ్యాయి. సమాజానికి ఉపయోగపడని కవితలు 70 84% (సుమారుగా) ప్రచురితమయ్యాయి

పైన పేర్కొన్న పట్టికలోని వివరాలనుబట్టి సమాజ ప్రయోజనానికి ఉపయోగపడే కవితలు 'భారతి'లో ఎన్ని ప్రచురితమవుతున్నాయో అర్థమవుతుంది

సమాజానికి ఉపయోగపడకపోతేనేమి, ఆ కవితలు కళాత్మకంగా ఉన్నాయి ఆ కవితలలో అణువణువునా సాహిత్యం తొణికిసలాడుతోంది అని కొందరు అనవచ్చు కానీ, అవి ప్రజలకు అర్థమైనప్పుడే వాటిలో ఉండే సాహిత్య విలువలకు, కళకూ వన్నె ఏర్పడుతుంది. లేనప్పుడు అవి పంచదారకు బదులు ఉప్పు వేసిన పాలవుతాయి. ఈ ఆరు నెలల 'భారతుల'లోని కవితల్ని అర్థమయ్యేవి, అర్థమవనివి అని రెండు తెగలుగా విభజించి ఈక్రింది పట్టికలో పొందుపరుస్తున్నాను.

నెల	అర్థమయ్యే కవితలు	అర్థమయ్యే కవితల శాతము (సుమారుగా)	అర్థమవని కవితలు	అర్థంగాని కవితల శాతము (సుమారుగా)
1980 జనవరి	5	40	7	60
1980 ఫిబ్రవరి	5	36	9	64
1980 మార్చి	6	42	8	58
1980 ఏప్రిల్	6	37	9	63
1980 మే	7	62	5	38
1980 జూన్	6	38	9	62

అంటే 1980 జనవరి నుంచి 1980 జూన్ వరకూ గల మొత్తం ఆరు 'భారతి' సంచికలలో అర్థమయ్యేవి 37 5% (సుమారుగా), అర్థంగానివి 62.5% (సుమారుగా) ప్రచురితమయ్యాయి.

ఇక 1980 జూన్ సంచికలో ప్రతీ కవితలోనూ, ఆకాశం, నక్షత్రాలు, చందమామ మితిమీరి చోటు చేసుకున్నాయి.

ఇక లేఖల విషయానికి వచ్చేటప్పటికి 'భారతి' ఒక చిన్న సైజు యుద్ధ రంగమవుతోంది. ఒకరినొకరు ఘాటైన అక్షర సముదాయంతో తిట్టుకోవడం, విమర్శనా బాణాలతో కొట్టుకోవడం ఈమధ్య పరిపాటైపోయింది. వీటికి ఉదాహరణలు యివ్వక్కర్లేదనుకుంటా.

'కేవలం వ్యక్తిగతంగా తిట్టుకునే సాహిత్య రోతగాళ్ళు ' అంటూ డా యం. మురళీధర్ మరియు డా. కె. వి. వెంకన్నా పవార్‌లు 1980 ఏప్రిల్ సంచికలో వాపోయారు. 'భారతి' ని యుద్ధరంగంలా వాడుకుంటున్న కవులు యుద్ధం మానివేసి, ఓర్పుతో చక్కని రీతిలో చర్చించుకుంటే మంచిది.

ఇంక ముగింపు కొచ్చేస్తాను.

ప్రబంధ కావ్యాలు సామాన్య జనావళి మనసుల్లో ఎందుకు చోటు చేసుకోలేకపోయాయ్ ?

అవి సామాన్యుల కర్థమయ్యే రీతిలో లేకపోవడమే కారణం వాటిల్లోని విషయం సామాన్యులకు కావలసింది లేకపోవడమే ప్రబంధ కావ్యాల్లోని పెద్ద లోపం. బి ఏ. లు, ఎమ్. ఏ. లు, చదివినవాళ్ళే ప్రబంధాలు చదివేటప్పుడు నిఘంటువులు దగ్గర పెట్టుకుంటారనడంలో అతిశయోక్తి లేదేమో . .

ప్రబంధ కావ్యాలు గ్రంథాలయాల్లో బీరువాలు అలంకరించడానికే కాని, ప్రజల మనసులను అలరించడానికి ఉపయోగపడటం లేదు. నేటి ఆధునిక వచన సాహిత్యానికి అటువంటి దుర్గతి పట్టకూడదని నా ఆకాంక్ష.

భగ్వాన్

వాడే వీడా ?

1980 జూన్ నెల భారతిలో నిగమశర్మోపాఖ్యానమును గురించి శ్రీ సర్వేశాయి తిరుమలరావు గారు వ్రాసిన వ్యాసము చాలా విశ్లేషణాత్మకముగా నున్నది. ఈ ఉపాఖ్యానము సంకేత కావ్యమని చాలా చక్కగా నిరూపించినారు.

అంుతే, వారు రామకృష్ణుని గూర్చి వ్రాసిన విషయములను విచారించవలసి యున్నది.

'హాస్యగాడు'గా ప్రసిద్ధిచెందిన రామలింగడును, పాండురంగ మాహాత్మ్య కృతికర్త యగు రామకృష్ణుడును ఒకరేనా యని సందేహిస్తూనే శ్రీ సర్వేశాయి తిరుమలరావు గారు 'ఏది యేమైనను వాడే వీడైనాడు' అని వ్రాశారు. ఈ రామలింగ, రామకృష్ణులను గూర్చి విస్తారమైన పరిశోధనలు జరిగినవి ఫలితముగా శ్రీకృష్ణదేవరాయల ఆస్థానములో 'వికటకవి'గా నున్న తెనాలి రామలింగడు, ఉద్భటారాధ్య చరిత్రము వ్రాసిన కాలమున రామలింగాఖ్యుడై, పాండురంగ మాహాత్మ్య రచనా కాలమునాటికి రామకృష్ణుడుగా ప్రసిద్ధి గాంచిన వాడు ఒకరు కారని, భిన్నులని సిద్ధాంతీకరించబడినది. అయినప్పటికిని, విద్వాంసు లింకా 'వాడే వీడ'ను భ్రమకు లోనై రామకృష్ణుడు 'హాస్యగాడు' అని భావిస్తూ అతని కావ్యాలలో -ముఖ్యముగా పాండురంగ మాహాత్మ్యములో—హాస్యరసస్ఫోరకములైన పద బంధాలను, సన్నివేశాలను వెతికి వెతికి బయటకు లాగుతూ అతనిని హాస్యగానిగా నిలబెట్ట ప్రయత్నిస్తున్నారు. ఈ దురవస్థకు లోనగుట వలననే శ్రీ తిరుమలరావుగారు పాండురంగ మాహాత్మ్యములో 'విట్టీ' ప్రయోగములు చూపించుటకు చాలా శ్రమపడవలసి వచ్చినది. 'ఈ అభేదము పాండురంగ మాహాత్మ్య కావ్యావగాహనకు అవరోధముగ నున్నది. తత్కావ్యసాహిత్య విమర్శను కవి హృదయ విరోధ మార్గమును పట్టించునదిగనున్నది' అని వ్రాసి దానిని సమర్థించుకొనుటకు అవస్థపడవలసి వచ్చినది.

తెనాలి రామలింగనికి, మొదట రామలింగడై పిదప రామకృష్ణుడైన వానికిని గల భేదము లివి.

తెనాలి రామలింగడు : విశ్వబ్రాహ్మణుడు. కశ్యపగోత్రుడు. మల్లిఖార్జునుని పుత్రుడు. కృష్ణరాయల చేత తెనాలిని అగ్రహారముగా

పొందినవాడు. వికటకవి క్రీ॥ శ॥ 1462లో జన్మించి రాయల యాస్థాన కవియై రాయలకన్న ముందుగా స్వర్గస్థుడైనాడు. ఇతని గ్రంథములలో పాండురంగ విజయము ఒకటి ఇది యిప్పుడలభ్యమైనను, నిన్న మొన్నటి విద్వాంసులీ గ్రంథమును చదివినట్లును, అందులోని కొన్ని పద్యములు ఇప్పటికీ కొందరి కంఠస్థములైనట్లును నిదర్శనము లున్నవి. ఆది పురాణము, ఒక బూతుగ్రంథము, వీరజనమనోరంజనము, లింగపురాణము, కందర్పకేతువిలాసము, హరిలీలా విలాసము ఇతని ఇతర గ్రంథాలుగా పరిశోధకులు పేర్కొనినారు.

మొదట రామలింగాఖ్యుడై పిదప రామకృష్ణుడైనవాడు: ఇతను గార్లపాటి రామపండితుని కుమారుడు. ఇతని శైవ గురువు పాలగుమి ఏలేశ్వరుడు, వైష్ణవ గురువు భట్టరు చిక్కాచార్యులు. ఇతని తమ్ముడు అన్నయు కూడా ఒక శైవ గురువు (పాలగుమి భీమ గురువు)ను ఒక వైష్ణవ గురువు (కందాళ శ్రీరంగ గురువు)ను కీర్తించాడు. ఉద్భటారాధ్య చరిత్ర, పాండురంగ మాహాత్మ్యము, ఘటికాచల మాహాత్మ్యము ఇతని రచనలు. ఇతను 'హాస్యగాడు' కాదు.

ప్రఖ్యాతి గాంచిన ఎందరో ప్రాచీనాంధ్రకవుల జీవిత విశేషములు దురదృష్ట వశమున మరుగున బడినవి. కొందరి జీవితగాధలు మరి కొందరివిగా ప్రచారమొందినవి. పరిశోధకులు ప్రకటించిన కొన్ని చరిత్రాంశములను కూడా పండితులు పరిగ్రహించక జనశ్రుతినే ప్రమాణముగా గ్రహించుటతో సమస్యలు మరింత జటిలమౌతున్నవి. 'జనశ్రుతిలోని తెనాలి రాముడెప్పటి వాడో తెలియదు. నిజముగా ఉండెనో కూడా చెప్పలేము' అని శ్రీ సర్దేశాయి తిరుమలరావుగారి వంటివారు వ్రాయుట మిక్కిలి శోచనీయము. ఇక పరిశోధకుల పరిశ్రమను గుర్తించు వారెవరు ?

డా. సూర్యదేవర రవికుమార్

ఆధునిక కవిత - తాత్త్విక పరిభాష

'సంస్కార' సినిమాలో బ్రాహ్మణత్వాన్ని మంటకలిపిన ఓ వ్యక్తి చనిపోతాడు. అగ్రహారంలో నివసించే బ్రాహ్మణులు అతణ్ణి దహనం చెయ్యడానికి అంగీకరించరు. ఆ అగ్రహారంలోకెల్లా విద్యాధికుడైన పూజారి సమస్యను తీవ్రంగా పరిశోధించి చివరికి తన పవిత్రతను, బ్రాహ్మణత్వాన్ని విసర్జించి ఆ శవాన్ని దహనసంస్కారం చెయ్యడానికి నిర్ణయిస్తాడు అయితే రోజుల తరబడిగా దహనంచెయ్యకుండా వున్న శవం వీచే దుర్వాసనని సింబాలిక్‌గా చనిపోయిన ఎలుకలద్వారా దర్శకుడు తెలియచేస్తాడు గ్రామంలోని బ్రాహ్మణులు దుర్వాసనని భరించలేక గ్రామాన్ని విడిచి వలసపోతారు కాని పూజారి మాత్రం దుర్వాసనని అరికట్టడానికి పూనుకుంటాడు థియేటర్లో కూర్చుని సినిమా చూసే ప్రేక్షకులుసైతం దుర్వాసనని పీల్చేంత బలంగా చిత్రించాడు దర్శకుడు చిత్రాన్ని.

నేటి కవి 'సంస్కార'లో పూజారి పాత్ర నిర్వహించాల్సివుంది. ప్రపంచమంతా దట్టంగా పేరుకుపోయిన దుర్వాసనని తన ఘ్రాణేంద్రియాల ద్వారా గ్రహించి, ఆ దుర్వాసననుండి పారిపోయే ప్రయత్నం చెయ్యకుండా నిలిచి ఆ దుర్వాసనని అంతంచెయ్యడమే నేటి కవి బాధ్యత.

శ్రీశ్రీ 'కొందరు పుట్టుకతోనే వృద్ధులు'అన్నారు అలాకాదు. ఇవ్వాళ అందరూ పుట్టడమే మరణించి పుడుతున్నారు పుట్టుకతోనే శవాలైన మనుషులతో నిండిన ఈ ప్రపంచం భరించరానిదిగా తయారైంది. ఆ శవాలు నిర్మిస్తున్న రోడ్లు, భవనాలు, చట్టాలు, ప్రభుత్వాలు. జీవితం ప్రతి అంగుళం శవప్రాయంగా మారిన నేటి దుర్భర పరిస్థితుల్లో కవి స్థితి పూర్తిగా దుర్భరం. ఇటువంటి భయానక స్థితి నుండి కవి అయినవాడు పారిపోలేడు కొందరు కవులు పారిపోగల్గుతున్నారు, దానిక్కారణం వారు గతంరుచి మరిగినవారు, 'సుఖ' రోగులు కావడం

కవిత్వంలో, ఇతర కళారంగాల్లో నేడు కనిపిస్తున్న తాత్త్విక దృక్పధానికిగల చరిత్రను కొంత పరిశీలిద్దాం

18వ శతాబ్దాంతం వరకు కవి తాను సమాజంకన్నా ఉన్నతుడిగా, ప్రత్యేకమైనవాడుగా తలంచేవాడు యాంత్రికీకరణ అధికమైనకొద్దీ కవి తన ఏకాంతాన్ని, స్వేచ్ఛని కోల్పోయాడు. మొదట్లో ఏకాంతాన్ని కోల్పోయిన కవి ఏకాంతం కోసం, ఏకాంతం వల్ల సాధ్యమయ్యే స్వేచ్ఛకోసం తపించాడు. అట్లా తపించిన కవిత్వమే పాశ్చాత్య సాహిత్యంలో కాల్పనిక వాదం. 19 వ శతాబ్దంలో సగభాగం అట్లానే గడిచింది. అయితే శతాబ్దం చివరిభాగంలో కవికి తన ఓటమిని, నిస్సహాయతను అంగీకరించక తప్పలేదు. కాల్పనిక వాదాన్ని పాతిపెట్టి ఆధునిక కవిత్వాన్ని సృజించిన మొదటి వాడిగా రింబో మనకు కనిపిస్తాడు. కవిత్వం నిష్ప్రయోజనమనే నిర్ణయానికి వచ్చి కవిత్వాన్ని త్యజించి తన మిగిలినజీవితాన్ని చాలా అరాచకంగా గడిపి, నాగరిక ప్రపంచానికి దూరంగా దిక్కులేని చావు చచ్చాడు. శబ్దానికి, నిశ్శబ్దానికి తేడా కనిపించలేదు కవికి. దాన్నే నిహిలిజం అన్నారు తాత్త్వికులు డాస్టవిస్కీ 1864లో రాసిన 'నోట్స్ ఫ్రం అండర్‌గ్రౌండ్'లో అర్ధరహితమైన, పతనమైన తన జీవితాన్ని అంగీకరించిన్నాడే మనిషి తిరిగి మనిషిగా జన్మించగలడనిప్రకటించాడు. అది మొదలు మనిషికి జీవితంపట్ల దృక్పథం మారింది అదేకాలంలో తత్వవేత్తలు కీర్కెగార్డ్, నీషే, మార్క్సులు భావవాదాన్ని, అధిభౌతిక శాస్త్రాల్ని ఖండిస్తూ ఇదే భావాల్ని ప్రకటించారు. నీషే కాల్పనిక వాదాన్ని తాత్త్వికంగా తిరస్కరించి, జీవితాన్ని [అన్ని లోపాలతో] అంగీకరించగల, ఎదుర్కొగల శక్తివంతుడైన నూత్న మానవుణ్ణి సృజించిందికూడా ఆ కాలంలోనే ఇంచుమించు ఆ తాత్త్విక దృక్పథమే నేటికీ మనిషిని పాలిస్తుంది ప్రపంచమంతా.

కనుక నేడు కవికి సమాజం గురించి రాయమని ఒకరు ఉపదేశించాల్సిన అవసరం ఏమాత్రం లేదు కవికీ, సమాజానికీ అంతరం వున్న కాలంలో కవి తన చర్మంలోకి దూరి తన గొడవను మాత్రమే ఏకరువుపెట్టే అవకాశాలుండేవి కాని కవికీ, సమాజానికీ [అతని పరిసరాలకి] మధ్యగల దూరం నశించిన నేటి కాలంలో కవి అనివా

ర్యంగా సమాజ వ్యత్యంలో స్వేచ్ఛగాఊపిరిపీల్చుకోలేని మనిషి గురించి మాత్రమే రాస్తాడు. దీనికి మనకు ఎన్నో ఉదాహరణలు లభిస్తాయి. అయితే నేడు కూడా కాల్పనిక కవిత్వపు సరిహద్దులు దాటని కవులు మనకు కనిపిస్తారు. వారి కాల్పనికత్వానికి కారణం వారు గతంలో జీవించడం [ఇంగ్లీషులో వీళ్ళని 'తిక్ స్కిన్డ్' అని పిలవొచ్చు].

కాల్పనిక కవిత్వం చారిత్రికంగా ఇవ్వాళ సాధ్యపడకపోవడానికి చాలా కారణాలున్నాయి. కాల్పనిక కవిత్వానికిపూర్వం మనిషి ప్రకృతి నుండి వేరు కాదు. కాల్పనిక కవులు రంగప్రవేశం చేసేనాటికి మనిషి ప్రకృతి నుండి వేరుచెయ్యబడుతున్నాడు. మానవజీవితంలో క్రొత్తగా ప్రవేశిస్తున్న యాంత్రిక నాగరికతను నిరసించడం మనం బ్లేక్‌లో స్ఫుటంగా చూడొచ్చు. ప్రకృతి ఒడిలో మాత్రమే ఈ సూత్న సమస్య లకు పరిష్కారం లభిస్తుందని కాల్పనికులు విశ్వసించారు. కనక చారిత్రి కంగా మానవజీవితంలో అసూహ్యమైన మార్పులు రూపుదిద్దుకుంటు న్నప్పటికీ కాల్పనికులు మాత్రం ప్రకృతిని తమ జీవితంలో ప్రధాన భాగంగా తలంచారు. కాని క్రమక్రమంగా మనిషికి, ప్రకృతికి మధ్య అగాధాలు సృష్టించబడ్డాయి. మనిషి ప్రకృతినుండి వెలివేయబడ్డాడు మనిషి ప్రకృతితో తన బాంధవ్యాన్ని కోల్పోయాడు. ప్రకృతి మనిషికి ఏమీ కాకుండా పోయింది. దీనిక్కారణం జీవితం ఇరుకైపోవడం. తన కాలాన్ని భౌతికావసరాలకోసం వెచ్చించడంలో నిమగ్నుడైన మనిషి క్రమంగా ఆనందానుభూతిని పొందగల ఇంద్రియాల్ని కోల్పోయాడు. నగర జీవితం మనిషికి వధ్య శిలగా మారింది. అందువల్ల 20వ శతాబ్దపు కవి—వృక్షాలు, పక్షులు, నక్షత్రాలు, కుసుమ సౌరభాలు, పిల్ల తెమ్మెరలపై కవిత్వం రాయడు అలా ఎవరైనా రాస్తే వాడు ఖచ్చితంగా మానవాతీతుడు.

చరిత్ర గమనంలో మనిషి ఉన్నత శిఖరాలందుకోవాల్సిపోయి వెనక్కెనక్కెనక్కి నిరింద్రియ ప్రపంచంవైపు వేగంగా తిరోగమిస్తున్నాడు ఇప్పుడు మనిషి రాళ్ళకన్నా ఏమీ గొప్పవాడు కాదు. ప్రకృతి సేంద్రియ ప్రపంచానికి [ఆర్గానిక్ వరల్డ్] చెందింది. వృక్షాలూ, పుష్పాలు జీవశక్తితో నిత్యం వికసిస్తాయి. నిరింద్రియుడిగ [ఇనార్గానిక్ బీయింగ్] మారిన మనిషి తనకన్నా ఉన్నత స్థాయిలో వున్న సజీవ ప్రపంచాన్నిగూర్చి ఎట్లా రాయగలడు? అలా రాయడం పూర్తిగా అసాధ్యం. మనిషి ఎట్లా ఆటవిక దశకు, నిరింద్రియ దశకు చేరిందీ మార్క్స్ ఎంతో విపులంగా చర్చించాడు మనిషి ఇంద్రియాలు కనీసం జంతుస్థాయిలో కూడా లేవని, జంతువుకన్నా, ఆటవికుడికన్నా మనిషి నీచస్థాయిలో బ్రతుకుతున్నాడని మార్క్స్ ఆనాడే గుర్తించాడు. [పేజి 110, ఎకనామిక్ అండ్ ఫిలాసఫిక్ మాన్యుస్క్రిప్ట్స్ ఆఫ్ 1844, 1977; ప్రొగెస్ పబ్లిషర్స్, మాస్కో]. అయితే ఇట్లా జడుడిగా, నిర్జీవిగా, నిరింద్రియుడిగా రూపాంతరం చెందిన మనిషికోసం కవిత్వం ఎట్లా రాయాలనే సమస్య తలెత్తుతుంది. మనిషి ఏ రూపమూ, కదలిక లేని నిశ్చలమైన శిలగా మారాడు కనుక ఆ శిలను బద్దలుకొట్టి, రూపమిచ్చి, ప్రాణాన్నిచ్చి మనిషిని సృష్టించాల్సినవాడిగా, శిల్పిగా కవి మారాలి. కనక కవి శిల్పి. అరూప పదార్థాన్నుండి రూపాన్ని వెలికితీసేవాడే శిల్పి. అదేవిధంగా వూహించలేనంత ఘోరంగా పతనమైన మనిషిని నిజమైన మనిషిగా మార్చగల్గేవాడేకవి. కాబట్టి కవికి నేడు శిల్పికి కావలసిన దృఢత్వం, దారుఢ్యం, కఠినత్వం, క్రూరత్వం కావాలి. మనిషి తనంత తానుగా మారగలడన్ననమ్మకంతో చాలాకాలంగ కవీ, తాత్త్వికుడు ఎదురుచూశారు. కాని అలాంటిదేమీ జరగలేదు. మనిషికి జీవితంపట్లగల భ్రమల్ని నిర్మూలించడంద్వారా కవి మనిషిని స్వప్నావస్థనుండి మేల్కొల్పగలడు. ఈనాటికీ మనిషికి ఎన్నెన్నో భ్రమలు, విశ్వాసాలు మతంపట్ల, జ్ఞానంపట్ల, సిద్ధాంతాల పట్ల, రాజకీయాలపట్ల వున్నాయి. భ్రమల్ని పూర్తిగా తొలగించి మనిషిని నగ్న వాస్తవంలోకి ఈడ్చుకురాగల్గాలి కవిత్వం ఇది కవి శిల్పిలా క్రూరంగా, కఠినంగా ప్రవర్తించిన్నాడు మాత్రమే సాధ్యమౌతుంది.

కవి ప్రాథమికంగా విధ్వంసకుడు. శ్రీశ్రీ తన మహాప్రస్థాన గేయాలద్వార విధ్వంసాన్ని బలంగా ధ్వనించి, దిగంబరులు తమ ప్రత్యేక శైలిలో విధ్వంసాన్ని ప్రకటించి ఈ దేశంలో ఏమీ వుప యోగం లేకుండా పోయింది. కవిత్వాన్ని ధ్వంస రచనగా అంగీకరించ లేని బలహీన బలాత్ములు ఏవిధంగా కవులో ఎంతకీ అంతుపట్టదు. ధ్వంస రచనగాకాక కవిత్వం ఇంకోవిధంగా ఎలా ఉండగలదో వూహించ లేను. కవిత్వ విధ్వంసితత్వాన్ని బైరాగి చాలాస్పష్టంగా ప్రకటించాడు, తన 'విధ్వంసం' అనే గేయంలో.

'వినాశ సుందర రూపం
వీక్షించిన వాడెవడూ
వికాస జడస్వాంతం
రక్షింప బూన డెవడూ
జుగుప్స మన ఆదర్శం
ప్రేయసి మన విధ్వంసం'

కవిత్వం ఎప్పుడూ నెగటివ్‌గా వుంటుంది. కవి వాస్తవాన్ని తిరస్కరించడానికే కవిత్వం రాస్తాడు. కృత్రిమ విలువలు నిజమైన విలువలుగా చలామణీ అయ్యే సమాజంలో, భాషద్వార, వ్యక్తీకరణ సాధ్యం కానటువంటి సమాజంలో కవి నూత్న విలువల్ని సృష్టించ డానికి గతాన్ని, వర్తమానాన్ని ధ్వంసం చెయ్యాలి. బ్రతకనేర్చిన పెద్ద మనుషుల ప్రపంచం[గ్రోన్ అప్ వరల్డ్]తో సఖ్యత నేర్పర్చుకోలేని కవి ఆ ప్రపంచంతో చేతులు కలపక— ఆ ప్రపంచానికి ఆవల నిలబడి తన పోరాటాన్ని కొనసాగిస్తాడు.

కవికీ, వాస్తవానికీ అంగీకారం కుదరనప్పుడే కవిత్వం జన్మిస్తుంది. కనక కవి ఎప్పుడూ వాస్తవంతో పోరాడుతాడు. వాస్తవ జీవితం అమర్చే సాధనాల్ని, విలువల కొలమానాల్ని అతడు అంగీకరించడు. కనక కవిత్వం ఎప్పుడూ గతితార్కికంగానే వుంటుంది. గతి తార్కిక పోరాటంవల్ల సృష్టించబడే నూత్నవాస్తవం ప్రస్తుత వాస్తవానికి భిన్నంగా వుంటుంది. కవిత్వం వాస్తవాన్ని ఖండిస్తుంది కనుక మనం ఏ గొప్ప కవిత్వంలోనైనా గతితార్కికతను [డయలెక్టిక్] చాలా సహజంగా, అనివార్యంగా దర్శిస్తాం.

గతితార్కిక కవిత మాత్రమే క్రియాశీలంగా [ఆక్టివ్] వుంటుంది. వాస్తవంతో సంబంధంలేని కవిత్వం ఎప్పుడూ ఉదాసీనంగా

[పాసివ్]గా వుంటుంది. అట్టి కవిత్వం పాఠకుల్ని దీర్ఘనిద్రలో వుండడానికి మాత్రమే తోడ్పడుతుంది. కాని గతితార్కిక కవిత్వం మనిషిని క్రియాశీలుణ్ణిచేసి అతనికి జీవితంతో పోరాడగల శక్తినిస్తుంది. మనిషిని శక్తివంతుడిగా, బలవంతుడిగా మార్చలేనిది కవిత్వం కానేరదు కవిత్వం చదివింతర్వాతకూడా మనిషి పిరికివాడుగా, భయస్తుడుగా, జీవితం చేతిలో ఓడిపోయేవాడుగా మిగిలాడంటే అది కవిత్వంకాదు.

"ఏదైనా సృష్టించడానికి ముందు ధ్వంసం చెయ్యడం అవసరం. సంఘంలో ఇలా ధ్వంసం చెయ్యగలవాడు కవి" అని హెర్బర్ట్ రీడ్ రాశాడు [హెర్బర్ట్ రీడ్ — పొయిట్రీ అండ్ అనార్కిసమ్]. ఫ్రాన్సులో డాడాయిజం, సర్రియలిజం ఈ విధ్వంస కార్యక్రమాన్ని చాలా విజయవంతంగా నిర్వర్తించాయి.

మార్క్స్ "తాత్వికులు ప్రపంచాన్ని రకరకాలుగా దర్శించారు, వ్యాఖ్యానించారు, కాని నిజానికి జరగాల్సింది ప్రపంచాన్ని మార్చడం" అని రాశాడు [కార్ల్ మార్క్స్ — ఫ్రెడరిక్ ఎంగెల్స్: జర్మన్ అయిడియాలజీ, పేజి 647 (థీసెస్ ఆన్ ఫాయర్‌బాక్,) ప్రోగ్రెస్ పబ్లిషర్స్, మాస్కో, 1964 ఎడిషన్].

వ్యాఖ్యానం [ఇంటర్ ప్రెటేషన్] అనేది భాషకు సంబంధించింది. సోక్రటీస్‌నుండి హెగెల్‌వరకు తాత్వికులు భాష నాధారం చేసుకుని ప్రపంచాన్ని విశ్లేషించారు. కాని జరగాల్సింది ఏమీ జరగలేదు. భాష చాలా బలహీనమైనదని గుర్తించిన వాళ్ళల్లో బహుశా మార్క్స్ మొదటివాడనుకుంటా. 19 వ శతాబ్దం చివరలో భాష వల్ల, అక్షరాలవల్ల వ్యక్తీకరణ ఎలా అసాధ్యమో కవికికూడా తెల్సింది. ఫ్రెంచి కవి మల్లార్మే దానికి ఉదాహరణ. శబ్దానికి, నిశ్శబ్దానికి తేడా నశించడమే నిహిలిజం అని ఇంతకు ముందో సారి అన్నాను. శబ్దం ఏమీ చెయ్యలేకపోవడాన్ని మార్క్స్ గుర్తించాడు. కనకనే డిస్‌కోర్స్ పట్ల తన అసహనాన్ని ప్రకటించాడు. జరగాల్సింది ప్రపంచాన్ని గురించిన చర్చకాదు, మార్పు అని మొదటిసారిగా ఉచ్చరించింది మార్క్స్.

విట్‌గెన్‌స్టైయిన్ ఆధునిక భాషాతత్వవేత్త భాషబలహీనతను గుర్తించి శబ్దానికి, నిశ్శబ్దానికి ఏ తేడా లేదన్న నిర్ణయానికివచ్చాడు. ఓ అనుభూతిని, అనుభవాన్ని భాషద్వార వ్యక్తీకరించినా అది అవతల వాడికి గ్రాహ్యం కాకపోవడాన్ని గుర్తించిన అతను భాషను ఆశ్రయించకుండా బ్రతకలేని మనిషిపట్ల సానుభూతిని ప్రకటించాడు. అలాగే నీషే "వ్యాకరణంలో విశ్వాసం సడలనంతవరకూ మనిషి భగవంతుడికి బానిసే" అన్నాడు. ఇక్కడ భగవంతుడంటే మనిషిని అవమానపరిచే ఏ మానవాతీత శక్తి అయినా కావచ్చు. [మానవుడిని ఓ చట్రంలో బిగించే వ్యూహాలు, ప్రవర్తనా నియమావళు (అవి ఏ రూపంలోనైనా వుండవచ్చు)లతో సహా].

ఆ విధంగా మార్క్స్ ఆధునిక భాషా తత్వవేత్తలకు, కవులకు, అరాచకవాదులకు, నిహిలిస్టులకు 'అ'క్రమంగా సన్నిహితుడయ్యాడు. మావో పుస్తక పఠనాన్ని ఎలా నిరసించిందీ జగద్విదితం. భాష నిష్ప్రయోజకత్వాన్ని గుర్తించిన నాడే భౌతిక వాస్తవాన్ని మార్చడానికి మనిషి పూనుకుంటాడనే నిర్ణయానికి మార్క్స్ వచ్చాడు. ఆధునిక కవితకు ఈ మార్క్సిస్టు జ్ఞానం ఎంతగానో తోడ్పడుతుంది. భాషనాధారంగా కవిత్వాలు రాస్తూ, ప్రపంచాన్ని విశ్లేషిస్తూ కాలయాపనచేస్తూ నిశ్చింతగా వుండటం పట్ల కవి ఆగ్రహాన్ని, అసహనాన్ని ప్రకటించాల్సిన సమయం ఆసన్నమైంది. వాస్తవానికి ఈ యుగంలో కవిత్వం అసాధ్యం. హెగెల్ ఆనాడే అంటే 1810 ప్రాంతాల్లోనే కవిత్వం గత కాలానికి చెందిందిగా, ఇక భవిష్యత్తులో సాధ్యం కానిదిగా అన్నాడు. ఇవ్వాళ్టి దుష్కర పరిస్థితుల్లో కవిత్వాన్ని సాధించగల్గినా ఆ కవిత్వం మనిషిని చర్యకు పూనుకొనేలా చేసినప్పుడే దాని కేమైనా సార్థకత. మొదటిరోజుల్లో విరసంలో వచ్చిన కవిత్వం ఈ సత్యాన్ని గుర్తించినట్లు కనిపిస్తుంది.

"ఎవరి అనుభవం ఎవరికీ అందకుండా మాటల కత్తులతో కాపలాకాయడంతప్ప, ప్రపంచంలో యిన్నివున్నా భాషలు మాత్రం ఏం చేస్తున్నాయి" అని నగ్నముని భాషను నిరసించాడు (నగ్నశిశువు).

పదాల భారం వల్ల, దీర్ఘనిద్రలో పడివున్న మనుషుల్ని "ఏరుకోరెందుకు తలలు" (నన్నెక్కనివ్వండి బోను) అని ఆశ్చర్యంగా చెరబండ రాజు ప్రశ్నించాడు.

యాంత్రిక నాగరికత మనుషుల్ని 'బుద్ధిమంతులు'గా, యంత్రాలుగా, అస్వతంత్రులుగా మార్చింది. బానిసత్వాన్ని మనిషి అంగీకరించేలా చెయ్యడానికి సైన్సు తోడ్పడింది. సైన్సు వల్ల హేతువాద దృక్పథం ప్రబలింది. ఇది నిజమైన, హేతుబద్ధమైన హేతువాదం కాదు. మనిషిని కొన్ని మూఢ ఆచారాల్నీ, సాంఘిక కట్టుబాట్లనీ పాటించే వాడుగా చేసిందీ హేతువాద దృక్పథం. ఈ హేతువాది చాలా హేతుబద్ధంగా ఆలోచిస్తాడు, ప్రవర్తిస్తాడు. అతనికి ఉద్రేకం, ఆవేశం, ద్వేషం, స్వతంత్రేచ్ఛ—ఇత్యాది ప్రాథమిక మనుష్య లక్షణాలుండవు. వ్యవస్థను వ్యతిరేకించే శక్తులు కూడా ఈ దృక్పథాన్ని పెంపొందింప చెయ్యడం వల్ల ఈ హేతుబద్ధమైన నడవడి సరియైనదిగా ఆమోదించబడింది. మనిషి తన జీవితంలో ఈ అర్థరహితమైన హేతువాదాన్ని కాదని ప్రవర్తిస్తే అతణ్ని అరాచక వాదిగా, 'ప్రగతి వ్యతిరేకి'గాచిత్రించాయీ అభ్యుదయ, పురోగామి శక్తులు. కనకనే ఈ అసత్యకరమైన హేతుబద్ధతను ఖండించాల్సిన అవసరం చాలావుంది. ఈ కృత్రిమ హేతుబద్ధతను పాటించే మనిషి కవిత్వం రాయడానికి పూర్తిగా అనర్హుడు అట్లాంటి వాడసలు కవిత్వం రాయలేడు కనక కవి తన జీవితంలో అరాచకత్వాన్ని చాలా సహజంగా స్వీకరించాలి. అప్పుడే బలమైన కవిత్వం రాయగలడు. జీవితంతో రాజీపడి బలహీనుడిగ మారిన వాడు అసలు కవిత్వం ఎలా రాయగలడు?

"జీవితాన్ని భద్రపర్చుకోవాలనుకున్ననాడు నువ్వు జీవితాన్ని కోల్పోతావు" అన్నాడు డి. హెచ్. లారెన్స్.

తర్వాత కవిత్వం ఆశాజనకంగా వుండాలనే ధోరణి మధ్య తరగతి మనస్తత్వం. జీవితమ్మీద ప్రీతి కలవాడు,చావుకు వెరసే వాడు తప్పకుండా ఆశావాదిగనే వుంటాడు. వాడికి విశ్వాసాలు మెండు. ఆధునిక మానవుడు విశ్వాసాన్ని కోల్పోయాడనేది ఏ కొద్ది జ్ఞానమున్న

వారికైనా తెలుసు. అలాంటప్పుడు ఆధునిక కవి ఎలా వర్తమానం పట్ల విశ్వాసంగా వుండగలడు. అతడు దాన్ని తిరస్కరిస్తాడు తప్ప దాని పంచన చేరడు. కనుక అతని కవిత్వంలో నిరాశావాద ధోరణి ధ్వనిస్తే ఆ కవిత్వాన్ని ప్రగతి నిరోధక కవిత్వమని తలంచే వారు చాలా విశ్వాసకరమైన జంతువులై వుండాలి. నిజానికి మనిషి ఎంతో బలవంతుడు, క్రూరుడు అయితే తప్ప నిరాశావాదాన్ని అంగీకరించడు. నిరాశావాది ఎప్పుడూ తన నిరాశావాదాన్ని అతిక్రమించడానికే ప్రయత్నిస్తుంటాడనేది మన 'గతి తార్కిక' ఆశావాదులకు అర్థం కాని విషయం.

'రోగి కాకుండా కవి కావడం పూర్తిగా అసాధ్యం' అని నీషే (విల్ టు పవర్— సం. 2) అన్నారు.

కవి కావడానికి రోగగ్రస్తుడు మాత్రమే అర్హుడు ముఖ్యం ఆధునిక కవి. రోగగ్రస్తమైన మానవ సంబంధాల గురించి రాయడానికి రోగి మాత్రమే అర్హుడౌతాడు. ఆరోగ్యవంతుడు అనారోగ్యం గురించి మాట్లాడ్డానికి అనర్హుడు. కవి వాస్తవం పట్ల ఎలాంటి భ్రమలు లేకుండా బ్రతుకుతాడు. కనక వ్యాధిగ్రస్తమైన వాస్తవాన్ని ననుసరించి అతను కూడా వ్యాధిగ్రస్తుడౌతాడు. నిజానికి సమాజం అనేకానేక వ్యాధులతో రోగనిలయంగా వున్నప్పటికీ అదే సమాజం సామాన్యుణ్ని అజ్ఞానంలో వుంచ డానికి, వాస్తవాన్ని కప్పిపుచ్చ డానికి రకరకాల మత్తు పదార్థాల్ని ఉచితంగా సరఫరా చేస్తుంది. కనుక సామాన్య మానవుడు తన వ్యాధిని గుర్తించక తాను ఆరోగ్య వంతుడిననే భ్రమలో బ్రతుకుతుంటాడు. ఉ విధంగా సామాన్య మానవులంతా ఆరోగ్యవంతులుగా జీవిస్తుంటారు. సామాన్యులు కాక ఇతరులైన మేధావులు, ముఖ్యంగా కవులు, రచయితలు కాల్పనికులై కొందరు, సిద్ధాంత కవచాల్ని, శిరస్త్రాణాల్ని ధరించి కొందరు తమ ఆరోగ్యాన్ని పరిరక్షించు కుంటారు. కనుక వీరు కవిత్వం రాయడానికి అనర్హులు. నిజమైన కవి తన్ను తాను పరిరక్షించు కోవడానికి ఎవరి పంచనా చేరడు, ఏ సిద్ధాంతం శరణువేడడు. కనక ఎట్టి ఆచ్ఛాదనలు లేని వాస్తవంలో బ్రతుకుతాడు. అతను మాత్రమే కవిత్వం రాయగలడు. నిజానికి కవి చేసే పోరాటం ఈ ఆరోగ్యకరమైన ప్రపంచం పైనే. కనక వ్యాధిగ్రస్తుడైన కవి మాత్రమే వ్యాధిని గురించి చెప్పగలడనడంలో ఎట్టి సందేహమూ లేదు. అతనిది మాత్రమే కవిత్వం. కారణం అతని కవిత్వం మాత్రమే ఆరోగ్యవంతుడైన పాఠకుణ్ని అనారోగ్య వంతుడిగా మార్చగలదు. ఆరోగ్య వంతుణ్ని రోగిగా మార్చగల్గడమే కవిత్వానికి పరీక్ష. ఆ కవిత్వం చదివిన తర్వాత కూడా పాఠకుడి ఆరోగ్యం చెక్కు చెదర లేదంటే అది కవిత్వం కాదన్నమాట. పాఠకుడు రోగిగా మారనంత వరకు రోగాన్ని గూర్చి ఆలోచించలేడు. కనుక ఇక్కడ కవి పాఠకుణ్ని రోగిగా మార్చేది అతణ్ని రోగవిముక్తుణ్ని చెయ్యడానికే. అయితే ఇవ్వాళ తెలుగు కవిత్వంలో ఆరోగ్య వంతులకే గిరాకీ. 'సాంప్రదాయ' ఆరోగ్యవంతులు, కాల్పనిక ఆరోగ్యవంతులు, కుహనా మార్క్సీయ ఆరోగ్యవంతులు ఇవ్వాళ అటు పాఠక లోకాన్ని, ఇటు కవిత్వాన్ని వంచించడంలో నిమగ్నులై వున్నారు. రోగాన్ని గురించిన విషయ సంగ్రహణలో సామాజికులు లబ్ధ ప్రతిష్ఠులు.

రోగి అయిన కవి చాలా కాలంగా తెలుగు కవిత్వంలో లేనందువల్ల ఇదే అదనని ఆరోగ్యవంతులు అనేకులు అజంతా మాటల్లో చెప్పాలంటే సమాజంలోవున్న అనారోగ్యకరమైన ఆరోగ్యానికి, కాలుష్యానికి సమాంతరంగా ఇంకో కాలుష్య ప్రపంచాన్ని, కాలుష్య యుగాన్ని నిర్మిస్తున్నారీ రోజు.

మార్క్సిస్టు విమర్శకులైన క్రిష్టఫర్ కాడ్వెల్ షా, లారెన్సులను, జార్జి లూకాక్స్ కాఫ్కా, జాయిస్, బెకెట్, మూసిల్‌లను బూర్జువాలుగా, రోగగ్రస్తులుగా, అనారోగ్యాన్ని ఆరోగ్యంగా తలంచేవారిగా ఎంచి నిందించడం మనమెరుగుదుము. దీన్నిబట్టి 'మార్క్సిస్టులు' నిజమైన కవిహృదయానికి, కవిత్వ సారానికి, మొత్తంగా సాహిత్యానికి ఎలా శత్రువులో తెలుసుకోవడం ఏమంత కష్టం కాదు.

కవి వ్యక్తిగత జీవితంలో రోగగ్రస్తుడైననాడు మాత్రమే కవిత్వంలో కూడా రోగగ్రస్తుడు కాగల్గుతాడు. కవి జీవితానికీ, కవిత్వానికీ అంతరాలు పెరుగుతున్నాయి. ఈ అంతరాలు తొలగిన్నాడే అతను నిజంగా కవిత్వం రాయగలడు. ఈనాడు కవి ఎప్పుడో ఒకసారి కవిత్వం రాసేసి తిరిగి గృహాంతర్భాగాల్లోకి దూరిపోతున్నాడు అతను జీవితంలో ఎక్కువకాలం సామాన్యునికి ఏమీ తీసిపోకుండా బ్రతికేస్తున్నాడు. కవి తన 24 గంటల జీవితంలో కవిగానే బ్రతకాలి. కవి వ్యక్తిగత జీవిత ప్రాధాన్యతను గురించి చలం, తర్వాత దిగంబరులు కళ్లు తెరిపించే ప్రయత్నం చేశారు.

శ్రీశ్రీ తర్వాత మనిషి ఆర్తరావాన్ని, దీనాలాపననీ, దుఃఖాన్నీ, ఒంటరితనాన్ని, విలువల లేమిని బలంగా గొప్పగా ప్రకటించిన కవులు శ్రీరంగం నారాయణబాబు, బెల్లంకొండ రామదాసు, బైరాగి, అజంతా, మహాస్వప్న. ఈ కవుల కవిత్వానికి, వ్యక్తిగత జీవితానికి విడదీయరాని సంబంధంవుంది. జీవితంలో గొప్పగా బ్రతికినవాళ్లు కావడంవల్లే తమ కవిత్వంద్వారా సమకాలీన మానవుడి అంతర్, బహిర్‌స్థితుల్ని నూతనంగా, చాలా స్వతంత్రంగా ఆవిష్కరించగల్గారు.

అర్థరహితమైన జీవితానికి అర్థాన్ని, విలువను ఆపాదించడం కోసం, మాతృగర్భంలోని నెచ్చదనాన్ని, ఆనందాన్ని ఈ లోకంలోకూడా కలుగచెయ్యడం కోసం, ఈ వాస్తవ ప్రపంచాన్ని మాతృగర్భంగా మార్చడంకోసం కవి కవిత్వాన్ని రాస్తాడనే ఫ్రాయిడ్,ఆటో రాంక్‌ల ఉద్ఘాటనకు ఉదాహరణగా పై కవుల్ని పేర్కొనడానికి నేను సందేహించను.

తెలుగు కవిత్వంలో మార్క్సిస్టు దృక్పథం ప్రవేశించి చాలా కాలమైంది అయితే దురదృష్టవశాత్తూ ఇక్కడ మార్క్సిజంగా చలామణీ అవుతున్నది మార్క్సిజం కానందువల్ల కవిత్వానికి దానివల్ల చాలా హాని జరిగింది. కవి ఇతర శాస్త్రాల్ని, ఆలోచనా ధోరణుల్ని చదవడంద్వారా జ్ఞానవంతుడైనట్లే మార్క్సిజం ద్వారా కూడా కావాలి. మార్క్సిస్టు జ్ఞానం అతని జీవిత దృక్పథానికి ఇతర జ్ఞానం మాదిరే వెన్నెముకగా వుండాలి. కాని ఇక్కడ ప్రపంచంలో మరెన్నో చోట్ల జరిగినట్లే కవిత్వం మార్క్సిజాన్ని ప్రచారం చెయ్యడానికి మాత్రమే వుపయోగపడింది. కవి తన మార్క్సిస్టు జ్ఞానంద్వారా

జనన్ని జ్ఞానవంతులుగా చెయ్యడంపోయి మార్క్సిస్టు సిద్ధాంతాల్ని కవిత్వంద్వార యధాతథంగా ప్రచారం చేశాడు. దానివల్ల మార్క్సిస్టు జ్ఞానం కవికిగాని, ప్రజలకు గాని ఉపయోగపడకుండా పోయింది. ఆధునిక కవికి మార్క్సిస్టు జ్ఞానం చాలా అవసరం. అయితే ఆ జ్ఞానం కవికి సంస్కారంగుండా, సంఘాలగుండాకాక ఇతర జ్ఞానం మాదిరి మూలరచయితల గ్రంథాలద్వారా కలగాలి. అలా జరగనందు వల్ల మూల సూత్రాలతో సంబంధంలేని అనేక మార్పులకు గురై, అవశేషంగా సూత్రమే మిగిలిన మార్క్సిజంక్కడ కవిని మరింత బలహీనపర్చింది.

మార్క్సిజం సమాజం గురించి అంటే ఇతరులగురించి 'పొరుగు'వారి గురించి మాత్రమే కవిత్వం రాయమనడంద్వారా మధ్య యుగాలకు చెందిన కాథలిక్ మతంగా మారింది.

ఆధునిక కవికి మార్క్సుతోపాటు ఫ్రాయిడ్, నీషే మరియు ఇతర ఆధునిక ఆలోచనా ధోరణులు తెలియడం చాలా అవసరం. లేకుంటే అతను సమకాలికుడిగా కవిత్వాన్ని సృజించలేడు. ఆధునిక జీవిత దృక్పథం మార్క్సిజం, మనోవిశ్లేషణశాస్త్రం (సైకోఎనాలిసిస్), అస్తిత్వవాదం (ఎక్స్‌స్టెంషియలిసమ్) ఈ మూడింటి కలయిక ఆధారంగా ఏర్పడింది. ఈ దృక్పథం ఆధునిక కవికి చాలా అవసరం.

కవికీ, పాఠకుడికీ మధ్యవున్న దూరానికిగల కారణం కవి ఉపయోగించే రీతి (ఫార్మ్) అని ఓ ప్రచారం. కవి పాఠకులస్థాయిని బట్టి వారి స్థాయికి దిగి కవిత్వం రాసిన్నాడు ఆ కవిత్వం పాఠకుడికి అర్థమౌతుందని ఓ ఆర్గ్యుమెంటు. కాని నిజానికి కవికి, పాఠకుడికి మధ్యవున్న దూరానికి కారణం రీతికాదు, విషయం (కంటెంట్). కవి చెప్పేవిషయం పాఠకుడికేమాత్రం ఇష్టంలేదు. వింటే ఎక్కడ భంగం వాటిల్లుతుందో అని భయపడి పారిపోతున్నాడు పాఠకుడు కవినుండి. అట్లాంటి పాఠకుడికి ఏ రీతిలో రాసినా ఒకటే. కవిచెప్పే విషయం అతడికి నచ్చదు. కవి ఎంత సులభంగా చెప్పినా పాఠకుడు వినడు, చదవడు.

ఈ రీతి సమస్య 20వ శతాబ్దంలో ఈమధ్య రేకెత్తింది. ఈ సమస్య అంతకుపూర్వంలేదు. ఈ శతాబ్దపు సాహిత్యంలో, రీతిలో వచ్చిన అనేకానేక మార్పులు కూడా విషయానికి లోబడే. విషయం కూడా మారడంవల్ల, జీవితం సంక్లిష్టం కావడంవల్ల, సంక్లిష్టమైన జీవితానుభవాల్ని రచించినప్పుడు సంక్లిష్టమైన రీతితప్పదు. ఈ రీతి విషయాల (ఫార్మ్ మరియు కంటెంట్) సమస్య కృత్రిమంగా సృష్టించి ఇట్లా మాట్లాడ్డం తప్పితే ఈ సమస్యకు అర్థంలేదు.

కనీసం పది సంవత్సరాలౌతుంది తెలుగు కవితకు గర్భస్రావం జరిగి.

తెలుగు కవిత్వంలో తిరిగి చలనం కలగాలంటే గత ముప్పై, నలభై ఏళ్ల గతానికి గుడ్‌బై చెప్పగల్గాలి. తిరిగి అలనాటి జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రిలా 'ఆశ్వాసాంతం' ఎవరైనా రాయాలి. మరో 'ఆశ్వాసాంతం' వెలువడనంతవరకూ నూతన ఆశ్వాసం తెలుగు కవిత్వంలో ఆరంభం కావడం అసాధ్యం.

అసురా

వేమన పద్యాలు : హైదరాబాద్ ప్రతులు

ఆగస్టు, '80 'భారతి' సంచికలో 'వేమన పద్యాల ప్రతులు – పరిష్కరణ' అనే వ్యాసంతో తంజావూరు, మద్రాసు, కాకినాడల్లో లభిస్తున్న ప్రతుల పరిచయం జరిగింది. ఇటీవల హైదరాబాద్‌లోని ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీలో చేరిన వేమన పద్యాల ప్రతులు కొన్ని (తాటాకువి–3; కాగితంవి–2) నా దృష్టికి వచ్చాయి. ఆగస్టు నెల వ్యాసానికి పూరణగా వాటి వివరాలను తెలియజేస్తున్నాను.

తాటాకు ప్రతులు

క్రమ సంఖ్య	లైబ్రరీలోని Acc నెంబరు	వివరాలు
1.	2291	ఇది 8 ఆకులు మాత్రమే మిగిలివున్న అసమగ్రప్రతి. సమగ్రంగా ఉన్న ప్రతిలో ఎన్ని వందల పద్యాలుండేవో కాని ఇప్పటికి 66 (ఒక్క పాదం, రెండు పాదాలుగా మిగిలిన పద్యాలను లెక్కిస్తే) మిగిలాయి. ఆకులవారిగా పద్యాల వివరాలు : మొదటి ఆకుతో 3వ పద్యం నుంచి 9వ పద్యం వరకు. రెండో ఆకు : 71 నుంచి 77 వరకు. మూడో ఆకు : 159 నుంచి 168 వరకు. నాలుగో ఆకు : 179 నుంచి 187 వరకు.

క్రమ సంఖ్య	లైబ్రరీలోని Acc నెంబరు	వివరాలు
		ఐదో ఆకు : 205 నుంచి 213 వరకు.
		ఆరో ఆకు : 220 నుంచి 230 వరకు.
		ఏడో ఆకు : 242 నుంచి 254 వరకు.
		ఒక ఆకు బాగా శిథిలం.
2.	1497	7 ఆకులు. అత్యంత శిథిల ప్రతి. 83 పద్యాలు మిగిలి ఉన్నాయి. అసమగ్ర ప్రతి.
		మొదటి ఆకు : 291 నుంచి 301 వరకు.
		రెండో ఆకు : 318 నుంచి 328 వరకు.
		మూడో ఆకు : 371 నుంచి 382 వరకు.
		నాలుగో ఆకు : 382 నుంచి 394 వరకు.
		ఐదో ఆకు : 395 నుంచి 404 వరకు.
		ఆరో ఆకు : 405 నుంచి 416 వరకు.
		ఏడో ఆకు : 430 నుంచి 443 వరకు.
3.	843	9 ఆకులు (వరసలో ఉన్నాయి.) 94 పద్యాలు, అసమగ్రం.

కాగితం ప్రతులు

క్రమ సంఖ్య	లైబ్రరీలోని Acc నెంబరు	వివరాలు
1.	3840	రాత అస్పష్టంగా ఉంది. 161 పద్యాలున్నాయి. 9 నుంచి 16 వరకు మొత్తం 7 కాగితాలు (10 నెంబరు కాగితం లేదు.) అంటే 14 పేజీలు.
2.	3866	1085 పద్యాలున్నాయి. ఈ ప్రతి మరీ మొన్న మొన్నటి దానిలాగే ఉంది. (50, 60 ఏళ్ళు) ప్రతిని సేకరించినవారు (నాగ శివలింగ యోగి) దీనిలో కొత్త పద్యాలు ఉన్నాయని రాశారు. ఇది నిజం కాదు.

డా. ఎన్. గోపి

లేఖలు

డా. శివాజీ విమర్శ

భారతి సెప్టెంబరు 1980 సంచికలో "మార్క్సుకు పాఠాలు" గ్రంథవిమర్శచేసిన డా. శివాజీగారు కొన్ని అవాస్తవిక మయిన విషయాలు వ్రాశారు. వాటికి సమాధానం యివ్వటం అవసర మనిపించి వ్రాస్తున్నాను.

"మార్క్సుకు పాఠాలు" గ్రంథంలో "భారత భాగవతాదుల నుండి అరవిందుని రచనలవరకూ పెక్కు అంశాలను తెచ్చి మార్క్సు చెప్పిన దానికి పోల్చి"న ఒక తులనాత్మక పరిశీలన ఉన్నదని ఒక వైపున అంగీకరిస్తూ, ఆ వెంటనే "ఈ పుస్తకంలో గజిబిజంతా చూస్తుంటే..." అంటూ గ్రంథంలోని విషయాలు గజిబిజిగా ఉన్నాయనీ, "కమ్యూనిజాన్ని కాదనేందుకు రాజకీయ, సాంఘిక, ఆర్థిక విధానాల చర్చ అవసరంగాని యిలా చెలితే నేలవిడిచిన సాము అవుతుం"దనీ డా. శివాజీ వ్రాశారు. మార్క్సు, లెనిన్, మావో మొద

లయిన సిద్ధాంతవేత్తల రచనలను అధ్యయనం చేసిన వారెవరూ మార్క్సిజానికి ఆధార శిలగాఉన్న తాత్త్విక భూమికను గురించి (యీ గ్రంథంలో చర్చించబడింది అదే) యిలాంటి తేలికమాటలు వ్రాసి, ''నేల''ను విడిచిన సాము చేయమని చెప్పలేరు.

ఇక భారతీయ సిద్ధాంతాలతోపోల్చి మార్క్సిజాన్ని బేరీజువేసి చూద్దాం అని అంటే చాలు అది ''కాలం చెల్లిన''వాదం, ''మెట్ట వేదాంతం'', ''యథాతథవాదం'' మొదలయిన మార్క్సిస్టు బ్రాండు పడికట్టు పదాల మత్తుతో ప్రజలను మభ్యపెట్టే నినాదాలతోకూడిన ప్రచార ధోరణే ఈ విమర్శలోనూ కనిపిస్తున్నదే కాని, నిజాయితీతో సిద్ధాంతచర్చ చేద్దామన్న సాహసంగాని, సంకల్పంగాని కనిపించటం లేదు. అంతమాత్రమేకాదు. ''పెద్దచేపలు చిన్న చేపలను మింగటం మామూలేనని జోలపాడ యత్నించి''నట్లు సమీక్షకులు ఆరోపించారు. ఇలా ఎక్కడ వ్రాశానో మరి వారికే తెలియాలి. పెద్దచేప చిన్నచేపను మింగటం (ధనికులు పేదలను దోపిడీ చేయటం) వికృతికాదు, ప్రకృతిసిద్ధమయిన స్థితి అని మార్క్సువాదులు చెబుతారు. కాని ''మాత్స్యన్యాయం'' లేక ''అటవీన్యాయం'' ఆగంతుకమైనదేకాని, సహజస్థితి కాదు. ఇదే భారతీయ సిద్ధాంతం, ఇదే నేటి శాస్త్రజ్ఞుల నిష్కర్ష. దీనినే పుస్తకంలోని మూడోపద్యాని కిచ్చిన వ్యాఖ్యలో వర్గ విభజన సిద్ధాంతాన్ని చర్చిస్తూ వర్గాలు సాపేక్షమయినవి మాత్రమే నవి నిరూపించిన సందర్భంలో ఉదహరించటం జరిగింది. పుస్తకంలో పూర్వపక్షం చేసినదానిని సిద్ధాంతంగా చెప్పినట్టు పేర్కొంటారేమిటి? ఇది పుస్తకాన్ని సరిగా చదవకపోవటమా? లేక తెలిసి తెలిసి వక్రీకరించటమా ?

ఇలాంటి సిద్ధాంతపరమైన గ్రంథాలను పరిశీలించేటప్పుడు మార్క్సిస్టు సాహిత్యంతోబాటు, మార్క్సిజానికి ఆధారభూతమయిన 19వ శతాబ్దపు న్యూటన్, హెగెల్, డార్విన్ సిద్ధాంతాలనూ, 20వ శతాబ్దపు ఐన్‌స్టీన్, హైసెన్‌బర్గ్, ఎడింగ్టన్ మొదలయిన శాస్త్రజ్ఞుల సిద్ధాంతాలనూ—వీనితోబాటుగా భారతీయ తత్త్వజ్ఞానాన్నీ, అధ్యయనంచేసి ఆ ఆధారంపైన కాక, కాలదోషంపట్టి బూజుపట్టిపోయిన విశ్వాసాల గీటురాయిపై మాత్రమే పరిశీలింపజూస్తే నిజానికి ''గజిబిజి''గానే ఉంటుంది. అట్టి స్థితిలో ఊరికే ఏవో నాలుగు ఊతపదాలతో కొట్టిపారేద్దామనుకోవటం సహజంకూడా.

ఒకవేళ ''ధర్మార్థ కామమోక్షాలు, వర్ణాశ్రమ ధర్మాలు, ఇతిహాసాలు, జీవాత్మ—పరమాత్మ''ల నంటి భారతీయ సిద్ధాంతాలపట్ల డా. శివాజీకి చెప్పలేని ''ఎలర్జీ'' కనుక ఉండి ఉన్నట్లయితే—కేవలం ఈనాటి శాస్త్రవిజ్ఞానాన్నీ, హేతువాదాన్నీ మాత్రమే ప్రమాణంగా గ్రహించి (వాటిపై ఆధారపడిన చర్చే పుస్తకంలో ఎక్కువ) విషయాలను విమర్శించి ఉండవలసింది. ఆవిధంగా ఒక సిద్ధాంతంగా మార్క్సిజంలోని అంతశ్శక్తి ఏమాత్రపు స్థాయిలోదో నిరూపించవలసిఉంది. అదేమీ చేయలేదు.

''జనం ఆలోచనలు, ఆశయాలు శరవేగంతో పరుగులెత్తుతున్నాయి'' అన్నారు. ఈనాటి శాస్త్రజ్ఞులు కనుగొంటున్న నూతన సత్యాల కారణంగా శాస్త్రజ్ఞులయొక్క, ప్రజలయొక్క ఆలోచనలు, ఆశయాలు ''శర''వేగంతోకాదు, ''స్పుత్నిక్'' వేగంతో కూడాకాదు, ''కాంతి''వేగంతో పరుగులెత్తుతున్నాయి. కాంతివేగాన్ని అధిగమించిన వైశ్విక దృక్పథాన్ని కూడా ఈనాటి ''సైన్సు'' ప్రజలకు కలిగిస్తున్నది. అయితే డా. శివాజీగారికి ''శర''వేగమే బాగు అనిపించిందేమో. ఏమయినా మార్క్సిజాన్ని 20వ శతాబ్దపు విజ్ఞానం దృష్ట్యా పరిశీలించ యత్నించిన వారిని యధాతథవాదులని ఎలాఅనగలరు డా. శివాజీ?

ఒక సిద్ధాంత గ్రంథాన్ని (అది పరిమాణంలో చిన్నదేకావచ్చు) పఠించటం ఎలాగో శ్రీ లిన్ యుటాంగ్ యిలా చెప్పాడు—''మీరు పుస్తకాన్ని చదవండి. అక్కడక్కడ ఆగి కాస్త ఆలోచించండి. చదివిన దానిని సింహావలోకనం చేసుకోండి. అర్థం కాకపోతే మరొకసారి చదవండి. ఇంకా అర్థం కాకపోతే, ఆ పుస్తకాన్ని క్రిందపడేసి అందులో ఉదహరించబడిన మూల గ్రంథాల వద్దకుపోయి మీ ప్రశ్నలకు సమాధానం వెతకండి. చదవటమంటే ఇదేనని నా భావన.''

మార్పుకోరని యథాతథవాదినిగా నన్ను చిత్రించటానికి ఏ ఒక్క ఋజువునూ చూపకపోయినప్పటికీ (భారతీయత అనే బూచి ఋజువా?) ఏ అంచనా కోసమని చెప్పినప్పటికీ ''మార్క్సుకు పారా''లను చదవటం అవసరమనిమాత్రం చెప్పగలిగారు డా. శివాజీ. గ్రంథంలో యథాతథవాదమే ఉందో, ప్రగతివాదమే ఉందో స్వయంగా తెలుసుకొనేందుకు పాఠకులకు అది ఒక ఆహ్వానమే.

వ జ్ర న ఖ

విజయవాడ.

వచన కవితలు

'భారతి'లో ప్రచురింపబడుతున్న వచన కవితలను చూసి నవ్వాలో ఏడ్వాలో తెలీడంలేదని కొందరు; ఎందుకంత బాధ అని మరి కొందరు పడే బాధలను చూడలేక యీ లేఖ వ్రాస్తున్నాను.

స్పందించిన కవి హృదయంలో మెదిలిన భావాలను సామాన్యుడికి సైతం అర్థమయ్యే రీతిలో వ్రాయడానికీ కవితా కన్యను ఛందోశృంఖలాలనుండి విముక్తిచేసి వచన కవిత్వాన్ని సాగిస్తున్నామని ఆధునిక కవులు అంటున్నారు—కానీ, సామాన్యులకు కవిత్వం ఛందోబద్ధమైన పద్యమా? గద్యమా? లేక వచన కవిత్వమా? అనే తర్కం అనవసరం—భాష, భావం వినసొంపుగా హృదయానికి హత్తుకునేలా ఉంటే చాలు.

"ఒక క్షణంలో
మనస్సులో ఏదో స్మృతి
తణిస్మణి
మణీ ఘృణి
ఏదో మతి వికాసించి"

మహాప్రస్థానానికి ముందుమాటలో "చెలం"గారు వ్రాసినట్లు ఛందస్సు నడ్డి విరగదన్నీ; ఆధునిక కవులు చెపుతున్నట్లు సామాన్యులకు అర్థమయ్యేందుకే యిలా శ్రీశ్రీ వ్రాశారు అంటేను, తెలుగు భాష ప్రధానాంశంగా డిగ్రీ సంపాదించినా బేధానికి, ఛేదానికి తేడా తెలియని విద్యావంతులున్న యీ రోజుల్లో యీ కవిత సామాన్యులకు సులభగ్రాహ్యంగా ఉందంటే మనం ఆశ్చర్యపోవాల్సిందే మరి.

కానీ; "ఎలుకతోలు దెచ్చి ఎంతాక..." అనే వేమన పద్యాన్ని ఛందోబద్ధమైన పద్యమనే కారణంగా మాత్రమే తెలుగుప్రజ దాన్ని ఆదరించలేదు. అందులోని భావం భాష హృదయానికి హత్తుకునేలా ఉండటమే అందుకు కారణం. అయితే వచన కవిత్వంలో కూడా అలాంటివి లేకపోలేదు.

"పుటక నీది
చావు నీది
బ్రతుకంతా
దేశానిది"

అనే జె. పి. గురించి వ్రాసిన "కాళోజీ"గారి కవితను అలా పద విభజన చేయక సాఫీగా వ్రాసినా చదివిన పాఠకుడు "అహో!" అనుకుంటాడు; కొద్ది పదాల్లో పెద్ద భావాన్ని యిమిడ్చిన రచయిత గొప్పదనానికి "శభాష్!" అని కూడా అంటాడు; ఆనందిస్తాడు.

కనుక చక్కని భావానికి అందమైన పదాలపొందిక అమరినప్పుడు, సామాన్యుడికి అది అర్థమయ్యే రీతిలో ఉంటే, రూపమేదైనా అతని హృదయంలో నిలిచిపోతుందనేది నిర్వివాదాంశం. ఎంత గొప్పదైనా అర్థంకానిది వ్యర్థమే—అలాగని అర్థమైనా, చక్కనిభావం, భాష లేనప్పుడు, ఛందోబద్ధమైనా, వచన కవిత్వమైనా సామాన్యుడి మనస్సు నాకట్టుకొనలేదనేందుకు ఉదాహరణ—

"ఆ ఉద్యోగమేనా?। ఆబోడి। ఇంజనీరు। ఉద్యోగ మెవడు చేస్తాడండీ। దాంతో మనమేం సంపాయిస్తాం। వైజాగులో కంట్రాక్టు। చేస్తున్నా।" యీ మాటల్ని మామూలుగా చదివితే ఉభయకుశలోపరిలో ఒకరి ప్రశ్నకు మరొకరి సమాధానం లాగుంటుంది తప్ప, కవిత్వం అనే భావం పొరపాటున కూడా కలగదు. కానీ శ్రీ కె. శివారెడ్డిగారు పై వాక్యాలను నిలువు గీతలు గీసినమేరకు పదవిభజనచేసి "జలగ" అనే శీర్షికపెట్టి 'యిదీ వచన కవిత్వమే' అంటే, మన సొమ్మేం పోయింది, "ఓహో! అలాగా!" అంటాం; ఆ తరువాత పత్రికల్లో విలువైన విషయాలతోపాటు వ్యాపార ప్రకటనలు కూడా చదివినట్లు చదువుతాం. అంతకన్నా మనం ఎక్కువ ప్రాధాన్యత నివ్వం.

కనుక కొన్ని కవితల్ని చూస్తుంటే నవ్వాలో, ఏడ్వాలో తోచడంలేదు అని ఎవరూ బాధపడవద్దు. నవరసాల్లో ఏదో ఒక రసాన్ని, భావపరిపుష్టతను కలిగియుండి చక్కని పదజాలంతో ఎల్లరికి అర్థమయ్యేరీతిలో రచయిత గుండెల్లోనుండి తడుముకోకుండా దూసుకొచ్చిన కవితలు పద్యాలైనా, గద్యాలైనా, వచనాలైనా, రెండుముక్కలైనాసరే కలకాలం ప్రజల మనసులో నిలబడి, రచయితను నిలబెడ్తాయి. అప్పుడాకవి ఆనందంలో ఉప్పొంగిపోతాడు. జన్మ చరితార్థమైందనుకుంటాడు. ఆ గర్వంతో ముసి ముసి నవ్వులు నవ్వుకుంటాడు. కానీ, తద్విరుద్ధమైన కవితలు, కవులు మనం కావాలని గుర్తు పెట్టుకోవాలన్నా సాధ్యంకానంత మారుగున పడిపోవడం మన తప్పు కాదని వారు గుర్తిస్తారు. గుర్తించి బాధపడతారు, ఏడుస్తారు. మనంమాత్రం నవ్వం—ఏడ్వం. ఆనందిస్తాం. అంతే.

శ్రీ అన్నప్రగడ శివరామప్రసాద్
నందిగామ

ఇలా చెప్పడం మంచిది

1980 సెప్టెంబరు నెల భారతిలో కలగూరగంపలో "ఎలాగ చెప్పాలి?" అంటూ పాపం శ్రీ బెడిద రాజేశ్వర్‌గారు చాలా బెడదపడ్డారు. తమాషా యేమిటంటే 'మృదుత్వం—సంయమనత్వం' మాటలుపయోగించిన వీరు, తమ వ్రాతలో యెక్కడా సంయమనం చూపనేలేదు మరి! 'నిజాయితీ' గురించి రొమ్మువిరిచారు. వచన కవితవైపు తామున్నామని జబ్బ చరిచారు.

ఒక్కటిమాత్రం నిజం! ఇప్పుడెవరు కానీ 'దేశభాషలందు తెలుగు లెస్స! తెలుగు కవిత్వం లెస్స!' అనేందుకు వీలులేని రీతిగా ఇలాంటివారే తెలుగుని 'చెర్చారు'.

నేనూ అనాలిమరి! నీరసించిపోతూన్న తెలుగు కవిత్వాన్నిచూచి వంత పాడేవారి వైపున్నానని. స్వేచ్ఛగా తన అభిప్రాయాన్ని ప్రకటించడం, విమర్శచేయటం 'వ్యక్తిత్వాన్ని పొడవటమే' అయితే, మహాశయా! నిస్సందేహంగా, నిర్మొహమాటంగా ఆనాటి ఆకవికుకవులూ, ఇంటింటి నంటింటి కవులూ తెలుగుతనాన్నే 'పొడి'చేస్తూన్నారనక తప్పదు.

ఎలాగ చెప్పాలి ? అని పైన ఒక తార్కికలీల ! ఇదే సంచికలో (సెప్టెంబరు) శ్రీయుతులు కె. సుధాకరరావు, ఎల్లా శివరామయ్య, రమేష్‌బాబు, డా. మురళీధరుల వ్రాతలు చూస్తే చాలు, ఎలా చెప్పాలో బోధపడుతుంది !

అలాగే మోహనమిత్రగాయా అదే సంచికలో వచన కవితలకీ, ఆ రచయితలకీ వత్తాసుగా తల్లోజుగారిమీద ఓ విసురు విసిరారు. లర్థంకానివీ లేనివీ సోదాహరణంగా తల్లోజుగారు వివరించాలా? ఎందుకూ ఉన్న అర్థమేమో వారే వ్యాఖ్యాన సహితంగా రెండు మూడు ఖండికలని పత్రికల కందించితే కనీసం సాహిత్యప్రియులన్నా అర్థం చేసుకుంటారుకదా! సామాన్య ప్రజల కెలాగూ బుఱ్ఱకెక్కదులెండి ! బలహీనులు బలహీనుల పక్షమే చేరతారుకాని, బలవంతుల్ని కలుపుకొందికిష్టపడరుకదా! నీరస పదబంధ రచయితలూ, నిచ్చెనల అచ్చెన గాయలాడే నెచ్చెలులూ ఆ కవిత మెచ్చక అన్యం మెచ్చుతారా? గురజాడవారి ''కొయ్యబొమ్మల'' చరణం అందరికీ వర్తిస్తుంది. ''కవిత్వమంటే- కవి—అంటే యేమో? సాహిత్య ప్రయోజనమేమో?'' తెలిసికొన్న ''సద్విమర్శకుడూ—నిజమైన రచయితా'' ఇలాంటి 'సాహిత్య లేఖ'లు వ్రాయుడు.

అలాగే శ్రీ ఎల్లా శివరామయ్యగారి ఆవేదన్ని 'భారతి' అర్థం చేసికుంటుందనే ఆశిద్దాం.

ఎందుకంటే తెలుగు కవిత్వాన్ని 'ఎన్రిచ్' చేసే ఈ లేఖా రచయిత ప్రయత్నాలని చాలామార్లు ఈ 'భారతే' వమ్ముచేయటం, పక్షపాత ధోరణిలో పవిత్ర భారతి వడిపోయిందేమో, 'విలువ'యెక్కువై విలువ'పడి, నీరసించిందేమోనని అనుకునేలా చేయడం అనేకమార్లు జరిగింది కనుక!

నీరసించిపోతు'న్న తెలుగు కవిత్వానికి పురామహాస్పత్యం సాధించాలనే తపన చాలామందికుంది. కాని దానికి భారతి చేయూత లేనిదే, పక్షపాత ధోరణులూ, వ్యక్తిపూజలూ, దూషణలూ మానినదే ఆ మహదాశయం సిద్ధించదు.

దినకర్
నంద్యాల్

మినీ కవితలో చిహ్నాలు

సెప్టెంబరు '80 భారతి కలగూరగంపలో మినీకవిత్వంపై జింబోగారి పరిశీలన చూశాను.

=, ×, ÷, ( ) వంటి చిహ్నాలు మినీకవితలో చోటు చేసుకోవటం గురించి ప్రస్తావిస్తూ వుదాహరణకు తీసుకోబడ్డ అంకిత కేశవులుగారి కవిత తొలిసారిగా ఆంధ్రజ్యోతి వారపత్రికలో కొన్ని సంవత్సరాలక్రితం చదివిన గుర్తు. కాని వారపత్రికలో నేను చదివిన కవితకీ, వ్యాసంలో చోటు చేసుకున్న కవితకీ అక్కడక్కడ కొంత తేడా వుంది. నాకు జ్ఞాపకం వున్నంతవరకూ ఆ గీతం స్వరూపం ఇది.

మనిషి + డబ్బు = హీరో
మనిషి − డబ్బు = జీరో
పరమాత్ముడికన్నా
పైసాయే మిన్న
దేర్ఫోర్ మేరే యారో
దేవుడికీ గోలీ మ్మారో.

ఈ విషయం వ్యాసరచయిత మరోసారి పరిశీలిస్తారని ఆశిస్తాను.

శ్రీ టి. చంద్రశేఖరరెడ్డి
ఖమ్మం

కృష్ణశాస్త్రిగారి మహతి


(61వ పేజీ తరువాయి)

పలికించగలరు శాస్త్రిగారు. ఈనాటి గేయకారులలో దేవులపల్లి 'ఎవరెస్టు' శిఖరం అన్న విషయాన్ని మహతి నిరూపిస్తున్నది. భక్త కవులందరూ సాధారణంగా తమ హృదయ స్పందాన్ని పాటలలోనే పలికించారు. పాటలలోనే దేవులపల్లి దివ్య ప్రణయామృతం ఒలికించారు. ''కృష్ణపక్షం'' పీఠికలో స్వామి శివశంకరులు కృష్ణపక్షం శుక్లపక్షం కావాలి అనే ఆకాంక్ష వెల్లడించారు. అక్షరాలా ఆకోరిక ఎలా ఫలించిందో 'మహతి'లో మనకు గోచరిస్తుంది.

మాట మాటలో సంగీత సాహిత్యాలని సమన్వయించే అనల్పమైన శిల్పవైభవం పాట పాటలో గుండెలని చీల్చుకు వచ్చే ఆవేదనా, ఆకొన్న ఆత్మకి అమృత నిష్యందం! దైవంమీద విశ్వాసంకల మనిషి ఏనాటి వాడైనా ఏ చోటి వాడైనా నోరారా పాడుకోగల భక్తిగీతాలివి! ఇరుకు గోడలు కట్టుకొని, జాతి మతాల పేరుతో ముక్కలు కాని మహా మానవ హృదయంలో ప్రభవించిన ప్రసూనాలివి. ఆంధ్ర సాహితి గర్వంగా కంఠాన ధరించ దగిన మణి హారం 'మహతి'.

అమరేంద్ర

ప్రజా సేవలో



* నిజమైన ప్రజల ప్రభుత్వం
* స్వచ్ఛమైన, సమర్థవంతమైన పరిపాలన
* ఏ స్థాయిలోనూ అవినీతికి ఆస్కారం ఉండదు
* రైతులకు, పారిశ్రామిక కార్మికులకు న్యాయం
* బలహీనవర్గాల అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత

ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్య నాయకత్వంలో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఫలవంతమైన, సత్వర ఫలితాలను యిచ్చే పనిచేసే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బహుముఖ కృషిని ప్రారంభించింది.

అవినీతిపై పోరాటం :

ఉన్నత పదవులలో ఉన్న ప్రజానాయకులపై వచ్చే ఆరోపణలను విచారించడానికి లోక్ ఆయుక్త, ఉపలోకాయుక్తలను ఏర్పాటు చేస్తారు ఇందుకోసం వచ్చే రాష్ట్ర శాసనసభ సమావేశంలో ఒక శాసనాన్ని ప్రవేశ పెడతారు. అవినీతిని కనుగొనడానికి ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేస్తారు.

ఉజ్జ్వల భవిష్యత్తులోకి :

ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమాన్ని, సంజయ్‌గాంధీ ఐదు సూత్రాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా, అర్థవంతంగా అమలు జరపడానికి వీలుగా ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తారు.

బలహీనవర్గాలకు చేయూత :

ఒక సంవత్సరానికిపైగా ప్రభుత్వ భూములలో ఉన్న గుడిసెవాసులను తొలగించరు. ఈ భూములు ప్రభుత్వ ఉపయోగానికి అవసరమైన పక్షంలో ప్రత్యామ్నాయ వసతి కల్పిస్తారు. ప్రతి కార్మికుడు ఉద్యోగవిరమణ చేయగానే ఒక స్వంత యిల్లు పొందే విధంగా తోడ్పడడానికి ప్రభుత్వం కృషి చేస్తుంది.

ఆపదలో ఉన్నవారికి సహాయం :

కరువు నివారణ సహాయక చర్యల నిమిత్తం రు. 7.5 కోట్ల మొత్తాన్ని మంజూరు చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని వరద బాధిత ప్రజలకు సహాయం అందజేయడానికి వీలుగా రు. 15 కోట్ల కేంద్ర సహాయాన్ని కోరారు.

ధరల అదుపు :

ధరల పరిస్థితిని నునిశితంగా పరిశీలిస్తూ, పరిస్థితిని వినియోగించుకుని వ్యాపారస్తులుగానీ, హోటళ్ళవారుగానీ పేద ప్రజలను, మధ్యతరగతి ప్రజలను దోపిడీ చేయకుండ చర్యలు తీసుకుంటారు.

ఆంధ్రప్రదేశ్ మహత్తర విజయాల సాధనను కొత్త శకంలో అడుగు పెడ్తోంది. ప్రజలు ముఖ్యంగా, బలహీనవర్గాల ప్రజల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం యిస్తారు. ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ ఉజ్జ్వల భవిష్యత్తువైపు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తూ రజతోత్సవం సంవత్సరంలో అడుగిడుతోంది.

సమాచార, పౌరసంబంధశాఖ, డైరెక్టరుచే ప్రకటితము ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

DIPR No. 35275/Advt. I C 3/80

గ్రంథ విమర్శలు

శ్రీమద్రామాయణము

[అయోధ్యాకాండము. పూర్వభాగము. టీకా తాత్పర్య సహితము. తాత్పర్య కర్త శ్రీ చలమచర్ల వేంకట శేషాచార్యులు. క్రౌన్ సైజు– 39 + 580 పుటలు. కాలికో బైండు. వెల రు 30/–లు. ప్రచారకులు : శ్రీ జయలక్ష్మీ పబ్లికేషన్సు, కేశవనగర్, శ్రీనగర్ కాలనీ పోష్టు, హైదరాబాదు.]

ఆది కావ్యమైన వాల్మీకి రామాయణాన్ని అర్థం చేసుకొనుటకూ, అందలి విశేషార్థాలను తెలుసుకొనుటకూ సంస్కృతంలో ప్రాచీనాలైన వ్యాఖ్యానాలున్నవి. అవి సంస్కృత భాషాభిజ్ఞులకు మాత్రం ఉపయోగపడుతున్నవి. సంస్కృత భాష యెరుగని ఆంధ్రుల ఉపయోగార్థం గత శతాబ్దిచివర చదలువాడ వారు ప్రతిపదార్థ టీకా తాత్పర్యాలలోనూ, విశేషార్థాలలోను వ్యాఖ్య తెలుగులో రచించారు. ఆ ప్రతులు కొంతకాలం వావిళ్లవారివద్ద లభ్యమవుతూ ఉండినవి. తర్వాత ఆ టీకా తాత్పర్యాలను ప్రకటించడంలో వ్యయప్రయాసలు ఎక్కువ అని గమనించి వావిళ్లవారు మూలంతోపాటు తాత్పర్యాన్ని మాత్రమే ప్రకటించారు. ఆ ప్రతులు కూడా ఇప్పుడు లభ్యం కావు. బహుళ ప్రచారంలో ఉన్న సుందరకాండ మాత్రం వేర్వేరు ప్రకాశకులు ప్రకటించినది దొరుకుతున్నది. సమగ్రంగా లభించడంలేదు. యామిజాల పద్మనాభస్వామి గారు మూలాన్ని తాత్పర్యంతో పాటు వెలువరిస్తున్నా, అది దిన పత్రికలో కొంచెం కొంచెంగా ప్రకటింపబడుతున్నదే కాని, పుస్తక రూపంగా ప్రకటించబడలేదు. తాత్పర్య సహిత శ్రీమద్రామాయణం లభ్యం కాని కారణంగా వేంకటశేషాచార్యులుగారు స్వీయ తాత్పర్యంతో ప్రకటింప సంకల్పించారు. ఇది వరకు బాలకాండ ప్రకటితమైనదట! దానికి ఎక్కువ ప్రోత్సాహం లభించింది. తర్వాతి కాండలను కూడా శీఘ్రంగా ప్రకటించాలని ఎందరో జాబులు వ్రాయడం వల్ల, మిత్రుల ప్రోత్సాహం వల్ల ఇప్పుడు అయోధ్యాకాండలోని ప్రథమ భాగం ప్రకటించబడింది. దీని ముద్రణకు తిరుమల–తిరుపతి దేవస్థానం వారి భూరి విరాళం లభించింది. విశేషార్థాలతో కూడా దీనిని ప్రకటించాలని కోరుతూ హనుమకొండలోని ఆర్షవాఙ్మయ సమితివారు కొంత ఆర్థిక సహాయంచేశారు. అభిమానులగు ఉదారులు, ఈరామాయణ ప్రచురణకు ముందుగానే విరాళాలు ఇచ్చి మిక్కిలి సహాయ పడ్డారు. తత్ఫలితంగా ఈ గ్రంథం సర్వాంగసుందరంగా ప్రకటించబడింది. ఇందులో అయోధ్యాకాండలోని 51 అధ్యాయాలు మాత్రమే ప్రథమ భాగంగా ప్రకటించబడినవి. తర్వాతి భాగంలో ఈ కాండ పూర్తి అవుతుందని తోస్తున్నది.

రామాయణంలోని ప్రతీ కాండకూ ఒక్కొక్క ప్రత్యేకత ఉన్నది. ఎక్కువ ప్రచారంలో ఉన్న సుందరకాండ అత్యంత సుందరమై నిత్య పారాయణ గ్రంథంగా ఉంటున్నది. బాలకాండ యజ్ఞవైశిష్ట్యాన్ని నిరూపించగా, అయోధ్యాకాండ ఆదర్శ వ్యక్తిత్వాన్ని చిత్రిస్తున్నది. మానవుడు తన ఉత్తమ జీవితాన్ని ఎలానడపవలెనో, జననీ జనకుల యెడలను, భార్యా సోదరుల యెడలను, బంధుమిత్రుల యెడలను,ఎట్లు ప్రవర్తించవలెనో, త్యాగమెట్టిదో– ఈ మున్నగు ధార్మికాంశములను వివరిస్తున్నది. ఆదర్శ జీవితాన్ని గురించి తెలిసికొనుటకు ఈ అయోధ్యాకాండను చదవడం ఎంతో అవసరం.

తాత్పర్యకర్త సంస్కృతాంధ్రాలలో సమర్థులైన పండితులు. తమ పాండిత్య ప్రదర్శనవల్ల పలువురి మెప్పును సంపాదించిన వారు. ప్రజాప్రోత్సాహం వల్లనే ఈ తాత్పర్యరచనకు పూనుకొన్నట్లు తెలుస్తున్నది. రామాయణ ప్రవచనం చేసే వారిలో విఖ్యాతిగాంచిన విద్వాంసులు సరస హృదయులు శ్రీ భాష్యం అప్పలాచార్యులు గారి అభినందనలను ఇది అందుకొన్నది. గ్రంథాదిని శ్రీరామాయణ మాహాత్మ్యం, [రామాయణ పారాయణ ప్రారంభంలో శ్రీవైష్ణవులు చదవ వలసిన శ్లోకాలు, పారాయణం ముగిసిన తర్వాత చదవ వలసిన శ్లోకాలు, స్మార్తాదులు చదవవలసిన శ్లోకాలు, అంగన్యాస,కరన్యాసాదికం శ్రీమద్రామాయణ పూజాక్రమం, విషయ సూచిక చేర్చబడినవి.

తాత్పర్యరచన సరళమైన భాషలో అందరికీ సులభంగా అర్థమయే రీతిని ఉన్నది. పుస్తకం మధ్య తెరపగా కనబడిన మూల తాత్పర్యాలు మచ్చునకు ఇయ్యబడుతున్నవి.

"చతుష్పథాన్ దేవపథాం
శ్చైత్యా నాయతనానిచ,
ప్రదక్షిణం పరిహరన్
జగామ నృపతేః సుతః"

నాల్గు మార్గములు కలియు స్థానములకును, దేవాలయములకును, రచ్చ చెట్లకును, సభ మున్నగు వానికి నా రాజపుత్రుడగు రాముడప్రదక్షిణముగ పోవుటను పరిహరించి ప్రదక్షిణముగనే పోయెను. [పుట. 226]

రామాయణంపై ఆసక్తి కలవారందరూ ఆదరించ వలసిన ఉత్తమ గ్రంథం యిది.

శ్రీ. బులుసు వేంకటరమణయ్య

ఆరు కవితా సంపుటాలు

సుందర పద బంధురమై, నవ్య భావయుక్తమై యుండునది కవిత్వము. వస్తువు జీవితానికి సన్నిహితమయినదై, దృష్టి రసార్ద్రమయినది కవిత! భవుతిక వాదానికీ, తాత్త్విక వాదానికీ లక్ష్యం ఒకటే – దృష్టి భేదం భేదం కారాదు (?!) పదప్రయోగము సరస మధురమై యింపు నింపుచు, వర్ణనములు గాఢ పరిశీలనా ఫలితములును, ఔచిత్య భాసురములును నయి, గొప్ప భావనా శక్తి గలిగినది

కవిత! పదాల గారడీ గాక, పెదిమల నాదాల నృత్యముల నాడించేది కవిత! దేవుని సన్నిధిలో చెందిన తన్మయత, కన్నీటి మానవ జీవన గీతం — ఇది కవిత! కవికి తపస్సూ, లోకానికి ఉషస్సూ, అరసికులకు అది తపస్సూ. అదే కవిత! ఆనందాన్నే గాదు, ఆరోగ్యాన్ని కూడా కలిగించేదే కవిత! గంభీర భావ గర్భితములయిన పదపంక్తులు గలిగి, జీవిత పరమావధిని చెప్పెడిదే కవిత! — అభ్యుదయ కవిత్వం జోలికిపోక భావ కవిత్వాన్ని ప్రధానంగా అర్చించిన పండిత ప్రకాండుల కవితా నిర్వచనాలివి!

అనుభూతులు గీతికా కృతులుగా రూపొందినవి కవిత! దేశభక్తి, జాతీయ భావన, ఈ దేశ ప్రవృత్తికి అనుగుణమయిన గొప్ప మార్పు (?) రావలెనని తీవ్రమయిన ఆకాంక్ష కలిగియుండి, ఇజాల సాలెగూడులో చిక్కుకొనక దేశమునకు ఉజ్జ్వలమైన భవిష్యత్తునాకాంక్షించునది కవిత! మాన్‌సూన్ గగనంలో తళుక్కున మెరిసి, స్ఫురించిన ముత్యపు పలుకు మేల్కొలిపే రసస్పందన బహిరంగ రూపం తాల్చడానికి తహతహలాడి, తాల్చిన రూపమే కవిత! పదునయిన భావనా బలంతో ముందు హృదయోద్గారాన్ని చూపించి తరువాత శబ్దాన్ని వినిపించేది కవిత! ఒక కవి ఒక అజ్ఞాత ప్రియితమను అదృశ్య సుందరిని ప్రత్యక్షపరచటానికి వాడుకొనునది కవిత! కవిత అంటే ఏమిటి అని జిజ్ఞాసువులు ప్రశ్నించటం ఎందుకు? కవిత అంటే కవితయే. కవిత మరొకటి ఎట్లా అవుతుంది?! కవిత ఏకముఖమయింది కాదు. బహుముఖమయింది. ఏ విధంగా ఏ ఆశయంతో రచించినా కవిత కవితయే అవుతుంది. ఒకే ప్రయోజనం కొరకు కవితను కట్టివేయటం, కవితను కవిత కాకుండా చేయటమే అవుతుంది. రొమాంటిక్ కావ్యాలు, యమకాలు, అనుప్రాసలు, అంత్యప్రాసలు, ధ్వనులు కలిగినది ఇంపయిన కవితగా భాసించగల అవకాశం వుంది. మవులికమయిన భావాలు నవ్యమయిన ప్రయోగాలు ఈ కవిత్వానికి విశిష్టత నాపాదిస్తాయి. అతీతవాదపు ఛాయలు కవిత్వానికి అనవసరంగాదు! అస్పష్టంగానో, ప్రచ్ఛన్నంగానో ఇవి కవితల్లో గోచరించకపోతే సామాజికులలో 'మానవ వికాసం' పెరుగదు! ఇటువంటి కవిత ఒక జీవన గీతాన్ని, హృదయ సంగీతాన్ని వినిపిస్తుంది!— ఈ రకపు కవిత్వాలకి ఇవి కడుపు నిండిన నిర్వచనాలు! ఒకరకపు **ఉన్మాదావస్థ దీనికి ప్రాతిపదిక.**

అంధవిశ్వాసాల జాడ్యాలు దేశాన్నలముకొన్న ఈ కాలంలో ఆలోచనావసరాన్ని గుర్తింప చేయటం, భక్తి నిరక్తితో జోడించి, భాషపై బలవంతపు వ్యభిచారాన్ని సాగించే ప్రబుద్ధుల మాయాప్రచారాన్ని గుర్తించి అరికట్టవలసిన అవసరాన్ని ప్రచారం చేయటం, కంటికెదురుగా కనపడే పగటి వేషాలను, వినపడే వేదాంత భేషజాలను అరికట్టటం, మనిషిని మత్తులో ముంచెత్తగల శక్తి గలిగిన దైవ వ్యాపారాలను చీల్చి చెండాడి, మత్తు వదల్చుకుని మనిషిని మనిషిగ తయారుకమ్మని హెచ్చరించడం, సామాజికుని మానసిక భీరుత్వాన్ని, భావదాస్యాన్ని రూపుమాపటం ధ్యేయంగా కలిగినది కవిత! ఆలోచనే **ప్రధానంగా గల వస్తువుతో నాస్తికత్వం, హేతువాదం, సమతావాదం** ఆలంబనాలుగా, శిల్పం కంటే, వస్తువే ప్రధానంగా, వేల సంవత్సరాల నుంచి పట్టివున్న తుప్పును వదలగొట్ట గలిగినదే కవిత్వం — అన్నవి హేతువాదుల కవిత్వపు భాష్యాలు!

కవికి గానీ, మనిషికి గానీ పుట్టుకతోనే వచ్చేది వర్గ స్పృహ. కవి ఎదిగి అలవర్చుకోవల్సింది సామాజిక స్పృహ. శాస్త్రీయమయిన అవగాహనతో కవి సమాజాన్ని విశ్లేషించి, తను 'డీ క్లాసిఫై' అయి, శ్రామిక జన పక్షపాతం వహిస్తాడు. రాజకీయ స్పృహలో అన్ని స్పృహలూ సంగమిస్తాయి. అదిలేని కవికి ఏ ఇతర స్పృహవున్నా అది నిరర్థకమే! గొప్ప సామాజిక బాధ్యతతో కవిత్వం సృజించే కవికి పోరాటం తప్ప ఇతర రాజీ పద్ధతులుండరాదు. కవిత్వమంటే అలంకార మనుకునేవాడికీ, ఆనందమే దాని పరమావధి అనుకునేవాడికీ, చమత్కారమే గుండెకాయ అనుకునేవాడికీ, యుద్ధ కవిత్వం కవిత్వంగా కనపడదు. సమాజాన్ని చైతన్యవంతం చేయటానికి, గుండెలోని వేదనలలో కలం ముంచి, కసిగా కవిత్వం రావాలి. ఉప్పెనలయి లేచే కెరటాలు, తుఫానులయి వీచే ఈదురుగాలులు, పెనుమంటలు రగిల్చే నిప్పురవ్వలు అయిన మినీ కవితలు విన్నవాళ్ళి తీసుకునిరాగలవు. ఇది కవిత గదు పొమ్మన్నవాళ్ళని ఆ చీకట్లోనే వదిలేసి, మన దోవన మనం అరుణారుణ బింబంవయిపు, నెత్తుటిధారల్ని చిమ్ముకుంటూ ముందుకి సాగిపోదామంటారు మినీకవితా రాధకులూ, అభ్యుదయకాముకులూ.

ఇన్ని రకాల వైరుధ్యాల మధ్యన, గుడ్డివాళ్ళ మధ్యన పడిన ఏనుగులాగ, ఆధునిక తెలుగు కవిత్వం రకరకాల ఆకారాల్ని పొందుతూ వున్నది. ప్రణయానుభూతులు, దైవ సంకీర్తనలు, రకరకాల పున్నాదాలు, పొలికేకలు, స్వకుచ మర్దనాలు, ఆత్మస్తుతులు, పరనిందలు, కఠినమయిన, హేయమైన, పరుషమయిన దూషణలు, అతిశయ పూర్వకమయిన భూషణలు మరెన్నిటితోనో తెలుగు సాహితీ ప్రపంచం, మైకులు పెట్టినట్లు దద్దరిల్లి పోతుండగా— పాఠకుడు కవుల్నీ, కవిబృంద నాయకుల్నీ చొక్కాలు పట్టుకొని నిలదీసి ప్రశ్నించవలసిన సమయం వచ్చినట్లనిపిస్తుంది. కవిత్వ ప్రభావం అయోమయంగా అయింది. ఆంధ్ర కవితాలలామ ప్రసవ వేదనా ఘట్టంలో వుందా? ఆశావహమయిన రేపుకి ఈనాటి గందరగోళం పునాది అవుతుందా?— అని ఆశగా నిరీక్షిస్తున్నాడు ఈనాటి పాఠకుడు. ఆ విశ్వాసమే ఇప్పటి ఆరు కవితా సంకలనాల విమర్శకి ప్రాతిపదిక.

ఇంద్ర చాపం

[రచన : రుద్రశ్రీ. ప్రచురణ : ఆంధ్రవిశ్వసాహితి, సికింద్రాబాదు. ప్రాప్తిస్థానం : చిట్టిమల్లె శంకరయ్య, జనగామ, వరంగల్ జిల్లా. పేజీలు : 20, వెల : రూపాయి].

పది సంవత్సరాలక్రితమే అచ్చుపడి, ఇపుడు విమర్శని కోరిన ఈ కవిత ప్రధానంగా భావాన్ని ఆలంబనగా గలది. ఇంద్ర ధనుస్సును చూచి, హృదయముప్పొంగగా, భావుకుడయిన కవి ప్రకృతిని కీర్తించటం ఇందలి ప్రధాన వస్తువు. కొందగా కడుపునిండిన భావుకులు దీనినమభవించి, ఆస్వాదించవచ్చును. ఈ పుస్తకానికి కొందరు పెద్దలు ముందు మాటలు వ్రాసి ఇవ్వగా, ప్రింటయినవి. దీన్నిండా **పాత వాసన వుంది.**

ఆరాత్రికమ్

[రచన : రుద్రశ్రీ. ప్రచురణ, ప్రాప్తిస్థానం పై పుస్తకం లాగానే. పేజీలు 90 వుండిన ఈ కవితా సంపుటి వెల రెండు రూపాయిలు.]

పై పుస్తకంలాగానే ఇదీ పది సంవత్సరాల క్రితపుదే. ఇందులోని కవితల్లో పరస్పర విరుద్ధమయిన ధోరణులు కానవస్తాయి. ఆహూతి, దేవుని సన్నిధిలో, దీపము నీవై స్వామీ—అనెడి కవితలు ఒక దోరణిలో సాగగా; ప్రతిజ్ఞ, హిమాలయము, గ్రామాభ్యుదయం మొదలయినవి మరొక ధోరణిలో సాగినవి. అన్నీ భావనాత్మకమయిన, ప్రబోధ ప్రధానమయిన ఖండికలు. ఒకనాడు ప్రాచుర్యం పొందిన ఒక రకపు భావ కవిత్వం పుస్తకం నిండా వున్నది. ఇప్పుడు దీనివైపు వాలా కొంత మందే చూడగలరనాలి. ఈ పుస్తకంలో ఆకర్షణ తక్కువ. నలుగురు ప్రముఖులు దీనికి ముందు మాటలు వ్రాసి ఇవ్వగా ఒక సినీ జీవికి ఇది అంకిత మీయబడినది.

భువననాదం

[రచన : బండి లక్ష్మీనరసింహారెడ్డి. ప్రచురణ : శ్రీ లక్ష్మి ప్రచురణలు, గాంధీనగరం, విజయవాడ—3. ప్రతులకు : నవజ్యోతి పబ్లికేషన్సు, విజయవాడ. పేజీలు 116 వెల : అయిదురూపాయలు.]

అనుభూతి, దేశభక్తి, జాతీయ భావన, అభ్యుదయం ఈ పుస్తకంలోని కవితలనిండా పుష్కలంగా వున్నాయి. 'ప్రతిభ ఒకడి సొమ్ము గాదు, అది ఎప్పుడు ఎక్కడ ఎలా ప్రజ్వరిల్లుతుందో చెప్పలేము'—అని అభిభాషించిన సి. నారాయణరెడ్డి గారు 'పరిష్టి' అన్న ఖండికలోని, ఉపమలోని, అక్షరాల బొమ్మలో కట్టబడిన, భావనా బలానికి పట్టం కట్టారు. సమాజం మీద ఈ యువకునికీ కసివున్నదట. కొన్ని కవితలలో కసిగా విజృంభించి ఎవర్నో పట్టుకుని గట్టిగా తిట్టిన కవి, అలసిపోయి కాటోలు, మధ్యలో జగజ్జననిని కీర్తించారు ! ఎన్నో సంగతుల్ని ఒక్కసారే చెప్పేయాలన్న కవిగారి వుబలాటం వలన ఈ పుస్తకం నానా జాతుల కవితలతో కలగూరగంప లాగ వుంది; స్పష్టమయిన చూపు కొరవడింది.

ముద్రణ, గెటప్ బాగా వున్న ఈ పుస్తకం అట్టమీద వేసిన తెల్ల పెయింటు చేతులకు అంటుకుని వదలకుండా వుంది.

కేవలం వుత్సాహము, పొలికేకలే కాదు; కవికి అవగాహన అవసరం అనీ, ఒక సంకలనంలోని ఖండికల్ని ఎన్నిక చేసి అచ్చు గొట్టించేటపుడు, ఒక దిక్కుగా నడచిన గిత్తలనే పోగు చేసి గాటనుగట్టాలనీ ఈ పుస్తకం చెపుతుంది.

రసజ్వాల

[రచన : రాజావిజయసారథి. కవిసేన హైదరాబాదు వారి ప్రచురణ. ప్రాప్తిస్థానం లేదు. వెల అయిదు రూపాయలు గలిగిన ఈ పుస్తకానికి మొత్తం ఎన్ని పేజీలో తెలియడం కష్టం.]

'నవతారౌతు', 'కవితారైతు' అన్న కీర్తిని గొన్న, ఏదీకాని, గుంటూరు శేషేంద్రశర్మ నవకవితా బీజాలు నాటగా, ఈ రసజ్వాల చెలరేగిందంటారు కవి వర్యులు. హృదయంలో మేల్కొన్న రసస్పందన ఈ కవిత్వానికి ప్రేరణ అంటారు ! ఇందులో రసజ్వాల, రాగవాహిని, రసహేల, జీవవాహిని, రసమాల, ప్రేమవాసిని, రసవాహిని అన్న పేరుగొన్న ఎన్నో వాగులు ప్రవహించాయి. కేవలం అనుభూతి పరమయిన, వ్యక్తి పరమయిన భావనలు ఈ కవితల నిండా వూహల వుయ్యాలలూగాయి. ఒక విచిత్రమయిన పరిస్థితిలో చెలరేగి, అక్షర రూపం పొందిన ఈ ఖండికలు అతీతవాదపుఛాయలతో వున్నాయి. రాజకీయ, సామాజిక స్పృహ ఏ మాత్రమూ లేని ఈ పుస్తకం వలన వర్తమాన సమాజానికి వుపయోగం తక్కువ. ఇందులో పదాల సర్కసులూవున్నాయి. ఒక విచిత్రమయిన వున్మాదావస్థకి పరాకాష్ఠలు ఇందు అచ్చయిన విషయాలు. ఈ పుస్తకంలో వున్నవన్నీ కడుపునిండిన కవితలు. పుస్తకం ముద్రణ బాగుంది. గెటప్ అంత బాగాలేదు.

ఆలోచనా గేయాలు

[రచన : గణేశ్వరం బాబూరావు. హేతువాద ప్రచురణలు, గుడివాడ. ప్రతులకు : రాఘవ సైకిల్ షాపు, గుడివాడ అనిరాయాలి. 40 పేజీలున్న ఈ పుస్తకం వెల మూడు రూపాయలు.]

అంధ విశ్వాసాల్ని ఖండించటం, మనిషి ఆలోచించవలసిన అవసరాన్ని నొక్కి వక్కాణించటం, దేవుడి పేరిటసాగే వ్యాపారాల్ని బయటపెట్టటం 'ఏమిటి? ఎందుకు' అని ప్రశ్నలు వేసుకోవాలని పఠితకి తెలియచెప్పటం ఈ పుస్తకంలోని గేయాల ధ్యేయం కాగా, రచయిత మతాన్నీ, మౌఢ్యాన్నీ, మూర్ఖత్వాన్నీ, ధర్మమనబడేదాన్నీ, దొంగ బ్రతుకుల్ని తూర్పారబట్టి దుమ్ము దులపటమేగాక, రాముణ్ణీ, కృష్ణుణ్ణీ, ధర్మరాజునీ, అయ్యప్పనీ, వేదవ్యాసుణ్ణీ, సాయిబాబానీ, జిల్లెళ్ళమూడిఅమ్మనీ మొదలయిన కొందర్ని పట్టుకుని చీల్చిచెండాడుతారు. కసి మాత్రమే కవిత్వ లక్షణమయితే అది ఈ పుస్తకం నిండా పుష్కలంగా వుంది. ఒక గట్టి నమ్మకంతో సాగిన విజృంభణ ఇక్కడ **వుంది.**

అయితే ఆలోచింప చేయదగిన అంశాల్ని వస్తువులుగా ఎన్నుకున్న ఈ గేయాలు ఆ పని సమర్థంగా చెయ్యలేవుగాని హాస్యాన్ని సృష్టించి నవ్విస్తాయి. ఉద్దేశ్యం వుత్కృష్టమయిందేగాని అనుసరించిన పద్ధతి శక్తిహీనమూ, ఆవేశపూరితమూ కానటం ఈ గేయాల్లో గల బలహీనత అనవచ్చును.

కెరటాలు

[రచన : వెంపలి వెంకట శివప్రసాదు. లవ్‌లీ పబ్లికేషన్, అనకాపల్లి; వివిఎస్. ప్రసాద్, బోయనవారి వీధి, అనకాపల్లి నుంచి పుస్తకం పొందవచ్చును. 25 పేజీలున్న ఈ చిన్న పుస్తకం ఖరీదు రెండున్నర రూపాయలు.]

సామాజిక స్పృహా, రాజకీయ స్పృహా నిండుగావున్న మినీ కవితలు పాతిక ఇందులో వున్నాయి. కె. శివారెడ్డి గొప్ప కవిత్వం ఇందులో వుందని అనకపోయినా, మంచి కవిత్వం ఈ యువ కవి కవితల్నిండా వుందని అనాలిసింది.

గుండెల్లోని వేదన, మాటల్లోని తీవ్రత, కూర్పులోని ప్రతిభ ఈ పుస్తకంలోని కవితల్లో వుంది; ఎంతో ఆవేశమూ, పుష్కలంగా కసీ వున్నాయి.

అమృతం తాగితే చావే రాదంటారు, విషం మింగితే బ్రతుకే లేదంటారు, మరి వీళ్ళేం తాగారని చస్తూ బ్రతుకుతున్నారు ?—అని అడిగి,

నా జనం కళ్ళ ఎడారిలో అనవరతం కనలేని కన్నీటిబొట్లు —అని బాధపడి,

ఉవ్వెత్తున లేచిన సమస్యల కెరటం, సహనాన్ని మింగేయగా, ఆవేశంతో రేపు నా జనత పెట్టే ఒక్క కేకచాలు, మీ చీకటి కోటలు బద్దలు కావటానికి — అని హెచ్చరించి,

కూలి పేటల మీదుగా వీస్తున్న బరువయిన గాలిలో గుండెల్ని పిండేసే విషాదమే నిండి వుంది, హుషారు ఎట్లా వుంటుంది — అని తర్కించి


ఆకలి ఆకలి ఏకమయితే తిరుగుబాటు జరుగుతుంది — అని ఆశించి

వెలుతురు తోరణాలు కట్టడానికి, చీకటితెరలనిచీల్చి విధ్వంసం చేస్తామని ప్రతినచేసి

బిగిసిన పిడికిళ్ళ నుంచి ఆకలీ దోపిడీ లేని రాజ్యం పుట్టుకొస్తుందని గట్టిగా భీషణంగా గర్జించారు యువకవి. బాగుంది కాని — ప్రతీ కవీ పొలికేకలు పెట్టి కసిగా గర్జించటమేనా ? ఇంకేం లేదా ? ఎక్కడ చూసినా — ఇవాళా, రేపూ అంతటా ఈ గర్జనలే ! అన్ని గర్జనలూ ఒకే రకంగా, మూసలో పోసిన విధంగా, కేవలం కవితల పేర్పుతోనూ, గర్జించటాలుతోను సరిపోయిందా ? సరేనండీ వ్యవస్థ మారాలి. దోపిడీ పోవాలి. సమ సమాజం రావాలి. మంచి యోచన. కాదనగల దమ్మున్నవాడు లేడు. అయితే ఎలాగా ? ఆదారి ఏది ? చైతన్యోద్దీపన అయింది. ముందుకు సాగమంటారు. ముందుకంటే ఎక్కడికి ? ఎవరితో ? ఆ విషయం గురించి ఎవరూ చెప్పరేం ? గానుగ చుట్టూ తిరిగే కళ్ళకి కంతలు కట్టిన ఎద్దులాగ, కేవలం గుమ్మం దగ్గరే డప్పులు కొడుతూ కూర్చుంటే, లోపలున్న పిచ్చి రక్తం రుచి మరిగిన నల్లపిల్లి పారిపోతుందా ? ఆ పిల్లిని తరుమ గొట్టాలంటే ఏంచేయాలి ? ఏరకంగా ముందడుగేయాలి ? ఆ పద్ధతి ఏమన్నా వుందా ? — అని సాధారణ పాఠకుడు అడుగుతున్నాడు. ఈ నవయుగ కవితా వైతాళికులు నిర్మాణాత్మకమయిన, హేతుబద్ధమయిన, ఆచరణ సాధ్యమయిన పరిష్కారాల్ని నిర్దేశించవలసిన అవసరం, అవి కవిత్వంలో ఆచరణలో రూపుదాల్చవలసిన ప్రాధాన్యతా లేదా ? ఈ అరుపులే ఇంకా ఎంత కాలం ? !

శ్రీ పాలడుగు వెంకటేశ్వరరావు

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 61247.



"సాంప్రదాయ సిద్ధమయిన
భారతీయ ఔషధాలకి
ప్రత్యేకమయిన శక్తివుంది.
ఉదాహరణకి,
అమృతాంజన్."

ప్రకృతిలో లభించే అత్యంత శక్తివంతమయిన పది మూల ఔషధాలతో అమృతాంజన్ తయారు చేయబడుతోంది. అంటే అమృతాంజన్ చాలా శక్తివంతమయినది.

అందుచేత అమృతాంజన్ తలనొప్పులకు, జలుబులకు, వంటినొప్పులకు, బెణుకులకు శీఘ్రంగానూ, నిశ్చయంగానూ ఉపశమనం కలిగిస్తుంది. అంతేకాదు అమృతాంజన్ సురక్షితమయిన బాధా నివారిణి.

అమృతాంజన్ :
80 సంవత్సరాలకు పైబడిన
నమ్మకమైన దివ్య
ఔషధము

AM-2148

అమృతాంజన్
తలనొప్పులకు .జలుబులకు.
వంటినొప్పులకు.బెణుకులకు

